

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

వెల: రూ. 5.00



సోమవారం | 28-8-2017 | పేజీలు: 18 + 20 | సంపుటి: 58 సంచిక: 133 | శ్రీహేవళంబినామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, భాద్రపద, శుక్లపక్షం; తిథి: సప్తమి రా. 12.37 తదుపరి అష్టమి; నక్షత్రం: విశాఖ రా. 8.10 తదుపరి అనూరాధ; వర్జ్యం: రా. 12.38-2.25; దుర్ముహూర్తం: మ. 12.42-1.31; మ. 3.11-4.00; అమృతఘడియలు: ఉ. 10.28-12.14; రాహుకాలం: ఉ.7.30-9.00; సూర్యోదయం: 6.05; సూర్యాస్తమయం: 6.28 | విజయవాడ సిటీ

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tanuku | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Kakinada | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad | Bangalore and Chennai

సింధుకు రజతం

హోరాహోరీ ఫైనల్లో ఓడిన తెలుగుతేజం

ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో రజత, కాంస్యాలతో ముగించిన భారత్

అసమాన పోరాట పటిమతో అభిమానుల మనసు గెలుచుకున్న సింధు 17

స్వర్ణంపై గురిపెట్టిన మన సింధు మరోసారి రజతంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. నరాలు తెగే ఉత్కంఠతో సాగిన ప్రపంచ చాంపియన్‌షిప్ ఫైనల్‌లో పోరాడి ఓడింది. జపాన్ ప్లేయర్ నొజోమి ఒకుహరాతో... రికార్డు స్థాయిలో సుదీర్ఘ పోరు జరిపింది. ఇదే టోర్నీలో సైనా నెహ్వాల్ కాంస్య పతకం గెలుచుకుని సత్తా చాటింది.



సిరీస్ మనదే

రోహిత్ శతకం.. చెలరేగిన బుమ్రా 16

శ్రీలంకపై మూడో వన్డేలోనూ గెలుపు

3-0తో సిరీస్ కైవసం





కాకినాడ రోడ్‌షోలో అభివాదం చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

జగన్.. ఓ డేరా బాబా!

ఉన్మాదిలా ప్రజలను రెచ్చగొడుతున్నాడు

- రాష్ట్రంలో రావణకాష్టమే ఆయన లక్ష్యం
- ఆయన అరాచకాలను సాగనివ్వను
- టీడీపీ కార్యకర్తలు, డ్వాక్రా మహిళలు ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- అప్పుడు రాష్ట్రంలో ఏ పార్టీ ఉండదు
- కాపులను బీసీల్లో చేర్చడమే ధ్యేయం
- డ్వాక్రా ఉత్పత్తులకు ఆన్‌లైన్ మార్కెట్
- కాకినాడ రోడ్‌షోలో సీఎం చంద్రబాబు
- ముగిసిన మున్సిపోల్స్ ప్రచార పర్వం

కాకినాడ, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): 'జగన్ ఓ డేరా బాబా.. ఉత్తరాది రాష్ట్రాల్లో డేరా బాబా జనాన్ని రెచ్చగొట్టి ఉన్మాదులను సృష్టిస్తుంటే ఇక్కడ జగన్ తన ఉన్మాదంతో జనాన్ని రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నాడు. అక్కడ డేరా బాబా, ఇక్కడ జగన్ బాబా.' అని సీఎం చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉత్తరాదిలో ప్రభుత్వాలు అప్రమత్తంగా లేకపోవడంతో డేరా బాబా

మిగతా 2వ పేజీలో...



చంద్రబాబు హామీలకు మోసపోవద్దు

అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచేది వైసీపీయే

ఇప్పుడు టీడీపీకి ఓటేసి అన్యాయానికి పట్టం కట్టొద్దు: జగన్ 14



14

నంద్యాల తీర్పు నేడే!

- ఉదయం 8 గంటల నుంచి కౌంటింగ్
- 11 గంటలకల్లా ఫలితం వెలువడే చాన్స్
- నంద్యాలలో భారీ పోలీసు బందోబస్తు



14

అరెస్టు చేసినట్లుంది!

- ఉప రాష్ట్రపతిగా 'నిబంధనల చట్రం'
- కుదురుకోవడానికి మరింత సమయం
- ఇదీ వెంకయ్య నాయుడు అంతరంగం
- కేంద్రం ఇచ్చినవి పూర్తయితే ఏపీ నంబర్ 1

విశ్వాసం పేరుతో హింసను

సహించం

తప్పు చేస్తే శిక్ష తప్పదు.. డేరా హింసపై స్పందించిన ప్రధాని

నివురు గప్పిన నిప్పు.. పంజాబ్, హరియాణాల్లో ఉద్రిక్తత.. గుర్మీత్ సింగ్‌కు నేడే శిక్ష ఖరారు

న్యూఢిల్లీ, ఆగస్టు 27(ఆంధ్రజ్యోతి): 'విశ్వాసం పేరుతో హింసకు పాల్పడే వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తాం. మతపరమైన, రాజకీయపరమైన విశ్వాసాల పేరుతో హింసకు పాల్పడితే సహించే ప్రసక్తే లేదు' అని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. హింసకు పాల్పడేవారికి శిక్ష తప్పదని అన్నారు. గుర్మీత్ రామ్ రహీమ్ సింగ్ అలియాస్ డేరాబాబా అనుచరులు సృష్టించిన విధ్వంసాన్ని దృష్టిలో ఉంచుకుని ఆయన ఈ వ్యాఖ్యలు

మిగతా 18వ పేజీలో...



గుర్మీత్ అనుచరుల హింసతో అతలాకుతలమైన సిర్సాలో భారీ బందోబస్తు



పోలీసులపై దాడికి ప్రయత్నిస్తున్న యువకులు

కిర్లంపూడి ఉద్రిక్తం!

- యాత్రకు ముద్రగడ.. పోలీసుల అదుపులోకి
- పోలీసులపై అనుచరుల వీరంగం
- కాల్వలోకి పోలీస్ డీఐజీ నెట్టివేత.. లాఠీచార్జి
- మీరు ఆపుతారా.. నన్ను రమ్మంటారా?
- జిల్లా పోలీసులపై డీజీపీ ఫైర్

13



బంగాళాఖాతంలో అల్పపీడనం


రాష్ట్రానికి భారీ వర్షసూచన 2


పిల్లలకు పాలిచ్చేందుకు బస్టాండ్లలో 'ప్రత్యేక' గదులు! 2











పేద్ద కాకరకాయ!

ఈ కాకరకాయను చూస్తే ఎవరైనా నోరెళ్లబెట్టాల్సిందే...సాధారణంగా కాకరకాయ పది నుంచి 15 సెంటీమీటర్ల పొడవు వుంటుంది. అందుకు భిన్నంగా విశాఖ జిల్లా అనంతగిరి మండలం టోకూరు పంచాయతీ తెంతెలగుడ గ్రామంలో సుమారు 40 సెంటీమీటర్ల పొడవు, కిలో రెండు వందల గ్రాముల బరువు కలిగిన పేద్ద కాకరకాయ కనిపించింది. గ్రామానికి చెందిన కిల్లో అప్పలస్వామి పెరట్లో కాచిన ఆ కాకరకాయను ఆదివారం స్థానిక చర్చికి అందజేసినట్టు ఆయన తెలిపారు.

- అనంతగిరి రూరల్, ఆంధ్రజ్యోతి



చేజర్లలో తెలుగువారి తొలి గణపతి విగ్రహం!

- పుట్లగూడెంలో పురాతన బౌద్ధారామం

చేజర్ల/విజయవాడ, ఆగస్టు 27(ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా చేజర్లలోని కపోతేశ్వరాలయంలో ఉన్న గణపతి విగ్రహమే తెలుగు వారి తొలి వినాయక విగ్రహమని విజయవాడలోని అమరావతి సాంస్కృతిక కేంద్రం సీఈవో ఈమని శివనాగిరెడ్డి వెల్లడించారు. తెలుగు నేలపై ప్రతిష్ఠించిన తొలి గణపతి విగ్రహం ఇదేనని ఆయన చెప్పారు. చేజర్ల రాజధానిగా పాలించిన ఆనందగోత్రినుల వంశానికి చెందిన రాజులు ఈ శిల్పాన్ని చెక్కించినట్లు చారిత్రక ఆధారాల ద్వారా తెలుస్తోందన్నారు. దీనిని పల్నాటి సున్నపురాతిలో చేశారని తెలిపారు. తెలుగు రాష్ట్రాల్లో ఈ గణపతి విగ్రహమే చారిత్రకంగా పేర్కొనదగిన తొలి రాతి శిల్పమని శివనాగిరెడ్డి తెలిపారు. కాగా, గుంటూరు జిల్లా అచ్చంపేట మండలం పుట్లగూడెం వద్ద రెండు వేల సంవత్సరాల నాటి బౌద్ధారామం బయల్పడింది. ప్రిజర్వ్ హెరిటేజ్ ఫర్ ఫోస్టెరిటీ పథకంలో భాగంగా అమరావతి సాంస్కృతిక కేంద్రం సీఈవో ఈమని శివనారెడ్డి ఆదివారం చేపట్టిన పరిశోధనలో ఈ బౌద్ధారామం వెలుగు చూసింది. అచ్చంపేటకు పది కిలోమీటర్ల దూరంలో కృష్ణానది ఒడ్డున పుట్ల గూడెం గ్రామంలోని భైరవగుట్టపై దీనిని గుర్తించారు. ఇక్కడ శిథిలావస్థలో ఉన్న శివాలయం, వెంకటేశ్వరాలయం ప్రాంగణంలో బౌద్ధ చిహ్నాలైన అర్ధ పద్మం, జంతువుల ఆకృతులతో చెక్కిన ఆరు శిలా మండప స్తంభాలను ఆదివారం శివనాగిరెడ్డి పరిశీలించారు.

లోకం తీరు



ఉష్ణోగ్రతలు

కేంద్రం	కనిష్ఠం	గరిష్ఠం
హైదరాబాద్	23.0	30.2
కర్నూలు	23.1	30.1
గుంటూరు	25.0	33.0
కడప	25.0	33.0
విజయవాడ	26.0	30.9
చిత్తూరు	26.2	33.0
విశాఖపట్నం	27.6	32.4

బంగాళాఖాతంలో అల్పపీడనం

విశాఖపట్నం, ఆగస్టు 27(ఆంధ్రజ్యోతి): ఒడిసాకు ఆనుకుని వాయవ్య, పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఆదివారం సాయంత్రం అల్పపీడనం ఏర్పడింది. దీనిపై ఉపరిత ద్రోణి ఏర్పడి రుతపవనాలపై సానుకూల ప్రభావం చూపుతోంది. దీంతో కోస్తా, తెలంగాణాల్లో అనేకచోట్ల, రాయలసీమలో పలుచోట్ల వర్షాలు కురుస్తాయని, కోస్తా, తెలంగాణాల్లో అక్కడక్కడా భారీవర్షాలు పడతాయని వాతావరణ శాఖ వెల్లడించింది. కాగా, ఈసారి రుతుపవనాల సీజన్‌లో అల్పపీడనాలు/వాయుగుండాలు ఏర్పడేందుకు వాతావరణం అనుకూలించలేదు. ఈ ఏడాది నైరుతి రుతుపవనాల కరెంట్ దక్షిణ చైనా సముద్రం పరిసరాల్లో ఏర్పడే టైఫూన్ల దిశగా వెళ్లిపోవడంతో బంగాళాఖాతంలో ఎటువంటి అల్పపీడనాలు రాలేదు. గతవారం హాంకాంగ్, దక్షిణ చైనా సముద్రంలో ఏర్పడిన కేటగిరీ-3 టైఫూన్ బలహీనపడి కొంతభాగం బంగాళాఖాతంలో ప్రవేశించింది. దీని ప్రభావంతో బంగాళాఖాతంలో వాతావరణం అనుకూలించి ఆదివారం అల్పపీడనం ఏర్పడిందని వాతావరణ నిపుణుడు ఆర్.మురళీకృష్ణ తెలిపారు. దీంతో రెండు మూడు రోజుల పాటు మంచి వర్షాలు కురుస్తాయని చెప్పారు.

పిల్లలకు పాలిచ్చేందుకు బస్టాండ్లలో ప్రత్యేక గదులు!

- తమిళనాడు తరహాలో ఏర్పాటు.. వెల్లడించిన ఆర్టీసీ అధికారులు

విశాఖపట్నం, ఆగస్టు 27(ఆంధ్రజ్యోతి): చంటిబిడ్డలతో ప్రయాణాలంటేనే తల్లులకు ఓ విధమైన బెరుకు మొదలవుతుంది. బస్టాండ్లు, రైల్వేస్టేషన్ల వంటి బహిరంగ ప్రదేశాల్లో పిల్లలకు పాలు పట్టడానికి వీరు నానా ఇబ్బందులూ పడుతుంటారు. అయితే తమిళనాడులోని బస్టాండ్లలో ఇటువంటి వారికోసం ప్రత్యేకంగా గదులున్నాయి. వాటిలో కూర్చొని ప్రశాంతంగా పిల్లలకు పాలు పట్టుకొనే సదుపాయాన్ని అక్కడి ప్రభుత్వం కల్పించింది. అయితే మన రాష్ట్రంలోని బస్టాండ్లలో కూడా ఇలాంటి గదులను ఏర్పాటుచేసే యోచనలో ఆర్టీసీ అధికారులు ఉన్నారు. ఈ అంశంపై ఆంధ్రా యూనివర్సిటీకి చెందిన న్యాయ విద్యార్థి వినోద్ సమాచార హక్కు చట్టం కింద అడిగిన ప్రశ్నకు ఆర్టీసీ అధికారులు సమాధానం ఇచ్చారు.

ఆధార్-పాన్ లింక్.. 31 వరకే



న్యూఢిల్లీ, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): ఆదాయపన్ను చట్టానికి సవరణ చేయడంతో ఆధార్‌తో పాన్‌కార్డ్ అనుసంధానం తప్పనిసరి అయింది. అందుకు తుది గడువు ఆగస్టు 31 వరకే ఉంది. ఈ పనిని ఆన్‌లైన్‌లోనే సులభంగా చేసుకోవచ్చని యూఐడీఏఐ ప్రకటించింది.

- మొదట ఇన్‌కమ్ టాక్స్ ఈ-పోర్టల్‌లో రిజిస్టర్ కావాలి
- లాగిన్ ఐడీ, పాస్వర్డ్, పుట్టిన తేదీ ఉపయోగించి ఈ-పోర్టల్‌లో లాగిన్ అవ్వాలి
- లాగిన్ అయిన వెంటనే ఒక పాపప్ విండో ఓపెన్ అవుతుంది. అక్కడ ఆధార్ కార్డ్ లింక్ చేసే ఆప్షన్ వస్తుంది. ఒకవేళ అలా రాకుంటే ప్రొఫైల్ సెట్టింగ్స్‌ని క్లిక్ చేసి లింక్ ఆధార్ అనే బటన్‌ను నొక్కాలి
- అక్కడ వ్యక్తిగత వివరాలు, పేరు, పుట్టిన తేదీ, లింగం తదితర వివరాలు సరిచూసుకోవాలి. అక్కడ ఆధార్ నంబర్ ఇవ్వాల్సి ఉంటుంది.
- తరువాత వచ్చిన ఆధార్ వివరాలు, పాన్ వివరాలతో సరిచూసుకోవాలి
- అన్ని సరిపోయిన తరువాత 'లింక్ ఆధార్' అనే ఆప్షన్‌ని క్లిక్ చేయాలి. ఒక వేళ వివరాలు సరిపోలకపోతే విడిగా వాటి సమాచారం అప్‌డేట్ చేసుకోవాలి
- అన్ని సరిపోయి ఆధార్‌తో అనుసంధం పూర్తైతే ఆధార్‌తో పాన్ విజయవంతంగా లింక్ అయిందన్న పాపప్ సందేశం వస్తుంది.

'విస్తరి'ంచిన బతుకు!

- నాడు వద్దన్నవారే.. ఔరా అనేలా తాడిపత్రి రోడ్డు విస్తరణ పనులు
- పదేళ్ల క్రితం ఆలోచనకు రూపం
- భయపడి, అడ్డుకున్నవారంతా పెరిగిన రేట్లు, బిజినెస్‌తో హ్యాపీ
- వేలనుంచి లక్షల్లోకి స్థలం ధరలు

తాడిపత్రి, ఆగస్టు 27: బాధపడ్డారు. కన్నీరు మున్నీరయ్యారు. తమ జీవితాల్లోకి కాళరాత్రులు తొంగిచూస్తాయని భయపడిపోయారు. చివరకు కోర్టుల నుంచి స్టేలూ తెచ్చారు. ఇప్పుడు వారే, 'వరం' దక్కినంతగా సంబరపడిపోతున్నారు. ఆనాడు నాయకులను రోడ్డు పై పట్టుకొని దులిపేసిన వారే.. విస్తరించిన తమ బతుకులను చూసి ఆశ్చర్యపోతున్నారు. అనంతపురం జిల్లా తాడిపత్రిలో చేపట్టిన రోడ్డు విస్తరణ పనులు, ఈ ప్రాంతం రూపురేఖలనే మార్చివేశాయి. తాడిపత్రి పట్టణానికి దారితీసే రహదారుల్లో సీబీ(కడప-బళ్లారి) రోడ్డు కీలకం. ఇది అనంతపురం, కడప, కర్నూలు జిల్లాలను కలిపే ఏకైక రహదారి. సిమెంటు పరిశ్రమలు, స్టీల్‌ప్లాంట్‌లకు ముడిపదార్థాలను అందించే యూనిట్లు, గ్రానైట్, బండల పాలిష్ యూనిట్లు బాగా విస్తరించిన ప్రాంతం కావడంతో.. ఈ మార్గంలో రద్దీ చాలా ఎక్కువ. దానికి తోడు వంద అడుగులు ఉండాల్సిన రోడ్డు.. దురాక్రమణలతో 50-60 అడుగులకు కుదించుకుపోయింది. రెండు వాహనాలు ఎదురెదురుగా వస్తే.. గంటలు గంటలు ట్రాఫిక్ ఆగిపోయే పరిస్థితి! ఈ పరిస్థితుల్లో సీబీరోడ్డుని విస్తరించాలని పదేళ్ల క్రితం, అప్పట్లో తాడిపత్రి మునిసిపాలిటీ వైస్‌ఛైర్మన్. ఇప్పటి ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్‌రెడ్డి నిర్ణయం తీసుకొన్నారు.

అడ్డంకులు ఎదురైనా..

రోడ్డు విస్తరణకు సంబంధించి రోడ్డుకిరువైపులా మార్కులు వేసిననాటినుంచీ అడ్డంకులు మొదలయ్యాయి. కొంతమంది మునిసిపాలిటీ అధికారులను కలిసి.. తమ సమస్య చెప్పుకొన్నారు. అలాంటివారి విజ్ఞప్తిమేరకు రోడ్డు విస్తరణలో కొన్నిమార్పులు చేశారు. మరికొందరు మాత్రం విస్తరణనే వ్యతిరేకించారు. రాజకీయ రంగు కూడా కలవడంతో అడుగడుగునా ఉద్రిక్తతలను ఎదుర్కోవాల్సి వచ్చింది. కొందరు కోర్టుకు వెళితే, మరికొందరు పురుగులమందు తాగి ఆత్మహత్యలు చేసుకుంటామని బెదిరించారు. ఇంకొందరు పనులు సాగుతున్నచోట వాహనాలకు అడ్డంగా బైఠాయించారు. విస్తరణలో తమ ఇళ్లు, షాపులు పోతున్నాయని ఆగ్రహించారు. నిజమైన బాధితులను ప్రభుత్వం గుర్తించింది. పరిహారంగా రూ.50 లక్షలను మంజూరు చేసింది. మరోవైపు, ఒక్కో అడ్డంకిని తొలగించుకొంటూ, మునిసిపాలిటీ అధికారులు ముందుకు సాగారు. రెండు విడతలుగా దాదాపు రూ.8 కోట్ల వ్యయంతో సిమెంటు రోడ్డు వేశారు.




విస్తరణ పనుల తర్వాత సీబీ రోడ్డు

విస్తరణ తర్వాత..

సీబీ రోడ్డుకు ఇరువైపులా ఉన్న స్థలాలు, ఇళ్లు, భవనాలకు భారీ రేట్లు పెరిగాయి. పల్లె ఆనవాళ్లు పోయి, సిటీ వాతావరణం పరుచుకొంది. వేలల్లో ఉండే స్థలం రేట్లు లక్షల్లోకి చేరాయి. ఒక సెంటు రూ.ఐదు లక్షలు ఉంటే, విస్తరణ తర్వాత రూ.50 లక్షల నుంచి రూ.75 లక్షల వరకు పలుకుతోంది. సీబీ రోడ్డుకు ఇరువైపులా ఎక్కువశాతం మట్టిమిద్దెలు, రాతి ఇళ్లు ఉండేవి. ఇప్పుడు వాటిని షోరూంలకు లీజులకు ఇచ్చారు. బ్యాంకులు, టూవీలర్స్, వివిధ వాహనాలకు సంబంధించిన కంపెనీలు తమ సేవలను విస్తరించేందుకు ఉత్సాహపడుతున్నాయి. ఈ నేపథ్యంలో, సీబీ రోడ్డు తరువాత.. ఆ స్థాయి రద్దీని మోస్తున్న పుట్లూరు రహదారి, మెయిన్ బజార్లలోనూ విస్తరణ పనులు చేపట్టాలని తాడిపత్రి ప్రజలు, వ్యాపారులు కోరుతున్నారు.

- **తిట్టినవారే మొక్కుతున్నారు**



రోడ్డు విస్తరణ చేయాలని నేను నిర్ణయం తీసుకొన్నప్పుడు తిట్టినవారు, బాధపడినవారే...ఇప్పుడు ఆనందంతో చేతులెత్తి మొక్కుతున్నారు. అప్పట్లో స్వయంగా బాధితులను కలిసి ధైర్యం చెప్పిన రోజులు గుర్తుకు వస్తున్నాయి.

– జేసీ ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే, తాడిపత్రి

- **ఇంత డిమాండ్ చూడలేదు**

మా భూములకు ఇంత డిమాండ్ వస్తుందని ఊహించలేకపోయాం. మా స్థలానికి మంచి పరిహారం లభించింది.

– అల్లాబక్ష్, కూల్‌డ్రింక్ షాపు యజమాని, తాడిపత్రి



సమాజానికి ట్రంప్ హానికరం

డోనాల్డ్ ట్రంప్‌తో సమాజానికి చాలా హాని జరుగుతుంది. ఉన్నతమైన అమెరికా అధ్యక్ష పీఠంపై అతడిని కూర్చోనివ్వకూడదని ఎంతో ప్రయత్నించి విఫలమయ్యా. అతడికి ఏ సిద్ధాంతమూ లేదు. కేవలం డోనాల్డ్ ట్రంప్ సిద్ధాంతం తప్ప. ఇదిఅమెరికాకు హాని చేస్తుంది.

-టీవీ వ్యాఖ్యాత పద్మాలక్ష్మి

విజయవాడలో..

నేటి పెట్రో ధరలు (లీ.)

పెట్రోల్	డీజిల్
పాత ధర రూ.74.63	పాత ధర 63.72
కొత్త ధర రూ.74.67	కొత్త ధర 63.71
పెరుగుదల 4 పైసలు	తగ్గుదల 1 పైసా

పురుషుల కన్నా స్త్రీల సత్తువ ఎక్కువ

టొరంటో, ఆగస్టు 27: పురుషులు, స్త్రీలలో శారీరకంగా ఎవరు ధృడంగా ఉంటారు? అని ప్రశ్న వేయగానే టక్కున పురుషులే అని జవాబిస్తాం. కానీ, పురుషుల కన్నా మహిళలే ఎక్కువ సత్తువ ఉన్నవాళ్లని, వారిలో కండరాల సహనశక్తి అధికమని అంటున్నారు కెనడాలోని యూనివర్సిటీ ఆఫ్ బ్రిటిష్ కొలంబియా శాస్త్రవేత్తలు. కండరాలకు సంబంధించిన వ్యాయామం చేయించినపుడు పురుషుల కంటే మహిళలు తక్కువగా అలిసిపోయినట్లు పరిశోధనల్లో తేలిందని వారు తెలిపారు. 8 మంది పురుషులు, 9 మంది మహిళలతో వ్యాయామం చేయించి పరీక్షించినపుడు పురుషులు తొందరగా అలసిపోయినట్లు వెల్లడైందని వివరించారు.

వ్యాయామం కోసం 'ఎక్సర్‌సైజ్ గోళీ'



లండన్, ఆగస్టు 27: ఆరోగ్యంగా ఉండాలంటే వ్యాయామం చేయాల్సిందే. పొద్దున్నే లేచి చెమటలు కక్కాల్సిందే. అదే ఏంచక్కా.. దానిక్కూడా ఏ మందో, సూదో ఉంటే ఎంత బాగుంటుంది? ఇదే ఆలోచన యూకేలోని యూనివర్సిటీ ఆఫ్ లీడ్స్ పరిశోధకులకూ తట్టింది. వెంటనే ఆ దిశగా పరిశోధనలు చేసి శరీరంలో పియెజో1 అనే ప్రొటీన్‌ను కనిపెట్టారు. వ్యాయామం చేస్తున్నపుడు పియెజో1 ప్రొటీన్ రక్తాన్ని గుండె నుంచి కడుపులోకి తీసుకెళ్తుంది. రక్తనాళాలపై ఒత్తిడి తెస్తుంది. ఆ ప్రొటీన్ ఆధారంగా ఔషధాన్ని తయారు చేసేందుకు శాస్త్రవేత్తలు సిద్ధమయ్యారు. వీరు ఎలుకలపై చేసిన పరిశోధనల్లో ఆశించదగ్గ ఫలితాలు వెలుగుచూశాయి.

జగన్.. ఓ డేరా బాబా!



కాకినాడ ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు, హాజరైన జనసందోహం

(మొదటి పేజీ తరువాయి)

అనుచరుల అరాచకాన్ని అడ్డుకోలేకపోయారని, అయితే జగన్ అరాచకాల పట్ల తాను ముందు నుంచీ జాగ్రత్తగా ఉన్నానని, అరాచకవాదుల ఆటలు సాగనివ్వనని స్పష్టం చేశారు. కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల సందర్భంగా ఆదివారం కాకినాడలో రోడ్‌షోలు, బహిరంగ సభల్లో సీఎం పాల్గొన్నారు. వివిధ సామాజిక వర్గాలతో సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కుల, మత, ప్రాంతాల పేరిట జగన్ రాష్ట్రంలో అశాంతి సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నాడని ధ్వజమెత్తారు. 'జగన్ చిన్నప్పటి నుంచి ఉన్మాదే. తండ్రి వైఎస్‌పై కూడా తిరగబడ్డాడు. తండ్రిని కూడా కష్టాలు పెట్టాడు. తండ్రి తన మాట వినడం లేదని టీవీలు బద్దలు కొట్టాడు. చివరకు వైఎస్ తన ఉద్యోగం పోతుందేమోనని భయపడి జగన్‌ను బెంగళూరు పంపించాడు. అక్కడి నుంచి అవినీతి మొదలు పెట్టాడు. తండ్రి చనిపోయిన తర్వాత ఇక్కడకు వచ్చి మనల్ని ఇబ్బంది పెట్టే ప్రయత్నం చేస్తున్నాడు' అని పేర్కొన్నారు. సీఎంనైన తనను కాల్చి చంపమని, ఉరితీయమని, బట్టలు ఊడదీయమని అంటున్నాడు, ఇటువంటి రెచ్చగొట్టే మాటలు భావి పౌరులైన పిల్లలపై ఎలాంటి ప్రభావం చూపిస్తాయి, ఈ సమాజం ఏమైపోతుందని చంద్రబాబు ప్రశ్నించారు. భావితరాల భవిష్యత్తు కోసం వైసీపీని ఓడించండని పిలుపునిచ్చారు. అంతకు ముందు కాకినాడ అంబేద్కర్ భవన్‌లో డ్వాక్రా మహిళల సమావేశంలో సీఎం మాట్లాడుతూ.. టీడీపీకి 60 లక్షల మంది కార్యకర్తలు ఉన్నారని, రాష్ట్రవ్యాప్తంగా 90 లక్షల మంది డ్వాక్రా మహిళలు ఉన్నారని వారంతా కలిసి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళితే రాష్ట్రంలో మరే పార్టీ ఉండదని వ్యాఖ్యానించారు. 'కాంగ్రెస్ ఇప్పటికే కనుమరుగైంది. కొత్తగా వైసీపీ వచ్చింది. ఆ పార్టీకి విలువలు లేవు. ప్రజల పట్ల ప్రేమ లేదు.' అని సీఎం పేర్కొన్నారు. నంద్యాల ఎన్నికల ప్రచారంలో జగన్ తనపై చేసిన వ్యాఖ్యలకు ఎన్నికల కమిషన్ స్పందించి, ఆయనపై క్రిమినల్ కేసులు పెట్టిందన్నారు. అయినా కూడా జగన్‌లో మార్పు రాలేదన్నారు. త్వరలోనే డ్వాక్రా సంఘాలకు ప్రపంచవ్యాప్త గుర్తింపు వస్తుందని అన్నారు.

వైసీపీ నేతలకు ప్రజలే మందు వేయాలి

రాష్ట్రంలో ఇటీవల పందులు, కుక్కల బెడద ఎక్కువైందని, వాటి బెడద లేకుండా చర్యలు తీసుకుంటున్నామని, కుక్కలు కరిచినా ఇబ్బంది లేకుండా వాటికి వ్యాక్సిన్లు వేయిస్తున్నామని సీఎం పేర్కొన్నారు. 'ఇప్పుడు వైసీపీ వారు మీ వద్దకు వస్తారు. పిచ్చి కుక్కల్లా అరుస్తారు. వారికి మీరే మందు వేయాలి' అని చంద్రబాబు సూచించారు. 'నా గురించి బాధ లేదు. నా బాధ అంతా ప్రజల కోసమే. నాపై బాంబులతో దాడి చేస్తే సాక్షాత్తు వెంకటేశ్వరస్వామి కాపాడాడు. ఉన్మాదులు, రౌడీలు, భూకబ్జాదారుల ఆటలు సాగనివ్వకండి. ఇక్కడ రావణకాష్టం చేయడానికి జగన్ సిద్ధంగా ఉన్నాడు. మీరు నాకు అండగా ఉండండి, వారి సంగతి నేను చూసుకుంటాను' అని సీఎం కాకినాడ ప్రజలకు భరోసా ఇచ్చారు.

ఓటు అడిగే హక్కు నాకే ఉంది

'రాష్ట్ర విభజన తర్వాత రాష్ట్రాభివృద్ధిని చేయగలనన్న విశ్వాసంతో మీరు నాకు పట్టం కట్టారు. మీ నమ్మకాన్ని వమ్ము చేయకుండా అభివృద్ధి సంక్షేమాన్ని కొనసాగిస్తున్నాను. శాంతి భద్రతలను కాపాడుతున్నాను. మిమ్మల్ని ఓటు అడిగే హక్కు నా ఒక్కడికే ఉంది.' అని సీఎం ఉద్ఘాటించారు. 'ఎన్టీఆర్ సమాజమే దేవాలయం, ప్రజలే నా దేవుళ్లు అని నమ్మేవారు. నేనూ అదే నమ్ముతున్నాను' అని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని ప్రతి పేద కుటుంబానికీ పెద్ద కొడుకులా వ్యవహరిస్తున్నానన్నారు. కాపులకు న్యాయం చేయడానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని, బీసీల్లో చేర్చే ప్రక్రియను త్వరలోనే పూర్తి చేస్తామని సీఎం చెప్పారు.

కాకినాడను అభివృద్ధి చేసే బాధ్యత తనదని సీఎం స్పష్టం చేశారు. ఇప్పటికే కాకినాడ స్మార్ట్ సిటీగా ఎంపికైందని, దానికిగాను రూ.2 వేల కోట్లు వస్తాయని తెలిపారు.రూ.250 కోట్లతో ఇంటింటికి కుళాయి సౌకర్యం, రూ.500 కోట్లతో రోడ్లు, పార్కులు, డ్రైనేజీ అభివృద్ధి జరుగుతుందన్నారు. ఎస్ఈజెడ్‌తో ఈ ప్రాంతంలో ఉద్యోగావకాశాలు పెరుగుతాయని తెలిపారు.

సమస్య వస్తే 1100కి కొట్టండి

మీకే ఏదైనా సమస్య వస్తే.. మీకు చేయాల్సిన పనికి ఎవరైనా లంచం అడిగితే 1100కి కాల్ చేయండి వెంటనే స్పందిస్తామని సీఎం ఉద్ఘాటించారు. తప్పు చేసింది తన సొంత మనిషి అయినా వదలనని, సమస్య ఉందని నా వద్దకు వస్తే నిజాయితీగా పరిష్కరిస్తానని అన్నారు. నీతివంతమైన పాలన అవసరం. మనం ఈ స్ఫూర్తికి నాంది పలకాలి అన్నారు.



తల కొరివి పెట్టి రుణం తీర్చుకున్న కోడలు

జీలుగుమిల్లి: ఈ కోడలు తన అత్తకే కొడుకయ్యింది. ఆ అత్త మరణిస్తే అంతిమ సంస్కారాలు చేసి రుణం తీర్చుకుంది. పశ్చిమ గోదావరి జిల్లా జీలుగుమిల్లిలో అనపాల భద్రమ్మ(70) ఆదివారం మృతి చెందింది. ఆ కుటుంబంలో ఇంటి పేరుగల మగదిక్కు లేరు. దీంతో కోడలు రత్తమ్మ, ఆదివారం అత్త అంత్యక్రియలు నిర్వహించింది. కొద్ది రోజుల క్రితం రత్తమ్మ భర్త అనపాల అప్పారావు చనిపోయాడు. అంతకు మునుపే రత్తమ్మ తన కొడుకు రాంబాబును కోల్పోయింది.

ప్రాణం తీసిన మెమొరీ కార్డు!

- పుట్టినరోజు వేడుకల్లో ఘర్షణ

మెంటాడ, ఆగస్టు 27: పుట్టినరోజు వేడుకల్లో మెమొరీ కార్డు చిచ్చుపెట్టింది. విజయనగరం జిల్లా మెంటాడ మండలం సంగంగడ్డివలసకి చెందిన కొర్రాయి చిన్నయ్య తన కుమారుడు బాలరాజు 4వ పుట్టినరోజు నేపథ్యంలో ఆదివారం బంధువులైన లక్ష్మణరావు, గుమ్మిల పొట్టయ్యకు సారా, మడ్డి కల్లుతో విందు ఇచ్చా డు. జన్మదిన వేడుకల్లో చిన్నయ్య సెల్‌ఫోన్‌లో పాటలు పెట్టి చిందులేశారు. తర్వా త కొద్దిసేపటికి ఫోన్‌లో మెమొరీ కార్డు కనిపించకుండా పోయింది. దాన్ని లక్ష్మణరావు దొంగలించాడంటూ చిన్నయ్య గొడవకు దిగాడు. గొడవ పెద్దది కావడంతో సారాయి మత్తులో ఉన్న చిన్నయ్య ఆవేశంగా కత్తితో పొట్టయ్య ఛాతీపై పొడిచాడు. దీంతో అతడు మరణించాడు.

ఆవును కాపాడిన యువకుడు



నల్లజర్ల, ఆగస్టు 27: పొలం పనులకు వెళ్తున్న ఆ యువకుడి సాహసం.. ఓ మూగ జీవం ప్రాణాలను కాపాడింది. పోలవరం కుడి కాలువలో కొట్టుకుపోతున్న ఆవును ఒడ్డుకు చేర్చేందుకు పశ్చిమ గోదావరి జిల్లా నల్లజర్ల మండలం అనంతపల్లికి చెందిన యువకుడు బళ్ల నాగపండు ప్రాణాలకు తెగించాడు. ఆదివారం సాయంత్రం కాలువ గట్టుపై నుంచి పొలం పనులకు వెళ్తున్నాడు. ఆ సమయంలో కాలువ ప్రవాహంలో ఆవు కొట్టుకుపోతుండడాన్ని నాగపండు గమనించాడు. సమీపంలో ఉన్న రైతులకు సమాచారమిచ్చి... కాలువలోకి దూకి నెమ్మదిగా ఒడ్డు వద్దకు చేర్చాడు.

ఆ డబ్బులెందుకు వేశారు?

- బెట్టింగ్ కేసులో కోటంరెడ్డిని ప్రశ్నించిన పోలీసులు

నెల్లూరు, ఆగస్టు 27(ఆంధ్రజ్యోతి): నెల్లూరు జిల్లాలో క్రికెట్ బెట్టింగుల వ్యవహారంపై వైసీపీ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిని పోలీసులు మరోసారి విచారించారు. ఇప్పటికే ఈ నెల 22న విచారించి కొంత సమాచారం సేకరించిన పోలీసులు.. ఆదివారం కూడా ప్రశ్నించి వివరాలు రాబట్టారు. అయితే అంతకుముందే ఆయన అనుచరుడు బిరదవోలు శ్రీకాంత్‌రెడ్డి నుంచి పోలీసులు పలు వివరాలు సేకరించారు. అతడు ఇచ్చిన సమాచారంతోపాటు కోటంరెడ్డి నుంచి మరిన్ని వివరాలు తెలుసుకొనేందుకు ఏఎస్పీ శరత్‌బాబు ప్రయత్నించారు. ఈ క్రమంలో ప్రధానంగా ఆర్థిక లావాదేవీలపై ఆరా తీశా రు. ఇవన్నీ వీడియో రికార్డు చేసి.. ప్రశ్నలకు రాత పూర్వకంగా సమాధానాలు తీసుకున్నారు. బెంగుళూరులోని కేతనహళ్లిలో కోటంరెడ్డి పేరుతో ఉన్న ఓ బ్యాంకులో రూ.4.98 లక్షలు డిపాజిట్ చేయడాన్ని ప్రధానంగా ప్రశ్నించారు. తనకు ఆ ఖాతాకు సంబంధం లేదని కోటంరెడ్డి చెప్పినా... నెల్లూరు నుంచి ఆ ఖాతాకు పలు సందర్భాల్లో నగదు బదిలీ జరిగినట్లు బ్యాంకు నుంచి తీసుకున్న సమాచారం వెల్లడిస్తోందని పోలీసులు స్పష్టం చేశారు. ఇలా పలు అంశాలపై కోటంరెడ్డి నుంచి వివరాలు రాబట్టిన పోలీసులు ప్రస్తుతానికి విచారణ ముగిసిందని చెప్పారు. రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి, ఆ తరువాత సిటీ ఎమ్మెల్యే అనిల్‌ను ఆదివారం విచారించాలని పోలీసులు తొలుత భావించారు. కానీ, కోటంరెడ్డి విచారణ వరకే వారు పరిమితయ్యారు. అనిల్‌కుమార్ ముఖ్య అనుచరుడు, పంటరుగా వ్యవహరించిన రూపుకుమార్‌యాదవ్‌ను మొదట విచారించిన తరువాతే ఎమ్మెల్యే అనిల్‌ను రెండో విడత విచారించాలని పోలీసులు నిర్ణయించారు. ఇదిలావుండగా, విచారణ అనంతరం కోటంరెడ్డి మీడియాతో మాట్లాడుతూ ఇది ప్రభుత్వ కక్ష్య సాధింపు చర్యకు పాల్పడుతోందని, వైసీపీ ఎమ్మెల్యేలను వేధింపులకు గురి చేస్తోందని ఆరోపించారు. క్రికెట్ బెట్టింగులను శాశ్వతంగా రూపు మాపేందుకు నాలుగు సూచనలు చేస్తూ ఓ వినతిపత్రాన్ని ఏఎస్పీ కి అందించానని,చర్యలు తీసుకోకపోతే న్యాయపరంగా పోరాడతానని అన్నారు. వైసీపీ ఎమ్మెల్యేలను ఇరికించడం వెనుక ఆంతర్యమేమిటో ఎస్పీ వెల్లడించాలని డిమాండ్ చేశారు. ఈ వ్యవహారాల్లో మంత్రులు, మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఉన్నారని, కృష్ణసింగ్ కాల్ లిస్టును పరిశీలిస్తే ఇది వెల్లడవుతుందని పేర్కొన్నారు.



ఎస్పీ కార్యాలయానికి వెళుతున్న కోటంరెడ్డి



గల్ఫ్‌లో ఘనంగా చవితి

- ఈసారి కువైత్‌లోనూ ఉత్సవాలు

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి): గల్ఫ్ దేశాల్లో వినాయక చవితి ఉత్సవాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈసారి కువైత్‌లోనూ ఆరున్నర అడుగుల వినాయకుని విగ్రహాన్ని ప్రతిష్ఠించి పూజలు చేశారు. ఈ కార్యక్రమానికి 3 వేల మంది తెలుగుప్రవాసీయులు హాజరయ్యారు. ఖైతాన్‌లో కె.రామ్మోహన్ ఆధ్వర్యంలో ఉత్సవాలు నిర్వహించగా కువైత్‌లో పనిచేస్తున్న ఏపీలోని కడప జిల్లా రాజంపేటకు చెందిన బాబు అనే శిల్పి విగ్రహాన్ని రూపొం దించారు. గణపతి లడ్డూను టీడీపీ నేత కె.సుధాకర్ రావు 700దినార్ల (దాదాపు రూ.1.5లక్షలు)కు వేలంలో దక్కించుకున్నారు. సౌదీ అరేబియాలోని దమ్మాం, రియాద్, జెద్దా, రాబిఖ్, దుబాయి, షార్జా, ఖతర్ తదితర ప్రాంతాల్లోనూ చవితి పండుగను ఘనంగా జరుపుకున్నారని ప్రవాసీ శారదాంబా చెప్పారు.



నర్సుల వైద్యం.. నిండు గర్భిణి మృతి

- ధర్మాజీగూడెం పీహెచ్‌సీ వద్ద మృతురాలి బంధువుల ఆందోళన

లింగపాలెం, ఆగస్టు 27 : వైద్యుడి విధులను నర్సులే చేయడంతో నిండు గర్భిణి ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. పశ్చిమగోదావరి జిల్లా లింగపాలెం మండలం ధర్మాజీగూడెం పీహెచ్‌సీలో ఆదివారం ఈ ఘటన జరిగింది. లింగపాలెం మండలంలోని మఠంగూడెం శివారు సుందరావుపేటకు చెందిన దేవరపల్లి విజ్ఞేశ్వరి ధర్మాజీగూడెంలోని బంధువుల ఇంటికి వచ్చారు. ఈనెల 25న ఆమెకు పురిటి నొప్పులు రావడంతో స్థానిక పీహెచ్‌సీలో చేర్చారు. ఆదివారం ఉదయం నొప్పులు ఎక్కువ కావడంతో పీహెచ్‌సీ సిబ్బంది కాన్పు చేసే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో విజ్ఞేశ్వరి మృతి చెందింది.. దీంతో వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే విజ్ఞేశ్వరి మృతి చెందిందని బంధువులు ఆరోపించారు. కాన్పు కష్టంగా ఉందని తాము వేరే ఆసుపత్రికి తీసుకెళ్తామని వైద్యులను అడిగినా అవసరం లేదన్నారని బంధువులు తెలిపారు. దీంతో పీహెచ్‌సీ వద్ద ఆందోళనకు దిగారు. పీహెచ్‌సీ వైద్యాధికారిని అరెస్టు చేయాలంటూ పట్టుబట్టారు. పోస్టుమార్టంకు తరలిస్తుండగా వైద్యులపై చర్యలు తీసుకోకుండా మృతదేహన్ని తీసుకువెళ్లనిచ్చేదిలేదని అడుకున్నారు. దీంతో సీఐ రాజేష్, సర్పంచ్ వరప్రసాద్, తహసీల్దార్ బి.సోమశేఖర్ ఆందోళనకారులతో మాట్లాడి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరుకు తరలించారు. బాధితులు పీహెచ్‌సీ వద్ద ఆందోళన చేస్తున్న విషయాన్ని స్థానిక టీడీపీ నాయకులు ఎమ్మెల్యే పీతల సుజాతకు తెలిపారు. స్పందించిన సుజాత కలెక్టర్, డీఎంహెచ్‌వోతో మాట్లాడి బాధితురాలికి న్యాయం చేయాలని సూచించారు. ధర్మాజీగూడెం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


విజ్ఞేశ్వరి మృతదేహం వద్ద రోదిస్తున్న భర్త

అమరావతిలో 'యూత్ హాస్టల్'

- సర్కారు సహాయం కోరాలని నిర్ణయం
- ఏపీ రాష్ట్ర శాఖ చైర్మన్‌గా డాక్టర్ జోషి

అమరావతి, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయిలో అనేక ప్రతిష్ఠాత్మక సంస్థలు తరలివస్తున్న నవ్యాంధ్ర రాజధాని అమరావతిలో అంతర్జాతీయ యూత్ హాస్టల్ ఏర్పాటు చేయాలని 'యూత్ హాస్టల్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా' (వైహెచ్‌ఏఐ) రాష్ట్ర శాఖ తీర్మానించింది. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వ సహకారం కోరాలని నిర్ణయించింది. ఆదివారం విజయవాడలో వైహెచ్‌ఏఐ రాష్ట్ర కౌన్సిల్ సమావేశం జరిగింది. నల్లమల, తిరుమల, మారేడుమిల్లి, కొండపల్లి అటవీ ప్రాంతాల్లో ట్రెక్కింగ్ కార్యక్రమాల విస్తరణకు అటవీశాఖతో కలిసి ప్రణాళికలు నిర్వహించాలని ఈ భేటీలో నిర్ణయించారు. ఇదే సమావేశంలో వైహెచ్‌ఏఐ ఆంధ్రప్రదేశ్ శాఖ కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకొన్నారు. చైర్మన్‌గా ఎస్ఆర్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వెలగా జోషిని, అధ్యక్షుడిగా ఉక్కునగరానికి చెందిన కృష్ణమూర్తి ఎన్నికయ్యారు. ఈ ఎన్నికలకు వైహెచ్‌ఏఐ జాతీయ కౌన్సిల్ సభ్యుడు నందం విష్ణువర్ధన్ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు.


డాక్టర్ వెలగా జోషి

గరగపర్రులో మరో 37 మందికి చెక్కులు

పాలకోడేరు, ఆగస్టు 27 : పశ్చిమ గోదావరి జిల్లా గరగపర్రులో సామాజిక బహిష్కరణకు గురైన దళితులలో మరో 37 మందికి ఒక్కొక్కరికి లక్ష రూపాయల చొప్పున పరిహారాన్ని తహసీల్దార్ గంజి రత్నమణి అందజేశారు. ఆదివారం సాయంత్రం పాలకోడేరు తహసీల్దార్ కార్యాలయంలో చెక్కులు పంపిణీ చేశారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం - ఫారం నెం. VII

(చట్టం నెం. 30/2013 లోని సెక్షన్ 19(1) మరియు రూలు 25(1) ప్రకారం)

ఆర్.సి.నెం. 5910/2015-ఎ1

రూఢి ప్రకటన

తేది : 24.08.2017

క్రింది షెడ్యూలులో నిర్దిష్ట పరిచిన గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం **తుళ్ళూరు-2** గ్రామములో గల యి.23.4000 సెంట్లు భూమి ప్రజాహిత కార్యక్రమాల నిమిత్తం అనగా **"రాజధాని నగర అభివృద్ధి ప్రాజెక్ట్"** ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ, విజయవాడ వారు నిర్మాణము చేయుటకు అవసరమని అనుగుణమైన ప్రభుత్వముగా అధీకృతులైన గుంటూరు జిల్లా కలెక్టరు గారు భావించుచున్నందున, సదరు భూముల యందు ఆసక్తి గల వ్యక్తులు అభ్యంతరములను దాఖలు చేసినందున చట్టం 30/2013లోని సెక్షన్ 15 ప్రకారము విచారణ మీదట మరియు ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ, విజయవాడ వారు భూసేకరణకు అవసరమగు సైకము జమచేసియున్నందున సంతృప్తి చెందినవారై గుంటూరు జిల్లా కలెక్టరు గారు చట్టం 30/2013 లోని సెక్షన్ 19(1) ప్రకారము ఈ డిక్లరేషను చేయుచున్నారు.

రూఢి ప్రకటన

దిగువ షెడ్యూలులో పేర్కొనిన యి.23.4000 సెంట్లు భూమి, చట్టం 30/2013 లోని సెక్షన్ 19(1) ప్రకారము ప్రజాహిత కార్యక్రమాలకు అనగా **"రాజధాని నగర అభివృద్ధి ప్రాజెక్ట్,"** ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ, విజయవాడ వారు నిర్మాణము చేయుటకు అవసరమని గుంటూరు జిల్లా కలెక్టరుగారు ధ్రువీకరించుచున్నారు.

షెడ్యూలు

ప్రాజెక్టుపేరు : రాజధాని నగర అభివృద్ధి ప్రాజెక్ట్

జిల్లా : గుంటూరు | మండలం : తుళ్ళూరు | గ్రామం : తుళ్ళూరు -2

క్ర. సం. నెం	సర్వే నెం.	సబ్ డివిజన్ నెం.	మొత్తము విస్తీర్ణము (ఎ.సెం.)	సేకరించవలసిన విస్తీర్ణము (ఎ.సెం.)	వర్గీకరణ	కేటగిరి	ఆసక్తి గల వ్యక్తుల పేర్లు మరియు చిరునామా	హద్దులు: ఉత్తరం స.నెం.	తూర్పు స.నెం.	దక్షిణము స.నెం.	పడమర స.నెం.	చెట్లు, కట్టడములు మొదలగు వివరములు
1	2	3	4	5	6	7	8	9	10	11	12	13
1	321	ఎ2ఎ	2.9400	0.9425	మెట్ట	పట్టా	కొల్లి సీతారామయ్య తండ్రి రాఘవయ్య	321/ఎ1	321/బి	321/ఎ2బి	321/ఎ1	-
2	322	1బి	3.7000	0.4700	మెట్ట	పట్టా	కొల్లి సీతారామయ్య తండ్రి రాఘవయ్య	322/1ఎ	322/1ఎ	322/2	322/1ఎ	-
3	323	బి1	0.0975	0.0975	మెట్ట	పట్టా	పసుపులేటి ఏడుకొండలు తండ్రి భాగయ్య	323/ఎ	323/బి2	335	323/సి	-
4	324	1బి2	2.7800	2.7800	మెట్ట	పట్టా	జమ్ముల శ్రీదేవి, భర్త లేటు రామకృష్ణారావు & జమ్ముల వినోద్ తండ్రి లేటు నాగేశ్వరరావు	324/1బి1	325	324/2	324/1ఎ	-
5	333	2	2.7000	2.700	మెట్ట	పట్టా	కొమ్మినేని కోటేశ్వరరావు తండ్రి చిన్న నరసయ్య	333/1	334	335	332	-
6	334	2	16.060	5.8300	మెట్ట	పట్టా	కొమ్మినేని కోటేశ్వరరావు తండ్రి చిన్న నరసయ్య	334/1	314	335	333	-
7	399	2	1.4300	1.4300	మెట్ట	పట్టా	జమ్ముల సాంబశివరావు తండ్రి లక్ష్మయ్య మరియు ఇతరులు	401	402	399/1	399/1	-
8	407	2	11.930	1.7000	మెట్ట	పట్టా	వల్లభనేని బుల్లెమ్మ & వల్లభనేని జయదేవ్ కృష్ణ (వల్లభనేని సుబ్బయ్య సత్రం ట్రస్ట్)	407/1	407/3	397, 398	[illegible]	-
9	422	భాగము	8.4300	0.0100	మెట్ట	పట్టా	పాటిబండ్ల సాంబశివరావు తండ్రి సీతారామయ్య	422/4	422/6ఎ	422/7	422/7	-
10	474	1&2	10.5400	2.7800	మెట్ట	పట్టా	పోలు రమేష్ & పోలు వెంకట అప్పారావు తండ్రి పాండురంగారావు	475/3	475/3	[illegible]	475/3	-
11	488	2	2.3400	2.3400	మెట్ట	పట్టా	కొమ్మినేని పుష్పాంజలి @అంజలి భర్త చలపతిరావు	489	489/3	[illegible]	488/1	-
12	492	2	2.3200	2.3200	మెట్ట	పట్టా	కొమ్మినేని పుష్పాంజలి @అంజలి భర్త చలపతిరావు	492/1	489	[illegible]	492/1	-
		మొత్తం విస్తీర్ణము		23.4000								

స్పెషల్ డిప్యూటీ కలెక్టరు మరియు భూసేకరణ అధికారి, భూసమీకరణ / సేకరణ, యూనిట్ 21, తుళ్ళూరు -2 నందు సదరు భూముల ప్లాను ఉంచినందున పనిదినములలో కార్యాలయ వేళలందు పరిశీలించుకొనవచ్చును.

భూసేకరణ వలన ప్రాజెక్ట్ ప్రభావిత కుటుంబముల సంఖ్య 39. నిర్వాసితులు ఎవ్వరును లేరు. పునరావాస మరియు పునర్నిర్మాణ పథకము సంగ్రహ నివేదిక భూసేకరణ అధికారి తుళ్ళూరు-2 వారి కార్యాలయమునందు, ఏ.పి.సి.ఆర్.డి.ఏ వెబ్‌సైట్ www.crda.ap.gov.in మరియు గుంటూరు జిల్లా కలెక్టర్ వారి వెబ్‌సైట్ www.guntur.ap.gov.in నందు ఉంచబడినవి.

ప్రాజెక్ట్ నిర్మాణ దశలో అవసరమైన భాగములో గనులు మరియు ఖనిజములు త్రవ్వుట / తొలగించుట/ వినియోగించుట తప్ప భూసేకరణ షెడ్యూలు మిగిలిన భూములలో ఉన్న బొగ్గు గనులు, ఇనుపరాయి, పలకరాయి లేదా యితర ఖనిజములు అవసరములేదు.

స్థలము : గుంటూరు
తేది : 24-08-2017

సం/- కోన శశిధర్,
జిల్లా కలెక్టరు, గుంటూరు

తూమచర్లకు గిడుగు పురస్కారం

- కర్ణాటకలో ఘనంగా తెలుగు భాషా దినోత్సవం

బెంగళూరు, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక తెలుగు రచయితల సమాఖ్య ఆధ్వర్యంలో ఇండో-ఏషియన్ అకాడమీలో ఆదివారం తెలుగు భాషా దినోత్సవాలు జరిగాయి. ఈ సందర్భంగా నిర్వహించిన కవి సమ్మేళనానికి పెద్ద సంఖ్యలో కవులు, సాహితీ అభిమానులు హాజరయ్యారు. సమాఖ్య అధ్యక్షులు సిరిపంగి మహేశ్వర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో గిడుగు రామ్మూర్తి 155వ జయంతిని పురస్కరించుకుని గిడుగు సాహితీ ప్రతిభా పురస్కారాన్ని.. అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ తూమచర్ల రాజారాంకు ప్రదానం చేశారు. ముఖ్య అతిథులుగా ఇండో-ఏషియన్ అకాడమీ చైర్మన్ డాక్టర్ ఏకాంబరం నాయుడు, రిటైర్డు తెలుగు పండితులు రంగస్వామి నాయుడు.. తెలుగు కవితా వైభవం హైదరాబాద్ వ్యవస్థాపకులు మేకా రవీంద్ర ముఖ్యులుగా పాల్గొన్నారు. తెలుగు భాషాభివృద్ధికి రాజారాం కృషికి గుర్తింపుగా కర్ణాటకలో గిడుగు రామ్మూర్తి పేరిట తొలిసారి పురస్కారాన్ని ప్రదానం చేశారు. కార్యాధ్యక్షులు బొగ్గవరపు మాల్యాద్రి మాట్లాడుతూ కర్ణాటక తెలుగు రచయితల సమాఖ్య.. తెలుగు భాష, సాహిత్య పరిరక్షణే లక్ష్యంగా పనిచేస్తోందన్నారు.


రాజారాంకు గిడుగు రామ్మూర్తి పురస్కారంతో సత్కారం

అమెరికా అధ్యక్ష పీఠంపై తెలుగోడు

యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ ఆశాభావం



ఎంవీపీ కాలనీ (విశాఖపట్నం), ఆగస్టు 27: అమెరికా రాజకీయాలతో పెనవేసుకున్న తెలుగువారి బంధాలను చూస్తుంటే ప్రవాసాంధ్రులు అమెరికా అధ్యక్ష పీఠాన్ని అధిరోహిస్తారని అనిపిస్తోందని ప్రముఖ సాహితీవేత్త యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ అన్నారు. శనివారం సాయంత్రం డెట్రాయిట్ తెలుగు సంఘం 40వ వార్షికోత్సవంలో ఆయన ప్రసంగించారు. అమెరికన్లతో సన్నిహిత సంబంధాలున్నవారు తమ పిల్లలను అమెరికా రాజకీయాల వైపు ప్రోత్సహించాలని కోరారు. కార్యక్రమంలో వేడుకల చైర్మన్ కోనేరు శ్రీనివాస్, సమన్వయకర్త మారెంరెడ్డి సాగర్, అధ్యక్షుడు అంచె హర్ష తదితరులు యార్లగడ్డ లక్ష్మీప్రసాద్‌ను ఘనంగా సత్కరించారు.

కాపు రిజర్వేషన్ల కోసం అడ్‌హక్ కమిటీ

విజయవాడ, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): షరతుల్లేని కాపు రిజర్వేషన్లు, కాపు, బలిజ, తెలగ, దళిత, మైనార్టీలు అందరికీ సమాన న్యాయమైన హక్కుల కల్పన, రాజ్యాధికారం డిమాండ్లతో కొత్త అడ్‌హక్ కమిటీ ఏర్పాటైంది. విజయవాడలో ఆదివారం సమావేశమైన కాపు, బలిజ, తెలగ నేతలు సుదీర్ఘ చర్చల అనంతరం కాపు రిజర్వేషన్ ఉద్యమాన్ని ముందుకు తీసుకువెళ్లేందుకు తీర్మానించారు. అనంతరం నూతన అడ్‌హక్ కమిటీ కన్వీనర్ ఇమ్మడి సత్యనారాయణ మాట్లాడుతూ కాపు, బలిజ, తెలగల ఓట్లు లేకుండా ఏ రాజకీయ పార్టీ మనుగడ సాగించలేదని, ముస్లింలు, దళితులను కూడా కలుపుకొని ఉద్యమాన్ని నడపనున్నట్టు తెలిపారు.

కాపు రిజర్వేషన్ వద్దు: ఆర్ కృష్ణయ్య

గుంటూరు, ఆగస్టు 27: "కాపుల రిజర్వేషన్‌కు మేం వ్యతిరేకం. ఈ రిజర్వేషన్‌తో బీసీలకు తీవ్ర అన్యాయం ఖాయం. కాపు రిజర్వేషన్ ప్రతిపాదనలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం. కాదని ఏకపక్షంగా వ్యవహరిస్తే ఎలాంటి ఉద్యమాలకైనా సిద్ధం" అని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఆర్ కృష్ణయ్య స్పష్టం చేశారు. గుంటూరులో జరిగిన బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశానికి హాజరైన ఆయన మీడియాతో మాట్లాడారు. బీసీలకు అన్యాయం జరగకుండా కాపులకు రిజర్వేషన్ కల్పిస్తామంటే అది ఆచరణ సాధ్యం కాదన్నారు. బీసీ కమిషన్ నిష్పక్షపాతంగా సర్వే చేయాలని కోరారు. ఓబీసీ కమిషన్‌కు చట్టబద్ధత కల్పించడమంటే ఓబీసీల వర్గీకరణను ఆమోదించటమేనన్నారు. బీసీ రాజకీయ పార్టీ ఏర్పాటు కోసం త్వరలో అన్ని బీసీ కులాలతో చర్చలు జరిపి నిర్ణయం తీసుకుంటామన్నారు.

గురజాడ సాహిత్యపీఠం నెలకొల్పాలి

- కన్యాశుల్కం గొప్పదనాన్ని తెలియజేయాలి: దాడి వీరభద్రరావు

విశాఖపట్నం, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): సాంఘిక దురాచారాలను రూపుమాపడానికే మహాకవి గురజాడ కన్యాశుల్కం నాటకాన్ని రాశారని మాజీమంత్రి దాడి వీరభద్ర రావు అన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం ప్లాటినమ్ జూబ్లీ అతిథిగృహంలో కన్యాశుల్కం 125 ఏళ్ల జాతీయ ఉత్సవాల్లో భాగంగా రెండవ రోజు సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. నాటి సమాజంలోని మనుషుల మనస్తత్వాలను మార్చగలనన్న ఉద్దేశంతోనే గురజాడ కన్యాశుల్కాన్ని రచించారని చెప్పారు. అందులోని పాత్రలు ఇప్పటికీ సజీవంగా ఉన్నాయన్నారు. జాతీయ ఉత్సవాల్లో కొన్ని తీర్మానాలను చేసి ప్రభుత్వానికి అందించాలని ఆయన కోరారు. ఏయూలో గురజాడ సాహిత్య పీఠాన్ని నెలకొల్పేలా ఒక తీర్మానాన్ని చేయాలన్నారు. కన్యాశుల్కం నాటకాన్ని నేటి తరానికి చూపాల్సిన ఆవశ్యకత ఉందని.. దీనిని ప్రదర్శనకు బృందాలను ఏర్పాటుచేసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. గురజాడను జాతీయ కవిగా ప్రకటించాలని వీరభద్రరావు డిమాండ్ చేశారు. రచయిత రామతీర్థ మాట్లాడుతూ ఆధునికం, అభ్యుదయమంతా గురజాడదేనని అన్నారు. సభకు అధ్యక్షత వహించిన డాక్టర్ మాటూరి శ్రీనివాస్ మాట్లాడుతూ.. కన్యాశుల్కం నాటకంలోని మధురవాణి పాత్ర ప్రతి మహిళలో, గిరీశం పాత్ర ప్రతి పురుషుడిలోనూ ఉంటుందని అన్నారు. కన్యాశుల్కం నాటక ఆంగ్ల అనువాదకుడు భాగవతుల రాధాకృష్ణ మాట్లాడుతూ.. కన్యాశుల్కం ఆంగ్ల అనువాదంతో చాలామందికి అనేక విషయాలను తెలియజేసే అవకాశం దక్కిందని తెలిపారు. ప్రదీప్ ఆచార్య మాట్లాడుతూ కన్యాశుల్కంలో హాస్యం, ఉద్వేగం...ఇలా అన్ని సమపాళ్లలో ఉంటాయని చెప్పారు. కన్యాశుల్కం అసోం సాహిత్యానికి ఎంతో దగ్గరగా ఉందని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా వక్తలను మొజాయిక్ సాహిత్య సంస్థ సభ్యులు సత్కరించారు



సోమవారం, 28 ఆగస్టు 2017

vividha@andhrajyothy.com

వివిధ

ఆంధ్రజ్యోతి సాహిత్య వేదిక

ఆదర్శ నగరం

పన్నెండో శతాబ్దికి చెందిన భక్త కవి, జ్ఞాని రవిదాసు రచించిన తాత్త్విక గీతం ఇది. కుల నిర్మూలనకు ఆద్యుడైన రామానుజ గురు పరంపర లోని స్వామి రామానంద శిష్యులే రవిదాసు, కబీర్‌దాసులు. రవిదాసు చామరుడు. చెప్పులు కుట్టి ఆర్జించిన సొమ్ముతో బాటసారులకు ఆతిథ్యం ఇచ్చి సేదతీర్చి తృప్తిపడేవాడు. విశేషించి కృష్ణభక్తి తన్మయురాలైన మహారాణి మీరాబాయికి గురువు. ఈ తత్త్వగీతం ఆనాటి రాజకీయ సాంఘిక వ్యవస్థని రేఖామాత్రంగా వెల్లడిస్తుంది. ఈ గీతం విప్లవాత్మకమని, నాటి సమాజం రవిదాసుని హింసలకు వేధింపులకు గురిచేసిందని చెబుతారు. ఎనిమిది శతాబ్దాల తర్వాత విశ్వకవి రవీంద్రుడు రచించిన "ఎక్కడ మనస్సు నిర్భయంగా వుంటుందో..." అనే ప్రముఖ గీతానికి రవిదాసు గీతం ప్రేరణ అనుకోవచ్చు.

వినండి సోదర సాధుసంతులారా
నా లక్ష్యం నా గమ్యం బేగంపూరు
అది అందాలకు ఆనందాలకు పెట్టిన పేరు
అక్కడ శరీరానికి శ్రమ వుండదు. వెట్టి చాకిరీ వుండదు.
మనో వేదనలుండవు
శిస్తులూ పస్తులూ కఠిన శిక్షలూ వుండవు
భయాలూ బాధలూ వుండవు
అణచివేతలూ అన్యాయాలూ వుండవు
అవమానాలూ జరిమానాలూ వుండవు
ఆకలి దప్పులుండవు. చెప్పులు కుట్టి బ్రతికే పని వుండదు
అక్కడ దాచుకోవడాలూ దోచుకోవడాలూ వుండవు
పశువుల జంతువుల మృతకళేబరాల్ని మోసే పని వుండదు
స్మశానాలుండవు. శవదహనాల కంపు వుండదు
సోదర సాధుసంతులారా రండి
చామరుడైన రవిదాసు ఆహ్వానిస్తున్నాడు
శాంతీ కాంతీ విరబూసే ఆ దేశానికి
స్వేచ్ఛా పవనాలు వీచే ఆ ప్రదేశానికి

('విశ్వభారతి' పత్రికలో 'Spritual Utopia' పేరుతో ప్రచురితమైన రవిదాసు గీతానికి తెలుగు అనుసరణ)

■ మహాస్వప్న

ప్రథమ భారతీయ భాషాశాస్త్రవేత్త గిడుగు

గిడుగు వెంకట రామమూర్తిగారు వ్యావహారిక భాషా వాదిగా మనకు తెలుసు. మనలో కొంతమందికి వారు శాసనభాషా పరిశోధకులుగా కూడ తెలుసు. కాని రామమూర్తిగారు సమకాలీన భాషాశాస్త్రవేత్తల మెప్పుపొందిన భారతీయ భాషాశాస్త్రవేత్తగా ఏకొద్దిమందికో గాని తెలియదు. భాషలు బోధించడానికీ, నేర్చుకోడానికీ భాషాశాస్త్ర అధ్యయనం అవసరం అని మొదటిసారిగా గుర్తించినవారు రామమూర్తిగారు. సవరభాషాబోధనకోసం ఆయన తన కాలానికి అందుబాటులోవున్న శాస్త్రవిషయాల్ని అధ్యయనం చేసిన అరుదైన అనువర్తిత భాషాశాస్త్రవేత్త.

రామమూర్తిగారిని భాషాశాస్త్రవేత్తగా మనం గుర్తించలేకపోవడానికి కారణాలు లేకపోలేదు. వారి భాషాకృషి సవరభాషకు చెందినది. ఆ భాషకు వ్యాకరణం, నిఘంటువులు రాశారు. సవర భాషలో వాచకాలు రాశారు. అంతేగాక ఆ భాషలో రెండు పెద్ద పాటలు గూడ రాశారు. వాటి తెలుగు అనువాదాలు లభిస్తున్నా వాటిని చదువుకోవలసిన అవసరంగాని, అభిలాషగాని తెలుగువారికి లేదు. ఐతే రామమూర్తిగారు పర్యావరణ పరిరక్షణపై సుమారు 100 సంవత్సరాల క్రితం రాసిన పాట మీద ఈనాడు పరిశోధకులు ప్రసంగాలు చేయడం ముదావహం.

రామమూర్తిగారు తెలుగుభాషను శాస్త్రీయదృక్పథంతో అధ్యయనం చేయడమే కాకుండా అటువంటి శాస్త్రగ్రంథ రచనకు పూనుకొన్నట్లు వారు రాసిపెట్టుకొన్న రాతప్రతులను చూస్తే తెలుస్తుంది. ఫొనెటిక్స్, సెమెంటిక్స్ అన్న శీర్షికలతో వారు కొంత నోట్‌చేసికొని వున్నారు. తెలుగు భాషాచరిత్రపై గ్రంథం రాయసంకల్పించారు. అయితే వ్యావహారిక భాషా ప్రయోజనాన్ని స్థాపించడానికే తమ శక్తి వినియోగించడంవల్ల ఈ విషయంపై ఆయన విశేషమైన కృషిచేయడానికి అవకాశం లేకపోయింది. "సవరభాషా మాన్యుయల్ వంటి సృజనాత్మక వ్యాకరణాలు రచించాల్సిన మేధాసంపత్తిని రామమూర్తిగారు భాషోపవాదాలకు త్యాగం చేశారు" అన్న చేకూరి రామారావుగారి అభిప్రాయంతో ఏకీభవించని వారు ఉండరనుకొంటాను.

1908 నాటి ఉపాధ్యాయ పరిషత్ రెండవ సమావేశంలో గిడుగు తను చేసిన భాషాతత్త్వ పరిశీలన గురించి చెప్తూ, "భాషాతత్త్వానికి, భాషల సంబంధానికి సంబంధించిన పుస్తకాలు కొన్ని చదువుకొన్నాను. లిఖితరూపమైన సాహిత్యంగాని, లిపిగాని లేని సవరభాషను నేర్చుకొన్నాను. ఆ భాషకు వ్యాకరణం రచించడానికి పూనుకొని వ్యాకరణమంటే ఏమిటో, అది ఎట్లుండవలెనో ముందుగా తెలుసుకొనవలెనన్న ఉద్దేశంతో ఆర్యభాషాకుటుంబానికి చెందిన లాటిన్, గ్రీక్, జర్మన్, సంస్కృతం, ఇంగ్లీషు మొదలైన భాషలకున్ను, ద్రావిడభాషాకుటుంబానికి చెందిన తమిళ, తెలుగు భాషలకున్నుగల వ్యాకరణాలు ఎట్లున్నవో పరిశీలించాను." అన్నారు. ఆ సమావేశంలో రామమూర్తి తెలుగు భాషాచరిత్ర గురించి మాట్లాడారు. తులనాత్మక అధ్యయనం చేసే భాషాశాస్త్రవేత్తలు ఎటువంటి పదాలను పరిగణనలోకి తీసుకోవాలో ఆనాడే చెప్పారు. భాషాకుటుంబాల వర్గీకరణ గురించి వివరిస్తూ "నిత్యం వాడుకొనే బంధుత్వవాచకాలు, సంఖ్యావాచకాలు, సర్వనామాలు, శరీరభాగాలు మొదలగునవి ఆ భాషకు సొంతమైనవేకాని ఇతర భాషలనుండి తెచ్చుకొన్నవి కావు. అంతేగాక భాషా కుటుంబాల వర్గీకరణానికి పదములకంటె అపదములే (ప్రత్యయాలు) ఎక్కువ తోడ్పడుతవి" అన్నారు. రామమూర్తిగారి శిష్యుడు చిలుకూరి నారాయణరావు గురువుగారి బోధనలను అనుసరిస్తే 'ఆంధ్రభాషా చరిత్ర' రచన వేరుగా ఉండేది.

ఇరవయ్యవ శతాబ్దపు ప్రారంభంలో భాషాశాస్త్రం ఇప్పటిలా అభివృద్ధి చెందలేదు. నాటి భాషాశాస్త్రంలో తులనాత్మక అధ్యయనం ప్రధానం. రెండవది ధ్వనిశాస్త్రం. ఈ రెంటిలోనూ రామమూర్తిగారు కృషిచేశారు. 1912లో డేనిల్ జోన్స్ మద్రాసులో కొన్ని ఉపన్యాసాలివ్వడానికి వచ్చినప్పుడు తెలుగుభాషలో 'పిట్టు-పిట్ట, మెట్టు-మెట్ట, మేకు-మేక, గూడు-గూడ వంటి జంటమాటల్లోని మొదటి పదంలోని హల్లుమీదగల అచ్చు రెండో పదంలోని హల్లుమీదగల అచ్చు రాతలో ఒకే విధంగా వున్నా ఉచ్చారణాభేదం వున్నట్లు తాను పరిశీలించిన విషయాన్ని రామమూర్తిగారు జోన్స్‌కు వివరించారు. వారు కనుగొన్న విషయం సరైనదేనని జోన్స్ అంగీకరించారు.

లిపి ధ్వనివిధేయంగా వుండాలన్నది రామమూర్తి అభిప్రాయం. "అంతర్జాతీయ ధ్వనిసంబంధ సంస్థ ఆమోదించిన సంకేతాలు ఇప్పుడు ఎంతో వ్యాప్తిలోకి వచ్చాయి. లిపిరహిత భాషలను వ్రాతలో తెలుపుటకు అనేక సంవత్సరాల ఆచరణాత్మక అనుభవమును ఆధారము చేసికొని ఎంతోమంది భాషాశాస్త్రవేత్తలు కలిసి ఈ ధ్వనిసంకేతాలు నిర్ణయించారు. క్రైస్తవ మిషనరీలు అభివృద్ధిలేని భాషలను రాయడానికి ధ్వనిలిపినే (ఐ.పి.ఎ.) ఎప్పుడూ వాడతారు. టర్కీ, రష్యా, జపాన్, చైనా నాయకులు లాటిన్ అక్షరాలను ఉపయోగించడం వలన కలిగే ప్రయోజనాలను ఎప్పుడో గుర్తించారు. క్లిష్టమైన అరబ్బీ అక్షరాలకు బదులు లాటిన్ అక్షరాలు వాడుక లోనికి వచ్చాయి. విదేశీయులు చీని, జపాన్ భాషలను ధ్వనిలిపిద్వారానే అభ్యసిస్తున్నారు. ధ్వనిలిపి ఉపయోగించడం వలన భారత దేశంలో భిన్నభాషలను తొలగించలేకపోయినప్పటికీ విభిన్న లిపులను తొలగించ వచ్చు. సవరభాష రాయడానికి సంప్రదాయకంగా వస్తున్న లిపి లేదు. ఊనిక, స్వరం, హావభావాలతో కూడుకొని ద్రవస్థితిలో వున్న భాషను లిఖించడం కష్టం. భారతదేశంలో వాడుకలోనున్న లిపులు ఏవీ సవరభాషను రాయడానికి ఉపయోగపడవు. ఒక్క ఇంటర్నేషనల్ ఫొనెటిక్ ఆల్ఫాబెట్‌లో మాత్రమే రాసేవీలుంది." అంటూ సవర ఇంగ్లీషు నిఘంటువుకు రాసిన రచయిత ముందుమాటలలో రామమూర్తి పేర్కొన్నారు.

జెరాల్డ్ కెలీ తెలుగుభాష మీద ఎక్కువ కృషిచేసిన అమెరికన్. 'తెలుగు ఒవెల్ ఫోనీమ్స్' అన్న వ్యాసంలో (1959) రామమూర్తిగారు గుర్తించిన ధ్వనిభేదాన్ని వర్ణ(అక్షర) భేదంగా పరిగణించాలని ప్రతిపాదించారు. తరువాత 1963లో తన ప్రతిపాదన వదలుకొన్నారు.

ఐతే నేడు తెలుగు రచనావ్యాసంగం అంతా వ్యావహారికభాషలో సాగుతుండడంవల్ల పాఠకులు సందిగ్ధంలో పడకుండా రాయవలసిన అవసరం వుంది. 'మీ ఇంట్లో మేకు + ఉందా, మీ ఇంట్లో మేక + ఉందా అన్న అర్థభేదంగల రెండు వాక్యాలనీ 'మీ ఇంట్లో మేకుందా' అనే రాస్తున్నాం. కాని ఉచ్చారణలో 'మకారం' మీదున్న అచ్చు ధ్వని వేరుగా వుంటుంది. ఎప్పుడు ఏ ధ్వనితో చదవాలో అర్థం తెలిసిన తరువాతే తెలుస్తుంది. ఇటువంటి సందర్భాలలో కొత్తగా ఒక వర్ణాన్ని (అక్షరాన్ని) తెలుగు లిపికి చేర్చుకోవలసిన విషయంపై భాషాశాస్త్రవేత్తలు చర్చించవలసివుంది.

"సవరభాష అభివృద్ధికి నోచుకోని భాష. దానికి గుర్తించదగిన ప్రామాణికత లేదు. ఒక గ్రామానికీ మరొక గ్రామానికీ ఒక మనిషికీ మరొక మనిషికీ కూడ ఉచ్చారణలో భేదం కనిపిస్తుంది. అన్ని సజీవభాషల్లోను ఉచ్చారణ భేదాలుంటాయి. ఎంతో అభివృద్ధి చెందిన ఆంగ్లభాషలో కూడ ఈ ఉచ్చారణా భేదాలు న్నాయి. సంప్రదాయకంగా వాడుతున్న స్పెలింగ్ దీనిని తెలియనీయదు. వాటిని ధ్వనిననుసరించి నిర్మించిన నిఘంటువుల్లోనే (ప్రొనౌన్సింగ్ డిక్షనరీ) చూడగలం." అంటారు రామమూర్తి. ప్రొనౌన్సింగ్ డిక్షనరీల్లో ప్రామాణిక ఉచ్చారణే ఉంటుంది. రాసే భాషకు ప్రామాణికత అవసరం అని రామమూర్తిగారి అభిప్రాయం.

సవర పిల్లలకు అంతర్జాతీయ ధ్వనిలిపిలో తమ మాతృభాషను రాసుకోవడం తేలికగా నేర్పించవచ్చని సరంగో గ్రామంలో 1930 నవంబరు 3న జరిగిన గిరిజన దర్బారులో రామమూర్తిగారు నిరూపించారు. గిడుగు రామమూర్తిగారు ఐ. పి. ఎ. లో రాసిన 'సోరా మాన్యుయల్' ను పరిచయంచేస్తూ అప్పటి గంజాం జిల్లాకు గవర్నర్‌గారి ఏజంటు ఐన గెలటీ దొరగారు "The Savaras are fortunate in being the first nation in the world to have a scientific script for their language" అంటూ కితాబు ఇచ్చారు.

గ్రియర్సన్‌గారి ఆదేశాలను పాటించి సవరభాషను శాస్త్రీ పద్ధతిలో అధ్యయనం చేయడానికి కావలసిన సామగ్రిని ఇంగ్లీషులో ప్రచురించమని పారిస్‌లోని ప్రొఫెసర్ యూల్స్ బ్లాక్ రామమూర్తిగారిని అర్థించారు. అలా చేసినట్లయితే ప్రపంచవ్యాప్తంగా పండితులకు ప్రయోజనకారి కాగలదని వారి అభిప్రాయము. "మీరు చేస్తున్న కృషికి మిమ్ము అభినందిస్తున్నాను. ఈ మీకృషికి నా ప్రోత్సాహము కూడ కారణమైతే అందుకు నాకు ఆనందంగానూ, గర్వంగానూ ఉంటుంది. మీ ప్రణాళిక ఎంతో ఆచరణయోగ్యమైనది"అని యూల్స్‌బ్లాక్ రామమూర్తిగారికి లేఖ రాశారు.

ఎర్నాకుళం మహారాజ కళాశాల ఆచార్యులు ఎల్.వి.రామస్వామి అయ్యరు "నాకు సవరభాషతో ఇంతకుముందున్న పరిచయం పరిమితమైంది. అది లింగ్విష్టిక్ సర్వే ఆఫ్ ఇండియా 4వ భాగమునుండి తెలుసుకున్నంత వరకే. అప్పటి నా అభిప్రాయమేమంటే సవరభాష ఒక సంకర మాండలికమని. ఇండో ఆర్యన్, ద్రావిడభాషల పదనిర్మాణ లక్షణాలను అధికంగా కలిగి ఉన్నదని. కాని మీ మాన్యుయల్ చదివిన తరువాత నా అభిప్రాయాన్ని సవరించుకొన్నాను. భాషాశాస్త్ర విద్యార్థులందరూ మీ గ్రంథాన్ని మనస్ఫూర్తిగా ఆహ్వానిస్తారు." అని రామమూర్తి గారికి లేఖ రాశారు.

"1931లో గిడుగు రామమూర్తిగారు రచించిన సోరా మాన్యుయల్ అంతర్జాతీయ ధ్వనిలిపిలో రాయబడిన మొట్టమొదటి వర్ణనాత్మక వ్యాకరణం. సోర మాన్యువల్, డిక్షనరీలలో రామమూర్తిగారు ఉపయోగించిన విశేషచిహ్నాలను నేడుగూడ యథాతథంగా వాడుకోవచ్చు" అని సవరభాషాధ్వనులపై పరిశోధన చేసిన డేవిడ్ స్టాంప్ ప్రశంసించారు.

అమెరికాలోని హవాయీ విశ్వవిద్యాలయంలో భాషాశాస్త్రంలో ఆచార్యులుగా వున్న స్టాన్లీ స్టరోస్టా సవరభాషమీద పరిశోధన చేసి 1967లో డాక్టరేట్ పట్టా పొందారు. తాను గిడుగు రామమూర్తిగారి సవరభాషా మాన్యుయల్‌ని ఎక్కువగా వాడుకొన్నానని, దాని నిర్దుష్టతకు, సమగ్రతకు ముగ్ధుణ్ణయాననీ ఆయన రాశారు. స్టరోస్టా తన సిద్ధాంత గ్రంథాన్ని రామమూర్తిగారికి అంకితం ఇస్తూ "గురువు, మానవతావాది, ముండా లింగ్విస్టిక్స్‌లో మొట్టమొదటి పరిశోధకుడు" అని శ్లాఘించారు. స్టరోస్టా 1981లో హైదరాబాద్ వచ్చినప్పుడు చే.రా.గారి కోరికమేరకు రామమూర్తిగారిపై ఒక వ్యాసం రాస్తూ అందులో "నేను 1967లో రామమూర్తిగారిని 'ముండా లింగ్విస్టిక్స్‌లో మొట్టమొదటి పరిశోధకుడు' అన్నాను. 'ముండా'అన్న విశేషణం వాడకుండా వుండవలసిందని ఇప్పుడు భావిస్తున్నాను. ... ఇప్పుడు సుమారు 15 సంవత్సరముల తరువాత, కొంత పాండిత్యం సంపాదించిన తరువాత వారియొక్క గొప్పతనం గ్రహించగలిగాను. బహుశా రామమూర్తిగారు తమ కాలానికంటే ముందు పుట్టివుండవచ్చు. ఆధునిక భాషాసిద్ధాంతాలైన స్ట్రక్చరిజం, జనరేటివ్ ప్రక్రియలను రామమూర్తిగారు ఆనాడే తమ రచనలలో ప్రవేశపెట్టారు." అంటూ గిడుగు సునిశిత పరిశీలన, పట్టుదల, శాస్త్రీయ దృక్పథం గురించి కొనియాడారు.

ఎర్నాకుళం మహారాజ కళాశాలలో ఎల్.వి.రామస్వామి అయ్యరుగారు ఇంగ్లీషు ప్రొఫెసర్. గిడుగు రామమూర్తికి మంచి మిత్రులు. ద్రావిడ భాషలపై గ్రంథరచన చేశారు. తిరువనంతపురంలోని ద్రవిడియన్ లింగ్విస్టిక్స్ అసోసియేషన్ వారు రామస్వామిగారి కృషిని వివరిస్తూ 'పయనీర్ ఇన్ లింగ్విస్టిక్స్' అన్న ఒక మోనోగ్రాఫ్ ప్రచురించారు. గిడుగు రామమూర్తిగారి గురించి ఇంతవరకు అటువంటి పుస్తకం వెలువడలేదు. ఐతే సంతోషించదగ్గ విషయం ఏమిటంటే తిరువనంతపురంలోని ద్రవిడియన్ లింగ్విస్టిక్స్ అసోసియేషన్‌కు చెందిన ఇంటర్నేషనల్ స్కూల్ ఆఫ్ ద్రవిడియన్ లింగ్విస్టిక్స్ అనే భాషాధ్యయన సంస్థకు చెందిన గ్రంథాలయంలో కాల్డ్‌వెల్డ్, ఎస్పర్సన్, డేనియల్ జోన్స్, బ్లూమ్‌ఫీల్డ్, గుండర్ట్, ఎమినో వంటి ప్రపంచ ప్రఖ్యాత భాషాశాస్త్రవేత్తల తైలవర్ణ చిత్రాల మధ్య మన గిడుగు వెంకట రామమూర్తి పంతులుగారి తైలవర్ణచిత్రం ఉండడం.

■ అల్లంసెట్టి చంద్రశేఖర రావు

99496 05141

(ఆగస్టు 29న గిడుగు జయంతి, తెలుగు భాషా దినోత్సవం)



"సవరభాషా మాన్యుయల్ వంటి సృజనాత్మక వ్యాకరణాలు రచించాల్సిన మేధాసంపత్తిని రామమూర్తిగారు భాషోపవాదాలకు త్యాగం చేశారు" అన్న చేకూరి రామారావుగారి అభిప్రాయంతో ఏకీభవించని వారు ఉండరనుకొంటాను.

విశాల శూన్యం



చెట్టుతో నేలతల్లి పాదాలకు
సర్వాంగ నమస్కారం చేయించారు

దాని కన్నీటి సోన దుమ్ములో
పూలూ పిందెలు మట్టిలో
గూళ్ళు కూలిన పక్షులు గగనంలో
ప్రాణుల నీడ దిగంతాలలో.

చెట్టును రంపం ముక్కలు చేస్తే
గుట్టలుగా శవాలు.
అంత్యక్రియలు చూడలేక
మబ్బులు ముఖం తిప్పుకొంటే,
నింగి నీరవమయితే,
నేల మొక్క పాదులో దాక్కొంది.

ప్రాణి నిశ్వాసను పీల్చి
ఉచ్ఛ్వాసనిచ్చే చైతన్యం నశిస్తే
కల్తీ గాలే దిక్కు.

మునుపు చెట్టుండే చోట
ఇప్పుడు పెద్ద బయలు ఉంది.
విశాల శూన్యం!
పైగా మరణం వంటి నిశ్శబ్దం.
ఎలా భరించటం?

■ కొలకలూరి ఇనాక్

94402 43433

'మట్టిబండి' పేరిట మహాపచారం!

'మట్టిబండి'లో కన్యాశుల్క జైత్రయాత్ర' శీర్షికన సోమవారం (ఆగస్టు 21) 'వివిధ' పేజీలో రామతీర్థ రాసిన వ్యాసం మా అందరికీ తీవ్రమైన మనస్తాపాన్ని కలిగించింది. అందుకు కారణాలు మేం ఇలా వివరించదలుచుకున్నాం.

'దరిద్ర చారుదత్తం' పేరిట భాసుడు రాసిన నాటకాన్ని విస్తరించి మృచ్ఛకటికం (మట్టిబండి) నాటకాన్ని శూద్రకుడు మలిచాడని, దీనినిబట్టి రెండువేల ఏళ్ల కిందటే సామాన్య పౌరులు, కన్నం దొంగలు, జూదగాళ్లు, వేశ్యలు, అధికారం చెలాయించే రాజుగారి బావమరుదులు, విప్లవకారులు అందరూ భారతీయ నాటకంలోకి కదలివచ్చారని ఆ వ్యాసం చెప్పింది. అంతవరకూ బాగానే ఉంటే ఉండవచ్చు. ఆ తరువాత పేరాలో "ఇద్దరు స్రష్టల (భాసుడు, శూద్రకుడు..) నవ్యప్రియత్వ భూమిక అయిన ఈ నాటకం (మృచ్ఛకటికం) ప్రభావంలోనే, తెలుగువారి ఆధునిక నాటకం 1892లో మూడు పదుల యువకుడైన గురజాడ కలం నుంచి రూపుదిద్దుకున్నది" అని రాశారు. అంటే గురజాడవారు భాసుని ప్రభావంతోనే కన్యాశుల్కం నాటకాన్ని రాసినట్టుగా అర్థం వస్తోంది కదా. ఆ అభిప్రాయంతోనే మాకు పేచీ. పోనీ, మృచ్ఛకటికానికీ, కన్యాశుల్కానికీ నడుమ తులనాత్మక అధ్యయనం చేశారు వ్యాసకర్తగారు అని సరిపెట్టేసుకుందామంటే అలాంటిదేం లేదు. మృచ్ఛకటికం ప్రభావంలోనే అప్పారావుగారి కలం నుంచి రూపుదిద్దుకున్నది 'కన్యాశుల్కం' అంటూ రాసిపారేశారు. ఇదేం అధ్యయనం? ఇలా సిద్ధాంతీకరించేస్తే, అర్థం పర్థం లేని భావాల స్థిరీకరణ జరిగిపోతే, రానున్న తరాలు భాసనాటకాన్ని గురజాడ కాపీ కొట్టాడని అనుకునే ప్రమాదం లేదా! అలాంటప్పుడు ఇలాంటి రాతల్ని సాహిత్య మర్యాదా పద్దు కింద చూడగలమా? ఇది గురజాడకు జరిగిన మహాపచారం కాదా? ఇంతటితో వ్యాసకర్త ఆగిపోలేదు. "వాడుక వచన భాషలో గురజాడ ఒక పూర్తి నాటకాన్ని నిర్మించడానికి, ఈ నిర్మాణం కోసం పాత్రలకు తగిన మాటతీరు, వ్యవహారిక తెనుగు వాడడానికి తగిన ధైర్యం ఆయనకు కలగడానికి కారణం వేలఏళ్ల కిందటి 'మట్టిబండి'లోనే ఉన్న"దని వాక్రుచ్చారు. ఇది మరీ విడ్డూరం. తనకు భాసుడు స్ఫూర్తి ప్రదాత అనిగానీ, ఆయన రాసిన రాతలవల్లే తాను వాడుక భాష రాస్తున్నానని గానీ గురజాడ ఎక్కడా ప్రకటించుకోలేదే. అలాంటప్పుడు ఇలాంటి తప్పుడు రాతలు తప్పు కాదా? ఇక మరో విషయం: 'మృచ్ఛకటికం'లో పాచికలాట ఉంటే, కన్యాశుల్కంలో పేకాట ఉందట. కాబట్టి 'మృచ్ఛకటికం' ప్రభావంలోనే కన్యాశుల్కం నాటకం గురజాడ మేధ నుంచి బయటకు వచ్చినట్టుగా ఈ మట్టీ మశానపు వ్యాసం చెబుతోంది. ఆ నాటకంలో రక్షక భటులు ఉంటే ఈ నాటకంలో పోలీసులు ఉన్నారట. ఇదో దిక్కుమాలిన పోలిక. ఇద్దరు రచయితల మధ్య, ఆ మాట కొస్తే ఇద్దరు మనుషుల మధ్య ఎక్కడో ఒక చోట భావాలు కలిస్తే కలవవచ్చు. అంతమాత్రాన ఒకరిని చూసి మరొకరు రాసేసేరనటం ఎంత దోషం? ఇదెలా ఉంటుందంటే, 'గుండుసున్న గుండ్రంగా ఉంటుంది. నిండు చంద్రుడూ గుండ్రంగానే ఉంటాడు. కాబట్టి సున్నానున్నా జాబిలినున్నా సమానమే" అన్నట్టుగా. ఇక్కడే మరో మాటా చెప్పుకోవాలి.

"రాయ్ బహుద్దూర్ వీరేశలింగం పంతులుగారి బ్రాహ్మ వివాహం ఇటీవల నేను చదవటం తటస్థించింది" అని అంటూ గురజాడగారు ఏమంటారంటే, "మా ఉభయుల నాటకాల్లో ఒకే విధమైన భావాలున్నాయని గమనించాను. ఆయన నాటకం బ్రాహ్మల పెళ్లిళ్లకు సంబంధించిన వ్యవహారాన్నంతటినీ స్పృశించడం వల్ల ఇది సహజమే. కానీ, ఇది తప్ప ఈ నాటకాల మధ్య మరే సామ్యమూ లేదు" అని చెబుతూ కన్యాశుల్కం లోనేమో హాస్యం, పాత్రల చిత్రీకరణ, జటిలమైన ఒక కొత్త కథాసంవిధానం కోసం ప్రయత్నించాను అంటారు.

ఇంత స్పష్టంగా మహానుభావుడు గురజాడే ఇంకా అనేక చోట్ల కూడా ఈ నాటక రచన గురించి మరి కొన్ని విషయాలూ చెప్పారు. ముఖ్యంగా రెండో కూర్పులో కన్యాశుల్కం రచనకు రెండు కారణాలు చెప్పారు: "నేనీ నాటకం రాసినప్పుడు దాన్ని ప్రచురించాలనే ఉద్దేశ్యం లేదు. సమాజ సంస్కరణోద్యమానికి తోడ్పడేందుకు, తెలుగుభాష నాటకాలకు తగిందికాదనే దురభిప్రాయాన్ని తొలగించేందుకు రాశాను." అన్నారు. కన్యాశుల్కం నాటకానికి ప్రేరణగా వర్తమాన సామాజిక సమస్యలే కారణమని చెప్పుకొచ్చారు. గతకాలపు సమాజము, సాహిత్యము, నాటకము ప్రేరణలని ఎక్కడా చెప్పలేదు. మహాకవి చెప్పని, మహాకవికి ప్రేరణకాని సాహిత్యాన్ని ప్రేరణగా చెప్పడం అపచారం.



ఆధునిక సంస్కృతి, నాగరికత మొట్టమొదట మొదలైన యూరప్ ఖండపు దేశాల తర్వాత ఎంతో కాలానికి గానీ, అవి భారతదేశం వంటి దేశాల్లో తలెత్తలేదు. ఇంచుమించుగా మనదేశంలో ఈ ఆధునిక జీవనవిధానం మొలకెత్తుతున్న దశలోనే- కన్యాశుల్కం రంగస్థలం మీదికి వచ్చిందని ప్రఖ్యాత విమర్శకులు అనేకులు ఇప్పటిదాకా వివరించుకువస్తే, ఆధునికతను తీసుకువచ్చి వాటికి పురాతన గోతుల్లో పునాదులున్నాయని రామతీర్థ రాగం తీయడం మూర్ఖత్వం. భాసుడు, శూద్రకుని కాలపు సమాజానికీ, ఆ సమాజంలో చెలామణీ అయ్యే భాషా సంస్కృతులకు- కన్యాశుల్కపు నాటి కాలపు సమాజానికి, భాషా సంస్కృతులకూ చాలా తేడా ఉంది. మృచ్ఛకటికం (మట్టిబండి)లోని పాత్రలను కన్యాశుల్కంలోని పాత్రలతో పోల్చడంలోనే రామతీర్థ అవగాహనారాహిత్యం ఉంది. (అప్పటికాలంలో శ్రామికులు, విప్లవకారులు ఉండరు. ఒక రాజు మీద తిరుగుబాటు చేసి మరొకరు రాజవుతారు. అది విప్లవం కాదు. విప్లవమంటే దోపిడీ చేసే వర్గం మీద దోపిడీకి గురయ్యే శ్రామికులు చేసే పోరాటం. అసలు సంస్కరణ అనే భావజాలానికి అప్పుడు చోటు లేదు. కానీ, రామతీర్థ ఇప్పటి పదజాలాన్ని అప్పటి భావాలకు అంటిస్తాడు.) కాగా, ఇది కేవలం అవగాహనలేమి అయితే ఫరవాలేదుగానీ- అన్నీ (ఆధునికతతో సహా) వేదాల్లో (పురాతనకాలంలో) ఉన్నాయష.. (అని గురజాడ వెక్కిరించినా) అంటూ ఇటీవల అధికార భావజాల సమూహం హడావుడి చేస్తోంది. కాదన్న వారిమీద కాలు దువ్వుతోంది. ఈ నేపథ్యంలో రామతీర్థను చూడాల్సి ఉంది. పురాణకథల్లోని పతివ్రత కోవకి చెందిన ఒకానొక వేశ్య వసంతసేన. మధురవాణి ఆ కోవకు చెందదు. పురాణ పాతివ్రత్యం పట్ల ఏ మాత్రమూ గౌరవం లేని వ్యక్తి ఆమె. సరికదా, ఆధునికత ముసుగేసుకున్న వ్యక్తులను కనిపెట్టి తగురీతిలో బుద్ధిచెప్పగల నాయకి. ఆధునిక స్త్రీ చరిత్రను తిరగరాస్తుందన్న గురజాడ మాటను మనం గౌరవిస్తే- మధురవాణి వారసులు రాస్తారు తప్ప, వసంతసేన వారసులు ఎప్పటికీ రాయలేరు. నూటపాతికేళ్లు బతికిన కన్యాశుల్కాన్ని మృత మృచ్ఛకటికంతో పోల్చవద్దు. గురజాడకు అపకారం చేయవద్దు. నూట పాతికేళ్ల సంబరాల్లో అపకీర్తిని ఆయనకు అంటగట్టవద్దు.

"కన్యాశుల్క నాటకం నూటపాతికేళ్ల ఏకైక ఆధునిక భారతీయ సజీవ నాటకంగా నిలిచిందీ అంటే, భాసుని జేగీయమాన జన చింతన, శూద్రకుని మృచ్ఛకటికం ప్రాణతేజాన్ని గురజాడ పొందడమూ ఒక కారణం" అని వ్యాసకర్త సూత్రీకరించడం- యుగకర్త అయిన గురజాడ, భాసుడు, శూద్రకుని దయవల్లనే కన్యాశుల్కం వంటి మహానాటకాన్ని నిర్మించాడని చెప్పకనే చెప్పడం. ఇంకా ఈ వ్యాసంలో అనేక విషయాల మీద కూడా చర్చించవచ్చు గానీ, 'దేశమంటే మట్టి కాదోయ్.. దేశమంటే మనుషులోయ్..' అంటూ ఆధునికతను చాటి చెప్పిన గురజాడను మాటిమాటికీ సంప్రదాయ భాసునితో పోల్చి చూపడం మా మనసును నొప్పిస్తున్న అంశం గనుక ఇక్కడే ఆపేస్తున్నాం. ఈ వ్యాసాన్ని పూర్తిగా ఖండిస్తున్నాం. గురజాడ కన్యాశుల్కం తొలి ప్రదర్శన జరిగి 125 ఏళ్లు అయిన వేళ ఒకవైపు విశాఖ, విజయనగరాల్లో ఉత్సవాలు జరుగుతున్న సమయంలోనే ఇలాంటి అవాంఛనీయ విశ్లేషణతో వ్యాసం వెలువడటం దురదృష్టకరం. దయచేసి మట్టిబండిలోనూ, తొట్టిబండిలోనూ కన్యాశుల్కాన్ని ఊరేగించ వద్దని, ప్రజారథంలో ఈ నాటకం జైత్రయాత్ర చేసేలా చర్యలు తీసుకోవాలని వ్యాసకర్తకు హితవు పలుకుతున్నాం.

- అట్టాడ అప్పలనాయుడు, చింతకింది శ్రీనివాసరావు, చందు సుబ్బారావు, వెలుగురామినాయుడు, బి.వి.ఎ. రామారావు నాయుడు, బమ్మిడి జగదీశ్వరరావు, దాసరి రామచంద్రరావు, చింతాడ తిరుమలరావు, బల్లెడ నారాయణమూర్తి, ఉప్పల అప్పలరాజు, విరియాల గౌతమ్... ఇంకా మరికొందరు.

తెలుగు భాషా సాహిత్య సేవలో ఆకాశవాణి

సాహిత్య అకాడెమి, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో 'తెలుగు భాషా సాహిత్య సేవలో ఆకాశవాణి' అంశంపై రెండు రోజుల సదస్సు ఆగస్టు 28, 29 తేదీలలో కాన్ఫరెన్స్ హాల్, రవీంద్రభారతి, నాంపల్లి, హైదరాబాద్ నందు జరుగుతుంది. సదస్సులో ఎస్.పి. మహాలింగేశ్వర్, ఎన్. గోపి, వి. ఉదయ శంకర్, ఆర్.వెంకటేశ్వర్లు, మామిడి హరికృష్ణ తదితరులు పాల్గొంటారు. మొదటి రోజు సా.4గం.లకు, రెండోరోజు సా.5గం.లకు కవి సంధ్య ప్రోగ్రామ్‌లో వరుసగా ఆశారాజు, సుధామలు పాల్గొంటారు.

- సాహిత్య అకాడెమి

గిడుగు రామమూర్తి పంతులు జయంతి

గిడుగు రామమూర్తి పంతులు జయంతి ఉత్సవాలు ఆగస్టు 29 సా.6గం.లకు హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జస్టిస్ చల్లా కోదండరాం ప్రారంభిస్తారు. ఈ సందర్భంగా ప్రభాకర్ జైని, జి. లక్ష్మీనరసయ్య, శిఖామణి తదితరులు పురస్కారాలు అందుకుంటారు. బి.చంద్రకుమార్, నాళేశ్వరం శంకరం, వై.ఎస్.ఆర్. శర్మ, భైస దేవదాస్ తదితరులు పాల్గొంటారు.

- బిక్కి కృష్ణ

గంగపుత్రులపై కవితలకు ఆహ్వానం

గంగపుత్రు వెలిని నిరసిస్తూ తీసుకువస్తున్న 'పోరు గంగపుత్రు' కవితా సంకలనానికి 20పంక్తులు మించని కవితలను ఆహ్వానిస్తున్నాం. ఆగస్టు 30 లోపు apbharave@gmail.comకు ఓపెన్ ఫైలు, పీడిఎఫ్ పంపాలి. వివరాలకు 9494423787.

- బహుజన రచయితల వేదిక

సినారె సాహిత్యంపై జాతీయ సదస్సు

శతాబ్ది ఉత్సవాల సందర్భంగా హైదరాబాద్ ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు శాఖ ఆగస్టు 30, 31 తేదీలలో ఉస్మానియా ఆర్ట్స్ కళాశాల రూమ్ నెం.57లో సి.నారాయణరెడ్డి సాహిత్యంపై జాతీయ సదస్సు నిర్వహిస్తున్నది. ఆగస్టు 30 ఉ.10గం.ల నుంచి సదస్సు ప్రారంభమవుతుంది. ప్రారంభ సమావేశంలో ముఖ్య అతిథిగా రామచంద్రం; విశిష్ట అతిథిగా ఎన్.గోపి; గౌరవ అతిథులుగా టి.పాపిరెడ్డి, ఎస్వీ సత్యనారాయణ; ముగింపు సభలో నందిని సిధారెడ్డి పాల్గొంటారు. ఎండ్లూరి సుధాకర్, రాచపాళెం చంద్రశేఖర్ రెడ్డి, బన్న అయిలయ్య, జి. బాలశ్రీనివాసమూర్తి, సి.కాసీం, ఎస్. రఘు తదితరులు పత్ర సమర్పణ చేస్తారు.

- ఎస్. రఘు

ఎసిఐఒ
ఇంటెలిజెన్స్ డిపార్ట్‌మెంట్‌లో 1300 జాబ్స్

కేంద్ర హోం మంత్రిత్వ శాఖ పరిధిలోని ఇంటెలిజెన్స్ డిపార్ట్‌మెంట్ నుంచి భారీ నోటిఫికేషన్ వెలువడింది. అసిస్టెంట్ సెంట్రల్ ఇంటెలిజెన్స్ ఆఫీసర్ గ్రేడ్-2/ఎగ్జిక్యూటివ్ (ఎసిఐఒ) పోస్టుల భర్తీకి ఇంటెలిజెన్స్ డిపార్ట్‌మెంట్ ప్రకటనను జారీ చేసింది. చురుగ్గా ఉంటూ సవాళ్లను ఇష్టపడే వారికి కేంద్ర హోం శాఖలో చక్కని హోదాలో కెరీర్‌ను ప్రారంభించే అవకాశం దీని ద్వారా లభిస్తుంది. ఇందుకు సంబంధించిన వివరాలను చూద్దాం

ఇంటెలిజెన్స్ డిపార్ట్‌మెంట్ తాజా నోటిఫికేషన్ ద్వారా గ్రూప్-సి విభాగంలో మొత్తం 1300 ఎసిఐఒ పోస్టులను నాన్ గెజిటెడ్, నాన్ మినిస్టీరియల్ కేడర్‌లో భర్తీ చేయనుంది.

పే స్కేల్: రూ.9,300-34,800, గ్రేడ్ పే రూ.4,200. వీటికి అదనంగా ఏడో వేతన కమిషన్ సిఫార్సుల మేరకు అలవెన్సులు లభిస్తాయి. ఈ పోస్టులకు ఆల్ ఇండియా సర్వీస్ లైబిలిటీ ఉంటుంది. కాబట్టి దేశవ్యాప్తంగా ఎక్కడైనా పోస్టింగ్ ఇస్తారు.

అర్హత: డిగ్రీ, కంప్యూటర్ నాలెడ్జ్ తప్పనిసరి.

వయసు: 18-27 ఏళ్లు (2017 సెప్టెంబర్ 2 నాటికి). రిజర్వ్‌డ్ వర్గాలకు వయో సడలింపునిస్తారు.

ఎంపిక: రాత పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా. రాత పరీక్షలో టైర్-1, టైర్-2 దశలు ఉంటాయి. ఈ రెండు దశలకు కలిపి 120 నిమిషాల సమయం, 150 మార్కులు కేటాయించారు.

టైర్-1: ఈ దశలో ప్రశ్నలు మల్టిపుల్ చాయిస్ రూపంలో ఉంటాయి. దీనికి కేటాయించిన మొత్తం మార్కులు 100. సమాధానాలను 60 నిమిషాల్లో గుర్తించాలి. ఇందులో నాలుగు విభాగాల నుంచి ప్రశ్నలు ఇస్తారు. జనరల్ అవేర్‌నెస్ (25 ప్రశ్నలు, 25 మార్కులు), క్వాంటిటేటివ్ అప్టిట్యూడ్ (25 ప్రశ్నలు, 25 మార్కులు), లాజికల్/అనలిటికల్ ఎబిలిటి (25 ప్రశ్నలు, 25 మార్కులు), ఇంగ్లీష్ లాంగ్వేజ్ (25 ప్రశ్నలు, 25 మార్కులు). నెగిటివ్ మార్కులు కూడా ఉన్నాయి. ప్రతి తప్పునకు 1/4 మార్కు కోత విధిస్తారు.

టైర్-2: టైర్-1లో నిర్దేశిత అర్హత సాధించిన వారిని మాత్రమే టైర్-2కు అనుమతిస్తారు. ఈ దశలో ప్రశ్నలు డిస్క్రిప్టివ్ రూపంలో ఉంటాయి. దీనికి కేటాయించిన మొత్తం మార్కులు 50. సమాధానాలను 60 నిమిషాల్లో పూర్తి చేయాలి. ఇందులో రెండు పార్ట్-ఎ, పార్ట్-బి భాగాలు ఉంటాయి. పార్ట్-ఎలో ఏదైనా ఒక అంశంపై ఎస్సే (వ్యాసం) రాయాలి. దీనికి కేటాయించిన మార్కులు 30. పార్ట్-బిలో ఇంగ్లీష్ కాంప్రెహెన్షన్, ప్రిసెస్ రైటింగ్ ప్రశ్నలు ఉంటాయి. దీనికి కేటాయించిన మార్కులు 20.

సిలబస్ విశ్లేషణ: నోటిఫికేషన్‌లో ఏయే విభాగాల నుంచి ప్రశ్నలు వస్తాయో మాత్రమే ఇచ్చారు. నిర్దేశిత సిలబస్‌ను పేర్కొనలేదు. కాబట్టి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసే సంస్థలైన స్టాఫ్ సెలెక్షన్ కమిషన్ (ఎస్ఎస్‌సి), యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) స్థాయిలోనే సిలబస్ ఉంటుందని భావించాల్సి ఉంటుంది. అంతేకాకుండా జనరల్ అవేర్‌నెస్, క్వాంటిటేటివ్ అప్టిట్యూడ్, లాజికల్/ అనలిటికల్ ఎబిలిటి, ఇంగ్లీష్ లాంగ్వేజ్ వంటి అంశాలు అన్ని పోటీ పరీక్షల్లో సాధారణంగా కనిపించేవి. కాబట్టి ఐబిపిఎస్ (క్లరికల్, పీఓ/ఎంటి), ఎస్ఎస్‌సి-సిజిఎల్‌ఈ వంటి పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న వారు ఆ ప్రిపరేషన్నే కొనసాగిస్తే సరిపోతుంది. ఆయా పోటీ పరీక్షల పుస్తకాలను ఫాలో అయితే సరిపోతుంది.

స్టడీ ప్లాన్: జనరల్ అవేర్‌నెస్: ఇందులో జనరల్ నాలెడ్జ్ (జికె), జనరల్ స్టడీస్ (జిఎస్) నుంచి ప్రశ్నలు వస్తాయి. జికె అంటే ఫ్యాక్ట్ ఆధారిత ఉండే ప్రశ్నలు. ఉదాహరణకు-నాబార్డ్‌ను ఎప్పుడు స్థాపించారు. జిఎస్‌లో సైన్స్, రాజ్యాంగం, హిస్టరీ అన్ని అంశాలు కలిసి ఉంటాయి. వీటిలో ఫ్యాక్ట్స్‌తోపాటు సంబంధిత విషయాలపై అవగాహన ఉండాలి. ఉదాహరణకు-నాబార్డ్ విధులు. గత ప్రశ్నపత్రాలను పరిశీలిస్తే జికె ప్రశ్నలే ఎక్కువగా కనిపిస్తాయి. అయినప్పటికీ జికె, జిఎస్ రెంటికి సమ ప్రాధాన్యం ఇస్తూ ప్రిపరేషన్ సాగించాలి.

ఇంగ్లీష్: ఇందులో ఎర్రర్ స్పాటింగ్, ఫిల్ ఇన్ ద బ్లాంక్స్, ఒకాబులరీ, స్పెల్లింగ్, బేసిక్ గ్రామర్, సెంటెన్స్ స్ట్రక్చర్, ఫ్రేజెస్, యాంటినామ్స్-సినానిమ్స్, కాంప్రెహెన్షన్ వంటి వాటి నుంచి ప్రశ్నలు వస్తాయి. మాక్ టెస్ట్‌లు రాయడం, బేసిక్ గ్రామర్ అంశాలపై దృష్టిసారిస్తే ఇందులో మెరుగైన స్కోర్ సాధించవచ్చు.

క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్: ఇందులో భిన్నాలు, దశాంశాలు, శాతాలు, లాభ-నష్టాలు, నిష్పత్తి, డిస్కౌంట్, పార్ట్‌నర్‌షిప్, వ్యాపార గణితం(వడ్డీ), కాలం-దూరం, కాలం-పని, గ్రాఫ్స్, త్రిభుజాలు, సర్కిల్స్, స్థూపాలు, చతురస్రం, దీర్ఘచతురస్రం, పిరమిడ్, ఎత్తు-దూరం, కోణాలు, బార్-చార్ట్ డయాగ్రామ్ వంటి అంశాల నుంచి ప్రశ్నలు వస్తాయి. ఈ విభాగంలో ఎక్కువ స్కోరింగ్ చేయాలంటే టేబుల్స్, స్క్వేర్స్, క్యూబ్స్, స్క్వేర్ రూట్స్, ప్రాబ్లమ్ సాల్వింగ్‌కు షార్ట్‌కట్ మెథడ్స్‌ను ఉపయోగించడం నేర్చుకోవాలి.

లాజికల్ ఎబిలిటి: వెర్బల్, నాన్ వెర్బల్, క్రిటికల్ థింకింగ్, సోషల్ ఇంటెలిజెన్స్, ఎమోషనల్ ఇంటెలిజెన్స్ సంబంధిత అంశాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. అనాలజీ, ప్రాబ్లమ్ సాల్వింగ్, బ్లడ్ రిలేషన్స్, రీజనింగ్, ఆర్థమెటిక్, నెంబర్ సిరీస్, కోడింగ్-డికోడింగ్, డేటా సఫిషియెన్సీ, డైరెక్షన్ సెన్స్, ర్యాంకింగ్స్, సీట్ ఆరేంజ్‌మెంట్స్, వర్డ్ బిల్డింగ్, వెన్ డయాగ్రామ్స్, స్పేస్ విజువలైజేషన్, మేచింగ్ వంటి టాపిక్స్‌పై దృష్టి సారించాలి. ఈ విభాగం కోసం బేసిక్ మేథమెటిక్స్, అల్ఫాబెట్ టెస్ట్ అంశాలను బాగా ప్రాక్టీస్ చేయాలి.

టైర్-2: ఇందులో పార్ట్-ఎలో నిర్దేశించిన అంశంపై 400 పదాలకు మించకుండా ఎస్సే (వ్యాసం) రాయాలి. హిస్టరీ, పాలిటీ, ఎకానమీ ఇలా ఎటువంటి టాపిక్ నుంచైనా ప్రశ్నలు అడగొచ్చు. కాబట్టి అభ్యర్థులు వివిధ రంగాల్లో గత, ప్రస్తుత సంఘటనలపై విస్తృతంగా అవగాహన పెంచుకోవాలి. తేదీలు, గణంకాలు వంటి వాటితో ఎస్సే ప్రెజెంట్ చేయడం ప్రయోజనకరంగా ఉంటుంది. కాంప్రెహెన్షన్, లాంగ్వేజ్ స్కిల్స్‌ను పరీక్షించడానికి ఉద్దేశించిన విభాగం పార్ట్-బి. కేవలం ఇంగ్లీష్ భాషలోనే ప్రశ్నలు ఉంటాయి. రీడింగ్ కాంప్రెహెన్షన్, ప్రిసీస్ రైటింగ్ వంటి అంశాల నుంచి ప్రశ్నలు వస్తాయి. బేసిక్ గ్రామర్ పుస్తకాలను రెగ్యులర్‌గా ప్రాక్టీస్ చేస్తే ఇందులో చక్కని స్కోర్ చేయొచ్చు.ఇందులో మంచి మార్కులు సాధించాలంటే దిన పత్రికలలో వచ్చే ఆర్టికల్స్‌ను చదవాలి. ముఖ్యంగా ఎడిట్ పేజీ వ్యాసాలపై దృష్టి సారించాలి.

ఇంటర్వ్యూ: టైర్-1, టైర్-2లో కలిపి నిర్దేశించిన మెరిట్ సాధించిన వారిని మాత్రమే ఇంటర్వ్యూకి పిలుస్తారు. ఈ దశకు 100 మార్కులు కేటాయించారు. ఇందులో అభ్యర్థుల మేథో సామర్థ్యం, ఆసక్తులు, నాయకత్వ లక్షణాలను పరిశీలిస్తారు. ముఖ్యంగా సామాజిక అంశాలపై అవగాహనను పరీక్షిస్తారు. టైర్-1, టైర్-2, ఇంటర్వ్యూ.. ఈ మూడు దశలలో సాధించిన మెరిట్ ఆధారంగా నియామకాన్ని ఖరారు చేస్తారు.

శిక్షణ: ఎంపికైన వారికి ప్రారంభంలో మధ్యప్రదేశ్‌లోని శివపూరిలో శిక్షణనిస్తారు. తరవాత ఢిల్లీలో రెండు నెలల శిక్షణ ఉంటుంది. అటుపై పోస్టింగ్ ఇస్తారు. శిక్షణ సమయంలో కూడా వేతనం చెల్లిస్తారు. ఇంటెలిజెన్స్ ఆఫీసర్స్ విధులు నిత్యం సవాళ్లతో కూడి ఉంటాయి. దేశ అంతర్గత భద్రతకు సంబంధించి ఉగ్రవాదులు, నక్సలైట్లు, ఇతర సాంఘిక శక్తుల నుంచి ఎదురయ్యే ముప్పును పసిగట్టి ఆ సమాచారంతో కేంద్రం, రాష్ట్రాలను ముందే అప్రమత్తం చేయడం వీరి బాధ్యత. అంతేకాకుండా శాంతిభద్రతలు, ఆహార భద్రత, తదితర అంశాలకు సంబంధించిన సున్నిత సమాచారాన్ని కూడా సేకరించాల్సి ఉంటుంది. కెరీర్ పరంగా చూస్తే.. అసిస్టెంట్ సెంట్రల్ ఇంటెలిజెన్స్ ఆఫీసర్ గ్రేడ్-2 తరవాత అసిస్టెంట్ సెంట్రల్ ఇంటెలిజెన్స్ ఆఫీసర్ గ్రేడ్-1, డిప్యూటీ సెంట్రల్ ఇంటెలిజెన్స్ ఆఫీసర్ (గెజిటెడ్ ర్యాంక్), జాయింట్ డిప్యూటీ డైరెక్టర్, అడిషనల్ డిప్యూటీ డైరెక్టర్, జాయింట్ డైరెక్టర్, అడిషనల్ డైరెక్టర్, డైరెక్టర్ వంటి హోదాలు ఉంటాయి.

దరఖాస్తు: ఆన్‌లైన్‌లో. **దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబర్ 2, 2017
వెబ్‌సైట్: www.mha.nic.in

TSPSC
అటవీ ఉద్యోగాల ప్రిపరేషన్ ప్లాన్

తెలంగాణ రాష్ట్ర అటవీ శాఖలో మూడు రకాల పోస్టుల భర్తీకి టిఎస్‌పిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేసింది. దీని ద్వారా భర్తీ చేయనున్న పోస్టుల వివరాలు.

1. ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్స్ : 67
2. ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్స్ : 90
3. ఫారెస్ట్ బీట్ ఆఫీసర్స్ : 1857

- **ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్స్, సెక్షన్ ఆఫీసర్స్ పోస్టులకు కనీస విద్యార్హత :** డిగ్రీ(మేథ్స్/సైన్స్/ఇంజనీరింగ్)
- **ఫారెస్ట్ బీట్ ఆఫీసర్స్ పోస్టులకు కనీస విద్యార్హత :** ఇంటర్మీడియట్


ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్స్ ఎంపిక విధానం

- క్వాలిఫైయింగ్ పరీక్ష(ఆబ్జెక్టివ్ విధానం)
- ప్రధాన పరీక్ష(ఆబ్జెక్టివ్ విధానం)
- నడక పరీక్ష & మెడికల్ టెస్ట్
- ఇంటర్వ్యూ
- క్వాలిఫైయింగ్ పరీక్షలో రెండు పేపర్లు ఉంటాయి.

1. జనరల్ ఇంగ్లీష్(100 మార్కులు, 100 ప్రశ్నలు, 100 నిమిషాలు)
2. జనరల్ మేథ్స్(100 మార్కులు, 100 ప్రశ్నలు, 100 నిమిషాలు)

జనరల్ ఇంగ్లీష్

1. Vocabulary 2. Parts of the speech 3. Tenses
4. Direct speech, Indirect speech
5. Simple, Compound and Complex Sentences
6. Linkers and Clauses
7. Idioms and one word substitution
8. Comprehension
9. Degrees of comparision
10. Question pattern and question tags.



- జనరల్ మేథ్స్ సిలబస్ ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్స్, బీట్ ఆఫీసర్స్‌కు ఉన్న సిలబస్సే.

గమనిక: ఈ టాపిక్స్ అన్నింటిపై 10వ తరగతి స్థాయిలో ప్రశ్నలు ఉంటాయి.

ప్రధాన పరీక్ష: ఇందులో రెండు పేపర్లు ఉంటాయి.

పేపర్-1:
జనరల్ స్టడీస్(150 ప్రశ్నలు, 150 మార్కులు, 150 నిమిషాలు)

పేపర్-2:
ఆపన్షల్ పేపర్(150 ప్రశ్నలు, 150 మార్కులు, 150 నిమిషాలు)

- **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం:** 2017 ఆగస్టు 21
- **దరఖాస్తుకు చివరి తేదీ:** 2017 సెప్టెంబరు 12
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** www.tspsc.gov.in

ఎంపిక విధానం

ఈ ప్రక్రియ మూడు దశల్లో ఉంటుంది.

- మొదటి దశ: రాత పరీక్ష(ఆబ్జెక్టివ్ విధానం)
- రెండో దశ: నడక పరీక్ష (వాకింగ్ టెస్ట్)
- మూడో దశ: మెడికల్ టెస్ట్

రాత పరీక్ష

ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్స్, బీట్ ఆఫీసర్స్‌కు ఒకే విధమైన రాత పరీక్ష ఉంటుంది. ఫారెస్ట్ బీట్ ఆఫీసర్స్‌తో పోల్చితే ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్స్ పరీక్ష ప్రశ్నలు కఠినంగా ఉంటాయి.

పేపర్-1:
జనరల్ నాలెడ్జ్(100 ప్రశ్నలు, 100 మార్కులు, 90 నిమిషాలు)

పేపర్-2:
జనరల్ మేథ్స్(100 ప్రశ్నలు, 100 మార్కులు, 90 నిమిషాలు)

నడక పరీక్ష

- పురుషులు: 25 కి.మీ. దూరాన్ని 4 గంటల్లో పూర్తి చేయాలి.
- మహిళలు: 16 కి.మీ. దూరాన్ని 4 గంటల్లో పూర్తి చేయాలి.

ఐచ్ఛిక అంశాలు

1. అగ్రికల్చర్ 2. బోటనీ 3. కెమిస్ట్రీ 4. కంప్యూటర్ అప్లికేషన్స్ 5. కంప్యూటర్ సైన్స్ 6. అగ్రికల్చర్ ఇంజనీరింగ్ 7. కెమికల్ ఇంజనీరింగ్ 8. సివిల్ ఇంజనీరింగ్ 9. కంప్యూటర్ ఇంజనీరింగ్ 10. ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ 11. ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ 12. మెకానికల్ ఇంజనీరింగ్ 13. ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ 14. ఫారెస్ట్రీ 15. జియాలజీ 16. హార్టీకల్చర్ 17. మేథ్స్ 18. ఫిజిక్స్ 19. స్టాటిస్టిక్స్ 20. వెటర్నరీ సైన్స్ 21. జువాలజీ

గమనిక: ఆర్ట్స్, సైన్స్, మేథ్స్ అభ్యర్థులు ఎవరైనాసరే సిలబస్ 10వ తరగతి స్థాయి అని పేర్కొన్నప్పటికీ సమస్యల క్లిష్టత పోటీ పరీక్షల కోణంలో ఉంటుందని గమనించాలి.

- మొదట మేథ్స్ సిలబస్‌లోని అంశాలను అవగాహన చేసుకోవాలి. తరవాత వాటికి సంబంధించిన బేసిక్స్, సూత్రాలను నేర్చుకొని వాటి ద్వారా సమస్యలను సాధన చేయాలి. తరవాత విభిన్న రకాల బిట్స్‌ను ప్రాక్టీస్ చేయాలి. షార్ట్‌కట్స్ కూడా తెలుసుకోవాలి. అప్పుడే సమయం ఆదా అవుతుంది.

నాన్ మేథ్స్ అభ్యర్థులు భయపడవద్దు

జనరల్ మేథ్స్ పేపర్ గురించి నాన్ మేథ్స్ అభ్యర్థులు దిగులు చెందాల్సిన పనిలేదు. ఆత్మవిశ్వాసం, పట్టుదల, సాధించాలన్న ధృడసంకల్పం మీలో ఉంటే మేథ్స్ అనేది మిమ్మల్ని ఏ మాత్రం భయపెట్టదు.

మరో అంశం ఏమిటంటే ప్రతి అభ్యర్థి కూడా 10వ తరగతి తరవాతనే మేథ్స్, నాన్ మేథ్స్‌గా విడిపోతారు. టెన్త్ వరకు అందరూ అన్ని సబ్జెక్టులను చదివే ఉంటారు. కనుక మేథ్స్, నాన్ మేథ్స్ అభ్యర్థులకు పెద్ద తేడా ఉండదు.

మేథ్స్ అభ్యర్థులు జాగ్రత్త

గణిత అభ్యర్థులు కొన్ని సందర్భాల్లో చిన్న చిన్న పొరపాట్లు చేస్తారు. మాకు వస్తుంది కదా! అనే ధీమాతో కొన్ని సార్లు తెలిసి పొరపాట్లు చేస్తారు. ఆత్మవిశ్వాసం మంచిదే కాని అతి విశ్వాసం కూడదు.

నాన్ మేథ్స్ అభ్యర్థులు, మేథ్స్ అభ్యర్థుల నుంచి పోటీని తట్టుకోవడానికి కఠోరమైన కృషి చేస్తారు. విజయం కోసం ఎదురుచూస్తారు. మేథ్స్ అభ్యర్థుల నిర్లక్ష్యమే నాన్ మేథ్స్ అభ్యర్థుల విజయానికి నాంది కావొచ్చు. కనుక నిర్లక్ష్యం వీడి చక్కగా సాధన చేస్తే మీరూ విజయం పొందటం తేలికే.



పి.ఆంజనేయులు
సీనియర్ ఫ్యాకల్టీ
రామయ్య కాంపిటీటివ్ కోచింగ్ సెంటర్, హైదరాబాద్

సూచనలు

- ముందుగా సిలబస్‌ను సంపూర్ణంగా అవగాహన చేసుకోవాలి. 6 నుంచి 10వ తరగతి పాఠ్య పుస్తకాలను దగ్గరపెట్టుకొని ఏ టాపిక్ ఏ తరగతిలో ఉందో గుర్తించాలి. బేసిక్స్‌తోపాటు ఫార్ములాలు నేర్చుకోవాలి. తరవాత ఫార్ములాలను ఉపయోగించి సమస్యలను సాధన చేయాలి. చివరగా ఆబ్జెక్టివ్ బిట్స్‌ను ప్రాక్టీస్ చేయాలి. ఈ ప్రాసెస్ అంతా ఒక ప్రణాళికాబద్ధంగా జరగాలి.
- కాంపిటేటివ్ ఎగ్జామ్స్‌లో సమయం చాలా కీలకమైనది. కనుక తక్కువ సమయంలో ఎక్కువ బిట్లు చేసేలా సాధన చేయాలి. ఇందుకుగాను షార్ట్‌కట్స్ బాగా దోహదపడతాయి. ఫార్ములాలను, షార్ట్‌కట్స్‌ని చక్కగా నోట్స్ రాసుకొని రోజుకు ఒక్కసారైనా చదివితే మంచి ఫలితం ఉంటుంది.
- సొంతంగా నోట్స్ సిద్ధం చేసుకోవడం ద్వారా కాన్సెప్ట్ మెదడులో స్థిరపడిపోతుంది.
- సూత్రాలను బట్టీపట్టకుండా ఆ సూత్రం ఎలా రూపొందిందో తెలుసుకుంటే మరిచిపోకుండా ఉండగలం.
- అప్లికేషన్ ప్రాబ్లమ్స్ వచ్చినా కూడా చేయగలిగేలా ప్రిపేర్ అవ్వాలి.
- సిలబస్ కంప్లీట్ అయిన తరవాత తప్పనిసరిగా రివిజన్ చేయాలి. ఎన్నిసార్లు రివిజన్ చేస్తే అంత మంచి ఫలితం వస్తుంది.
- ప్రణాళికాబద్ధంగా ప్రిపేర్ కావాలి. వాయిదా వేసే పద్ధతి మానుకోవాలి.
- ఆత్మస్థైర్యం కోల్పోకూడదు. పట్టుదలనే పెట్టుబడిగా పెట్టి కృషి చేయాలి.
- నెగెటివ్ థింకింగ్ మానుకోవాలి. అది మనలోని శక్తిని హరిస్తుంది.
- సమస్యలను ఎక్కువ సార్లు సాధన చేయడం ద్వారా వేగం పెరుగుతుంది. అలాగే కచ్చితత్వం చేకూరుతుంది.
- థియరీ పార్ట్స్‌ను కూడా క్షుణ్ణంగా చదువుకోవాలి.
- ఇతర వ్యాపకాలపై దృష్టి మరలకుండా కేవలం ప్రిపరేషన్ మీదనే మనసు లగ్నం చేయండి.

చదవాల్సిన పుస్తకాలు

- క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ - ఆర్.ఎస్.అగర్వాల్
- క్విక్ అర్థమెటిక్ - అశిష్ అగర్వాల్
- క్విక్కర్ మేథ్స్ - కుందన్ & తైరా
- క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ - అభిజిత్ గుహ
- 6 నుంచి 10 తరగతి వరకు మేథ్స్ పుస్తకాలు

ముఖ్యమైన తేదీలు

- ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్స్ పరీక్ష: 2017 అక్టోబరు 14
- ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్స్ పరీక్ష: 2017 అక్టోబరు 22
- ఫారెస్ట్ బీట్ ఆఫీసర్స్ పరీక్ష: 2017 అక్టోబరు 29

సిలబస్

జనరల్ నాలెడ్జ్

- కరెంట్ ఎఫైర్స్
- నిత్య జీవితంలో సైన్స్
- డిజాస్టర్ మేనేజ్‌మెంట్
- జాగ్రఫీ, ఎకానమీ(తెలంగాణ& ఇండియా)
- భారత రాజ్యాంగం
- భారత రాజకీయ వ్యవస్థ & భారత ప్రభుత్వం
- ఆధునిక భారతదేశ చరిత్ర(జాతీయోద్యమం కీలకం)
- తెలంగాణ సమాజం, సంస్కృతి, వారసత్వం, కళలు & సాహిత్యం
- తెలంగాణ ప్రభుత్వ పథకాలు
- ఎథిక్స్(నీతి). సున్నితమైన అంశాలు, బలహీన వర్గాలు, లింగ వివక్ష, సామాజిక స్పృహ

జనరల్ మేథ్స్

- నంబర్ సిస్టమ్
- ఏకవస్తు మార్గం
- కాలం - దూరం
- కాలం - పని
- శాతాలు
- బారు వడ్డీ - చక్ర వడ్డీ
- లాభ - నష్టాలు
- నిష్పత్తి - అనుపాతం(అనులోమానుపాతం, విలోమానుపాతం, మిశ్రమానుపాతం)
- వర్గం - వర్గమూలం
- క.సా.గు. - గ.సా.భా.
- భాజనీయత
- కరణులు
- సంవర్గమానాలు
- బీజగణితం(కారణాంక విభజన. వర్గసమీకరణం మొదలైనవి)
- ఘాతాంకవాదం
- త్రికోణమితి(ఎత్తులు - దూరాలు)
- సమితులు
- రేఖాగణితం
- సంఖ్యాకశాస్త్రం
- భిన్నాలు - దశాంశ భిన్నాలు
- క్షేత్ర గణితం

గమనిక:
ఈ టాపిక్స్ అన్నింటిపై 10వ తరగతి స్థాయిలో ప్రశ్నలు ఉంటాయి.

స్పోర్ట్స్ జర్నలిస్టు కావాలంటే...



• నేను బిఎస్సీ డిగ్రీ పూర్తి చేశాను. బ్లాగుల్లో రాసే అలవాటు ఉంది. మా కాలేజీకి సంబంధించిన మేగజైన్‌లో కూడా మూడు సంవత్సరాలు నా వ్యాసాలు ప్రచురితం అయ్యాయి. అయితే నాకు క్రీడల పట్ల ఆసక్తి ఉంది. స్పోర్ట్స్ జర్నలిస్టు కావాలనేది కోరిక. దీనిలోకి వెళ్లడానికి జర్నలిజంలో డిగ్రీ, డిప్లొమా తప్పనిసరిగా ఉండాలా?

- రమణి, నెల్లూరు

○ జర్నలిజం అనేది అనుక్షణం ఆసక్తిగా ఉండే రంగం. అది పేపర్, టీవీ, రేడియో, వెబ్‌సైట్ ఏదైనప్పటికీ నైపుణ్యాల్లో తేడాలు ఉండవచ్చుకానీ బాధ్యతలు దాదాపుగా ఒకే తీరుగా ఉంటాయి. మన దగ్గర పత్రికలు, టీవీల్లో పనిచేయడానికి జర్నలిజం తప్పనిసరి ఏమీ కాదు. కాకపోతే ఆ డిగ్రీ లేదా డిప్లొమా ఉన్నవారికి కొంత ప్రాధాన్యం ఇస్తారు. చాలా పత్రికలు రాత నైపుణ్యాలు, భాషా సామర్థ్యం ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేసుకుని సొంతంగా శిక్షణ ఇచ్చుకుంటాయి. ఇక మీరుచెప్పిన స్పోర్ట్స్ జర్నలిజం విషయానికి వస్తే శిక్షణ సమయంలో అభ్యర్థులకు ఎందులో ఆసక్తి ఉంది, పట్టు ఉంది అనే అంశాల ఆధారంగా వారిని ఆ విభాగాలకు ఎంపిక చేస్తారు. క్రీడలకు సంబంధించి మీకు పూర్తి పరిజ్ఞానం ఉండి, లైవ్ మ్యాచ్ చూస్తూ కంటెంట్ రాయగలిగితే మీరు ఇందులోకి వెళ్లవచ్చు. మీరు ఇందులోకి వెళ్లేముందే ఒక విషయాన్ని గమనించాలి. క్రీడా జర్నలిజం అనేది లిమిటెడ్ రంగం. ప్రతీ పేపర్, చానెల్, స్పోర్ట్స్ మేగజైన్‌లో అతి కొద్ది ఉద్యోగాలు మాత్రమే ఉంటాయి. స్పోర్ట్స్ పట్ల ఆసక్తి ఉంటే ఏదైనా క్రీడలో స్పెషలైజేషన్ చేస్తే వాటి ఈవెంట్ ఆర్గనైజర్‌గా కూడా పనిచేయవచ్చు.

క్రీడల్లో ఆసక్తి ఉన్న చాలా మంది వివిధ పత్రికలకు ఫ్రీలాన్సర్లుగా పనిచేస్తూ సొంతంగా బ్లాగులు నడుపుతుంటారు. ఈ రంగంలో మీరు విజయం సాధించాలంటే క్రీడా సంస్థలు, క్రీడాకారులు, కోచ్‌లు, క్రీడా రంగానికి చెందిన చాలా మందితో మీరు సంబంధాలు కొనసాగించాల్సి ఉంటుంది. స్పోర్ట్స్ మేనేజ్‌మెంట్ కూడా ఆలోచించదగిన మరో రంగం. ఇది స్పోర్ట్స్, మార్కెటింగ్‌ల మిశ్రమం. కోల్‌కతాలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ వెల్ఫేర్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్‌లో ఒక సంవత్సరం కాలపరిమితిగల కోర్సు ఉంది. ఢిల్లీ యూనివర్సిటీకి అనుబంధంగా ఉన్న ఇందిరాగాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ సర్వీసెస్‌లో కూడా ఈ ప్రోగ్రామ్ ఉంది. ముంబైలోని ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పోర్ట్స్ మేనేజ్‌మెంట్(www.iismworld.com), ముంబైలోని నేషనల్ అకాడమి ఆఫ్ స్పోర్ట్స్ మేనేజ్‌మెంట్(www.nasm.edu.in)లో కూడా ఇలాంటి కోర్సులు ఉన్నాయి.

• గోవర్ధనం కిరణ్‌కుమార్

చిరునామా: వివరాలు ఇవిగో, కేరాఫ్ ఎడ్యుకేషన్ డెస్క్, ఆంధ్రజ్యోతి, ప్లాట్ నెం.76, రోడ్ నెం.70, అశ్వినీ ఎన్‌క్లేవ్, హుడా హైట్స్, జర్నలిస్ట్ కాలనీ, జూబ్లీహిల్స్, హైదరాబాద్-500 033



జర్మనీలో ఉన్నత విద్య

జర్మనీలో ఉన్నత విద్యను అభ్యసించాలనుకొనే విదేశీ విద్యార్థులకు అక్కడి ప్రభుత్వం అనేక స్కాలర్‌షిప్‌లను అందిస్తోంది. టాప్ 200 యూనివర్సిటీల్లోని మొదటి 12 సంస్థల్లో ఏటా అనేక మంది భారతీయులు వివిధ కోర్సుల్లో ప్రవేశాలు పొందుతున్నారు. ముఖ్యంగా ఈ ప్రవేశాలు పరిశోధన రంగాల్లో ఎక్కువ. అతి తక్కువ ఖర్చుతో అక్కడి యూనివర్సిటీల్లో పరిశోధనలు చేసే అవకాశం ఉండటమే ఇందుకు ప్రధాన కారణం. ఒక రకంగా చెప్పాలంటే పూర్తిగా అక్కడి స్కాలర్‌షిప్స్‌తోనే ఉన్నత చదువులు చదువుకునే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. జర్మనీ ప్రభుత్వ నిధులను పొందే యూనివర్సిటీల్లో విదేశీ విద్యార్థులు కొన్ని ఎంపిక చేసిన కోర్సుల్లో పూర్తిగా ఉచితంగా చేరవచ్చు. కొన్ని ప్రైవేట్ యూనివర్సిటీల్లో మాత్రం ఫీజులు నామమాత్రంగా ఉంటాయి.

మూడు రెట్లు పెరిగిన భారతీయ విద్యార్థుల సంఖ్య

జర్మనీలోని వివిధ విశ్వవిద్యాలయాల్లో చదువుతున్న భారతీయ విద్యార్థుల సంఖ్య ఏటా పెరుగుతోంది. మరో వైపు బ్రిటన్‌లో వీరి సంఖ్య తగ్గుముఖం పడుతోంది. బెర్లిన్‌లోని భారత ఎంబసి కార్యాలయం ఇటీవల విడుదల చేసిన వివరాల ప్రకారం ప్రస్తుతం జర్మనీలో 13,740 మంది భారతీయ విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. వీరి సంఖ్య 2010 నుంచి 2016 వరకు మూడు రెట్లు పెరిగింది. భారత విద్యార్థులకు ఉన్నత విద్యలో ఫేవరేట్ డెస్టినేషన్‌గా ఉన్న బ్రిటన్‌లో వారి సంఖ్య 39, 090 నుంచి 18,320కి పడిపోయింది. యురోపియన్ యూనియన్ నుంచి ఎగ్జిట్ అవడం, వీసా సమస్యలు, బోగస్ కాలేజీల మూసివేత, ఇతరత్రా అంతర్గత సమస్యలు బ్రిటన్‌లో భారతీయ విద్యార్థుల సంఖ్య తగ్గడానికి ప్రధాన కారణాలు.

జర్మనీలో ప్రస్తుతం మూడు విధాల స్కాలర్‌షిప్స్ అమలు చేస్తున్నారు. అవి...ప్రభుత్వ స్కాలర్‌షిప్‌లు, ప్రభుత్వేతర స్కాలర్‌షిప్‌లు, యూనివర్సిటీ సంబంధిత స్కాలర్‌షిప్‌లు. ఈ స్కాలర్‌షిప్స్ విద్యార్థుల ట్యూషన్ ఫీజు సహా జీవన భృతికి సరిపడేలా లభిస్తున్నాయి.

ప్రభుత్వ స్కాలర్‌షిప్‌లు

1. **డాడ్(డిఎఎడి):** దీని పూర్తి పేరు ద జర్మన్ అకడమిక్ ఎక్స్ఛేంజ్ సర్వీస్. దీనిని ప్రధానంగా విదేశీ విద్యార్థుల కోసం ఉద్దేశించారు. ఈ స్కాలర్‌షిప్ ప్రవేశపెట్టి 2025 నాటికి వంద సంవత్సరాలు పూర్తవుతాయి. అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్, అదేవిధంగా కొన్ని ఎంపిక చేసిన పిహెచ్‌డి ప్రోగ్రామ్స్‌కు ఈ స్కాలర్‌షిప్ లభిస్తుంది.
2. **ఎరామస్ ప్లస్:** యూరప్‌లో చదువుకునే విద్యార్థులకిచ్చే అతి పెద్ద స్కాలర్‌షిప్ ఇది. యురోపియన్ యూనియన్ ఈ స్కాలర్‌షిప్‌నకు నిధులు సమకూరుస్తోంది. సుమారు వందకు మించి మాస్టర్స్ ప్రోగ్రామ్స్‌లో ఉన్నత విద్యను అభసిస్తున్న అనేక మంది విదేశీ విద్యార్థులకు ఈ స్కాలర్‌షిప్ ఎంతగానో దోహపడుతోంది.

ప్రభుత్వేతర స్కాలర్‌షిప్‌లు

1. **హెన్‌రిచ్ బోల్ స్కాలర్‌షిప్ ఫర్ ఇంటర్నేషనల్ స్టూడెంట్స్**
ఈ స్కాలర్‌షిప్ జర్మనీ, ఇతర విదేశీ విద్యార్థులకు ఉద్దేశించింది. అండర్‌గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్, పిహెచ్‌డి ప్రోగ్రామ్స్‌కి దీనిని వర్తింపచేస్తున్నారు. జర్మనీస్ ఫెడరల్ మినిస్ట్రీ ఆఫ్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్(బిఎంబిఎఫ్) నిబంధనల ప్రకారం ఏటా రెండు సార్లు విదేశీ విద్యార్థుల నుంచి మార్చి, ఆగస్టు 31 లోపు స్కాలర్‌షిప్ కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తారు.
2. **హమ్‌బోల్ట్ రీసెర్చ్ ఫెలోషిప్స్ ఫర్ పోస్ట్ డాక్టరోల్ రీసెర్చర్స్**
ద అలెగ్జాండర్ వొన్ హమ్‌బోల్ట్ ఫౌండేషన్ ఈ స్కాలర్‌షిప్స్‌ను అందజేస్తోంది. పిహెచ్‌డి పూర్తయి పరిశోధన రంగంలో కొనసాగుతున్న వారికి ఆరు నుంచి 12 నెలల ఫెలోషిప్ లభిస్తుంది. ఏటా సుమారు 500 ఫెలోషిప్‌లను కేటాయిస్తున్నారు.
3. **కొన్‌రాడ్ అడెన్యూయర్ స్టిఫ్‌టంగ్(కెఎఎస్) స్కాలర్‌షిప్స్**
పోస్ట్ గ్రాడ్యుయేట్ అండ్ డాక్టరోల్ ప్రోగ్రామ్స్ చేస్తున్న విదేశీ విద్యార్థులకు ఈ స్కాలర్‌షిప్ వర్తిస్తుంది. అన్ని విభాగాల్లోని అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. వయసు 30 ఏళ్లకు మించకూడదు.
4. **బేయర్ ఫౌండేషన్ స్కాలర్‌షిప్స్** మొత్తం ఐదు ఫెలోషిప్ ప్రోగ్రామ్స్‌కి బేయర్ ఫౌండేషన్ ఆర్థిక సహాయం చేస్తుంది. బయాలజీ, మాలిక్యులర్ బయాలజీ, బయోఇంజనీరింగ్, బయోఇన్ఫర్మాటిక్స్, కెమిస్ట్రీ, బయోకెమిస్ట్రీ, ఫార్మస్యూటికల్స్ అండ్ కంప్యుటేషనల్ లైఫ్ సైన్సెస్ విభాగాల్లో ఒట్టో బేయర్ స్కాలర్‌షిప్స్ లభిస్తుంది. వెటర్నరీ మెడిసిన్, మెడికల్ సైన్స్, మెడికల్ ఇంజనీరింగ్, పబ్లిక్ హెల్త్ అండ్ హెల్త్ ఎకనామిక్స్ సబ్జెక్టులకు కర్ల్ డ్యూస్‌బర్గ్ స్కాలర్‌షిప్ లభిస్తుంది. అదేవిధంగా ఆగ్రో సైన్సెస్, డిజిటల్ ఫార్మింగ్, ఆగ్రానమీ, క్రాప్ సైన్సెస్, గ్రీన్ బయోటెక్నాలజీ, ఎన్విరాన్‌మెంటల్ సైన్సెస్ అండ్ సస్టయినబిలిటీ కోర్సులు చదివే వారు జెఫ్ స్కెల్ స్కాలర్‌షిప్‌నకు దరఖాస్తు చేసుకోవచ్చు. నాన్ అకడమిక్ ప్రొఫెషన్స్‌లో అప్రెంటిస్ చేసే వారికి హెర్మన్ స్ట్రెంజర్ స్కాలర్‌షిప్ బయాలజీ, కెమిస్ట్రీ(మాస్టర్స్ డిగ్రీ స్థాయి వరకు)లో స్టూడెంట్ టీచర్స్‌గా పని చేస్తున్నవారికి కర్ల్ హన్‌సెన్ స్కాలర్‌షిప్‌ను బేయర్ ఫౌండేషన్ అందజేస్తుంది.
5. **మేరి స్కోడోస్కా క్యూరి ఆక్షన్స్(ఎంఎస్‌సిఎ)**
ఎంఎస్‌సిఎ నాలుగు రకాల స్కాలర్‌షిప్స్‌ను అందజేస్తోంది. ప్రధానంగా పరిశోధన రంగానికి వీటిని ఉద్దేశించారు. వివిధ సంస్థలు లేదా విశ్వవిద్యాలయాల మధ్య పరిశోధన, భాగస్వామ్య అభివృద్ధిని పెంపొందించే క్రమంలో ఈ స్కాలర్‌షిప్‌లను ఇస్తున్నారు.
యురోపియన్ పార్టనర్‌షిప్స్ ఆఫ్ యూనివర్సిటీస్, నాన్ అకడమిక్ ఆర్గనైజేషన్స్ అండ్ రీసెర్చ్ ఆర్గనైజేషన్స్ కలిసి ఈ స్కాలర్‌షిప్‌ను నిర్వహిస్తున్నాయి. ఎంప్లాయిబిలిటీ స్కిల్స్ పెంచడం ఈ ప్రోగ్రామ్ ముఖ్య ఉద్దేశం.
ఇండివిడ్యువల్ ఫెలోషిప్స్(ఐఎఫ్): వివిధ రంగాల్లో అనుభవమున్న పరిశోధకులు యురోపియన్ యూనియన్‌లో పనిచేసే వారికి ఉద్దేశించారు. ఈ ఫెలోషిప్ కింద రెండేళ్ల వేతనం, మొబిలిటీ అలవెన్స్, ఇతరత్రా ఖర్చులను చెల్లిస్తారు.
ఇన్నోవేషన్ స్టాఫ్ ఎక్స్ఛేంజెస్(రైస్): ఇంటర్నేషనల్, ఇంటర్ సెక్టోరల్ కోఆపరేషన్ దీని ప్రధాన ఉద్దేశం. అన్ని స్థాయుల విద్యార్థులు, పోస్ట్ గ్రాడ్యుయేట్ రీసెర్చర్స్ నుంచి మేనేజ్‌మెంట్ పొజిషన్స్ వరకు ఈ స్కాలర్‌షిప్ వర్తిస్తుంది.

జర్మనీలో టాప్ యూనివర్సిటీలు

యూనివర్సిటీ పేరు	వరల్డ్ ర్యాంక్	వెబ్‌సైట్
1. టెక్నికల్ యూనివర్సిటీ ఆఫ్ మునిచ్	64	https://www.tum.de/en/homepage/
2. లుడ్‌విగ్-మాక్సిమిలియన్స్-యూనివర్సిటాట్ ముంకెన్	66	https://www.en.uni-muenchen.de/
3. రుప్రెక్ట్-కర్ల్స్-యూనివర్సిటాట్ హైడెల్‌బర్గ్	68	https://www.uni-heidelberg.de/index_e.html
4. కెఐటి, కరల్‌స్రూహె ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ	107	https://www.kit.edu/english
5. హంబోల్ట్-యూనివర్సిటాట్ బెర్లిన్	120	https://www.hu-berlin.de/en/
6. ఫ్రెయ్ యూనివర్సిటాట్ బెర్లిన్	125	www.fu-berlin.de/en/index.html
7. ఆర్‌డబ్ల్యుటిహెచ్ ఎకెన్ యూనివర్సిటీ	141	www.rwth-aachen.de
8. టెక్నిస్ యూనివర్సిటాట్ బెర్లిన్(టియు బెర్లిన్)	144	www.tu-berlin.de
9. ఎడెర్‌హర్డ్ కర్ల్స్ యూనివర్సిటాట్ టెబిజెన్	164	https://www.uni-tuebingen.de
10. అల్‌బర్ట్-లుడ్‌విగ్స్-యూనివర్సిటాట్ ఫ్రిల్‌బర్గ్	171	https://www.uni-freiburg.de
11. యూనివర్సిటీ ఆఫ్ గొట్టింజెన్	181	https://www.uni-goettingen.de
12. టెక్నిస్ యూనివర్సిటాట్ డ్రెస్డెన్	195	https://tu-dresden.de

భారతీయ విద్యార్థులకు వరం ప్రాజెక్ట్ ఐఎస్‌జి

- బెర్లిన్‌లోని ఇండియన్ ఎంబసి కార్యాలయం జర్మనీలో విద్యను అభ్యసించాలనుకునే, అదేవిధంగా ప్రస్తుతం చదువుకుంటున్న విద్యార్థుల కోసం 'ప్రాజెక్టు ఐఎస్‌జి' పేరుతో ప్రత్యేక పోర్టల్‌ని నిర్వహిస్తోంది. అదేవిధంగా ఫేస్‌బుక్, ట్విటర్ అకౌంట్లను కూడా ప్రారంభించింది. అతి తక్కువ సమయంలోనే వేలాది మంది విద్యార్థులు ఐఎస్‌జి పోర్టల్‌లో తమ పేర్లు నమోచేసుకున్నారు.
- ప్రాజెక్ట్ ఐఎస్‌జి ద్వారా కొత్తవారికి వీసా, వసతి, స్కాలర్‌షిప్స్ వంటి వాటితో పాటు, చదువు పూర్తయ్యాక అక్కడే ఉద్యోగ ప్రయత్నాల్లో ఉన్న వారికి సూచనలు, సలహాలు ఇండియన్ ఎంబసి ఇస్తోంది.

వెబ్‌సైట్: http://www.indianstudentsgermany.org/WP/
రిజిస్ట్రేషన్: http://www.indischebotschaft.de/registration/
ఈమెయిల్: administration@indianstudentsgermany.org

యూనివర్సిటీ స్కాలర్‌షిప్స్

- **బ్రెమెన్ ఇంటర్నేషనల్ గ్రాడ్యుయేట్ స్కూల్ ఆఫ్ సోషల్ సైన్సెస్(బిఐజిఎస్ఎస్ఎస్):** యూనివర్సిటీ ఆఫ్ బ్రెమెన్ అండ్ జాకబ్స్ యూనివర్సిటీ బ్రెమెన్‌తోపాటు మరికొన్ని రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్స్ కలిసి బిఐజిఎస్ఎస్ఎస్ పిహెచ్‌డి ప్రోగ్రామ్‌ను ఆఫర్ చేస్తున్నాయి. యూనివర్సిటీ ఆఫ్ బ్రెమెన్ నిర్వహించే ఈ ప్రోగ్రామ్ కాల వ్యవధి ఆరు సెమిస్టర్లు(36 నెలలు). బిఐజిఎస్ఎస్ఎస్ నెట్‌వర్క్‌లో బోస్పోరస్ యూనివర్సిటీ, ఇయుఐ ఫ్లోరెన్స్, ఎల్ఎస్ఇ, యూనివర్సిటీ ఆఫ్ మిన్నెసోట, చాపెల్ హిల్, యేల్ యూనివర్సిటీ, యోన్సీ యూనివర్సిటీలు కూడా ఉన్నాయి.
- **ఫ్రాంక్‌ఫర్ట్ స్కూల్ ఆఫ్ పైనాన్స్ అండ్ మేనేజ్‌మెంట్:** 10 డాక్టోరల్ ట్యూషన్ వేవర్స్ స్కాలర్‌షిప్స్‌ని అందజేస్తుంది. నాలుగేళ్ల ఈ డాక్టోరల్ కోర్సు కరికులమ్ పూర్తిగా ఇంగ్లీష్‌లో ఉంటుంది. ఫ్రాంక్‌ఫర్ట్ స్కూల్ ఆఫ్ పైనాన్స్ అండ్ మేనేజ్‌మెంట్ స్కాలర్‌షిప్‌తో పాటు 1200 యూరోల మంత్లి స్టయిపెండ్ కూడా పొందవచ్చు. కాన్ఫరెన్స్‌ల సందర్భంగా అయ్యే రవాణా ఖర్చులను కూడా సంస్థే భరిస్తుంది. **ఏటా జనవరిలో దరఖాస్తులను స్వీకరిస్తారు.**
- **ఫ్రియాస్ కోఫండ్ ఫెలోషిప్ ప్రోగ్రామ్(ఎఫ్‌సిఎఫ్‌పి):** ఈ స్కాలర్‌షిప్‌ను విదేశీ పరిశోధక విద్యార్థులకు ఉద్దేశించారు. యూనివర్సిటీ ఆఫ్ ఫ్రిబర్గ్‌తో పాటు లీగ్ ఆఫ్ యురోపియన్ రీసెర్చ్ యూనివర్సిటీస్(ఎల్ఇఆర్‌యు)లో సభ్య సంస్థలు సంయుక్తంగా 'ఫియాస్ కోఫండ్ ఫెలోషిప్ ప్రోగ్రామ్'ని నిర్వహిస్తున్నాయి. ఏటా 25 షెలోషిప్స్ ఇస్తారు. ఏడాదిలో మూడు నెలలు రీసెర్చ్ ప్రాజెక్టులో భాగంగా ఫ్రీబర్గ్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ అడ్వాన్స్‌డ్ స్టడీస్(ఎఫ్ఆర్ఐఎఎస్)లో పనిచేసే అభ్యర్థులకు ఈ ఫెలోషిప్ లభిస్తుంది.

దరఖాస్తు ప్రారంభం: 2017 సెప్టెంబరు 1
దరఖాస్తుకు చివరి తేది: 2017 అక్టోబరు 10

- **హెచ్‌హెచ్ఎల్ లిప్‌జిగ్ గ్రాడ్యుయేట్ స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్:** మాస్టర్స్, ఎంబిఎ, డాక్టోరల్ ప్రోగ్రామ్స్‌ల్లో వివిధ రకాల స్కాలర్‌షిప్‌లను హెచ్‌హెచ్ఎల్ లిప్‌జిగ్ గ్రాడ్యుయేట్ స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ ఆఫర్ చేస్తోంది. వీటిలో హెచ్‌హెచ్ఎల్ లిప్‌జిగ్ గ్రాడ్యుయేట్ స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్, కోఫి అన్నన్ బిజినెస్ స్కూల్ ఆఫ్ ఫౌండేషన్ ఫెలోషిప్, ఫ్యూచర్ ఎంట్రపెన్యూర్ స్కాలర్‌షిప్ ప్రోగ్రామ్, హెచ్‌హెచ్ఎల్ ఏసియా-పసిఫిక్ స్కాలర్‌షిప్ ప్రోగ్రామ్ వంటివి కొన్ని ముఖ్యమైనవి. ఒక్కో స్కాలర్‌షిప్ దరఖాస్తుకు ఒక్కో గడువు తేదీ ఉంటుంది. కాబట్టి ఆభ్యర్థులు తమ అర్హతలకు తగ్గ స్కాలర్‌షిప్ వివరాలను సంబంధిత వెబ్‌సైట్‌లో పొందవచ్చు.
- **హమ్‌బోల్ట్ యూనివర్సిటీ ఇంటర్నేషనల్ రీసెర్చ్ ఫెలోషిప్స్:** సీనియర్ స్కాలర్స్, పోస్ట్ డాక్టోరల్ అభ్యర్థులకు 10-15 ఫెలోషిప్స్‌ను హమ్‌బోల్ట్ యూనివర్సిటీ స్పాన్సర్ చేస్తుంది. **ఈ ఫెలోషిప్స్ అక్టోబర్ 1న ప్రారంభమై మరుసటి ఏడు జూలై 31న ముగుస్తాయి.** అయితే షార్టర్ ఫెలోషిప్స్‌కి కూడా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. హ్యూమానిటీస్ షోషల్ సైన్సెస్ విభాగాలైన హిస్టరీ, ఆంత్రోపాలజీ, లా, సోషియాలజీ, పొలిటికల్ సైన్స్ వంటి వాటిల్లో ఫెలోషిప్స్ పొందవచ్చు.

దరఖాస్తుకు చివరి తేదీ: 2017 సెప్టెంబరు 10

- **ఇంటర్నేషనల్ డాక్టోరల్ పొజిషన్స్ ఎట్ గ్రాడ్యుయేట్ స్కూల్ ఆఫ్ ఈస్ట్ అండ్ సౌత్ యురోపియన్ స్టడీస్:** లుడ్‌విగ్ మాక్సిమిలన్ యూనివర్సిటీ ఆఫ్ మునిచ్, యూనివర్సిటీ ఆఫ్ రీజెన్స్‌బర్గ్, గ్రాడ్యుయేట్ స్కూల్ ఆఫ్ ఈస్ట్ అండ్ సౌత్ యురోపియన్ స్టడీస్‌లు సంయుక్తంగా ఈ ఫెలోషిప్‌ని నిర్వహిస్తున్నాయి. మూడు విభాగాల్లో రీసెర్చ్ అసిస్టెంట్స్, పీహెచ్‌డీ ఫెలోషిప్స్ ఉంటాయి. అవి...ఒరిజిన్స్ అండ్ ఫార్మ్స్ ఆఫ్ సోషల్ అండ్ పొలిటికల్ ఛేంజ్; కల్చరల్ సిస్టమ్స్;ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, మైగ్రేషన్ అండ్ ట్రాన్స్‌ఫర్ ఆఫ్ నాలెడ్జ్. **ఫెలోషిప్స్ నవంబర్‌లో ప్రారంభమవుతాయి. వ్యవధి 18 నెలలు. అయితే 24 నెలల వరకు పొడిగించే అవకాశం ఉంటుంది.** రీసెర్చ్ అసిస్టెంట్ పొజిషన్‌కి రెమ్యునరేషన్ కింద జర్మనీ పబ్లిక్ సర్వీస్ సాలరీ స్కేల్ గ్రేడ్ ఇ-13(65 శాతం)ని వర్తింపచేస్తారు. పిహెచ్‌డీ స్కాలర్స్‌కి నెలకు 1365 యూరోల స్టయిపెండ్ లభిస్తుంది. వీటితో పాటు రవాణా, ఇతర ఖర్చులు కూడా చెల్లిస్తారు. వివాహం అయి చిన్న పిల్లలు ఉన్న మహిళలకు చైల్డ్ కేర్ సౌకర్యం కూడా కల్పిస్తారు.
- **యూనివర్సిటాట్ హంబర్గ్ మెరిట్ స్కాలర్‌షిప్స్:** డిగ్రీలోని అన్ని విభాగాల విదేశీ విద్యార్థులకు యూనివర్సిటాట్ హంబర్గ్ మెరిట్ స్కాలర్‌షిప్స్ అందజేస్తుంది. యూనివర్సిటీలో కనీసం రెండేళ్ల కాలానికి ఎన్‌రోల్ చేసుకొన్న విద్యార్థులకు నెలకి 650 యూరోలు అందజేస్తారు. పిహెచ్‌డీ అభ్యర్థులకు అత్యధికంగా నెలకు 1000 యూరోల స్కాలర్‌షిప్ లభిస్తుంది.
- **ఏకెన్ యూనివర్సిటీ:** ఏకెన్ యూనివర్సిటీ ఫర్ అడ్వాన్స్‌డ్ స్టడీ ఇన్ కంప్యూటేషనల్ ఇంజనీరింగ్ సైన్స్(ఎఐసిఇఎస్)లో పిహెచ్‌డి స్కాలర్‌షిప్స్ ఆఫర్ చేస్తుంది. ఈ స్కాలర్‌షిప్ కింద నెలకు 2000 యూరోలను చెల్లిస్తారు.

ఐబిపిఎస్ ఎగ్జామ్‌లో కొత్త కాన్సెప్ట్‌లు

మిక్చర్స్ & అల్లిగేషన్స్

పాలల్లో నీళ్లు కలిపితే... అది కూడా పోటీ పరీక్షల్లో ఒక ప్రశ్నే. బ్యాంకు ఆఫీసర్, క్లర్క్స్ పోటీ పరీక్షల్లో, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ టెస్ట్‌లలో మిక్చర్స్ అండ్ అల్లిగేషన్స్ టాపిక్‌పై ప్రశ్నలు తప్పకుండా ఉంటున్నాయి.

మిక్చర్స్ అంటే ఏమిటి?

మిక్చర్స్‌కి సంబంధించిన లెక్కల్లో రెండు అంతకంటే ఎక్కువ క్వాంటిటీస్ ఉంటాయి. ఈ క్వాంటిటీలకు సంబంధించిన ఎలిమెంట్స్‌ను రేషియో (నిష్పత్తి)లలో, శాతాలలో గాని తెలియజేస్తారు.

అల్లిగేషన్స్ అంటే ఏమిటి?

అల్లిగేషన్ అనేది ఒక రూల్ (ఒక సూత్రం). ఈ రూల్ సహాయంతో మిక్చర్స్‌కి సంబంధించిన ప్రాబ్లమ్స్‌ను సాల్వ్ చేయవచ్చు. **మిక్చర్స్‌కి ఉదాహరణలు:** • ఒక స్కూల్ తరగతిలో ఉన్న బాయ్స్ అండ్ గర్ల్స్; ఒక ఫ్యాక్టరీలో ఉన్న ఆఫీసర్స్, వర్కర్స్; ఒక ఆఫీస్‌లో ఉన్న ఎక్కువ జీతం ఉద్యోగస్తులు, తక్కువ జీతం ఉద్యోగస్తులు; ఒక క్లాసులో రకరకాల బరువున్న విద్యార్థులు.

- మిక్చర్ ప్రాబ్లమ్స్‌ను సింగిల్ వేరియబుల్‌తో; లేక రెండు వేరియబుల్స్‌తో ఉన్నవి గాని ఇస్తారు.
- రేట్ ప్రాబ్లమ్స్‌లో మిక్చర్స్ ప్రాబ్లమ్స్ ఒక భాగం. వీటిని పరిష్కరించాలంటే ముందుగా ఇచ్చిన ప్రాబ్లమ్‌ను జాగ్రత్తగా పరిశీలించాలి. ఆ ప్రాబ్లమ్‌లో ఇచ్చిన రకరకాల క్వాంటిటీస్‌ను చదవాలి.

మనం రోజూ ఉపయోగించే సరకులలో మిక్చర్స్ అనేక రకాలుగా ఉంటాయి:

1) డ్రై మిక్చర్స్, 2) లిక్విడ్ మిక్చర్స్.



లిక్విడ్ మిక్చర్స్‌కి ఉదాహరణ:

- మంచి పాలూ, నీళ్లు కలిపి చేసే మిశ్రమం
- పెట్రోల్‌లో కిరోసిన్ కలిపి చేసే మిశ్రమం
- నిమ్మరసం, చక్కర, నీళ్లు కలిపి తయారు చేసే మిశ్రమం.

డ్రై మిక్చర్స్‌కి ఉదాహరణ

- 22 కేరట్ల బంగారం, 18 కేరట్ల బంగారం కలిపి చేసే మిశ్రమం
- మేలైన బియ్యం, నాసిరకం బియ్యం కలిపి చేసే మిశ్రమం

- **రూల్ 1 :** బేసిక్ మెథడ్ అమలు చేయటం. ఉదా:

ఒక లీటర్ రూ. 55 ఖరీదున్న 30 లీటర్ల పాలలో, నీళ్లు కలిపారు. అలా వచ్చిన నీళ్ల, పాల మిశ్రమాన్ని ఒక లీటర్ రూ. 50కి అమ్మాలంటే ఎన్ని లీటర్ల నీళ్లు కలిపి ఉండాలి?
జవాబు: 3 లీటర్లు

రూల్ 2: ఈ కింది సూత్రాన్ని అమలు చేయటం:

$$\frac{\text{Quantity of Cheaper item}}{\text{Quantity of dearer item}} = \frac{\text{Price of dearer-Average price of mixture}}{\text{Average price of mixture-Price of cheaper}}$$

వివరణ: $x/30 = 5/50$; $x/30 = 1/10$; $x = 3$ లీటర్లు

ఉదాహరణ: లీటర్‌కి రూ. 21 ఖరీదున్న 9 లీటర్ల పెట్రోల్‌కి, లీటర్‌కి రూ. 13 ఖరీదున్న కిరోసిన్ కలిపారు. అలా వచ్చిన మిశ్రమాన్ని ఒక లీటర్‌కి ఎన్ని రూపాయల చొప్పున అమ్మాలి?

జవాబు: రూ.9 ఒక లీటర్‌కి

నోట్: హైస్కూల్ విద్యార్థులకి నిర్దేశించిన గణితశాస్త్రం టెక్స్‌బుక్‌లలో ఇలాంటి ప్రశ్నలు ఉంటాయి. పోటీ పరీక్షల అభ్యర్థులు వాటిని కూడా సాధన చేయవచ్చు.

- ప్రాతూరి పోతయ్యశర్మ

Scholarship Alert

Post-Matric Scholarships Scheme for Minorities 2017-18

Category: National
Description: To motivate students belonging to minority communities of India, Zoroastrians, Christians, Buddhists, Jains, Sikhs and Muslims, Government of India is offering them scholarship opportunity for higher education up to Ph.D. based on merit while earmarking 30% scholarships for girl students.
Eligibility: Students having cleared class 10 examination from any private or government school affiliated under a recognized board for study in a government or private higher secondary school, college, universitywith family income not more than INR 2L and 50% marks in previous final examination are eligible to apply for the opportunity.
Application: Applications can be made online only.
Prizes & Rewards: The awardees will receive varying admission, tuition and maintenance fee depending on the higher education they are pursuing, for both day scholars and hostellers on monthly and annual basis.
Last Date to Apply: August 31, 2017
Short Source URL:
http://www.b4s.in/aj/PMS21

The Matsumae International Research Fellowship 2017-18

Category: International
Description: Matsumae International Foundation, Japan is inviting applications from doctorate candidates to imbibe deeper understanding of Japan with priority given to the field of study in natural science, engineering and medicine.
Eligibility: Candidate must be a doctorate, not more than 49 years of age having conversational ability in English or Japanese, must not have been in Japan in the past or present with firm positions and professions and must return on completion of the fellowship. The candidate must obtain offer of acceptance from the host institution to carry out the research.
Application: Applications are to made offline via post.
Prizes & Rewards: Awardee will receive stipend of 2,20,000 Yen p.m., overseas travel or sickness insurance, economy class round-trip air ticket and lump sum amount of 1,20,000 Yen to assist with local travel expense, lodging, etc. on arrival.
Last Date to Apply: August 31, 2017
Short Source URL:
http://www.b4s.in/aj/TMI4

Merit cum Means Scholarship for Minorities 2017

Category: National
Description: To assist poor and meritorious studentsof minority community financially,ie, Zoroastrians, Christians, Buddhists, Jains, Sikhs and Muslims, Ministry of Electronics& Information Technology, Government of Indiaisinviting applications for the scholarship opportunity to help them with technical or professional course.
Eligibility: Candidates pursuing technical or professional course in any institute under recognized educational boardhaving not less than 50% in higher secondaryor graduation. The candidate must not be availing any other financial aids by any other means and family income must not exceed INR 2.5L
Application: Applications are accepted online only.
Prizes & Rewards: Maintenance allowance of INR 10,000 p.a. to hostellers and INR 5000 p.a. for day scholars, and course fee of INR 20,000 or actual fee, whichever is less for both, hostellers and day scholars will be provided.
Last Date to Apply: August 31, 2017
Short Source URL:
http://www.b4s.in/aj/MCM9

Courtesy: www.buddy4study.com

నవ్య
కుటుంబ కదంబం







నాలుగేళ్ల వయసులో మృదంగంతో ఏర్పడిన స్నేహాన్ని డెబ్భయ్ ఏళ్లుగా కొనసాగిస్తున్నారు.. పద్మశ్రీ యల్లా వెంకటేశ్వరరావు. ప్రపంచ వ్యాప్తంగా వేలాది కచేరీలు నిర్వహించి అంతర్జాతీయ స్థాయి కళాకారుడని అనిపించుకున్నారు. మృదంగంతో సాగిన తన జీవిత ప్రయాణ విశేషాలను 'ఓపెన్‌హార్ట్ విత్ ఆర్కే' కార్యక్రమంలో ఏబీఎన్-ఆంధ్రజ్యోతి ఎం.డి వేమూరి రాధాకృష్ణతో ఆయన ఇలా పంచుకున్నారు.

మన వాళ్లకు సినిమా పాటలే ఎక్కువ!

మీరు మృదంగ విద్వాంసులే కాకుండా మంచి గాయకులని కూడా విన్నాం. ఈ కార్యక్రమాన్ని ఒక గీతంతో మొదలుపెట్టండి..

వినాయక ఉత్సవాలు జరుగుతున్నాయి కాబట్టి విఘ్నేశ్వరుణ్ణి ప్రార్థిస్తూ పాడతాను. "మహా గణపతిం మనసా స్మరామి.. మహా గణపతిం మనసా స్మరామి..."

మీ వల్ల మృదంగానికి పేరొచ్చిందా? మృదంగం వల్ల మీకు పేరొచ్చిందా?

మృదంగం వల్లే నాకు పేరొచ్చింది. మృదంగం లేకపోతే 'యల్లా వెంకటేశ్వరరావు' లేడు. చిన్నప్పటి నుంచి నాకు మృదంగాన్ని ప్రథమ స్థానానికి తీసుకెళ్లాలని ఉండేది. అప్పట్లో మృదంగం పక్క వాద్యంగా ఉండేది. దాన్ని ప్రధాన వాద్యంగా మార్చాలన్న ఆవేశం ఉండేది.

ఆ ఆలోచన ఎందుకొచ్చింది?

అప్పటి సామాజిక పరిస్థితులు. అప్పట్లో కళాకారులు చాలా పేదరికంలో ఉండేవారు. ప్రధాన వాద్యకారునికి ఉండే గౌరవం మిగతా వారికి ఉండేది కాదు. చాలా దుర్భరమైన పరిస్థితులు ఉండేవి. ప్రధాన గాయకునికి ఎంత జ్ఞానం ఉందో వాద్యకారులందరికీ అంత జ్ఞానం ఉంటే తప్ప అందుకోలేరు. పక్క వాయిద్యం సరిగ్గా లేకపోతే మొత్తం పోతుంది. అందుకే వాళ్లు చాలా తపన పడతారు. వాద్యం వాయించే వ్యక్తికి విరామం ఇస్తుంటారు. దాంతో ప్రోగ్రామ్ అయిపోందనుకుని ప్రేక్షకులు లేచి వెళ్లిపోయే వారు. ఇలాంటివి చూశాక మృదంగాన్ని ప్రధాన వాద్యంగా తీసుకురావాలని నిర్ణయించుకున్నా. అలాంటి సందర్భాలు చాలా చూశాను.

మీకూ ఎదురయ్యాయా?

ఎదుర్కొన్నాను! కానీ, అంతగా కాదు. ప్రధాన గాయకుడు ఫస్ట్‌క్లాస్‌లో వెళితే నేను కూడా ఫస్ట్‌క్లాస్‌లో వెళ్లేవాణ్ణి. 'మృదంగం ఏం తక్కువ!' అనుకునేవాణ్ణి. డామినేట్ చేస్తున్నానని కార్యక్రమాలకు కూడా పిలిచే వారు కాదు.

మిగతా వాళ్లందరినీ డామినేట్ చేస్తుంటారని అంటారు, నిజమేనా?

అనుకుంటున్నారు వాళ్లు. నేను నా ప్రతిభ చూపించుకోవాలి కదా! స్టేజ్‌పైన యల్లా వెంకటేశ్వరరావు ఉన్నాడంటే ఒక ప్రత్యేకత ఉంటుందని జనం అనుకొంటారు. మనల్ని చూసి వచ్చే జనం కూడా ఉంటారు. ప్రతి మనిషికీ కొంతమంది ఆడియన్స్ ఉంటారు. అప్పుడు మన ప్రదర్శన సరిగ్గా లేకపోతే 'ఏంటీ డౌన్ అయిపోయాడాయన' అంటారు. అందుకే స్టేజ్‌పై విజృంభిస్తూనే ఉంటాను. అందుకే సోలో ఉంటే తప్ప పిలవడం లేదు. మంగళంపల్లి బాలమురళీకృష్ణ, ఎమ్మెస్ సుబ్బలక్ష్మి, టి.ఎల్ వసంతకుమారి, ఓలేటి వెంకటేశ్వర్లు, రాధా జయలక్ష్మి, టిఎన్ కృష్ణన్, ద్వారం వెంకటస్వామి నాయుడుగారు, మైసూరు చోడయ్య.... ఇలాంటి వారందరితోనూ, మూడు తరాల వారితో వాయించాను. దాదాపు 70 దేశాల్లో మృదంగం కచ్చేరీలు చేశాను.

ఎవరితో మీకు చాలా టఫ్‌గా అనిపించింది?

అల్లారఖా, కృష్ణ మహరాజ్, జాకీర్ హుస్సేన్... వీరితో చాలా టఫ్. అయితే రోమ్‌లో కార్యక్రమంలో జాకీర్ హుస్సేన్‌ను సెకండ్ రౌండ్‌లో దాటాను! చివరి వరకు నేనే! అప్పటి నుంచీ మళ్లీ కలిసి చేయలేదు.

మృదంగంతో చాలా ప్రయోగాలు చేశారు! ఏకబిగిన 36 గంటలు మృదంగం వాయించి రికార్డుల్లోకెక్కారు కదా! ఎలా సాధ్యమయింది?

సాధన చేశాను. రోజూ పది గంటలు సాధన చేసేవాణ్ణి. ఒక్కోరోజు నిద్రాహారాలు మాని తపస్సులా చేసేవాణ్ణి. నాకున్నది ఒక్కటే తపన. మృదంగాన్ని ఉన్నతస్థాయికి తీసుకెళ్లాలి. ఎవ్వరికీ ఇబ్బంది కలగకుండా ఒక గదిలో కూర్చుని సాధన చేసే వాణ్ణి. అప్పట్లో కరెంటు ఉండేది కాదు. చెమటలు కారిపోతుండేవి. సమయం మీద ధ్యాస ఉండేది కాదు. కొత్త ప్రయోగాలు చేసేవాణ్ణి. ఆ రోజు బాలమురళీకృష్ణగారొచ్చి గణపతి ప్రార్థనతో మొదలుపెట్టారు. ఉద్దండులైన మహానుభావులు వచ్చి పాల్గొన్నారు. దానివల్ల అది ఒక రికార్డు అయింది. రికార్డు కోసం చేసింది కాదు. 24 గంటలు అనుకుని మొదలుపెట్టాను. కానీ, 36 గంటలకు వెళ్లిపోయింది.

> **ఇంత చేసినా జీవనభృతి రావట్లేదు!**
>
> తెలుగు విశ్వవిద్యాలయంలోకి డిప్యుటేషన్ మీద వెళ్లే నాటికే ఆకాశవాణిలో ఎన్నో ఏళ్లు పని చేశాను. రెండేళ్ల డిప్యుటేషన్ తర్వాత అధికారులు ఒత్తిడి చేయడంతో, 29 ఏళ్ల సర్వీసు తర్వాత.. ఆకాశవాణికి రాజీనామా చేయాల్సి వచ్చింది. తర్వాత తెలుగు యూనివర్సిటీలో 16 ఏళ్లు పని చేశాను. ఇప్పుడు నాకు జీవన భృతి (పెన్షన్) కూడా రావడం లేదు. ఆకాశవాణి వాళ్లూ పట్టించుకోవడం లేదు! తెలుగు యూనివర్సిటీ నుంచి కూడా స్పందన లేదు. పెన్షన్ గురించి తిరగని ఆఫీసు లేదు. అయినా పని కాలేదు. 12 ఏళ్లుగా పోరాడుతున్నా.. ఫలితం లేదు. ఇన్ని సంవత్సరాలు సర్వీసు చేశాను. ఆయా సంస్థలకు నా వల్ల ఎంతో పేరు ప్రఖ్యాతులు వచ్చాయి. అవార్డులు వచ్చాయి. అయినా, ఈ పరిస్థితి తప్పలేదు.

ఏకధాటిగా మృదంగం వాయిస్తుంటే ఆయాసం కలగదా?

వస్తుంది! తట్టుకోవాలి. ఏ మాత్రం ఆయాసపడినా తాళం తప్పుతుంది. శ్రుతి పోతుంది. ఈ రెండూ పరిరక్షించుకుంటూ విన్యాసాలు చేయాలి. మొత్తంగా చూస్తే 29 వేల పైచిలుకు కార్యక్రమాలు నిర్వహించాను.

ఇన్ని ప్రదర్శనలు ఇచ్చారు కదా! ఎక్కడైనా అపశ్రుతి చోటుచేసుకుందా?

దేవుడి దయ వల్ల ఎన్నడూ చోటుచేసుకోలేదు. ఉద్దండ పిండాల దగ్గర కూడా పోటాపోటీగా వాయించాను. అందరూ భేష్ అన్నవాళ్లే!

మీ ప్రతిభను నిలబెట్టేవాళ్లు మీ కుటుంబం నుంచి ఎవరైనా ఉన్నారా?

ఉన్నారు. అయితే, వాళ్ల చదువుకు ఇబ్బంది కలుగుతోంది. చిన్నప్పటి నుంచి నేను ఐఏఎస్ అవ్వాలనుకున్నాను. కుటుంబ పరిస్థితి, ఆర్థిక పరిస్థితి వల్ల సాధ్యం కాలేదు. మృదంగ సాధనకే నా జీవితం అంకితమైంది. నాలుగేళ్ల వయసులో మృదంగం వాయించడం మొదలుపెట్టాను. ఏడేళ్ల వయసు నుంచి కచ్చేరీలు చేస్తున్నాను. మృదంగంతో నాది ఇంచు మించు డెబ్భయ్ ఏళ్ల ప్రయాణం.

ఒకే వాద్యంతో ఇన్నేళ్ల సుదీర్ఘ ప్రయాణంలో ఎక్కడా విసుగు రాలేదా? పడిన శ్రమకు ఫలితం రాలేదన్న భావన కలుగలేదా?

అసంతృప్తి ఉంది. తమిళనాడులో, ఉత్తర భారతంలో.. నా కన్నా ప్రతిభ తక్కువ ఉన్నవారికి ఎన్నో పురస్కారాలు రావడం కాస్త ఇబ్బంది అనిపిస్తుంది. ఆర్థికంగా మాత్రం బాగానే ఉంది.

ఆకాశవాణి మీకు వేదిక అనుకోవచ్చా?

ఆకాశవాణి నాకు మాతృ సంస్థ. పదహారేళ్లప్పుడు నాకు ఉద్యోగం ఇచ్చారు. నిజంగా చెప్పాలంటే పదహారేళ్లకు ఇవ్వకూడదు. పధ్నాలుగేళ్లు ఉన్నప్పుడు ఒక జాతీయ పురస్కారం వచ్చింది. అప్పటి రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ చేతుల మీదుగా దానిని తీసుకున్నాను. అప్పటి కేంద్రమంత్రి బెజవాడ గోపాలరెడ్డిగారు సిఫారసు చేశారు. అలా ఆకాశవాణిలో అవకాశం వచ్చింది. అతి చిన్న వయసులో ఆకాశవాణిలో చేరిన స్టాఫ్ ఆర్టిస్ట్‌ని నేనే! కాంట్రాక్టు పద్ధతిలో 100 రూపాయలు వచ్చేవి. పర్మినెంట్ అయ్యాక రూ.150 అయ్యింది. కుటుంబ అవసరాలకు సరిపోయేవి కావు. కార్యక్రమాలు చేస్తూ నెట్టుకొచ్చేవాణ్ణి.

బయట కచ్చేరీలు చేస్తుంటే.. అధికారులు ఏమనేవారు?

అధికారుల్లో కొందరు పరమ దుర్మార్గులు ఉండేవాళ్లు. బయటకు వెళ్లనిచ్చే వాళ్లు కాదు. వాళ్లను ఎలాగో ప్రసన్నం చేసుకొని వెళ్లేవాణ్ణి.

కచ్చేరీలకు ఇదివరకటిలా జనం వస్తున్నారా?

నా కార్యక్రమం వరకైతే విశేషంగానే వస్తున్నారు.

విదేశాల్లో కచ్చేరీలకు మనవాళ్లు ఎక్కువగా వస్తారా.. విదేశీయులా?

వాళ్లే ఎక్కువగా వస్తుంటారు. మనవాళ్లు వచ్చినా.. అందులో తెలుగు వాళ్లు తక్కువ. కన్నడిగులు, తమిళులు, ఉత్తర భారతదేశానికి చెందిన వాళ్లు.. ఎక్కువగా ఉంటారు. మన తెలుగు వాళ్లకు సినిమా పాటలు కావాలి. కానీ, విదేశీయులు ఎంతో గౌరవిస్తారు, ఆదరిస్తారు.

మీ స్కూల్‌లో విదేశీయులు ఉన్నారా?

ఉన్నారు. పారిస్, ఇంగ్లండ్, దక్షిణాఫ్రికా ఇలా పలు దేశాలకు చెందిన విద్యార్థులు చాలామంది ఉన్నారు.

స్కూలు బాగానే నడుస్తోందా?

ఇప్పుడు నేనే తగ్గించాను. ఓపిక లేదు. శిష్యుల దగ్గర నయాపైసా తీసుకోను. నేను ఎలా నేర్చుకున్నానో.. వాళ్లకూ అలాగే నేర్పాను. నా శిష్యులు మంచి విద్వాంసులుగా తయారయ్యారు. నన్ను మించిన వాళ్లూ ఉన్నారు. రెండువేల మంది శిష్యుల్లో ఓ పది మంది అంతర్జాతీయ స్థాయి కళాకారులుగా తయారయ్యారు. ఇంతకన్నా ఆనందం ఏముంటుంది!

రోగాలు నయం చేయడానికి మ్యూజిక్ థెరపీ అని మొదలుపెట్టారు. సంగీతానికి అన్ని జబ్బులూ నయమవుతాయంటారా?

నేను కూడా మ్యూజిక్ థెరపీ చేశాను. అయితే, అన్ని జబ్బులూ నయం కావు. మానసిక ఒత్తిడి తగ్గించవచ్చు. మానసిక ప్రశాంతత వస్తే.. సగం రోగాలు నయం అయినట్టే!

కాలానుగుణంగా సంగీత కళాకారుల ఆహార్యంలో మార్పు లేదేం?

పది మందిలో ప్రత్యేకంగా కనిపించాలని ఒకటి! కొన్ని సెంటిమెంట్‌గా ధరించేవీ ఉంటాయి. కచ్చేరీల్లో విశేషంగా కనిపించడానికి ప్రత్యేకమైన ఆహార్యం అనుసరిస్తూ ఉంటాం.

మీ భవిష్యత్ ప్రణాళికలు ఏమిటి?

విశ్వవిద్యాలయం ప్రారంభించాలని ఉంది. దానికి సంబంధించిన ప్రాజెక్ట్ రిపోర్ట్‌ను తిరుమల తిరుపతి దేవస్థానానికి (టీటీడీ) అందజేశాను. ఢిల్లీలో కూడా చెప్పాను. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గారు గానీ, తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ గారు గానీ సహకరిస్తే.. వాళ్లు సహకరిస్తామన్నారు. ప్రాజెక్ట్ అయితే సిద్ధంగా ఉంది.

వాళ్ళు గుర్తుపెట్టుకోట్లేదు!

- తబలా వాద్యకారులతో కలిసి జుగల్‌బందీ చేశాను. కానీ, వాళ్లను డామినేట్ చేయకూడదు. డామినేట్ చేస్తే వాళ్లకు నచ్చదు. అవకాశం వచ్చినపుడు మనకు ఉన్న సంగీతజ్ఞానం చూపించుకోకపోతే ఎలా?
- తంజావూరు, కేరళలో మృదంగ వాదన కళకు చాలా ఆదరణ ఉంది. వేల మంది ఉన్నా తగిన రీతిలో కార్యక్రమాలు జరుగుతుంటాయి. మృదంగం తయారీదారులు అక్కడ ఎక్కువ.
- మా అబ్బాయి పేరు బాలమురళీకృష్ణ - బాగా పాడతాడు. రకరకాల సంగీత వాద్యాలు కూడా వాయిస్తారు. మా అమ్మాయి మంచి చిత్రకారిణి. యోగా గురువు కూడా! ఇంకొక అమ్మాయి కూచిపూడి నృత్య కళాకారిణి. వారి పిల్లలు కూడా సంగీత సాధనలో ఉన్నారు.
- తిరుమల తిరుపతి దేవస్థానం ఆస్థాన విద్వాంసుడిగా సేవలందించాను. ఎక్స్‌పర్ట్ మెంబర్‌గా ఎన్నో సంస్కరణల్లో భాగమయ్యాను. అయితే, అధికారులను బట్టే అన్నీ జరుగుతుంటాయి. వారి వల్లే కొన్ని మంచి పనులు జరుగుతున్నాయి. చెడూ జరుగుతోంది. ఆస్థాన విద్వాంసుడిని గౌరవప్రదంగా నియమించారు. అయితే ఆస్థాన విద్వాంసులను గుర్తుపెట్టుకోవాలనే భావన చాలామంది అధికారుల్లో ఉండటం లేదు.
- రెండు మూడు సినిమాలకు పని చేశాను. దర్శకుడు కె.విశ్వనాథ్ గారు మొదటి అవకాశం ఇచ్చారు. 'సప్తపది' సినిమా కోసం. కానీ, సినిమాల్లో సరిపడక వద్దనుకున్నాను.
- ఎన్.టి.రామారావు గారికి నాపై మంచి అభిమానం ఉండేది. వారింట పెళ్లిళ్లలో నా కార్యక్రమం తప్పనిసరి. తెలుగు విశ్వవిద్యాలయం పెడుతున్నారని అన్నారు. నేను వారి దగ్గరికి వెళ్లి.. సంగీత కళలకు కూడా అవకాశం కల్పించమని చెప్పాను. నాతో పాటు పలువురు ప్రముఖులతో కమిటీ వేసి ప్రణాళిక రూపొందించమన్నారు. అలాగే చేశాం. 'వాద్య సహకారం' విభాగం కూడా సూచించాను. దానిని నన్నే చూసుకోమన్నారు. ఆకాశవాణిలో ఉన్నానని చెప్పాను. డిప్యుటేషన్ మీద రమ్మంటే వెళ్లాను. చాలా కష్టపడి పని చేశాను. మృదంగం, నాదస్వరం, డోలు, థియేటర్ ఆర్ట్స్ - ఇలా ఎన్నో విభాగాలు ప్రవేశపెట్టాం.
- ఒక్క మృదంగం వాయించడమే కష్టం. అలాంటిది తొమ్మిది మృదంగాలను శ్రుతిచేయడం సాధారణ విషయం కాదు. దానికి సంగీత జ్ఞానం ఒక్కటే సరిపోదు. సాధనతోనే సాధ్యం.



బ్యూటీ కేర్



అలా చేస్తే వన్నె తగ్గుతారు!

చర్మం మృదువుగా, అందంగా, కాంతిమంతంగా ఉండాలంటే అర్ధరాత్రి సమయంలో చిరుతిళ్లు తినకూడదంటున్నారు నిపుణులు. అర్ధరాత్రుళ్లు తినడం వల్ల అతినీలలోహిత కిరణాల నుంచి రక్షించే గుణం చర్మంలో హరించుకుపోతుందిట. అంతేకాదు ఈ అలవాటు వల్ల సన్‌బర్న్ బారిన కూడా ఎక్కువగా పడతారట. దీర్ఘకాలంలో చర్మం ముడతలుపడటంతో పాటు, తొందరగా ముసలివారవడం, చర్మ క్యాన్సర్ తలెత్తుతాయి. అర్ధరాత్రుళ్లు చిరుతిళ్లు తినే అలవాటు ఉన్న వాళ్ల చర్మం మృదుత్వాన్ని, కాంతిని కోల్పోతుంది కూడా. చర్మంలో ప్రత్యేక గుణాలు దెబ్బతింటాయి. సమయానికి ఆరోగ్యవంతమైన ఆహారం తీసుకుంటే అతినీలలోహిత కిరణాల నుంచి, ఎండ వేడిమి నుంచి చర్మం మనల్ని కాపాడుతుంది. శాస్త్రవేత్తలు ఇటీవల ఎలుకల మీద చేసిన ఒక స్టడీలో ఈ విషయం వెల్లడైంది.

పేరెంటచ్

జంతువుల కథలంటేనే ఇష్టం!

పిల్లలు కథల నుంచే విలువలను, సందేశాల్ని, పాఠాలను, నీతిని నేర్చుకుంటారని తాజా సర్వేలో వెల్లడైంది. అనగనగా ఒక రాజు.. అని మనుషుల గురించి చెప్పే కథల కంటే.. అనగనగా ఓ సింహం ఉంది.. అంటే పిల్లలకు మరింత బాగా కథ అర్థమవుతుందట. టొరాంటో విశ్వవిద్యాలయం అనేకమంది పిల్లల మానసిక స్థితిపై పరిశోధన చేసింది. అందులో తేలిందేంటంటే.. నాలుగు నుంచి ఆరేళ్ల పిల్లలు పుస్తకాల్లో ఉండే మనుషుల బొమ్మలకంటే , జంతువుల బొమ్మలుండే కథలను ఇష్టపడతారని. రోజువారి విషయాలను, జంతువులను ప్రధాన పాత్రలుగా చేసి కథలు చెబితే వారికి త్వరగా అర్థమవుతుంది. పుస్తకాలనుంచే నేర్చుకునే తత్వం పిల్లలకు బాగా అలవడుతుంది. సామాజిక సేవ, మంచి ఆలోచనలు, సృజనాత్మకత పెంపొందాలన్నా పిల్లలకు మంచి కథల పుస్తకాలను పరిచయం చేయాలి.

స్టోరీబుక్స్ ఆధారంగా ప్రాపంచిక విషయాలను, సామాజిక స్పృహను పిల్లలకు తల్లిదండ్రులు నేర్పించాలి.



గుడ్ మార్నింగ్

ఒక వ్యక్తి పేదవాడా.. ధనవంతుడా..
అని నిర్ణయించేది ఆ వ్యక్తి ఆదాయం కాదు!
అతడి ఆదాయానికీ, ఖర్చుకీ మధ్యలో ఉన్న
వ్యత్యాసం!!

మీకు మీరే డాక్టర్

ఆరోగ్యానికి తల్లి



స్మార్ట్‌హోమ్

వంటింట్లో సులువుగా..!



ఆటల ప్రపంచానికి కిటికీ

కిటికి పక్కన సీటు కోసం కొట్లాడుకోని పిల్లలు ఉండరు... విమానం ఎక్కినాసరే విండో సీటు కావాలని సరదా పడని పెద్దలూ ఉండరు. తరగతి గదిలో టీచరు పాఠాలు చెబుతున్నా... క్షణం విరామం దొరికితే చాలు కిటికీ వైపు చూపులు విసిరే చిన్నారులైతే లెక్కే లేదు... ఇంతకూ కిటికీలో దాగిన ఆ ఆకర్షణ ఏమిటి.... ముడి వీడని పచ్చని ప్రకృతి రహస్యాల్ని కిటికి అద్దంపడుతుందా? ప్రకృతికీ, సృజనకీ, కిటికీకి మధ్య ఉన్న బంధం ఏమిటి?ఈ ఆలోచనలు స్కూల్లో చదివే రోజుల్లో రోహిణీ దీప్తికి వచ్చాయి. పెద్దయ్యాక కిటికీ జ్ఞాన నేత్రమనీ, చదువు ప్రకృతితో ముడిపడిన ప్రక్రియ అనీ ఆమెకు అర్థమైంది. అందుకే నేటి పిల్లల కోసం వినూత్నంగా భర్త ప్రమోద్‌తో కలిసి బోర్డు గేమ్స్‌కు శ్రీకారం చుట్టింది. ఆ స్టార్టప్‌కు 'కిటికీ' అని పేరు పెట్టింది. పిల్లల్లో సృజనకు బాటలు వేసే సరికొత్త ఆటలను అందిస్తూ, వారి లోని ఆసక్తులకు మొగ్గలు తొడిగేలా చేస్తోంది. ఆ విశేషాలు రోహిణీ దీప్తి మాటల్లో తెలుసుకుందాం.

• సృజన



బోలెడు విజ్ఞానం

ఆ ఆలోచన ఆమెదే!

మలుపుతిప్పిన ట్రావెల్...

ఆ పేరు ఎందుకుపెట్టామంటే...

గేమ్స్‌పై హోంవర్క్!

ఇతర సబ్జెక్టులపైనా చేస్తాం...







• నవ్య డెస్క్


నయాహవా

టెడ్డీబేర్ డాగ్స్!



ఇక నువ్వే చెప్పాలి!

నవ జీవనగీతం





మన్నాడే



డైలీ సుడోకు - 164

	7							5
2	5					3	4	6
9		6	4					
5				4	9			
		7	5		8	9		
			2	6				4
					6	5		8
1	8	5					7	3
6							1	

ఎలా పూరించాలి?

ప్రతి బాక్స్‌లోనూ 9 గళ్లు ఉంటాయి.

నిలువుగానూ, అడ్డంగానూ

సుడోకు- 163 సమాధానం

నివేదన

సద్గురు లక్షణం



- రాచమడుగు శ్రీనివాసులు

రెండు సినిమాలు తీసినంత..!



మహేష్, రకుల్‌ప్రీత్

చెప్పాం. తమిళ వెర్షన్‌లో మహేశ్ డబ్బింగ్ చాలా క్లీన్‌గా బాగుందని నా స్నేహితులంతా అంటున్నారు. తమిళ్‌కు అది కూడా ప్లస్ పాయింటే" అని తెలిపారు మురుగదాస్. ప్రస్తుతం ఈ చిత్రానికి సంబంధించిన చివరి పాటను రొమేనియాలో మహేశ్, రకుల్‌ప్రీత్‌పై చిత్రీకరిస్తున్నారు.

సింగర్స్ స్పెషల్

ఎన్నిపాటలు పాడారన్నది కాదు.. ప్రవహించే నదిలా ఒక్క పాటైనా ప్రేక్షకుల నోట పరుగులు పెడుతుందా, లేదా అన్నదే ముఖ్యం. ఇప్పుడలా పరిగెడుతున్న పాటల్లో 'కన్ను కన్ను కలిశాయి' ఒకటి. 'పైసా వసూల్' చిత్రంలోని ఈ పాట పాడింది నడిగడ్డ శ్రీకావ్య చందన. ప్రేక్షకులు ఎవరైనా ఆ పాట వినగానే 'గుర్తుండిపోదా నీ స్వరం' అనుకోవాల్సిందే. పలు టీవీ షోలతో పాపులారిటీ తెచ్చుకుందీ యువగాయని. గతేడాది ప్రారంభించిన ప్లేబ్యాక్ కెరీర్ గురించి ఇలా చెప్పుకొచ్చింది శ్రీకావ్య చందన.

అమ్మానాన్నల ఆనందం చూశా!



- శ్రీకావ్య చందన

కలగా ఉంది...

ఆ రెండు కోరికలు తీరాయి..!

సక్సెస్ కాకపోతే...



ప్రధానితో..

'కన్ను కన్ను కలిశాయి'తో...

కౌన్సెలింగ్

అదే నాకున్న పెద్ద జబ్బు



- డాక్టర్ ఎల్. కిరణ్‌కుమార్

హీరో బాలయ్యా? మోక్షా?.. అని ఆశ్చర్యపోతున్నారు!

- బాలకృష్ణ



శ్రియ, చార్మి, ముస్కాన్, కైరాతో డాన్స్ చేస్తున్న బాలకృష్ణ

"పైసా వసూల్‌ని నా రీ లాంచింగ్ సినిమాగా భావిస్తున్నా. ఈ సినిమా ట్రైలర్ చూసిన వాళ్లందరూ ఇందులో హీరో బాలయ్యా? మోక్షా? అని ఆశ్చర్యపోతున్నారు. కొత్తగా, హుషారుగా ఉన్నానని అంటున్నారు" అని నందమూరి బాలకృష్ణ అన్నారు. ఆయన హీరోగా నటించిన 'పైసా వసూల్' ఆడియో సక్సెస్ వేడుక హైదరాబాద్‌లో ఆదివారం రాత్రి జరిగింది. భవ్య క్రియేషన్స్ పతాకంపై పూరి జగన్నాథ్ దర్శకత్వం వహించిన చిత్రమిది. శ్రియ, ముస్కాన్, కైరా నాయికలు. వి.ఆనందప్రసాద్ నిర్మించారు. బాలకృష్ణ మాట్లాడుతూ "చెన్నైలో ఫైటర్స్ అసోసియేషన్ రజతోత్సవానికి నాన్నగారు ఎన్.టి.రామారావుగారు వెళ్లారు. శనివారం జరిగిన స్వర్ణోత్సవానికి నేను వెళ్లా. 75 ఏళ్లకు మోక్షని, 100 ఏళ్లకి దేవాంశ్‌ను పంపిస్తానని మాటిచ్చి వచ్చా. ప్రస్తుతం కె.ఎస్.రవికుమార్ దర్శకత్వంలో చేస్తున్న సినిమా ఒక షెడ్యూల్ పూర్తయింది. మరోవైపు నాన్నగారి బయోపిక్ పనులు కూడా జోరుగా సాగుతున్నాయి. 'పైసా వసూల్' సినిమాతో నాకు, పూరిగారికి బాగా జెల్ అయింది. నిర్మాతకు మంచి లాభాలు రావాలని ఆశిస్తున్నా" అని అన్నారు.



ఆడియో సక్సెస్ మీట్‌లో పూరి, ఆనంద్‌ప్రసాద్, మోహన్‌బాబు, బాలకృష్ణ, శ్రియ

ముఖ్య అతిథిగా హాజరైన మంచు మోహన్‌బాబు మాట్లాడుతూ "ఈ చిత్రం రూ.101 కోట్లను మించి కలెక్ట్ చేయాలని కోరుకుంటున్నాను. ప్రపంచం గర్వించదగ్గ మహానటుడు, మా అన్నయ్య ఎన్టీఆర్ కుమారుడు బాలకృష్ణకి రికార్డులు కొత్త కాదు. ఎన్నో సిల్వర్ జూబ్లీలు, గోల్డెన్ జూబ్లీలు చూశాడు. ఎప్పుడూ డబ్బులిచ్చి సినిమాలు ఆడించుకోలేదు. ఈ సినిమాలో అద్భుతంగా పాట పాడాడు. కానీ 'మావా ఏక్ పెగ్ లా' అని ఎవరిని ఉద్దేశించి అన్నాడో మరి" అని అన్నారు. క్రమశిక్షణ, అంకిత భావం ఉన్న బాలయ్యతో కలిసి పనిచేయడం ఆనందంగా ఉందని, మంచి ఆడియో రావడానికి అనూప్, భాస్కరభట్ల, పులగం చిన్నారాయణ కారణమని దర్శకుడు పూరి జగన్నాథ్ చెప్పారు.

నా ఫ్యామిలీతో యుద్ధం చేయిస్తుంటా

- రాజమౌళి

"నేను యుద్ధాలు చెయ్యను. నాకోసం నా ఫ్యామిలీతో యుద్ధం చేయిస్తుంటా" అని రాజమౌళి అన్నారు. నాగచైతన్య, లావణ్యా త్రిపాఠి జంటగా కృష్ణ మారిముత్తు దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'యుద్ధం శరణం'. కొర్రపాటి సాయి, రజనీ నిర్మాతలు. వివేక్ సాగర్ సంగీతం అందించిన పాటల్ని ఆదివారం హైదరాబాద్‌లో విడుదల చేశారు. కీరవాణి సీడీలను ఆవిష్కరించి రాజమౌళికి అందించారు. రాజమౌళి మాట్లాడుతూ "మా ఆవిడకి ఓ పట్టాన ఏదీ నచ్చదు. నా సినిమాలో అయినా పాయింట్ నచ్చకపోతే నిర్మొహమాటంగా చెబుతుంది. 'బాహుబలికి మనం ఎంత ప్రీ వర్క్ చేశామో.. కృష్ణ కూడా అంతే చేశాడు. ఈ సినిమాకు కాస్ట్యూమ్ డిజైనింగ్ చేయడం చాలా ఎగ్జైటింగ్‌గా ఉంది' అని మొదటిసారి వేరే సినిమా గురించి గొప్పగా మాట్లాడింది. అప్పుడే ఈ సినిమా మీద నమ్మకం ఏర్పడింది. ఆదివారం మధ్యాహ్నం ట్రైలర్ చూశాక ఈ సినిమా సూపర్‌హిట్ అవుతుందనిపించింది. చైతన్య కథలు ఎంచుకునే తీరు నచ్చింది. విలన్‌గా శ్రీకాంత్‌గారి గెటప్ బావుంది" అని అన్నారు. నాగచైతన్య మాట్లాడుతూ "ఓ సామాన్యుడు పవర్‌ఫుల్ విలన్‌పై ఎలా గెలిచాడు అన్నది కథ. ఇందులో హీరో ఎక్కడా వెపన్ ఉపయోగించడు. వయలెన్స్ ఉండదు. సోషల్ మీడియా, టెక్నాలజీ, ఇంటెలిజెన్స్‌ను మాత్రమే తన ఆయుధాలుగా వాడతాడు. డైరెక్టర్ కృష్ణ నా స్నేహితుడు. నాలుగో తరగతి నుంచి కలిసి చదువుకున్నాం. ఎనిమిదో తరగతిలో ఒకే అమ్మాయిని ప్రేమించాం. అక్కడ మా ఇద్దరి మధ్య యుద్ధం మొదలైంది. అప్పుడు నేనే గెలిచా. సెప్టెంబర్ 8న సినిమా రిలీజ్ యుద్ధంలో మాత్రం నా మిత్రుడే గెలవాలి" అని అన్నారు. డి.సురేశ్‌బాబు, కీరవాణి, రానా, వివేక్‌సాగర్, ఎస్.ఎస్‌కార్తికేయ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



'యుద్ధం శరణం' ఆడియో ఆవిష్కరణ దృశ్యం

అల్లరి నరేశ్, నిఖిలా విమల్



మంచి సినిమా చేశా...

"ఇంతకు ముందు 'గమ్యం'లో చేసిన గాలిశీను పాత్ర నవ్విస్తూనే ఏడిపించింది. ఆ తరహా కథ కోసం చాలా రోజులుగా ఎదురుచూస్తున్నా. మూడేళ్ల క్రితం వచ్చిన 'ఒరు వడక్కన్ సెల్ఫీ' మలయాళ చిత్రం చూశాక నాకు కావలసిన కథ దొరికిందనిపించింది. అందుకే మాతృకను డైరెక్ట్ చేసిన ప్రజిత్‌తోనే తెలుగులో రీమేక్ చేశాం" అని అల్లరి నరేశ్ అన్నారు. ఆయన కథానాయకుడిగా నటించిన చిత్రం 'మేడ మీద అబ్బాయి'. నిఖిలా విమల్ కథానాయిక. ప్రజిత్ దర్శకుడు. బొప్పన చంద్రశేఖర్ నిర్మాత. శనివారం ప్రసాద్ ప్రివ్యూ థియేటర్‌లో ట్రైలర్‌ను విడుదల చేశారు. నరేశ్ మాట్లాడుతూ "ఈ మధ్యన నా సినిమాలు మూస ధోరణిలో ఉంటున్నాయంటున్న తరుణంలో కొత్తగా ఏదన్నా చెయ్యాలనిపించి ఈ సినిమా చేశా. తెలుగు నేటివిటీకి అనుగుణంగా చిన్న మార్పులు చేశాం. మంచి సినిమా చేశాననే నమ్మకం ఉంది. హైపర్ ఆది పాత్ర ఆకట్టుకుంటుంది. నా కన్నా అతనికే మంచి పేరొస్తుంది" అని అన్నారు. 'అల్లరి', 'ప్రాణం', 'గమ్యం', 'శంభో శివ శంభో' సినిమాలను కలిపితే ఎలా ఉంటుందో ఈ సినిమా అలా ఉంటుందనీ, సెప్టెంబర్ 8న సినిమాను విడుదల చేస్తున్నామనీ నిర్మాత తెలిపారు.

ఒళ్లు గగుర్పొడిచింది

- చిరంజీవి



ఆకాశ్‌కుమార్

"ఈ మధ్యనే జయప్రద మా ఇంటికొచ్చి 'శరభ' సినిమా పోస్టర్ విడుదల చెయ్యాలని కోరారు. ఆ సందర్భంలో కొన్ని క్లిప్పింగ్స్ చూశా. యువతిగా, నడివయస్కురాలిగా తన నటన ఆకట్టుకుంది. అప్పుడే పుట్టిన తన బిడ్డను ఓ దుష్టశక్తి చంపాలనుకుంటున్న సమయంలో జయప్రద నటన చూసి ఒళ్లు గగుర్పొడిచి 'వావ్' అనకుండా ఉండలేకపోయాను" అని చిరంజీవి అన్నారు. జయప్రద ప్రధాన పాత్రలో ఆకాశ్‌కుమార్, మిస్తీ జంటగా నటిస్తున్న చిత్రం 'శరభ'. ఎన్.నరసింహారావు దర్శకుడు. సురేశ్ కపాడియా, అశ్వనికుమార్ నిర్మాతలు. శనివారం చిరంజీవి నివాసంలో ఈ చిత్రం మోషన్ పోస్టర్‌ను విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ "దైవశక్తి, దుష్టశక్తి, మానవశక్తుల మధ్య నడిచే ఈ సినిమా 'జగదేకవీరుడు అతిలోక సుందరి'ను గుర్తు చేసింది. పతాక సన్నివేశాల్లో హీరో నటన బాగుంది" అని అన్నారు. జయప్రద మాట్లాడుతూ "నా సినీ ప్రయాణంలో 'సింహాసనం', 'మేఘసందేశం'లాంటి సినిమాలతోపాటు గుర్తుండిపోయే పాత్రలెన్నో చేశా. ఈ మధ్యన చాలా అవకాశాలు వచ్చినప్పటికీ మంచి పాత్రతోనే తెరపై కనిపించాలనుకున్నా. 'శరభ' నటిగా సంతృప్తి కలిగించిన సినిమా" అని అన్నారు. "పూర్తిగా కమర్షియల్ అంశాలతో తెరకెక్కిన సోషియో ఫాంటసీ సినిమా ఇది. ఫాదర్ సెంటిమెంట్ ఆకట్టుకుంటుంది" అని దర్శకుడు తెలిపారు. అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునే చిత్రమిదని నిర్మాత సురేశ్ కపాడియా చెప్పారు. ఈ చిత్రానికి మాటలు: సాయిమాధవ్ బుర్రా, కెమెరా: రమణ సాల్వ, సంగీతం: కోటి.

కేజీ బేసిన్ గ్యాస్ ఉత్పత్తి పెంపుపై రిలయన్స్ దృష్టి

న్యూఢిల్లీ: కేజీ బేసిన్‌లోని క్షేత్రాల్లో గ్యాస్ ఉత్పత్తి మరింత పెంచేందుకు రిలయన్స్ ఇండస్ట్రీస్ సిద్ధమవుతోంది. ఇందులో భాగంగా ఈ ప్రాంతంలోని ఎంజె-1 క్షేత్రంలో గ్యాస్ ఉత్పత్తి చేపట్టాలని రిలయన్స్, బ్రిటిష్ పెట్రోలియం, కెనడాకు చెందిన నికో సంస్థలు నిర్ణయించాయి. ఈ క్షేత్రంలో 0.988 శతకోటి ఘనపుటడుగుల (టిసిఎఫ్) గ్యాస్ నిక్షేపాలున్నట్టు అంచనా. ప్రస్తుతం రిలయన్స్ గ్యాస్ ఉత్పత్తి చేస్తున్న కేజీ-డి6 బ్లాక్‌కు ఎంజె-1 2,000 మీటర్ల దూరంలో ఉంది. ఉత్పత్తికి సమీపంలోనే సముద్రంలో ఫ్లోటింగ్ ప్రొడక్షన్ స్టోరేజ్ అండ్ ఆఫ్ లోడింగ్ (ఎఫ్‌పిఎస్‌ఒ) ఏర్పాటు చేసి ఇందుకు ఉపక్రమించాలని రిలయన్స్ భావిస్తోంది. ఈ పద్ధతిలో ముందుగా గ్యాస్‌ను బయటికి తీసి అక్కడే ప్రాసెస్ చేసి పైప్‌లైన్ ద్వారా తీర ప్రాంతానికి చేరవేస్తారు. కొత్తగా అభవృద్ధి చేసే క్షేత్రాల నుంచి ఉత్పత్తి చేసే ఒక మిలియన్ బ్రిటిష్ థర్మల్ యూనిట్ (ఎంబిటియు) గ్యాస్ ధరను 5.56 డాలర్లుగా ప్రభుత్వం నిర్ణయించింది.


సామ్‌సంగ్‌పై పెరగనున్న

విదేశీ పెత్తనం

- అగమ్య గోచరంగా మారిన భవిష్యత్

ముంబై: ఎంత మంచి గుర్రమైన సరైన రౌతు ఉన్నంత వరకే సరిగ్గా స్వారీ చేస్తుంది. లేకపోతే అడ్డదిడ్డంగా పరుగెడుతుంది. వ్యాపార సంస్థలకూ ఇది వర్తిస్తుంది. ప్రస్తుతం దక్షిణ కొరియాకు చెందిన ఎలక్ట్రానిక్ దిగ్గజం శామ్‌సంగ్ గ్రూపుదీ ఇదే పరిస్థితి. అవినీతి, నిధుల దుర్వినియోగం ఆరోపణలపై గ్రూప్ వారసుడు లీ జే యాంగ్‌కి ఐదేళ్ల జైలు శిక్ష పడడంతో, ఇప్పుడు ఆ గ్రూపు భవిష్యత్తూ అగమ్య గోచరంగా మారింది. సందట్లో సడేమియాలా దీన్ని అలుసుగా తీసుకుని సామ్‌సంగ్ గ్రూప్ కంపెనీల ఈక్విటీలో చెప్పుకోదగ్గ స్థాయిలో వాటాలు ఉన్న విదేశీ సంస్థలు కంపెనీపై తమ పట్టు మరింత బిగించే ప్రమాదం కనిపిస్తోంది. ముఖ్యంగా సామ్‌సంగ్ ఎలక్ట్రానిక్స్ ఈక్విటీలో వాటా ఉన్న విదేశీ హెడ్జ్ ఫండ్లు డివిడెండ్ కోసం పట్టుపట్టే ప్రమాదం ఉందని భావిస్తున్నారు. అమెరికాకు చెందిన ఇల్లియట్ మేనేజ్‌మెంట్ అనే హెడ్జ్ ఫండ్ గత సంవత్సరమే ఇందుకోసం పట్టుపట్టింది. అయితే ప్రమోటర్ల కుటుంబం తకున్న వాటాలో 44 బిలియన్ డాలర్ల విలువైన షేర్లను వదులుకుని షేర్ వాల్యూ పెంచడంతో ఆ వివాదం సర్దుకుంది. లీ జే యాంగ్ జైలు ఊచలు లెక్కపెట్టడం ఖాయమవడంతో ఇప్పుడు ఈ హెడ్జ్ సంస్థలు, సావరిన్ వెల్త్ ఫండ్లు డివిడెండ్‌తోపాటు గ్రూప్ కంపెనీల డైరెక్టర్ల ఎంపిక, వ్యాపార విధానాల్లోనూ వేలు పెడతాయని భావిస్తున్నారు. గ్రూప్ కంపెనీల పాలన ఎంత మంచి సిఇఒల పాలనలో ఉన్నా వారు కీలక నిర్ణయాలు అంత త్వరగా తీసుకునే అవకాశం లేదు. లీ తండ్రి కున్ హీ ప్రస్తుతం అనారోగ్యంతో మంచం పట్టారు. కాబట్టి ఆయన మరోసారి చురుగ్గా సాంసంగ్ వ్యాపార కార్యకలాపాలు నెత్తికెత్తుకునే అవకాశం లేదు. ప్రస్తుతం టెక్నాలజీ వేగంగా మారిపోతోంది. స్మార్ట్‌ఫోన్లతో సహా అనేక రంగాల్లో చైనా కంపెనీల నుంచి శామ్‌సంగ్ తీవ్ర పోటీ ఎదుర్కొంటోంది. ఈ నేపథ్యంలో కొత్త కంపెనీల కొనుగోలు, టేకోవర్లపై ఎప్పటికప్పుడు వేగంగా నిర్ణయాలు తీసుకోవాలి. సరైన రథసారథి లేకపోతే ఇవన్నీ జరిగే విషయాలు కావు. ఈ సంక్షోభం నుంచి సామ్‌సంగ్ ఎలా బయటపడుతుందో వేచి చూడాల్సిందే.

రిటైల్ (ఒక గుడ్డు) ధర రూ. 4.15	నెక్ (100 గుడ్లు)		
హైదరాబాద్	355.00	వరంగల్	357.00
విజయవాడ	359.00	చెన్నై	397.00
గోదావరి	359.00	నమక్కల్	387.00
బెంగళూరు	382.00	చిత్తూరు	390.00
విశాఖపట్నం	362.00	ముంబై	400.00



బ్యాంకు విలీనాలకు ఆర్థిక సహాయం

ఆర్థిక శాఖ సూత్రప్రాయ సంసిద్ధత



న్యూఢిల్లీ: బ్యాంకింగ్ రంగంలో కన్సాలిడేషన్‌కు మార్గం సుగమం చేస్తూ ప్రభుత్వరంగ బ్యాంకులకు మూలధన మద్దతు అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్టు ఒక అధికారి చెప్పారు. బ్యాంకులు మొండిబకాయిల ఊబిలో కూరుకుపోయి గుక్క తిప్పుకోలేని స్థితిలో ఉన్న నేపథ్యంలో ప్రభుత్వం ఈ నిర్ణయానికి వచ్చిందని ఆయన అన్నారు. బ్యాంకుల విలీనాల అంశాన్ని ప్రత్యామ్నాయ యంత్రాంగానికి (ఎఎం) అప్పగించేందుకు కేంద్ర కేబినెట్ గత వారంలో జరిగిన సమావేశంలో నిర్ణయించిన విషయం విదితమే. ఆర్థిక మంత్రి సారథ్యంలోని ఈ మంత్రుల స్థాయి కమిటీ కన్సాలిడేషన్ ప్రక్రియను వేగవంతం చేస్తుంది. ఆస్తుల నాణ్యతపరంగా ఒత్తిడి ఎదుర్కొంటున్న బ్యాంకుల నుంచి విలీనం కోసం ప్రతిపాదనలు అందిన అనంతరం ఆ విలీనం వల్ల శక్తివంతమైన బ్యాంకు ఏర్పడుతుందని భావించినట్టయితే నిధుల కొరత ఆ విలీనానికి అవరోధం కాకుండా చూడాలన్నది ప్రభుత్వ లక్ష్యమని ఆ అధికారి తెలిపారు. అలాంటి ప్రతిపాదన లాభదాయకమే అని ఎఎం భావించినట్టయితే కొనుగోలు చేస్తున్న బ్యాంకుకు అవసరం అయిన ఆర్థిక సహాయం ప్రభుత్వం అందిస్తుందని ఆయన వివరించారు. అయితే విలీనం ప్రతిపాదన తొలుత బ్యాంకు బోర్డు నుంచే రావాలని పేరు వెల్లడించడానికి నిరాకరించిన అధికారి అన్నారు.

వచ్చే మార్చి చివరికల్లా కనీసం ఇలాంటి ఒక విలీనం ప్రతిపాదన అయినా ఫలవంతం కావాలని ప్రభుత్వం భావిస్తున్నదని ఆ వర్గాలు తెలిపాయి. ఇటీవలే అనుబంధ బ్యాంకులన్నింటినీ విలీనం చేసుకుని ప్రపంచంలోని అతిపెద్ద బ్యాంకుల్లో ఒకటిగా మారిన ఎస్‌బిఐ మినహా దేశంలో ప్రస్తుతం 20 పిఎస్‌బిలున్నాయి. వాటి మొండి బకాయిల పరిమాణం ఆరు లక్షల కోట్ల రూపాయలు. ఈ బ్యాంకులను ఆరేడు పెద్ద బ్యాంకులుగా మార్చినట్టయితే ఈ ఎన్‌పిఎల సమస్యను సమర్థవంతంగా ఎదుర్కొనడంతో పాటు బ్యాంకింగ్‌లో పోటీని కూడా దీటుగా ఎదుర్కొనేందుకు వీలు కలుగుతుందని, తద్వారా ప్రభుత్వ ఖజానాపై భారం సైతం తగ్గుతుందని ప్రభుత్వం భావిస్తోంది. సూత్రప్రాయంగా బ్యాంకు బోర్డుల నుంచి వచ్చిన ప్రతిపాదనకు ఎఎం ఆమోదం తెలిపినట్టయితే ఆ తర్వాత చట్టం, సెబి నిబంధనలకు అనుగుణంగా ఆయా బ్యాంకులు తగు చర్యలు తీసుకోవలసి ఉంటుంది. ఆ తర్వాత తుది ప్రతిపాదనను కేబినెట్ ఆమోదిస్తుంది. ఒక పెద్ద బ్యాంకు బలహీనమైన బ్యాంకును కొనుగోలు చేయాలన్న నియమం ఏదీ లేదని, ఒక పెద్ద బ్యాంకుగా అవతరించి గట్టి పోటీ ఇవ్వగల సామర్థ్యాలుంటే రెండు, మూడు చిన్న బ్యాంకులు కూడా విలీనం కావచ్చునని అధికార వర్గాలవారంటున్నారు.

బ్యాంకింగ్ నియంత్రణల చట్టం నోటిఫికేషన్

మొండి బకాయిల వసూలు కోసం ఇన్‌సాల్వెన్సీ ప్రక్రియ చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని బ్యాంకులకు ఆదేశాలు జారీ చేసే అధికారాలు ఆర్‌బిఐకి దఖలుపరిచే బ్యాంకింగ్ నియంత్రణల (సవరణ) చట్టాన్ని ప్రభుత్వం నోటిఫై చేసింది. ఈ నెల ప్రారంభంలో పార్లమెంటు ఈ చట్టాన్ని ఆమోదించింది. ఇప్పటివరకు అమలులో ఉన్న ఆర్డినెన్స్ స్థానంలో ఈ చట్టం అమలులోకి వచ్చింది. ఆర్డినెన్సు అమలులో ఉన్న సమయంలోనే ఆర్‌బిఐ ఐదు వేల కోట్ల రూపాయలకు పైగా బకాయిలున్న 12 ఎన్‌పిఏ ఖాతాలను ఇన్‌సాల్వెన్సీ కింద చర్యల కోసం ఆర్‌బిఐ గుర్తించింది.

ఎస్‌యువిలు, కార్లపై పెరగనున్న

జిఎస్‌టి సెస్

ఈ వారమే ఆర్డినెన్స్‌పై కేంద్ర కేబినెట్ నిర్ణయం

న్యూఢిల్లీ: కార్లు మరింత ప్రియం కాబోతున్నాయి. పెద్ద, మధ్య రకం కార్లతోపాటు, ఎస్‌యువిలపై ప్రస్తుతం 15 శాతంగా ఉన్న జిఎస్‌టి సెస్‌ను 25 శాతానికి పెంచేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఇందుకోసం జారీ చేసే ఆర్డినెన్స్‌పై కేంద్ర కేబినెట్ ఈ వారమే నిర్ణయం తీసుకుంటుందని భావిస్తున్నారు. ఇందుకు ఈ నెల 5న జరిగిన జిఎస్‌టి మండలి సమావేశం ఇప్పటికే ఆమోదం తెలిపింది. ఏదైనా ఒక వస్తువు లేదా వస్తువులపై జిఎస్‌టి సెస్ పెంచాలన్నా, తగ్గించాలన్నా 'జిఎస్‌టి (రాష్ట్రాలకు నష్ట పరిహారం) చట్టం, 2017'ను సవరించాలి. ప్రస్తుతం పార్లమెంట్ సమావేశంలో లేకపోవడంతో జిఎస్‌టి మండలి నిర్ణయాన్ని ఆర్డినెన్స్ ద్వారా అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. జిఎస్‌టికి ముందు ఆటోమొబైల్ వాహనాలపై పన్నుల భారం 52 నుంచి 54.72 శాతం వరకు ఉండేది. జిఎస్‌టి అమలులోకి వచ్చాక 28 శాతం జిఎస్‌టి, 15 శాతం సెస్సుతో ఇది 43 శాతానికి తగ్గింది. దీంతో దాదాపు అన్ని ఆటోమొబైల్ కంపెనీలు తమ ఎస్‌యువిల ధరను రూ.లక్ష నుంచి రూ.3 లక్షల వరకు తగ్గించాయి.

విలాస వస్తువులైన వీటిని పన్నుల భారం తగ్గించాల్సిన అవసరం ఏమొచ్చిందని విమర్శలు రావడంతో వీటిపై సెస్ భారాన్ని 15 నుంచి 25 శాతానికి పెంచాలని జిఎస్‌టి మండలి నిర్ణయించింది. దీనిపై ఆటోమొబైల్ కంపెనీలు ఇప్పటికే అసంతృప్తి వ్యక్తం చేశాయి. అయినా సరే దీనిపై ముందుకెళ్లాలని ప్రభుత్వం నిర్ణయించింది. వచ్చే నెల 9న హైదరాబాద్‌లో జరిగే జిఎస్‌టి మండలి సమావేశంలోనూ దీనిపై చర్చ జరిగే అవకాశం ఉంది.

జెమ్స్ అండ్ జువెలరీ పరిశ్రమపై నిఘా

విలువైన రాళ్లు, నగల పరిశ్రమ (జెమ్స్ అండ్ జువెలరీ) పరిశ్రమలో అక్రమ నగదు లావాదేవీలు జరగకుండా అడ్డుకోవడంపైనా ప్రభుత్వం దృష్టి పెట్టింది. ఇందుకోసం డైరెక్టర్ జనరల్ ఆఫ్ గూడ్స్ అండ్ సర్వీసెస్ ఇంటలిజెన్స్ (డిజిజిఎస్‌టిఐ)ని నియంత్రణ సంస్థ (రెగ్యులేటర్)గా నియమించింది. అక్రమ నగదు లావాదేవీల నియంత్రణ చట్టం (పిఎంఎల్) ప్రకారం కంపెనీలు లేదా వ్యక్తులు రూ.10 లక్షలకు మించిన ఆర్థిక లావాదేవీల వివరాలు, విదేశాలకు రూ.5 లక్షలకు మించి పంపే నగదు, రూ.50 లక్షలు లేదా అంత కంటే ఎక్కువ విలువైన స్థిర, చరాస్తుల కొనుగోలు వివరాల రికార్డులు తప్పకుండా నిర్వహించాలి.

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ.		వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్	
హైదరాబాద్	82.00	గోదావరి	84.00
కరీంనగర్	82.00	విజయవాడ	84.00
వరంగల్	82.00	గుంటూరు	84.00
మహబూబ్‌నగర్	82.00	ఒంగోలు	86.00
కర్నూలు	82.00	చిత్తూరు	83.00
విశాఖపట్నం	79.00	నెల్లూరు	83.00




9900 పైన స్వల్పకాలిక అప్‌ట్రెండ్



వి. సుందర్ రాజా

నిఫ్టీ మైనర్ రికవరీ, సైడ్‌వేస్ ధోరణిలో ట్రేడయింది. పరిధి 9900-9750కే పరిమితం అయింది. కాని వారం మొత్తానికి పాజిటివ్ ధోరణిలో నిలకడగా ముగిసింది. రానున్న కొద్ది రోజుల్లో స్వల్పకాలిక అప్‌ట్రెండ్‌ను ధ్రువీకరించడానికి మరింత బలాన్ని ప్రదర్శించాల్సి ఉంది. గత రెండు వారాల కదలికలు కూడా పరిమితంగానే ఉన్నాయి. తాజా కదలికపై స్పష్టత కోసం బ్రేకౌట్ తప్పనిసరి. 50 డిఎంఏ వద్ద రికవరీ సాధించడం కూడా సానుకూల సంకేతం. ప్రస్తుతం స్వల్పకాలిక నిరోధ స్థాయి 9900 వద్ద కీలకంగా నిలిచి ఉంది.



బుల్లిష్ స్థాయిలు...

మార్కెట్ పాజిటివ్‌గా ప్రారంభమైతే కీలక నిరోధం 9900 వద్ద పరీక్ష ఎదుర్కొనవచ్చు. మరింత అప్‌ట్రెండ్ కోసం ఇటీవల సాధించిన ఈ మైనర్ గరిష్ఠ స్థాయి కన్నా పైన నిలదొక్కుకోవాలి. తదుపరి ప్రధాన నిరోధం 10000. గత నెలలో ఇక్కడే ప్రధాన కన్సాలిడేషన్ చోటు చేసుకుంది. ఈ సారి కూడా ఇక్కడ మేజర్ కన్సాలిడేషన్‌కు ఆస్కారం ఉంది. అంతకన్నా పైన కనీసం రెండోరోజుల పాటు క్లోజయినప్పుడే స్వల్పకాలిక అప్‌ట్రెండ్ ఉంటుంది.

బేరిష్ స్థాయిలు...

ప్రధాన మద్దతు స్థాయి 9800. గత కొద్ది రోజులుగా ఈ స్థాయిలో రికవరీ సాధిస్తోంది. మరింత కరెక్షన్‌లో పయనించినా భద్రతకోసం ఇక్కడ రికవరీ తప్పనిసరి. అంతకన్నా దిగువన క్లోజయితే మరింత బలహీనత సంకేతం ఇస్తుంది. దిగువ టార్గెట్లు 9700, 9500.

- బ్యాంక్ నిఫ్టీ మద్దతు స్థాయి 24000 వద్ద రికవరీ సాధించింది. రికవరీని కొనసాగిస్తే స్వల్పకాలిక అప్‌ట్రెండ్ కోసం ప్రధాన నిరోధం 24500 కన్నా పైన బలంగా క్లోజ్ కావాలి. 24000 కన్నా దిగజారితే స్వల్పకాలిక కరెక్షన్ ముప్పు ఎదుర్కొంటుంది.

స్వల్పకాలిక వ్యూహం: 9900 వద్ద బలంగా కన్సాలిడేట్ అయినప్పుడే గట్టి స్టాప్ లాస్‌తో స్వల్పకాలిక ట్రేడర్లు స్వల్పకాలిక బై పొజిషన్లు పరిశీలించవచ్చు.

పాటర్న్: మార్కెట్ ప్రస్తుతం స్వల్పకాలిక 20 డిఎంఏ వద్ద పరీక్ష ఎదుర్కొనబోతోంది. 9900 వద్ద అడ్డంగా కనిపిస్తున్న రెసిస్టెన్స్ ట్రెండ్‌లైన్ వద్ద నిలదొక్కుకుంటే మరింత అప్‌ట్రెండ్‌లో పురోగమిస్తుంది. అలాగే ఏటవాలుగా ఎగువకు కనిపిస్తున్న రెసిస్టెన్స్ ట్రెండ్‌లైన్ కన్నా పైనే ఉండడం ట్రెండ్‌లో సానుకూలతను సూచిస్తోంది. అంతే కాదు ప్రస్తుతం నిఫ్టీ దిగువకు ఏటవాలుగా కనిపిస్తున్న ట్రెండ్‌లైన్ వద్ద కీలకంగా నిలిచింది. అప్‌ట్రెండ్ కోసం ఈ రేఖను దాటాలి.

టైమ్: ఈ సూచిక ప్రకారం సోమ, గురువారాల్లో తదుపరి రివర్సల్స్ ఉన్నాయి.

సోమవారం స్థాయిలివే:

నిరోధం : 9900,9960 మద్దతు : 9850, 9800

వి.సుందర్ రాజా,
www.sundartrends.in

ఫ్యూచర్ షార్ట్ టర్మ్ ట్రేడింగ్ గైడ్

గోద్రెజ్ కన్స్యూమర్ (రూ.918) - కొనుగోలు స్థాయిలకు చేరువలో..

రూ.915 ఎగువన అప్‌ట్రెండ్ మొదటి నిరోధం రూ.950 రెండో నిరోధం రూ.990
రూ.900 దిగువన డౌన్‌ట్రెండ్ మొదటి మద్దతు రూ.870 రెండో మద్దతు రూ.840

జెట్ ఎయిర్‌వేస్ (రూ.575) - కొనుగోలు స్థాయిలకు చేరువలో..

రూ.580 ఎగువన అప్‌ట్రెండ్ మొదటి నిరోధం రూ.605 రెండో నిరోధం రూ.630
రూ.560 దిగువన డౌన్‌ట్రెండ్ మొదటి మద్దతు రూ.540 రెండో మద్దతు రూ.520

2020నాటికి రూ. 50,000 కోట్ల టర్నోవర్

- లలితా జువెలర్స్ సిఎండి కిరణ్ కుమార్ వెల్లడి
- త్వరలో విజయవాడ, రాజమహేంద్రవరంలో..



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ప్రముఖ జువెలరీ సంస్థ లలితా జువెలర్స్.. ఆంధ్రప్రదేశ్‌లో మరో రెండు షోరూమ్‌లు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. రాజమహేంద్రవరం, నవ్యాంధ్ర రాజధాని సమీపంలోని విజయవాడ నగరాల్లో ఈ రెండు షోరూమ్‌లు ఏర్పాటు కానున్నాయి. హైదరాబాద్‌లోని సోమాజీగూడలో 1.3 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ప్రపంచంలోనే అతి పెద్ద నగల షోరూమ్ ఏర్పాటు చేసిన సందర్భంగా జరిగిన విలేకరుల సమావేశంలో కంపెనీ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కిరణ్ కుమార్ ఈ విషయం వెల్లడించారు. వచ్చే మార్చి నాటికి ఈ రెండు షోరూమ్‌ల ఏర్పాటు పూర్తవుతుంది చెప్పారు. లలితా జువెలరీ సంస్థ ఇప్పటికే ఏపిలోని తిరుపతి, వైజాగ్ నగరాల్లో రెండు షోరూమ్‌లు నిర్వహిస్తోంది. '1,000 రూపాయలు మొదలుకొని కోటి రూపాయల విలువైన బంగారు ఆభరణాలు, మూడు కోట్ల రూపాయల విలువైన వజ్రాభరణాలు మా షోరూమ్స్‌లో లభిస్తాయి' అని కిరణ్ కుమార్ చెప్పారు. సోమాజిగూడ షోరూమ్ కోసం కంపెనీ రూ.700 కోట్లు ఖర్చుతో ఏర్పాటు చేసింది. మరో రెండు నెలల్లో కూకట్‌పల్లిలో ఇంకో షోరూం ఏర్పాటు చేయబోతున్నట్టు కిరణ్ కుమార్ వెల్లడించారు. 'మా షోరూమ్స్‌లో అతి తక్కువ మేకింగ్ చార్జీలతో అన్ని రకాల నగలు లభిస్తాయి. మా అంత తక్కువ ధరలకు మరెవ్వరూ నగలు అమ్మలేరు' అన్నారు.

రూ.15,000 కోట్ల టర్నోవర్..

లలితా జువెలర్స్ గత ఆర్థిక సంవత్సరం రూ.11,000 కోట్ల టర్నోవర్ సాధించింది. ఈ సంవత్సరం ఇది రూ.15,000 కోట్ల వరకు ఉంటుందని అంచనా వేస్తోంది. మరో మూడేళ్లలో (2020) రూ.50,000 కోట్ల టర్నోవర్ సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు కిరణ్ కుమార్ చెప్పారు. జిఎస్‌టి అమలుతో నగల వ్యాపారానికి ఎలాంటి ఇబ్బందులు లేవన్నారు. నిజానికి జిఎస్‌టితో వ్యాపార లావాదేవీల్లో పూర్తి పారదర్శకత ఏర్పడిందన్నారు. దీనివల్ల రాష్ట్రాల పన్ను రాబడి పెరుగుతుందన్నారు.

స్క్రిప్ ఆధారిత కదలికలు

(ఆగస్టు 27-సెప్టెంబర్ 1 తేదీల మధ్య వారానికి)

గత వారం నిఫ్టీ : 9857 (+20)

ఆస్ట్రో గైడ్



డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

నిఫ్టీ గత వారం 9884-9740 పాయింట్ల మధ్యన పరిమిత పరిధిలో కదలాడి 20 పాయింట్ల లాభంతో (సుమారు 0.20 శాతం) వారం గరిష్ఠ స్థాయి 9857 వద్ద స్వల్ప పాజిటివ్ దృక్పథంతో ముగిసింది.

- స్వల్పకాలిక ధోరణి బలహీనంగా మారింది. మధ్య, దీర్ఘకాలిక ధోరణులు రెండింటిలోనూ బుల్లిష్‌గానే ఉంది. 9975 కన్నా పైన ముగిసినప్పుడే తిరిగి బుల్లిష్ అవుతుంది.
- 20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 9926, 9805, 9597, 9050 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి.
- నిఫ్టీ ప్రస్తుతం 20 డిఎంఏల కన్నా దిగువకు వచ్చింది. కాని 200 డిఎంఏ కన్నా 50 డిఎంఏ పైన ఉండడందీర్ఘకాలిక ట్రెండ్ బుల్లిష్‌గా ఉందనేందుకు ఇది సంకేతం.

వారానికి బ్రేకౌట్ స్థాయి: 9975
బ్రేక్‌డౌన్ స్థాయి : 9725

ఇన్వెస్టర్లకు సూచన

వారం ప్రారంభ స్థాయి అత్యంత కీలకం. ఇండెక్స్ గత వారం ప్రారంభ స్థాయి కన్నా పైన ట్రేడవుతూ ఉంటే లాంగ్ పొజిషన్లను పరిశీలించవచ్చు.

నిరోధ స్థాయిలు : 10005, 10080 (9930 పైన బుల్లిష్)
మద్దతు స్థాయిలు : 9710, 9635 (9785 దిగువన బేరిష్)

గ్రహగతులివే..

- తులలోని విశాఖ పాదం 3 నుంచి ధనుస్సులోని పూర్వాషాఢ పాదం 2 మధ్యలో చంద్ర సంచారం
- సింహంలోని మఖ పాదం 4 నుంచి పుబ్బ పాదం 1 మధ్యలో రవి సంచారం
- సింహంలోని మఖ పాదం 2,3 మధ్యలో వక్రగతిలో బుధ సంచారం
- కర్కాటకంలోని పుష్యమి పాదం 2,3 మధ్యలో శుక్ర సంచారం
- కర్కాటకంలోని మఖ పాదం 1లో నీచస్థితిలో కుజ సంచారం
- వృశ్చికంలోని జ్యేష్ఠ పాదం 4లో మీన నవాంశలో వక్రగతిలో శని సంచారం
- కన్యలోని చిత్త పాదం 2లో కన్య వర్గోత్తమలో బృహస్పతి సంచారం
- కర్కాటకంలో రాహువు, మకరంలో కేతువు మీన, కన్య నవాంశల్లో సంచారం

ద్వితీయార్థం మెరుగు

(సోమవారానికి)

తిథి: భాద్రపద శుద్ధ సప్తమి
నక్షత్రం: విశాఖ

అశ్విని, మఖ, మూల నక్షత్ర జాతకులు, వృశ్చిక, మీన రాశుల వారు అప్రమత్తంగా ఉండాలి.

ట్రెండ్ మార్పు వేళలు: 1.28, 3.08

ధోరణి: గ్రహగతులను బట్టి నిస్తేజంగా ప్రారంభమై మధ్యాహ్న ఒంటి గంట నుంచి 3.15 మధ్యలో మెరుగ్గా ట్రేడ్ కావచ్చు.

ట్రేడింగ్ వ్యూహం: నిఫ్టీ ఫ్యూచర్స్ 10.45 సమయానికి ప్రారంభ స్థాయి/సగటు (ఎటిపి)కన్నా దిగువన ట్రేడవుతుంటే తగు స్టాప్‌లాస్‌తో షార్ట్ పొజిషన్లు తీసుకుని 12.45 సమయానికి క్లోజ్ చేసుకోవాలి. ఒంటి గంట తర్వాత ఎటిపికన్నా పైకి వస్తే లాంగ్ పొజిషన్లు తీసుకుని 3.15 సమయానికి క్లోజ్ చేసుకోవాలి.

నిరోధ స్థాయిలు: 9895, 9930,
మద్దతు స్థాయిలు: 9815, 9780

గమనిక: ఇది పూర్తిగా ఆస్ట్రోటెక్నికల్ అంశాల ఆధారంగా ఇచ్చిన సూచన. మార్కెట్ వాస్తవిక కదలికల ఆధారంగా నిర్ణయాలు తీసుకోవాలి.

ఇన్ఫోసిస్

మార్కెట్ స్ట్రాటజి

దేశంలోనే రెండో అతిపెద్ద ఐటి కంపెనీ ఇన్ఫోసిస్‌లో ఇటీవలి కాలంలో చోటు చేసుకున్న సంక్షోభంతో షేరు ధర భారీగా పతనమైంది. విశాల్ సిక్కా నిష్క్రమణతో బోర్డు సభ్యులకు ఫౌండర్స్‌కు మధ్య గొడవ తారా స్థాయికి చేరింది. చివరకు నందన్ నీలేకని రాకతో ఇన్ఫోసిస్ బోర్డులో నూతన ఉత్తేజం నెలకొంది. దీంతో షేరు ధరలో పెరుగుదల చోటు చేసుకోవచ్చని అంచనా. ఈ పరిణామాన్ని దృష్టిలో పెట్టుకుని ఈ వారం ఇన్ఫోసిస్‌కు సంబంధించిన వ్యూహం ఇస్తున్నాం. ఇది ఈ నెల 31 వరకు మాత్రమే. ఇందులో ఇన్ఫోసిస్ 920 రూపాయల కాల్ 18 రూపాయల్లో ఒక లాట్ కొనుగోలు చేయాలి. దీంతోపాటు 940 రూపాయల కాల్ ఒక లాట్ 11 రూపాయల్లో షార్ట్ చేయాలి. లేదా ఇవే ధరలు అందుబాటులోకి లేకుంటే రెండింటి మధ్య వ్యత్యాసం 7 రూపాయలు లేదా అంతకంటే తక్కువ ఉండేట్లు వ్యూహాన్ని అమలుపరచవచ్చు. ఆగస్టు 31 నాటికి ఇన్ఫోసిస్ షేరు 927 రూపాయల ఎగువన ముగిస్తే ట్రేడర్లు లాభంలో ఉంటారు. ఈ వ్యూహంలో వచ్చే గరిష్ఠ లాభం 6,500 రూపాయలు కాగా గరిష్ఠ నష్టం 3,500 రూపాయలు.

- రాంబాబు

ఆటుపోట్ల వారం

మార్కెట్ నాడి

"మార్కెట్ కదలికలను ప్రభావితం చేసే ఎన్నో కీలక సంఘటనలు ఈ వారంలో చోటు చేసుకోబోతున్నాయి. అవి అందించే సంకేతాలే మార్కెట్ దిశను నిర్దేశిస్తాయి".



విజయ్ సింఘానియా
డైరెక్టర్, ట్రేడ్‌స్మార్ట్ ఆన్‌లైన్

ఆగస్టు నెలకు ఫ్యూచర్స్ కాంట్రాక్టుల ముగింపు గురువారం ఉండడం వల్ల ఈ వారం మార్కెట్ ఆటుపోట్లు సాధించే అవకాశం ఉంది. జూలై నెల విత్తలోటు, మొదటి త్రైమాసికం జిడిపి గణాంకాలు వంటివి ఈ వారంలోనే ప్రభుత్వం ప్రకటించనుంది. అలాగే ఆగస్టు నెల పిఎంఐ గణాంకాలను మార్కిట్ ఎకనామిక్స్ శుక్రవారం విడుదల చేయనుంది. అలాగే సేవల రంగం పిఎంఐ కూడా ఈ వారంలో విడుదల కానుంది. ఆగస్టు నెల ఆటో అమ్మకాల గణాంకాలు కూడా శుక్రవారం వెలువడనున్నాయి. ఇక ప్రపంచ ఆర్థిక స్థితిపై సమీక్షించేందుకు అమెరికన్ ఫెడరల్ రిజర్వ్ ఛైర్ పర్సన్ జానెట్ ఎల్లెన్‌తో పాటు 40 మంది వరకు కేంద్ర బ్యాంకర్లు ఈ వారంలో సమావేశం కానున్నారు. కాన్సస్ నగరంలో ఈ సమావేశాన్ని అమెరికన్ ఫెడరల్ రిజర్వ్ నిర్వహిస్తోంది. ఇక ఈ వారంలో విడుదల కానున్న ఇతర గణాంకాల్లో అమెరికా వ్యవసాయేతర నిరుద్యోగిత డేటా, క్యు2 జిడిపి (బుధవారం), అమెరికాలో ఇళ్ల అమ్మకాల గణాంకాలు (గురువారం) ఉన్నాయి.

బ్యాంకుల అండతో పునరుజ్జీవం...

నాలుగు రోజులే ట్రేడింగ్ దినాలున్న గత వారంలో మార్కెట్ గత ఆటుపోట్లతో నడిచింది. ప్రధానంగా దేశంలోని ఐటి దిగ్గజం ఇన్ఫోసిస్ సృష్టించిన సంక్షోభం వల్ల వారం ప్రారంభంలో మార్కెట్‌ను భారీగా కుంగదీసింది. మరోపక్క అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రకటనలు కూడా మార్కెట్లన్నింటినీ అప్రమత్తంగా ఉండేలా చేశాయి. ఫలితంగా దేశీయ మార్కెట్‌లో విదేశీ ఇన్వెస్టర్లు నిరంతర అమ్మకాలు సాగించారు. అయితే బ్యాంకుల కన్సాలిడేషన్ దిశగా ప్రభుత్వం తీసుకున్న చర్యతో బ్యాంకు షేర్లలో కదలిక ఏర్పడి వారాంతంలో మార్కెట్ పునరుజ్జీవం సాధించింది. రానున్న కాలంలో బ్యాంకులే మార్కెట్ ర్యాలీకి అండగా నిలిచే ఆస్కారం ఉంది.

టెక్నికల్స్ ఇవే...

ఫార్మా, బ్యాంకింగ్, మెటల్ స్టాక్‌లు అందించిన మద్దతుతో మార్కెట్ గత వారం ఒక మోస్తరు లాభాలతో క్లోజయింది. అయితే 9950 వద్ద నిఫ్టీకి గట్టి నిరోధం ఉంది. కీలక మద్దతు స్థాయి 9780. అయితే బ్యాంక్ నిఫ్టీ డెయిలీ చార్టుల్లో క్షీణత దశను బ్రేక్ చేసింది. తక్షణ నిరోధం 24,500. దీన్ని దాటితే 25000 దిశగా ర్యాలీ కొనసాగుతుంది. 24,100 వద్ద కీలక మద్దతు ఉంది.

ఆంధ్రజ్యోతి
బిజినెస్ Plus
28-8-2017 సోమవారం

దివాన్ హౌజింగ్ ఫైనాన్స్

DHFL
Changing Rules Changing Lives

షేర్ షాట్

మార్కెట్లు అనిశ్చితిలోకి జారుకున్నప్పుడు ఇన్వెస్టర్లు అయోమయానికి లోనవుతుంటారు. ఈ అనిశ్చిత పరిస్థితుల్లో ఇన్వెస్టర్ల కోసం టెక్నికల్, ఫండమెంటల్స్‌తో పెరుగుదలకు ఆస్కారం కలిగిన స్క్రిప్‌లను అసోసియేషన్ ఆఫ్ టెక్నికల్ మార్కెట్ ఎనలిస్ట్, హైదరాబాద్ చాప్టర్ హెడ్ టి బ్రహ్మచారి ప్రతి వారం ఆంధ్రజ్యోతి 'బిప్లస్' పాఠకులకు సిఫారసు చేయనున్నారు.

దేశంలో మూడో అతిపెద్ద హౌజింగ్ ఫైనాన్స్ కంపెనీ ఇది. 2017 ఆర్థిక సంవత్సరంనాటికి మొత్తం 83,560 కోట్ల రూపాయల రుణ ఆస్తులతో (ఎయుఎం) మధ్య, దిగువ మధ్య తరగతి ప్రజలకు రుణాలను అందిస్తోంది. మెట్రో నగరాలకన్నా చిన్న నగరాలు, పట్టణాల్లో ఎక్కువగా దృష్టిసారిస్తూ వస్తున్నది. దేశవ్యాప్తంగా 353 శాఖల ద్వారానేకాకుండా లండన్, దుబాయ్‌లలోని కార్యాలయాలతో విదేశీ వినియోగదారులకు కూడా సేవలు అందిస్తోంది.

ఇక ఫండమెంటల్స్ విషయానికొస్తే.. 2017 ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో 261 కోట్ల రూపాయల నికర లాభాన్ని ప్రకటించింది. ఇది గత ఏడాది ఇదే కాలంతో పోల్చితే 29.3 శాతం అధికం. 23 శాతం వృద్ధితో 2,408 కోట్ల రూపాయల ఆదాయాన్ని నమోదు చేసుకుంది. రుణ వితరణ 32.5 శాతం పెరిగిన కారణంగా ఈ ఫలితాలను ప్రకటించగలిగింది. అలాగే ఇపిఎస్ 6.38 రూపాయల నుంచి 8.28 రూపాయలకు పెరిగింది. దీనికి తోడు నికర వడ్డీ మార్జిన్ కూడా 0.14 శాతం పెరిగి 3.05 శాతానికి చేరుకుంది. సమీకరించిన నిధులపై వ్యయాన్ని 1.28 శాతం తగ్గించుకోగలిగింది.

2022నాటికి అందరికీ ఇళ్లు ఉండాలన్న విధానంలో భాగంగా ప్రభుత్వం తీసుకుంటున్న విధాన నిర్ణయాలు కంపెనీకి అనుకూలంగా మారాయి. గృహ రుణాలపై 3 నుంచి 4 శాతం వడ్డీ రాయితీ, బలహీన వర్గాల వారికి రుణ ఆధారిత సబ్సిడీ పథకం, ప్రధాన మంత్రి ఆవాస్ యోజనా లాంటి పథకాలు గృహ రుణ రంగాన్ని ప్రోత్సహించే విధంగా ఉన్నాయి. అలాగే దేశ మార్‌గేజ్ రంగం ఇప్పుడిప్పుడే వేళ్లూనుకుంటున్నది. స్మార్ట్ సిటీస్, మేక్ ఇన్ ఇండియాలాంటి పథకాలతో ఈ రంగంలో అవకాశాలు మరింత పెరిగే ఆస్కారం ఉంది. వచ్చే పదేళ్లలో ఈ రంగం ఐదింతల వృద్ధిని సాధించవచ్చని అంచనా. హౌజింగ్ ఫైనాన్స్ రంగంపై క్రిసిల్ విడుదల చేసిన నివేదిక ప్రకారం.. గృహ రుణాల్లో ఏటా సగటున 18.6 శాతం వృద్ధి నమోదు అవుతోంది. ఈ నేపథ్యంలో డిహెచ్‌ఎఫ్‌ఎల్‌లో సంస్థాగత ఇన్వెస్టర్ల కొనుగోళ్లు కూడా పెరిగాయి. గత ఏడాది 101 ఫండ్స్ ఈ షేర్లను కొనుగోలు చేయగా.. 2017 మార్చినాటికి 112 ఫండ్స్‌లో ఇందులో మదుపు చేశాయి.

టెక్నికల్స్ విశ్లేషణ

ఈ ఏడాది జనవరిలో వచ్చిన అసెండింగ్ ట్రయాంగిల్ బ్రేకౌట్ అలాగే మధ్యకాలిక చలన సగటుల క్రాసోవర్ కారణంగా 255 రూపాయల నుంచి 455 రూపాయలకు పెరిగింది. కేవలం 74 ట్రేడింగ్ సెషన్లలో 80 శాతం పెరుగుదలను నమోదు చేసిన ఈ షేరు గత 79 ట్రేడింగ్ సెషన్లలో 387 రూపాయల నుంచి 478 రూపాయల స్థాయిలో కన్సాలిడేట్ అవుతోంది. సుదీర్ఘ కన్సాలిడేషన్ తర్వాత వచ్చే బ్రేకౌట్‌తో చాలా వేగంగా షేరు ధర పెరిగే అవకాశాలుంటాయి. మార్కెట్ పరిస్థితులకారణంగా ఈ నెల మొదటి రెండు వారాలు భారీ పతనాన్ని చవిచూసిన ఈ షేరు ఆ తర్వాత అంతే వేగంగా కోలుకోగలిగింది. లాంగ్ టర్మ్, షార్ట్ టర్మ్ చలన సగటులకు ఎగువన ట్రేడ్ అవుతోంది. అన్ని ఇండికేటర్లు బుల్లిష్ ధోరణిని ధృవీకరిస్తున్నాయి. అలాగే 468 స్థాయిలోని నిరోధక స్థాయిని అధిగమించింది. ప్రస్తుతానికి 478.50 రూపాయల స్థాయిలో నిరోధాన్ని ఎదుర్కొంటోంది. ఈ షేరును ఈ వారంలో 468 రూపాయల నుంచి 479 రూపాయల స్థాయిల మధ్య కొనుగోలు చేయవచ్చు. టెక్నికల్‌గా స్టాప్‌లాస్ స్థాయి 428 రూపాయలు. ఈ షేరు వచ్చే త్రైమాసిక ఫలితాల నాటికి 534 రూపాయల నుంచి 575 రూపాయల లక్ష్యానికి చేరుకునే అవకాశాలున్నాయి.

గమనిక : ఈ శీర్షికలో అందించే స్క్రిప్స్‌పై జరిపే లావాదేవీలకు ఇన్వెస్టర్లదే పూర్తి బాధ్యత. వారి లాభనష్టాలకు ఆంధ్రజ్యోతి పత్రిక ఎలాంటి బాధ్యత వహించదు.

పన్నులేని రాబడులకు డివిడెండ్ స్టాక్స్

రామారావు ప్రైవేట్ కంపెనీలో మేనేజర్‌గా చేసి రిటైర్ అయ్యారు. ఉద్యోగ కాలంలో ఎంపిక చేసిన కంపెనీల షేర్లలో ఇన్వెస్ట్ చేస్తూ వచ్చారు. పెన్షన్ లేకున్నా కంపెనీల నుంచి క్రమం తప్పకుండా అందుతున్న డివిడెండ్లతో నిశ్చింతంగా కాలం వెళ్లదీస్తున్నారు. కంపెనీల షేర్లపై వచ్చే డివిడెండ్ రాబడులతో నిశ్చింతగా కాలం గడిపేయవచ్చా?. మరి అలాంటి మంచి కంపెనీల షేర్లు పట్టడం ఎలా ?

కొన్ని కంపెనీల తీరే వేరు. లాభాలు ఎలా ఉన్నా ఇన్వెస్టర్లకు క్రమం తప్పకుండా డివిడెండ్ చెల్లిస్తుంటాయి. ఇలాంటి కంపెనీలను నమ్ముకుంటే రిటైర్‌మెంట్ తర్వాత పెట్టుబడులను కదిలించకుండా, కేవలం డివిడెండ్ ఆదాయంతోనే జీవితం నెట్టుకురావచ్చు. కాకపోతే ఇలాంటి మంచి కంపెనీల షేర్లను గుర్తించడమే పెద్ద సమస్య. సంపాదించేటప్పుడే ఇలాంటి కంపెనీల షేర్లను గుర్తించి పోర్టుఫోలియోలో చేర్చుకోవాలి. తరచూ మార్కెట్లో వచ్చే దిద్దుబాట్లు ఇందుకు సరైన సమయం. అలా ఈ షేర్లను పట్టగలిగితే పెట్టుబడి లాభాలతో పాటు ఏటా క్రమం తప్పకుండా మంచి డివిడెండ్ ఆదాయం జేబులో వేసుకోవచ్చు. ఒక ఆర్థిక సంవత్సరంలో ఇలా షేర్లపై వచ్చే డివిడెండ్ ఆదాయం రూ.10 లక్షలు దాటనంత వరకు పైసా కూడా పన్ను పోటు ఉండదు. రాకేశ్ ఝున్‌ఝున్‌వాలా, వారెన్ బఫెట్ వంటి 'పెట్టుబడి' దిగ్గజాలు తమ పెట్టుబడులను ఏ మాత్రం కదిలించకుండా దాదాపుగా 'డివిడెండ్' ఆదాయంతోనే విలాసవంతమైన జీవితాన్ని గడుపుతున్నారు. వినడానికి విచిత్రంగా ఉన్నా ఇది పచ్చి నిజం.

షేర్ల ఎంపిక..

మంచి డివిడెండ్ ఆదాయం ఇచ్చే కంపెనీల షేర్లను గుర్తించడం అంత తేలిక కాదు. ఇందుకోసం చాలా కసరత్తు చేయాలి. స్టాక్ మార్కెట్లో ఇన్వెస్ట్ చేసే మదుపరుల్లో 80 శాతం మంది నేను కొనే షేరు ధర మరింత పెరిగి మంచి లాభాలు ఇస్తే చాలు అనుకుంటారు. ఇందుకోసం ఏ కంపెనీ షేరు ధర బాగా పెరిగి భారీ లాభాలు పంచే అవకాశం ఉందో గుర్తించేందుకు బ్రోకింగ్ సంస్థలు, ఫైనాన్షియల్ పత్రికల్లో వచ్చే రికమండేషన్లను జల్లెడ పడుతుంటారు. ఇంకొంత మంది తాము కొనే కంపెనీ షేరు ధర బాగా పెరిగే అవకాశం ఉందా? లేదా? అనే విషయం పెద్దగా పట్టించుకోరు. ఏటా క్రమం తప్పకుండా పెద్ద మొత్తంలో డివిడెండ్ చెల్లిస్తున్న కంపెనీల షేర్ల కోసం వెతుకుతుంటారు.

రీ ఇన్వెస్ట్‌మెంట్..


ఒకవేళ ఇప్పటికే వీరి పోర్టుఫోలియోలో మంచి డివిడెండ్ ఆదాయం ఇచ్చే కంపెనీల షేర్లు ఉంటే, ఆ వచ్చే డివిడెండ్ ఆదాయాన్నీ మళ్లీ అలాంటి షేర్లలో మదుపు చేసేందుకే ఇష్టపడతారు. ఇలా చేస్తూ పోతుంటే కొన్నేళ్లకు వీరి డివిడెండ్ ఆదాయం వారి రోజువారీ ఖర్చులను మించిపోతుంది. టిసిఎస్ (టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్) షేర్లే ఇందుకు ఉదాహరణ. టిసిఎస్ కంపెనీ 2000లో ఐపిఒ ద్వారా ఒక్కో షేరును రూ.850 చొప్పున జారీ చేసి పెద్ద మొత్తంలో నిధులు సమీకరించింది. అప్పట్లో ఈ ఇష్యూలో షేర్లు పొంది అట్టిపెట్టుకున్న మదుపరులకు ఈ షేర్లు కనక వర్షం కురిపించాయి. షేరు ధర పెరిగిన విషయాన్ని పక్కన పెట్టుకున్నా అప్పటి నుంచి ఇప్పటి వరకు టిసిఎస్ కంపెనీ షేర్లు కలిగి ఉన్న మదుపరులకు ఒక్కో షేరుపై రూ.733.5 వరకు డివిడెండ్ ఆదాయం లభించింది. 2008 వంటి సంక్షోభ సమయంలోనూ టిసిఎస్ తన వాటాదారులకు మరింత ఎక్కువ డివిడెండ్ చెల్లించింది.

భయపడొద్దు..

ఇలా టిసిఎస్ ఒక్కటే కాదు. ఇంకా చాలా కంపెనీలు వాటాదారులకు ఏటా ఆకర్షణీయమైన డివిడెండ్ చెల్లిస్తున్నాయి. కొన్ని కంపెనీలైతే చెల్లించే డివిడెండ్‌ను ఏటా పెంచుతున్నాయి. ఈ విషయాలతో కంపెనీలు వాటాదారులకు చెల్లించే డివిడెండ్ ప్రాముఖ్యత ఏంటో తెలిసి ఉంటుంది. డివిడెండ్ ఆదాయం ప్రాముఖ్యత తెలియక లేదా కేవలం డివిడెండ్ ఆదాయం కోసమే అలాంటి కంపెనీల షేర్లు కొంటే నష్టపోతామనే భయంతోనే ఇన్వెస్టర్లు ఇలాంటి షేర్ల జోలికి పోరు.

నిశ్చింతగా జీవితం..

గుడ్డిగా కంపెనీల షేర్లు కొనకుండా ముందు సరైన కసరత్తు చేసి డివిడెండ్ ఆదాయానికి అవకాశం ఉన్న కంపెనీల షేర్లను ఎప్పటికప్పుడు కొనుగోలు చేసి పెట్టుకోవాలి. అలా చేయగలిగితే రిటైర్‌మెంట్ తర్వాత నిశ్చింతగా జీవితం గడిపేయవచ్చు. అసలును కదపకుండానే డివిడెండ్ ఆదాయంతో ఖర్చుల భారం తట్టుకోవచ్చు. వారెన్ బఫెట్ ఇదే విధానాన్ని అనుసరిస్తున్నట్టు చెబుతారు.



పాటించాల్సిన నియమాలు..

- వెంటనే డీమ్యాట్ ఖాతా తెరవండి
- విశ్లేషణతో కూడిన సరైన కసరత్తు చేసి, క్రమం తప్పకుండా డివిడెండ్ చెల్లిస్తున్న కంపెనీల జాబితా తయారు చేసుకోండి.
- మార్కెట్ దిద్దుబాటులో ఉన్నపుడు ఇలాంటి కంపెనీల షేర్లు ఆకర్షణీయమైన ధరల్లో లభిస్తుంటే వెంటనే కొనేయాలి.
- వచ్చిన డివిడెండ్ ఆదాయంతో మళ్లీ అలాంటి కంపెనీల షేర్లు కొనాలి.
- డివిడెండ్ ఆదాయం ఇంటి ఖర్చులకు సరిపడా వచ్చే వరకు ఈ పెట్టుబడి విధానం కొనసాగించాలి.
- అదనంగా వచ్చే ఈ ఆదాయంతో వీలైనంత ఆర్థిక స్వాతంత్ర్యం అనుభవించాలి.



బ్లూచిప్స్‌ను పట్టడం ఎలా?

మార్కెట్ పండితులను ఎవర్ని కదిలించినా... బ్లూచిప్స్‌లో ఇన్వెస్ట్ చేయమని సలహా ఇస్తారు. స్టాక్ మార్కెట్లో అనేక కంపెనీల షేర్లు ఉన్నా, అందులో బ్లూచిప్ కంపెనీలు వేరు. పోర్టుపోలియోలో ఈ కంపెనీల షేర్లు ఉంటే మార్కెట్ ఆటుపోట్ల సమయంలోనూ చాలా వరకు నిశ్చింతగా ఉండొచ్చన్నది నిపుణుల సలహా. ఇంతకీ వేటిని బ్లూచిప్ షేర్లు అంటారు?

కొన్ని కంపెనీలు మాత్రమే ఏటా వ్యాపారంతో పాటు లాభాలు పెంచుకుంటూ, ఆ షేర్లు కొన్న ఇన్వెస్టర్లకు రాబడులు పెంచుతుంటాయి. వీటి ఇమేజ్ మార్కెట్లో భిన్నంగా ఉంటుంది. ఎంఆర్‌ఎఫ్ షేరు ఇందుకు ఉదాహరణ. సరిగ్గా ఏడాది క్రితం రూ.35,000 పలికిన ఈ షేరు ఇప్పుడు రూ.63,000 దగ్గర ట్రేడవుతోంది. అంటే ఏడాది కల్లా ఈ షేర్లలో ఇన్వెస్ట్ చేసిన మదుపరులు సంపద విలువ 80 శాతం పెరిగింది. ఒక్క ఎంఆర్‌ఎఫ్ మాత్రమే కాదు... చారిత్రకంగా చూస్తే ఎల్ అండ్ టి, ఇన్ఫోసిస్, ఐషర్ మోటార్స్ వంటి బ్లూచిప్ కంపెనీలూ ఇన్వెస్టర్లకు ఇలానే మంచి లాభాలు పంచాయి. ఒక కంపెనీ షేర్లను బ్లూచిప్ షేర్లుగా చెప్పాలంటే చాలా లక్షణాలు ఉండాలి. ముఖ్యంగా ఆ కంపెనీ మంచి పేరు ప్రతిష్టలు, ఆర్థిక పరిపుష్టి, అందరికీ బాగా తెలిసి ఉండాలి. అన్నింటికంటే ముఖ్యంగా ఇది లార్జ్ క్యాప్ స్టాక్ అయి ఉంటుంది. మార్కెట్ బాగున్నపుడు బ్లూచిప్ కంపెనీల షేర్లపై వచ్చే రాబడులూ అద్భుతంగా ఉంటాయి. అందుకే వీటి ధరా ఎప్పుడూ ఎక్కువ స్థాయిలో కోట్ అవుతుంది. ఇంకా తమకు సంబంధించిన రంగాల్లో ఈ కంపెనీలు మార్కెట్ లీడర్లుగా ఉంటాయి. సాధారణంగా బ్లూచిప్ కంపెనీలకు ఈ లక్షణాలు ఉంటాయని భావించవచ్చు.

మంచి నాయకత్వం..

బ్లూచిప్ కంపెనీల నిర్వహణ మంచి ట్రాక్ రికార్డుతో వృత్తిపర నైపుణ్యాలు ఉన్న నిపుణుల చేతుల్లో ఉంటుంది. సుదీర్ఘ అనుభవంతో వీరు వ్యాపారాల నిర్వహణలో రాటుదేలి ఉంటారు.

బిజినెస్ మోడల్

సుదీర్ఘ అనుభవంతో ఈ కంపెనీలకు తమ వ్యాపారాలపై పూర్తి పట్టు ఏర్పడుతుంది. ఆ అనుభవంతో వ్యాపారాన్ని ఎప్పటికప్పుడు పెంచుకుంటూ అందరి చేత లీడర్లుగా గుర్తింపు పొంది ఉంటాయి.

అత్యుత్తమ ట్రాక్ రికార్డు

అమ్మకాలు, లాభాలతోపాటు వాటాదారులకు బ్లూచిప్ కంపెనీలు క్రమం తప్పకుండా డివిడెండ్ చెల్లిస్తుంటాయి. ఎంఆర్‌ఎఫ్ వంటి కంపెనీలు మాత్రం డివిడెండ్ చెల్లించక పోయినా, వాటి షేరు ధర మాత్రం ఏటా పెరుగుతుంటుంది.

ప్రయోజనాలు

- బ్లూచిప్ కంపెనీల బిజినెస్ మోడల్ నిరంతర వృద్ధికి అనువుగా ఉంటుంది.
- చాలా వరకు క్రమం తప్పకుండా డివిడెండ్ చెల్లిస్తుంటాయి.
- అప్పుల భారం లేకుండా, నగదు నిల్వలు కలిగి ఉంటాయి.
- ఈ కంపెనీల షేర్లలో పెట్టుబడి, అసలుకు ఢోకా ఉండకపోవచ్చు.
- దీర్ఘకాలికంగా చూసినా బ్లూచిప్ కంపెనీల షేర్లు నిలకడతో కూడిన రాబడులు ఇస్తాయి.
- స్టాక్ మార్కెట్లో ఏర్పడే ఆటుపోట్ల ప్రభావమూ ఈ షేర్లపై పెద్దగా ఉండదు.
- మంచి నియంత్రణలతో బ్లూచిప్ కంపెనీల నిర్వహణ బాగుంటుంది.

సమస్యలు

- కొత్తగా మార్కెట్‌కు వచ్చిన మంచి కంపెనీల షేర్లతో పోలిస్తే వీటి పెరుగుదల తక్కువ. దీంతో ఈ షేర్లపై రాబడులూ తక్కువగానే ఉంటాయి.
- స్పష్టంగా చెప్పాలంటే ఈ షేర్లు మల్టీబ్యాగర్ (ఇబ్బడి ముబ్బడిగా లాభాలు పంచే) షేర్లు కావు.
- ఈ షేర్ల ధర ఎప్పుడూ ఎక్కువగా ఉంటుంది. కాబట్టి వీటిని కొనడం కూడా రిటైల్ ఇన్వెస్టర్లకు అంత తేలిక కాదు.
- స్టాక్ మార్కెట్ కుప్పకూలినపుడు బ్లూచిప్ కంపెనీల షేర్ల ధర బాగా దిద్దుబాటుకు లోనయ్యే అవకాశం ఉంది.
- ఈ కంపెనీలు వ్యాపార విషయంలోనూ సంప్రదాయ పద్ధతిలో ఆచితూచి ముందుకెళుతుంటాయి. కొత్త వ్యాపార అవకాశాలు అందిపుచ్చుకునేందుకు ఇది అవరోధంగా మారే అవకాశం ఉంది.

ఇన్వెస్ట్ చేయవచ్చా?

స్మాల్ అండ్ మిడ్ క్యాప్/అల్లాటప్పా కంపెనీల షేర్లు కొని చేతులు కాల్చుకునే బదులు బ్లూచిప్ కంపెనీల షేర్లలో ఇన్వెస్ట్ చేయడం మంచిది. పెద్దగా ఆటుపోట్లు లేకుండా దీర్ఘకాలంలో నిలకడతో కూడిన రాబడులు ఆశించే మదుపరులు ఈ షేర్లను నమ్ముకోవచ్చు. అలాగని ఇన్వెస్టర్లు పూర్తిగా వీటిలోనే ఇన్వెస్ట్ చేయాలని కాదు. మంచి వ్యాపార అవకాశాలు, పటిష్టమైన మేనేజ్‌మెంట్ ఉన్న చిన్న, మధ్యరకం కంపెనీల షేర్లలోనూ కొంత ఇన్వెస్ట్ చేయాలి. స్టాక్ మార్కెట్లోకి ప్రవేశించే వారుమాత్రం బ్లూచిప్ కంపెనీల షేర్లను ఎంచుకోవడం మేలు.

పరిశీలించాల్సిన విషయాలు

ఏదైనా ఒక బ్లూచిప్ కంపెనీ షేర్లలో ఇన్వెస్ట్ చేసేటప్పుడు కొన్ని విషయాలు తెలుసుకోవాలి. అవేంటంటే....

- కంపెనీ ఎన్ని రంగాలకు చెందిన వ్యాపారాల్లో ఉంది?
- కంపెనీ బ్రాండ్‌కు ఉన్న విలువ, వ్యాపార అవకాశాలు
- అప్పులు, గత పనితీరు
- కంపెనీ అందించే వస్తు, సేవల భవిష్యత్ అవకాశాలు
- ఆర్థిక పనితీరు, డివిడెండ్ చెల్లింపుల చరిత్ర
- కంపెనీలో తరువాత ఎవరు ఉన్నత స్థానాల్లోకి వస్తారు ?

వీటిని తెలుసుకున్నాకే బ్లూచిప్ కంపెనీల షేర్లు కొనుగోలు చేయాలి. ఎవరో చెప్పారని కొనుగోలు చేస్తే అసలుకే ఎసరు వచ్చే ప్రమాదం ఉంటుంది. ప్రతి ఈక్విటీ ఇన్వెస్టర్ పోర్టుఫోలియోలో కొన్ని బ్లూచిప్ కంపెనీల షేర్లయినా ఉంటే లాభదాయకం.

పాత క్రెడిట్‌ను జిఎస్‌టిలోకి ఎలా బదిలీ చేసుకోవాలి?



గొండాల రాంబాబు

జిఎస్‌టి అమల్లోకి వచ్చి దాదాపు రెండు నెలలు అవుతోంది. జిఎస్‌టి చట్టం కింద నమోదై వ్యాపారాలు కొనసాగిస్తున్న వారిలో సింహభాగం ఇంతకు ముందు ఏదో ఒక పన్ను విభాగం కింద అంటే వ్యాట్, సెంట్రల్ ఎక్సైజ్, సర్వీస్ టాక్స్ మొదలైన వాటి కింద నమోదైన వారే. వీరందరికీ ఇంతకు ముందు మిగిలి ఉన్న సెన్‌వ్యాట్ క్రెడిట్ లేదా ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్‌ను జిఎస్‌టి కింద మార్చుకోవటం అత్యంత ఆవశ్యకం. అలాగే వివిధ కారణాలతో ఇది వరకు రిజిస్ట్రేషన్ లేని వారు లేదా రిజిస్ట్రేషన్ ఉండి పన్ను మినహాయింపు పొందిన సర్వీసులు లేదా వస్తువులు తయారు చేసే వారు ఇంతకు ముందు సెన్‌వ్యాట్ లేదా ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్ తీసుకోవటానికి అవకాశం లేదు. ఇప్పుడు వీరంతా జిఎస్‌టి కింద నమోదై పన్ను కట్టాల్సి ఉంటే మాత్రం జులై 1 నాటికి వారి వద్ద ఇన్‌పుట్స్ ఏమైనా మిగిలి ఉంటే వాటి మీద క్రెడిట్ ఇప్పుడు తీసుకోవచ్చు. అంతేకాకుండా జులై 1 నాటికి వారి వద్ద పాక్షికంగా లేదా పూర్తిగా తయారైన వస్తువులు ఏమైనా ఉంటే వాటికి సంబంధించిన అంటే వాటి తయారీలో వాడిన ఇన్‌పుట్స్ మీద క్రెడిట్ తీసుకోవచ్చు. అలాగే క్యాపిటల్ గూడ్స్ మీద తీసుకోవాల్సిన క్రెడిట్ ఏమైనా ఉంటే అది కూడా తీసుకోవచ్చు. అయితే జిఎస్‌టిలో కాంపోజిషన్ స్కీమ్ కింద నమోదైన వారికి క్రెడిట్ తీసుకునే అవకాశం లేదు. (వీటికి సంబంధించిన నియమ నిబంధనలను ఇంతకు ముందే ఇవ్వటం జరిగింది).

ఇదీ జీఎస్‌టీ

మరిప్పుడు ఆయా క్రెడిట్స్‌ను జిఎస్‌టిలోని మీ రిజిస్ట్రేషన్ నంబర్‌కు ఎలా బదిలీ చేసుకోవాలో తెలుసుకుందాం. దీనికి సంబంధించి జిఎస్‌టి ట్రాన్ 1 (TRAN 1) అనే దరఖాస్తును నింపటం ద్వారా సంబంధిత క్రెడిట్స్‌ను మీ జిఎస్‌టి ఖాతాలోకి సులువుగా బదిలీ చేసుకోవచ్చు. ఈ జిఎస్‌టి ట్రాన్ 1 దరఖాస్తు ఆన్‌లైన్‌లో మీ ఖాతాలో లభిస్తుంది. ఈ జిఎస్‌టి ట్రాన్ 1 ను నింపటానికి సెప్టెంబరు 28 వరకు గడువు ఉంది. అయితే ఈ విధంగా క్రెడిట్ తీసుకుని జులై నెల తాలూకు చెల్లించాల్సిన పన్నుకు సర్దుబాటు చేయాలంటే మాత్రం చివరి తేదీ ఆగస్టు 28.

వివరంగా చెప్పాలంటే జులై నెలకు సంబంధించి ఒక వ్యక్తి చెల్లించాల్సిన జిఎస్‌టి మొత్తం లక్ష రూపాయలు అనుకుందాం. ఇతనికి జులై నెలలో కొనుగోళ్ల ద్వారా పది వేల రూపాయల క్రెడిట్ లభిస్తుందని అనుకుందాం. అలాగే పాత క్రెడిట్ అంటే జిఎస్‌టి ట్రాన్ 1 ను నింపటం ద్వారా మరో యాభై వేల రూపాయల క్రెడిట్ బదిలీ అవుతుంది అనుకుందాం. ఆ వ్యక్తి యాభై వేల రూపాయల క్రెడిట్‌ను జూలై నెలలో తాను చెల్లించాల్సిన లక్ష రూపాయల కోసం ఉపయోగించుకోవాలి అనుకుంటే మాత్రం జిఎస్‌టి ట్రాన్ 1ను ఆగస్టు 28 లోపు ఆన్‌లైన్‌లో సబ్మిట్ చేయాల్సి ఉంటుంది. అలాగే మిగతా నలభై వేల రూపాయలు ఈ నెల 25 వ తేదీలోపు కట్టి ఉండాలి. అప్పుడు జిఎస్‌టి ట్రాన్ 1 ను నింపటం ద్వారా పాత క్రెడిట్ యాభై వేల రూపాయలు పొందవచ్చు. అలాగే ఇంతకు ముందు చెప్పినట్లు జిఎస్‌టిఆర్ 3బి అనేది రిజిస్ట్రేషన్ తీసుకున్న ప్రతి ఒక్కరు (కాంపోజిషన్ స్కీమ్‌లో వారు మినహాయించి) ఫైల్ చేయాల్సి ఉంటుంది. ఈ జిఎస్‌టిఆర్ 3బి నింపటం ద్వారా జులై నెల తాలూకు పది వేల రూపాయల క్రెడిట్ పొదటమే కాకుండా కట్టాల్సిన లక్ష రూపాయలకు తగిన విధంగా క్రెడిట్ లెడ్జర్, క్యాష్ లెడ్జర్‌లను సర్దుబాటు చేయటం ద్వారా మొత్తం ప్రక్రియ పూర్తవుతుంది. ఒకవేళ జిఎస్‌టి ట్రాన్ 1ను నింపాల్సిన అవసరం లేకున్నా లేదా తర్వాత అంటే సెప్టెంబరు 28 లోపు నింపాలి అనుకునే వారు జిఎస్‌టిఆర్ 3బికి సంబంధించిన మొత్తం ప్రక్రియ ఆగస్టు 25లోపు పూర్తి చేసి ఉండాలి. జిఎస్‌టికి సంబంధించి



మరింత సమాచారం. సంబంధిత వీడియోలను http://goo.gl/bzX8s1 ద్వారా వీక్షించవచ్చు.

గమనిక : ఈ వ్యాసాల ద్వారా ఇస్తున్న సమాచారం కేవలం అవగాహన కోసం మాత్రమే. పాఠకులు ఏదైనా నిర్ణయం తీసుకునే ముందు సంబంధిత చట్టాలు/నిబంధనలను కూలంకషంగా పరిశీలించాలి.

కర్నూలు సీమలో జలసిరి



రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు నల్లమల అటవీ ప్రాంతం కొత్త అందాలను సంతరించుకుంది. కర్నూలు జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం అహోబిలంలో ఎత్తైన కొండల నుంచి జాలువారుతున్న జలపాతాలు ..



కడప నగర సమీపంలోని రిమ్స్ వద్ద గల పాలకొండల్లో జలపాతాలు చూపరులను కనువిందు చేస్తున్నాయి. మూడు రోజుల నుంచి కురుస్తున్న వర్షానికి పాలకొండల పైనుంచి జలపాతాలు దూకుతున్నాయి.



కర్నూలు జిల్లా అవుకు టన్నెల్ వద్ద జలపాతం పర్యాటకులకు కనువిందు చేస్తోంది. అవుకు మండలంలోని మెట్టుపల్లె సమీపంలో నిర్మితం అవుతున్న గాలేరు నగరి సుజల స్రవంతి కాలువ దిగువన ఈ భారీ జలపాతం ఉంది

బైకులు ఢీ.. నలుగురు మృతి

నిమజ్జనం విషాదాల్లో ఏడుగురు దుర్మరణం

ఒంగోలు/కళ్యాణదుర్గం/తడ, ఆగస్టు 27: వినాయక నిమజ్జనం సందర్భంగా వేర్వేరు జిల్లాల్లో జరిగిన దుర్ఘటనల్లో ఏడుగురు దుర్మరణం పాలయ్యారు. ప్రకాశం జిల్లా కొత్తపట్నం మండలం ఈతముక్కల సమీపంలో రెండు బైకులు ఢీకొని నలుగురు మృతి చెందారు. ఒంగోలులోని వడ్డెరపాలేనికి మందపల్లి అశోక్ (25), బత్తుల పవన్ (14), కుట్టుబోయిన శివశంకర్ వినాయక నిమజ్జనం కోసం ఈతముక్కల సముద్ర తీరానికి బైక్‌పై వెళ్లారు. తిరుగు ప్రయాణంలో బకింగ్‌హాం కాలువ వద్ద వీరి వాహనం ఎదురుగా వస్తున్న మరో బైక్‌ను ఢీకొట్టింది. దీంతో అశోక్, పవన్‌తో పాటు ఎదురు బైక్‌పై వస్తున్న కందులూరుకు చెందిన ఆలూరి రాంబాబు (40), బొబ్బాల కృష్ణమూర్తి (25) ప్రాణాలు కోల్పోయారు. శివశంకర్ పరిస్థితి విషమంగా ఉంది. నెల్లూరు జిల్లా తడ మండలం అండగుండాలలో ఆదివారం నిమజ్జనం కోసం వినాయకుడి విగ్రహాన్ని ఊరేగిస్తుండగా విద్యుత్ వైర్లు విగ్రహానికి అడ్డువచ్చాయి. వాటిని తప్పించే ప్రయత్నంలో పిచుక యువకృష్ణ (22), పిచుక శ్రీనివాసులు (23) విద్యుదాఘాతానికి గురై మృతి చెందారు. అనంతపురం జిల్లా శెట్టూరు మండలం లక్ష్మంపల్లిలో గణేష్ మండపానికి అలంకరించిన విద్యుత్ బల్బులను తొలగించే క్రమంలో మహమ్మద్ బాషా(16) విద్యుదాఘాతానికి గురై తీవ్రంగా గాయపడ్డాడు. ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతిచెందాడు.



ప్రకాశం జిల్లా ఈతముక్కల వద్ద ప్రమాదస్థలిలో మృతిచెందిన అశోక్



99% నోట్లు తిరిగొచ్చాయి

- ఆర్బీఐకి చేరని 1000 నోట్లు 1.3 శాతమే
- 500 నోట్లపై తేలని లెక్క

న్యూఢిల్లీ, ఆగస్టు 27: నోట్ల రద్దు అనంతరం 99 శాతం రూ.1000 నోట్లు ఆర్బీఐకి తిరిగివచ్చాయి. రిజర్వ్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా వెబ్‌సైట్‌లో పేర్కొన్న డేటా ఆధారంగా రూపొందిన నివేదిక ఈ విషయాన్ని వెల్లడించింది. ఈ ఏడాది మార్చి 2017 నాటికి రూ.8,925 కోట్ల విలువైన వెయ్యి రూపాయల నోట్లు చలామణిలో ఉన్నట్లు తెలిపింది. చలామణి అంటే రిజర్వ్ బ్యాంకుకు రాకుండా.. బ్యాంకుల్లోను, ప్రజల వద్ద ఉన్న నగదుగా పేర్కొంది. గతేడాది నవంబర్ 8వ తేదీన పెద్ద నోట్ల రద్దు నిర్ణయం తీసుకున్న తర్వాత కేవలం 1.3శాతం నోట్లు మాత్రమే తిరిగి రాలేదని ఆ నివేదిక వెల్లడించింది. అయితే రూ.500 నోట్లు ఎన్ని జమ అయ్యాయనే విషయాన్ని నివేదికలో పేర్కొనలేదు.

నిలిచిన ఇళ్లకు నిధులు

కాంగ్రెస్ హయాంలో ప్రారంభించినా పూర్తి కాని గృహాలకు ప్రయోజనం

- యూనిట్ కాస్ట్‌కు అదనంగా రూ.25 వేలు
- మొత్తం ఆగిపోయిన ఇళ్లు 2.62 లక్షలు



అమరావతి, ఆగస్టు 27(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ హయాంలో ప్రారంభమైనా అనేక కారణాలతో మధ్యలోనే నిలిచిపోయిన పక్కా-ఇళ్లకు ఇప్పుడు మోక్షం కలుగుతోంది. పాత ఇళ్ల నిర్మాణాలను పూర్తిచేయాలని టీడీపీ ప్రభుత్వం నిర్ణయించడంతో వాటిలో కదలిక వచ్చింది. దాదాపు మూడేళ్ల కిందట ఇళ్లు నిలిచిపోయినందున మారిన పరిస్థితులకు అనుగుణంగా పాత ఇళ్లకు అదనంగా రూ.25వేలు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ ఆదేశాలు ఇటీవలే విడుదలయ్యాయి. అందుకు అనుగుణంగా క్షేత్రస్థాయి యంత్రాంగం ఇళ్లపై దృష్టిసారించింది. గ్రామాలవారీగా జాబితాలు రూపొందించి లబ్ధిదారులకు సమాచారం ఇచ్చి నిధుల విడుదల ప్రక్రియను తాజాగా అధికారులు ప్రారంభించారు. డబ్బుల్లేక నిర్మాణాలు మధ్యలోనే ఆపేసిన వారికి ఇది పెద్ద ఉపశమనంగా మారింది. ఎన్టీఆర్ పథకంతో సమానంగా రాయితీ రాకపోయినా గత ప్రభుత్వంలో ఉన్న యూనిట్ కాస్ట్‌తో పాటు అదనపు నిధులు మంజూరుచేయడంతో ఇళ్లు పూర్తిచేసుకునేందుకు లబ్ధిదారులు ముందుకొస్తున్నారు. కాంగ్రెస్ హయాం చివర్లో ఇళ్లు ప్రారంభించుకున్న వారికి ప్రభుత్వం నుంచి సహకారం లభించకపోవడంతో ఎక్కడ ఇళ్లు అక్కడే ఆగిపోయాయి. రాష్ట్ర విభజన ఉద్యమాల నేపథ్యంలో నిధుల మంజూరు అప్పట్లో పూర్తిగా నిలిచిపోయింది. ప్రభుత్వం నుంచి బిల్లులు రాకపోయినా కొందరు అప్పులుచేసి ఇళ్లు పూర్తిచేసుకుంటే... చాలా మంది పేదలు స్తోమత లేక వాటిని అలాగే వదిలేశారు. కాంగ్రెస్ హయాంలో టీడీపీకి చెందిన లబ్ధిదారులు తక్కువ మందే ఉంటారని, అందువల్ల పాత ఇళ్లకు నిధులు విడుదల కావని అప్పట్లో ఇళ్లు ప్రారంభించుకున్న వారు వాటిపై ఆశలు వదిలేశారు. కానీ ఏ పార్టీ అయినా పేదల ఇళ్లు పూర్తిచేయాల్సిన బాధ్యత తమపై ఉందని భావించిన చంద్రబాబు ప్రభుత్వం... వాటిపై ఇటీవల సానుకూల నిర్ణయం తీసుకుంది. తాజా అంచనాల ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా 2,93,909 అసంపూర్తి ఇళ్లు ఉన్నాయి. అందులో బేస్‌మెంట్, అంతకంటే తక్కువ స్థాయిలో 1,78,108 ఇళ్లు, రూఫ్, లింటల్ లెవెల్‌లో 1,15,801 ఇళ్లు ఉన్నాయి. కాగా అందులో 31,173 మంది సొంతంగా నిర్మాణాలు పూర్తిచేసుకున్నారు. అవి పోగా ఇంకా 2,62,736 ఇళ్లకు అదనపు లబ్ధి చేకూర్చాలని ప్రభుత్వం నిర్ణయించింది. కాంగ్రెస్ హయాంలో ఎస్టీలకు రూ.1.05లక్షలు, ఎస్సీలకు రూ.లక్ష, ఇతరులకు రూ.70వేలు చొప్పున యూనిట్ కాస్ట్ ఉంది. ఈ యూనిట్‌కాస్ట్ ప్రకారం అప్పట్లో విడుదలైన నగదు మినహాయించి మిగతా నిధులను ఇప్పుడు విడుదల చేస్తారు. మూడేళ్లు గడిచినందున నిర్మాణ ముడిసరుకుల ధరల్లో మార్పులు వచ్చిన దృష్ట్యా ఒక్కో యూనిట్‌కు రూ.25వేలు అదనంగా ఇస్తున్నారు.

ఎస్సీ, ఎస్టీలకు ఎక్కువ లబ్ధి

ప్రస్తుతం ఎన్టీఆర్ గృహనిర్మాణ పథకంలో కులాలతో సంబంధం లేకుండా అందరికీ ఒకే యూనిట్‌కాస్ట్ ఉంది. ఒక్కో ఇంటికి రూ.లక్షన్నర చొప్పున ఇస్తున్నారు. అదనపు నిధులతో కలిపితే ఎస్సీ, ఎస్టీలకు దాదాపుగా కొత్త యూనిట్‌కాస్ట్ ప్రకారం రాయితీ నిధులు అందనున్నాయి. దీంతో బీసీలు, ఓసీలు కంటే అసంపూర్ణంగా ఉన్న ఇళ్లను పూర్తి చేసుకునేందుకు ఎస్సీ, ఎస్టీలు ఎక్కువ ఆసక్తి చూపుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా మధ్యలో నిలిచిపోయిన ఇళ్లు 2.62లక్షలు ఉంటే అందులో ప్రస్తుతం రెండు లక్షల ఇళ్లకు అదనపు నిధులు రూ.25వేలు ఇస్తున్నారు. ఇందుకోసం ప్రభుత్వం రూ.500 కోట్లు విడుదల చేసింది. ముందుగా వచ్చిన వారికి అదనపు నిధులు ఇవ్వాలని అధికారులు నిర్ణయించారు. తొలుత 2లక్షల ఇళ్లు పూర్తయితే తర్వాత మిగిలిన వారికి కూడా అదనపు రాయితీ విడుదల చేస్తామని అధికారులు చెప్పారు. బేస్‌మెంట్, రూఫ్, రూఫ్‌కాస్ట్ మూడు దశల్లో మొత్తం రూ.25వేలు విడుదల చేయాలని సూచించింది. ఒకవేళ ఇప్పటికే రూఫ్‌కాస్ట్ దశలో ఉంటే మొత్తం రూ.25వేలు ఒకేసారి ఇస్తారు.

కిర్లంపూడి ఉద్రిక్తం!

- పాదయాత్రకు కదిలిన ముద్రగడ
- అడ్డుకునేందుకు పోలీసులు యత్నం
- వారిపై ముద్రగడ అనుచరుల వీరంగం
- డీఐజీని కాల్వలోకి నెట్టేసిన ఆందోళనకారులు
- లాఠీచార్జి.. పోలీసుల అదుపులో ముద్రగడ





ముద్రగడను వ్యాన్‌లో తరలిస్తున్న పోలీసులు, పంట కాలువలో పడిపోయిన పోలీసు అధికారిని బయటకు తీసుకువస్తున్న దృశ్యం

కాకినాడ, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా కిర్లంపూడిలో మరోసారి ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఆదివారం ఉదయం 11 గంటలకు కాపు నేత ముద్రగడ పద్మనాభం అనూహ్యరీతిలో చలో అమరావతి నిరవధిక పాదయాత్ర చేపట్టారు. ఇంటి ముందు ఉన్న పోలీసులను తోసుకుంటూ ముందుకు కదిలారు. వందలాది మంది అనుచరులు ఆయనకు జతకలిశారు. పాదయాత్రను నిలువరించడానికి ప్రయత్నించిన పోలీసులను ముద్రగడ అనుచరులు తీవ్రస్థాయిలో దుర్భాషలాడుతూ పక్కకు నెట్టివేశారు. సాక్షాత్తు ఏలూరు రేంజి డీఐజీ రామకృష్ణను నెట్టేయడంతో ఆయన పక్కనే ఉన్న పంటకాల్వలో పడిపోయారు. సుమారు మూడు గంటల హైడ్రామా అనంతరం ముద్రగడను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

కిర్లంపూడిలోని ముద్రగడ ఇంటి వద్ద ఆదివారం ఉదయం 11 గంటల వరకు ప్రశాంత వాతావరణం ఉంది. ఆ తర్వాత ఒక్కసారిగా పరిస్థితి మారిపోయింది. కాపు జేఏసీ నేతలు, మహిళలతో ఒక్కసారిగా ఇంటి నుంచి బయటకు వచ్చిన ముద్రగడ ఇంటి గేటు ముందు ఉన్న పోలీసులను తోసుకుని పాదయాత్ర చేపట్టారు. ఆ సమయంలో అక్కడ పోలీసులు తక్కువగా ఉండటంతో పాదయాత్రను అడ్డుకోవడం వారికి సాధ్యపడలేదు. దీంతో వెంటనే వారు సమాచారాన్ని ఉన్నతాధికారులకు తెలియజేశారు. ఈలోగానే వందలాది మంది ముద్రగడ అనుచరులు పాదయాత్రలో కలిశారు. పాదయాత్ర కిర్లంపూడి గ్రామం దాటే సమయానికి పోలీసులు భారీగా అక్కడికి చేరుకున్నారు. ముద్రగడ అనుచరులు వారిపైకి తిరగబడ్డారు. దీంతో పోలీసులు లాఠీలకు పనిచెప్పారు. అయినా ముద్రగడ అనుచరులు వెనక్కి తగ్గలేదు. పోలీసులను తీవ్రస్థాయిలో దుర్భాషలాడుతూ వారిని పక్కకు నెట్టేయడం ప్రారంభించారు. రాజుపాలెం సమీపంలో ఏలూరు రేంజి డీఐజీ రామకృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు పాదయాత్రను అడ్డుకున్నారు. వారితో వాగ్వాదానికి దిగిన ముద్రగడ అనుచరులు పోలీసులను నెట్టేయడంతో డీఐజీ రామకృష్ణ పక్కనే ఉన్న పంటకాల్వలో పడిపోయారు. పోలీసు కానిస్టేబుళ్ల ఆయన్ను కాల్వ నుంచి బయటకు తీశారు. తర్వాత వీరవరం వరకు పాదయాత్ర సాగింది. వీరవరంలో పోలీసులు ముద్రగడను అదుపులోకి తీసుకుని వ్యాన్‌లోకి ఎక్కించారు. కాగా, కాపులను బీసీల్లో చేర్చాలని పాదయాత్ర చేపడతామని ముందుగా చెప్పినా తమపట్ల ప్రభుత్వం పాశవికంగా అణిచివేత ధోరణితో వ్యవహరిస్తోందని మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం విమర్శించారు. పాదయాత్ర ప్రారంభానికి ముందు కిర్లంపూడిలోని తన నివాసం వద్ద ఆదివారం ఉదయం ఆయన విలేకరులతో మాట్లాడారు. కాపు నేత ముద్రగడ పాదయాత్రపై మున్సిపల్ మంత్రి నారాయణ స్పందించారు. రిజర్వేషన్ల కోసం కాపులు 34 ఏళ్లుగా ఎదురుచూస్తున్నారని, కొద్ది నెలలు ఆగితే టీడీపీ ప్రభుత్వం కాపులకు రిజర్వేషన్లు కల్పిస్తుందని అన్నారు.

మీరు ఆపుతారా.. నేను రానా?

- యాత్రను అడ్డుకోలేకపోయారు
- జిల్లా పోలీసులపై డీజీపీ ఫైర్
- కిర్లంపూడిలో ఏం జరిగినా ముద్రగడదే బాధ్యత: డీజీపీ



రాజమహేంద్రవరం సిటీ : "ముద్రగడ పద్మనాభం పాదయాత్రను మీరు ఆపుతారా... లేక నన్ను వచ్చి కంట్రోల్ చేయమంటారా" అని డీజీపీ నండూరి సాంబశివరావు జిల్లా పోలీసు యంత్రాంగంపై మండిపడ్డారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం అర్బన్ జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. కిర్లంపూడిలో ఏం జరిగినా ముద్రగడదే బాధ్యత అన్నారు. ముద్రగడ ఏ ఉద్యమం చేసినా హింసాత్మక సంఘటనలు చోటుచేసుకుంటాయని, తునిలో కూడా అదే పునరావృతమైందన్నారు. పాదయాత్రకు అనుమతి తీసుకోవడానికి భేషజమేమిటని ప్రశ్నించారు. పాదయాత్రలో కొంతమంది విధ్వంసం సృష్టించడానికి వచ్చినట్టుగా తమకు సమాచారం ఉందని అన్నారు. ముద్రగడ పాదయాత్ర ఆపాలని, లేకపోతే అరెస్టు చేయడానికీ వెనుకాడమని చెప్పారు. పాదయాత్రను అడ్డుకోవడంలో స్థానిక పోలీసులు విఫలమయ్యారని, వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని, సంబంధిత డీఎస్పీని సస్పెండ్ చేస్తామని డీజీపీ చెప్పారు. డీఎస్పీ రామారావు, సీఐ కాశీవిశ్వనాథ్, ఎస్ఐ బాలాజీపై చర్యలు తీసుకోనున్నట్లు సమాచారం.



షోరూం ప్రారంభిస్తున్న దత్తాత్రేయ, కేటీఆర్ తదితరులు

ఘనంగా లలితా జువెలర్స్ ప్రారంభోత్సవం

- హైదరాబాద్‌లో తొలి షోరూమ్‌ను ప్రారంభించిన కేటీఆర్
- కేంద్ర మంత్రి దత్తాత్రేయ, హోం మంత్రి నాయిని సహా పలువురు ప్రముఖుల హాజరు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ జువెలరీ సంస్థ 'లలిత జువెలర్స్' హైదరాబాద్‌లో తన తొలి షోరూమ్‌ను ప్రారంభించింది. సోమాజిగూడ సర్కిల్‌లో ఏర్పాటు చేసిన ఈ షోరూమ్‌ను తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కె.టి.రామారావు ప్రారంభించారు. ప్రారంభోత్సవం సందర్భంగా.. అన్ని బంగారు నగలకూ తరుగులో ఒక శాతం రాయితీ, వజ్రాభరణాల్లో క్యారెట్‌కు రూ.2000 మేర తగ్గించారు. 1.3 లక్షల చదరపుటడుగుల విస్తీర్ణంలో.. రూ.700 కోట్లతో ఏర్పాటు చేసిన ఈ షోరూమ్‌లో వేలాది డిజైన్ల నగలను ప్రజలకు అందుబాటులో ఉంచారు. రూ.1000 నుంచి రూ.కోటి దాకా విలువ చేసే నగలు, రూ.3 కోట్ల దాకా విలువైన వజ్రాభరణాలు ఈ షోరూమ్‌లో అందుబాటులో ఉన్నాయి. రాయితీలు ప్రకటించడం, పలు రకాల నగలు అందుబాటులోకి తేవడంతో తొలిరోజే షోరూమ్ కళకళలాడింది. పెద్ద సంఖ్యలో వచ్చిన కొనుగోలుదారులతో సందడిగా మారింది. షోరూమ్ లోపలా, బయటా వందల సంఖ్యలో ప్రజలు, కొనుగోలుదారులతో కిక్కిరిసిపోవడంతో రద్దీని అదుపు చేసేందుకు పోలీసులు రంగంలోకి దిగారు. కాగా, లలిత జువెలర్స్ సంస్థ మరో రెండు నెలల్లో కూకట్‌పల్లిలో ఇంకో షోరూమ్ ఏర్పాటు చేయబోతోంది. కేంద్ర కార్మిక శాఖ మంత్రి దత్తాత్రేయ, తెలంగాణ రాష్ట్ర హోంమంత్రి నాయిని నరసింహా రెడ్డి, ఖైరతాబాద్ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి సహా పలువురు ప్రముఖులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.



దినకరన్ దూకుడు

పార్టీ పదవుల నుంచి ఏపీఎస్, రాజేంద్రన్‌ల తొలగింపు.. 22కి చేరిన బలం

చెన్నై, ఆగస్టు 27(ఆంధ్రజ్యోతి): తమిళనాడు రాజకీయాలు రసవత్తరంగా మారుతున్నాయి. అన్నాడీఎంకే శశికళ వర్గం నేత, పార్టీ డిప్యూటీ కార్యదర్శి టీటీవీ దినకరన్ దూకుడు పెంచారు. సీఎం ఎడప్పాడి పళనిస్వామి(ఈపీఎస్)ని పార్టీ పదవి నుంచి తొలగించారు. దినకరన్ వర్గం ఎమ్మెల్యేలు 19 మందిపై పార్టీ ఫిరాయింపు చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాలని స్పీకర్‌కు సిఫారసు చేసిన పార్టీ విప్ ఎస్. రాజేంద్రన్‌ను కూడా అరియలూరు జిల్లా పార్టీ కార్యదర్శి పదవి నుంచి తొలగించారు. మరోపక్క, రెండు రోజుల వ్యవధిలో ముగ్గురు ఎమ్మెల్యేలు దినకరన్ వర్గంలో చేరడంతో బలం 22కి పెరిగింది. అన్నాడీఎంకేలో మాజీ సీఎం ఓపీఎస్ వర్గం విలీనమైనప్పటి నుంచి ఎమ్మెల్యేలకు దినకరన్ వల విసురుతూనే ఉన్నారు. ఇప్పటికే ఆయన వర్గంలోని 19 మంది శాసనసభ్యులు ఎడప్పాడి ప్రభుత్వానికి మద్దతు ఉపసంహరించుకుంటున్నట్లు గవర్నర్‌కు లేఖలు అందజేశారు. ఈ నేపథ్యంలో తిరుప్పరకుంద్రం శాసనసభ్యుడు బోసు ఆదివారం ఉదయం దినకరన్‌కు మద్దతు ప్రకటించారు. దీంతో దినకరన్ వర్గంలోని శాసనసభ్యుల సంఖ్య 22కు చేరింది. కాగా, శాసనసభలో నిషేధిత గుట్కా ప్యాకెట్లను ప్రదర్శించామన్న కారణంతో తనతో సహా 10 మంది డీఎంకే ఎమ్మెల్యేలను సస్పెండ్ చేయడానికి అధికార అన్నాడీఎంకే కుట్ర పన్నుతోందని డీఎంకే కార్యాచరణ అధ్యక్షుడు ఎంకే స్టాలిన్ ఆరోపించారు.

త్వరలో స్టాలిన్-దినకరన్ ప్రభుత్వం: స్వామి

డీఎంకే కార్యాచరణ అధ్యక్షుడు స్టాలిన్, అన్నాడీఎంకే డిప్యూటీ ప్రధాన కార్యదర్శి దినకరన్ కలిసి కొద్దిరోజుల్లో సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతున్నారని బీజేపీ సీనియర్ నేత సుబ్రహ్మణస్వామి ఆదివారం ట్విట్టర్‌లో సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇది రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. ఇటీవలే ఎడప్పాడి వర్గంతో పన్నీర్ వర్గం వీలైనమైన నేపథ్యంలో.. దినకరన్ వర్గం ఎమ్మెల్యేలు 19 మంది ఎడ ప్పాడి ప్రభుత్వానికి మద్దతు ఉపసంహరించుకున్నారు. ప్రభుత్వంపై అవిశ్వాసం పెట్టేందుకు స్టాలిన్ సిద్ధపడుతున్నారు.



పెరిగిన పోలవరం అంచనాలకు వచ్చే బడ్జెట్‌లో ఆమోదం

- 16జాతీయ ప్రాజెక్టుల్లో ఇక్కడే వేగంగా పనులు.. సాగునీటి ప్రాజెక్టుల జాతీయ కమిషనర్ వోరా

అమరావతి, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టుకు కేంద్రం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని, 2018 నాటికి దీన్ని పూర్తిచేయాలనే లక్ష్యంతో ఉందని సాగునీటి ప్రాజెక్టుల జాతీయ కమిషనర్ వోరా స్పష్టం చేశారు. ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.58,636కోట్లకు పెరిగిందని, దీన్ని 2018-19 బడ్జెట్ సమావేశాల్లో ఆమోదించే అవకాశం ఉందని చెప్పారు. ఈనెల 24న పోలవరం ప్రాజెక్టు సందర్శనకు వచ్చిన వోరా బృందం జల వనరులశాఖ కార్యదర్శి శశిభూషణ్‌కుమార్, ఈఎన్‌సీ ఎం.వెంకటేశ్వరరావు తదితరులతో సమావేశమైంది. అనంతరం విజయవాడలో మంత్రి ఉమామహేశ్వరరావుతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా వోరా మాట్లాడుతూ, "దేశంలోని 16జాతీయ ప్రాజెక్టుల్లో పోలవరం పనులు మాత్రమే లక్ష్యం మేరకు సాగుతున్నాయి. కేంద్రం నుంచి నిధులు రాబట్టడంలోనూ ఈ ప్రాజెక్టే ముందంజలో ఉంది. సీఎం చంద్రబాబు ప్రతి సోమవారం సమీక్షిస్తుండటంతో పనుల్లో వేగం కనిపిస్తోంది. ఈ ప్రాజెక్టు కోసం రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన భూసేకరణ, పరిహారం చెల్లింపుల విధానం చాలా బాగుంది." అని కితాబిచ్చారు. ఈ ప్రాజెక్టు నిర్మాణం కోసం చేసిన వ్యయంలో రూ.1000 కోట్లను వారం రోజుల్లో విడుదల చేస్తామన్నారు.

టీడీపీలోకి వాణీవిశ్వనాథ్



చెన్నై, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సినీ నటి వాణీవిశ్వనాథ్ త్వరలో తెలుగుదేశం పార్టీలో చేరనున్నారు. చిత్తూరు జిల్లా నగరికి చెందిన టీడీపీ సీనియర్ నేతలైన ఆనం శ్రీహరి నాయుడు, దూర్వాసులు నాయుడు, హరినాయుడు, రామానుజం చలపతి తదితరులు ఆదివారం చెన్నై వచ్చి వాణీవిశ్వనాథ్‌ను కలుసుకున్నారు. టీడీపీలో చేరాలని ఈ సందర్భంగా వారు ఆమెను ఆహ్వానించారు. ఇందుకు ఆమె అంగీకరించారు. ఈ సందర్భంగా వాణీవిశ్వనాథ్ 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ... తన అభివృద్ధికి కారకులైన తెలుగువారికి ఏదైనా చేయాలని ఎంతో కాలంగా అనుకుంటున్నానన్నారు. అదే విధంగా సీఎం చంద్రబాబు నాయకత్వమంటే అభిమానమన్నారు. దక్షిణభారతదేశం.. ఆయన నాయకత్వం గురించి, ఆయన విజన్ గురించి ఇప్పుడు విశేషంగా చర్చించుకుంటోందని అందుకే త్వరలోనే అమరావతి వెళ్లి టీడీపీలో చేరతానని ఆమె వివరించారు.

కమ్యూనిస్టులు.. ఎన్నికలకు దూరం!

- భవిష్యత్తులో ఇదే మేలనిపిస్తోంది: సీపీఐ

అమరావతి, ఆగస్టు 27(ఆంధ్రజ్యోతి): భవిష్యత్తులో జరిగే అన్ని ఎన్నికల్లోనూ కమ్యూనిస్టులు పోటీ చేయకుండా ఉంటేనే మేలనిపిస్తోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ అన్నారు. కాకినాడ మున్సిపల్ ఎన్నికలను చూసే ఇలా వ్యాఖ్యానించాల్సి వచ్చిందన్నారు. ప్రధాన పార్టీలు ఎక్కడికక్కడ కోట్ల రూపాయిలను వెదజల్లుతున్నాయని ఆరోపించారు. నంద్యాల ఉప ఎన్నికల్లో పోటీపడి మరీ ఓటర్లను కొనుగోలు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. వార్డు కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలను కొనుగోలు చేసే దుస్థితి దాపురించడం దారుణమని వ్యాఖ్యానించారు. అభివృద్ధిని చూసి ఓటెయ్యాలని సీఎం చంద్రబాబు చెబుతూనే తన పార్టీ నేతలకు నోట్ల కట్టలను ఎందుకు పంచుతున్నారని ప్రశ్నించారు. నంద్యాల ఉప ఎన్నిక నిర్వహణలో ఎన్నికల కమిషన్‌తో పాటు పోలీస్‌శాఖ పూర్తిగా విఫలమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఫలితాలపై పెద్ద ఎత్తున బెట్టింగులు జరుగుతుంటే పోలీసులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ఆదివారం విజయవాడలో ఆయన మీడియాతో మాట్లాడారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడతూ దేశ వ్యాప్తంగా సెప్టెంబరు 15 నుంచి అక్టోబరు 15 వరకు ప్రచార కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని 13 జిల్లాల్లోనూ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. బీజేపీ అధికారంలోకి వస్తే విదేశాల్లో మూలుగుతున్న రూ.70 లక్షల కోట్ల నల్లధనాన్ని వెలికి తీస్తామని, నల్లకుబేరుల ఆట కట్టిస్తామని ఎన్నికల్లో ఇచ్చిన హామీని నెరవేర్చడంలో మోదీ విఫలమయ్యారని ఆరోపించారు. డేరా బాబా సాయంతో హరియాణాలో గెలిచినందునే ప్రస్తుత ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరిస్తోందని రామకృష్ణ విమర్శించారు. డేరాబాబాతో అక్కడి ప్రభుత్వం లాలూచీ పడటం వల్లే భారీ విధ్వంసం జరిగిందన్నారు.

హింసను తిప్పి కొట్టాలి

- మతాలకు అతీతంగా మహిళకు సమాన హక్కులు
- రైతుకు మంచి రోజులు రావాలి
- ఉప రాష్ట్రపతి వెంకయ్య ఆకాంక్ష
- చెన్నైలో 'క్విట్ ఇండియా' వేడుకల్లో ప్రసంగం

చెన్నై, ఆగస్టు 27(ఆంధ్రజ్యోతి): "ప్రజాస్వామ్య వ్యవస్థలో హింసకు తావు లేదు. హింసాత్మక సంఘటనల వల్ల నష్టపోయేది సామాన్య ప్రజలే. హింస ఏ రూపంలో వచ్చినా దానిని అణచివేయాల్సిందే. దేశ ప్రజలంతా హింసకు వ్యతిరేకంగా పోరాడాలి" అని ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు పేర్కొన్నారు. క్విట్ ఇండియా వజ్రోత్సవాల సందర్భంగా ఆదివారం చెన్నైలోని అన్నా విశ్వవిద్యాలయంలో జరిగిన 'నవభారత సాధనకు శపథం చేద్దాం' సభలో వెంకయ్య ప్రసంగించారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి ఏడు దశాబ్దాలైనా పేదరికం, నిరక్షరాస్యత, లింగవివక్ష, కులమత భేదాలు కొనసాగుతూనే ఉన్నాయని, ఈ అరిష్టాలను తొలగించేందుకు సమైక్యంగా పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. వ్యవసాయ దేశంగా పేరుగడించిన మన దేశం ఆహారం కోసం దిగుమతులకు అర్రులు చాస్తుండటం తగదన్నారు. రైతులు తమ ఉత్పత్తులకు తామే ధరలను నిర్ణయించుకునేలా మంచి రోజులు రావాలని ఆకాంక్షిస్తున్నానని తెలిపారు. గ్రామాలు, పట్టణాల మధ్య వ్యత్యాసాలను రూపుమాపాల్సి ఉందన్నారు. ఇటీవల ట్రిపుల్ తలాక్‌కు వ్యతిరేకంగా సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పు చరిత్రాత్మకమని వెంకయ్య అన్నారు. "ఏ మతానికి చెందిన మహిళలైనా వివక్షకు గురికాకూడదు. పురుషులతో సమానంగా హక్కులు కల్పించాల్సిందే" అని తెలిపారు. ఈ సభలో రాష్ట్ర ఇన్‌చార్జ్ గవర్నర్ విద్యాసాగరరావు, పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి అనంత్‌కుమార్ పాల్గొన్నారు.

అరెస్టు చేసినట్లుంది!

- ఉప రాష్ట్రపతిగా 'నిబంధనల చట్రం'
- ఇదీ వెంకయ్య నాయుడు అంతరంగం
- కేంద్రం ఇచ్చినవి పూర్తయితే ఏపీ నెంబర్ వన్

అమరావతి, ఆగస్టు 27(ఆంధ్రజ్యోతి): నిరంతరం ప్రజల మధ్య పర్యటనలు! పార్టీలో, ప్రభుత్వంలో ఎక్కడ సమస్య వచ్చినా 'పరిష్కర్త' పాత్ర! సభలు, సమావేశాల్లో మాటల మంత్ర దండంతో కట్టిపడేసే నైపుణ్యం! ఇలా నాలుగున్నర దశాబ్దాలపాటు రాజకీయం! ఇప్పుడు ఒక్కసారిగా ఉప రాష్ట్రపతి అయ్యారు. ఇప్పుడెలా ఉంది అని ప్రశ్నిస్తే... 'అరెస్టు చేసినట్లుంది' అని వెంకయ్య నాయుడు నవ్వుతూ చెబుతున్నారు. రాజ్యాంగబద్ధ పదవికి సంబంధించిన నిబంధనల్లో కుదురుకోవడానికి, అలవాటుపడడానికి కొంత సమయం పడుతుందని అంటున్నారు. ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా వెంకయ్య పేరు ఖరారు చేయగానే... కేంద్ర మంత్రి సుష్మాస్వరాజ్ స్పందిస్తూ... "వెంకయ్యజీ... ఇక నుంచి మీకు ఇష్టమైన రెండు పనులను చేసే అవకాశం ఉండదు! ఒకటి పర్యటనలు, రెండోది మీడియాతో మాట్లాడడం" అని అన్నారట! అయితే... ఏ సంస్థను ఎలా ఉపయోగించుకోవాలో వెంకయ్యకు బాగా తెలుసు అని ప్రధాని మోదీ చమత్కరించారట! ఉప రాష్ట్రపతి పదవిలో అన్నీ 'ప్రొటోకాల్' ప్రకారమే జరగాలి. కానీ, వెంకయ్య వాటిని కూడా పక్కన పెట్టేస్తున్నారు. ఇటీవల స్వాతంత్ర్య దినోత్సవం రోజున రాష్ట్రపతి భవన్‌లో ఎట్‌హోం కార్యక్రమం నిర్వహించారు. ఆ కార్యక్రమానికి 500ల మందికి పైగా వీవీఐపీలు, ప్రముఖులు హాజరయ్యారు. రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతికి పెద్ద కుర్చీలు వేసి కూర్చోపెట్టారు. "మీరిక్కడే కూర్చుని ఉండాలి. అంతా వచ్చి మీకు నమస్కారం పెట్టి వెళ్తుంటారు" అని ఉపరాష్ట్రపతి కార్యాలయ అధికారులు వెంకయ్యకు చెప్పారు. "అదేమిటి! వాళ్లను మనమే ఆహ్వానించాం. అతిథులు వరుసలో వచ్చి నమస్కారం పెట్టుకుంటే వెళ్తే మనం కూర్చోవడం కరెక్ట్ కాదు" అని వెంకయ్య అన్నారు. నిబంధనలు అంతే ఉన్నాయని అధికారులు బదులిచ్చారు. రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి రాజ్యాంగబద్ధ హోదాలని, వారికి ఇచ్చే గౌరవం దేశానికి దక్కుతుందని అన్నారు. ఈ సమాధానంతోనూ వెంకయ్య సంతృప్తి చెందలేదు. "ఐదొందల మంది ఉన్నారు కదా! నేనే అక్కడికి వెళ్తా. ఇది నా నిర్ణయం" అని చెప్పేశారు. దీంతో అధికారులు తప్పనిసరి పరిస్థితుల్లో సరే అన్నారు. అప్పటికప్పుడు అటూ ఇటూ తాళ్లు కట్టారు. "మీరు మధ్యలో నడుస్తూ వెళ్లండి! కానీ... మీరు ఎవ్వరికీ కరచాలనం ఇవ్వకూడదు" అని సూచించారు. 'బాగా గుర్తు చేశారు' అనుకుంటూ ఆ వెంటనే అందరికీ షేక్‌హ్యాండ్‌లు ఇస్తూ వెంకయ్య ముందుకు సాగారు.

పని చాలా ఉంటుంది!

'పార్లమెంటు సమావేశాల్లో తప్ప ఉప రాష్ట్రపతికి పనేం ఉంటుంది!' అనే అభిప్రాయం తప్పు అని వెంకయ్య తేల్చేశారు. వివిధ అంశాలపై మొత్తం 30 పార్లమెంటరీ కమిటీలు ఉంటాయి. అందులో పది కమిటీలు రాజ్యసభ సభ్యులతో ఏర్పాటవుతాయి. రాజ్యసభ అధ్యక్షుడి హోదాలో ఉప రాష్ట్రపతే ఆ కమిటీలు నియమిస్తారు. ఇక... దేశంలోని పది ప్రముఖ విశ్వవిద్యాలయాలకు ఉపకులపతిగా వ్యవహరిస్తారు. మరికొన్ని ప్రతిష్ఠాత్మక సంస్థలకు పెద్దగా ఉంటారు. ఏటా కొన్ని విదేశీ పర్యటనలుంటాయి. వంద రోజుల పాటు రాజ్యసభ సమావేశాలుంటాయి. ఈ సభకు చైర్మన్‌గా బాధ్యతలు నిర్వర్తించాల్సి ఉంటుంది. ఇవన్నీ కీలకమైనవని వెంకయ్య పేర్కొంటున్నారు.



ఆత్కూరులో స్వర్ణభారతి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంప్‌ను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించిన ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు

నాడు చాలా మథనపడ్డాను!

ఉప రాష్ట్రపతి వెంకయ్య ఆదివారం అమరావతిలో స్వర్ణ భారతి ట్రస్టులో కొద్దిసేపు మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. రాష్ట్ర విభజన నాటి పరిస్థితులను మరోసారి గుర్తుకు తెచ్చుకున్నారు. "ఒక జాతీయ నాయకుడిగా ఉండి ఏపీవైపు మాట్లాడడం సమంజసమేనా? అని మనసులో అనుమానం. కానీ, అది చరిత్రాత్మక సమయం. మన బిడ్డలు, తెలుగోళ్లకు అన్యాయం జరగకుండా ఉండాల్సిన సమయం. దీంతో ఒకరోజు ముందు అద్వాణీకి చెప్పాను. ఏపీకి జరిగిన అన్యాయంపై గట్టిగా మాట్లాడాలని అనుకుంటున్నానని చెప్పా. ఆయన కూడా మాట్లాడమన్నారు" అని తెలిపారు. విభజన చట్టంలో ప్రస్తుతం ఉన్న హామీలన్నీ మొదట్లో లేవని, జైరాం రమేశ్ తదితరులతో మాట్లాడాకే చట్టంలో చేరాయని తెలిపారు. రాష్ట్రానికి కేంద్రం చేసిన సహాయాన్ని లెక్కలతో సహా వివరించారు. "తెలుగు వారిగా అవి మనకు తక్కువ నిధులే అనిపించవచ్చు. కానీ, ప్రాజెక్టులు ఒకసారి మొదలుపెట్టాక పూర్తికావాల్సిందే. ప్రత్యేక హోదా ఇచ్చే పరిస్థితి లేనందునే లక్షల కోట్ల ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించారు. దాంతోపాటు ఐదేళ్లపాటు విదేశీ సాయంతో నడిచే ప్రాజెక్టుల రుణాలు కేంద్రమే తీర్చేందుకు ఒప్పుకొంది. విశాఖపట్నంలో జరిగిన పెట్టుబడుల సదస్సులో రూ.10.5 లక్షల కోట్ల విలువైన ఒప్పందాలు జరిగితే... అందులో 6.5లక్షల కోట్లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలవే. ఇవన్నీ వెంటనే వచ్చేస్తాయని కాదు. కానీ, ప్రకటించాక రావాల్సిందే. కేంద్రం ఇచ్చినవన్నీ పూర్తి చేస్తే ఏపీ అగ్రస్థానంలో నిలుస్తుంది" అని వెంకయ్య వివరించారు. మంత్రిగా ఉన్నప్పుడు ఏపీకి అత్యధిక ఇళ్లు ఇచ్చానని గుర్తు చేసుకున్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న జస్టిస్ నాగేశ్వరరావు

గృహహింస ఫిర్యాదులు ఏపీలో ఎక్కువ

- భార్యాభర్తల బంధాన్ని పెంచాలి: జస్టిస్ నాగేశ్వరరావు

విజయవాడ, ఆగస్టు 27(ఆంధ్రజ్యోతి): వరకట్న వేధింపులు, గృహహింసకు సంబంధించిన కేసుల్లో న్యాయవాదులు మధ్యవర్తులుగా ఉండి, భార్యాభర్తల మధ్య సంబంధాలను పెంపొందించేలా కృషి చేయాలని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ లావు నాగేశ్వరరావు అభిప్రాయపడ్డారు. పిటిషన్లను ప్రోత్సహించడం కంటే వాళ్ల మధ్య అనురాగం, ఆప్యాయతను పెంచితే సమాజంలో విలువలు పెరుగుతాయని చెప్పారు. గృహహింసకు సంబంధించిన ఫిర్యాదులు ఏపీలో ఎక్కువగా ఉంటున్నాయని, చట్టాలపై మహిళలకు అవగాహన పెరగడమే దీనికి కారణమని ఆయన అభిప్రాయపడ్డారు. సి.పద్మనాభరెడ్డి, పీఎన్ భగవతి స్మారక ప్రసంగంలో భాగంగా ఇండియన్ లాయర్స్ అసోసియేషన్(ఐఏఎల్) ఏపీ యూనిట్ విజయవాడలో ఆదివారం 'క్రిమినల్ లా అండ్ మ్యారేజ్' అంశంపై సదస్సును నిర్వహించింది. దీనిలో ఆయన ముఖ్యఅతిథిగా ప్రసంగించారు. జస్టిస్ నాగేశ్వరరావు, తెలుగు రాష్ట్రాల ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సి.ప్రవీణ్‌కుమార్‌లను న్యాయవాదుల సంఘం ఈ సందర్భంగా ఘనంగా సత్కరించింది. కార్యక్రమంలో కృష్ణాజిల్లా సెషన్స్ జడ్జి వై.లక్ష్మణరావు, బెజవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సోము కృష్ణమూర్తి, ఐఏఎల్ అధ్యక్షుడు ఆర్ఎస్ చీమా, కార్యదర్శి చలసాని అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

5వేల స్కూళ్లలో డిజిటల్ క్లాసులు: గంటా

అనకాపల్లి, ఆగస్టు 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 5వేల పాఠశాలల్లో డిజిటల్ తరగతులు ఏర్పాటు చేయనున్నామని మంత్రి గంటా శ్రీనివాసరావు అన్నారు. విశాఖజిల్లా కశింకోట మండలం వెదురుపర్తి పాఠశాలలో డిజిటల్ తరగతుల నిర్వహణకు అవసరమైన సామగ్రిని రోటరీ క్లబ్ సమకూర్చింది. ఆదివారం స్థానిక రోటరీ కల్యాణ మండపంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆ సామగ్రిని పాఠశాల సిబ్బందికి మంత్రి అందజేశారు. రాష్ట్రంలోని ఆరు జిల్లాల్లో 51 పాఠశాలల్లో డిజిటలైజేషన్‌కు సంబంధించిన సామగ్రి అందజేసిన రోటరీ క్లబ్ ప్రతినిధులను ఆయన అభినందించారు.

నేడు పీఎస్ఎల్వీ-సీ39 రిహార్సల్స్

శ్రీహరికోట, ఆగస్టు 27: స్వదేశీ నావిగేషన్ వ్యవస్థ కోసం రూపొందించిన 'నావిక్'ను బలోపేతం చేసేందుకు ఐఆర్ఎన్ఎస్ఎస్-1హెచ్ ఉపగ్రహాన్ని రోదసిలోకి ప్రవేశపెట్టేందుకు ఇస్రో సిద్ధమైంది. శ్రీహరికోట సతీష్ థావన్ అంతరిక్ష కేంద్రం రెండో ప్రయోగవేదిక నుంచి పీఎస్ఎల్వీ-సీ39 రాకెట్ ద్వారా కక్ష్యలోకి ప్రవేశపెట్టేందుకు ఏర్పాట్లు పూర్తి చేసింది. షార్‌లోని వ్యాబ్‌లో రాకెట్‌తో ఉపగ్రహం అనుసంధానం ముగియడంతో ఆదివారం ఉదయం 6.30 గంటలకు రాకెట్‌ను శాస్త్రవేత్తలు రెండో ప్రయోగ వేదికపైకి చేర్చారు. సోమవారం రాకెట్ ప్రయోగానికి రిహార్సల్స్ నిర్వహించేందుకు శాస్త్రవేత్తలు ఏర్పాట్లు చేశారు. ఇది విజయవంతమైతే మంగళవారం ఎంఆర్ఆర్, లాంచ్ ఆథరైజేషన్ బోర్డు సమావేశాలు ఏర్పాట్లు చేసి ప్రయోగానికి ఆమోదం తెలపనున్నారు. అనంతరం 30వ తేదీ మధ్యాహ్నం 1.59 గంటలకు కౌంట్‌డౌన్‌ను ప్రారంభిస్తారు. 29 గంటలపాటు కౌంట్‌డౌన్‌ను కొనసాగించి 31వ తేదీ సాయంత్రం 6.59 గంటలకు రాకెట్‌ను ప్రయోగిస్తారు.

నంద్యాల తీర్పు నేడే

- ఉదయం 8 గంటల నుంచి కౌంటింగ్
- 11 గంటలకల్లా ఫలితం వెలువడే చాన్స్
- ప్రతిష్ఠాత్మక పోరుపై ఇరుపార్టీల్లో ఉత్కంఠ
- 2019 ఎన్నికలకు సెమీఫైనల్‌గా ప్రచారం

నంద్యాల/అమరావతి, ఆగస్టు 27(ఆంధ్రజ్యోతి): హోరాహోరీగా సాగిన నంద్యాల పోరులో విజేత ఎవరో మరికొద్ది గంటల్లో తేలిపోనుంది. నంద్యాల ఉప ఎన్నిక ఓట్ల లెక్కింపు సోమవారం ఉదయం 8 గంటలకు ప్రారంభమవుతుంది. ఉదయం 9.30 గంటలకల్లా నంద్యాల నాడి ఏమిటో తెలిసిపోనుంది. 11 గంటలకల్లా తుది ఫలితం వెల్లడయ్యే అవకాశం ఉంది. ఉప ఎన్నిక పోరును అధికార టీడీపీ, ప్రతిపక్ష వైసీపీ ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాయి. దీంతో ఈ ఎన్నికను 2019 సార్వత్రిక ఎన్నికలకు సెమీఫైనల్‌గా భావించే పరిస్థితి ఏర్పడింది. ఈ ఫలితం కోసం రెండు తెలుగు రాష్ట్రాలూ ఉత్కంఠతో ఎదురుచూస్తున్నాయి. తమ ప్రభుత్వం మూడేళ్లలో చేసిన అభివృద్ధితోపాటు ప్రతిపక్షనేత జగన్ వ్యవహార శైలిపై ప్రజలు ఈ ఎన్నికల్లో తీర్పు ఇవ్వనున్నారని టీడీపీ నేతలు పేర్కొంటున్నారు.



కౌంటింగ్ కేంద్రం వద్ద పోలీసుల భద్రత

నంద్యాలలో జెండా ఎగురవేస్తే సార్వత్రిక ఎన్నికల్లో తమకు తిరుగుండదని వైసీపీ నేతలు భావిస్తున్నారు. వైసీపీ వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ బాధ్యతలు చేపట్టాక జరిగిన తొలి ఎన్నిక ఇదే కావడం.. ఈ ఎన్నికను జగన్ అంతా తానై వ్యవహరించి కడదాకా ప్రచారం చేయడంతో.. నంద్యాల ఉప ఎన్నిక వైసీపీకి ప్రతిష్ఠాత్మకంగా మారింది. నంద్యాలలో గెలుపు సాధిస్తే.. ప్రభుత్వ పథకాలు ప్రజామోదం పొందాయని, ప్రజల్లో టీడీపీ బలంగా ఉందని ఆ పార్టీ నేతలు చెప్పుకోగలుగుతారు. ఉప ఎన్నికతో మొదలైన విజయం.. సార్వత్రిక ఎన్నికల వరకు కొనసాగుతుందని చెప్పుకునేందుకు ఆస్కారం ఉంటుంది. అయితే ఫలితం వ్యతిరేకంగా వస్తే ప్రభుత్వ వ్యతిరేక పవనాలు మొదలయ్యాయని ప్రచారం చేసేందుకు వైసీపీ చేతికి అస్త్రం దొరికినట్లే. హోరాహోరీగా సాగిన ఈ ఎన్నికలో టీడీపీపై కంటే సీఎం చంద్రబాబునే లక్ష్యంగా చేసుకుని జగన్ విమర్శలు చేశారు. హామీలను నెరవేర్చని చంద్రబాబును నడిరోడ్డుపై కాల్చి చంపాలని.. ఉరి తీయాలంటూ జగన్ చేసిన విమర్శలు వివాదాస్పదమయ్యాయి. జగన్ వైఖరికి వైసీపీ ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ సలహానే కారణమని ప్రచారం జరుగుతోంది.

14 టేబుళ్లు.. 19 రౌండ్లు

జిల్లా ఎన్నికల అధికారి సత్యనారాయణ, ఎస్పీ గోపీనాథ్ జెట్టి, ఎన్నికల రిటర్నింగ్ అధికారి ప్రసన్న వెంకటేష్ ఆధ్వర్యంలో ఓట్ల లెక్కింపు ఏర్పాట్లు పూర్తి చేశారు. నంద్యాల బరిలో మొత్తం 15 మంది బరిలో ఉన్నారు. ఈనెల 23న జరిగిన ఎన్నికలో 79.13 శాతం పోలింగ్ నమోదైంది. నంద్యాల అర్బన్‌లో మొత్తం 1,42,628 ఓట్లకుగాను 1,05,484 ఓట్లు పోలయ్యాయి. నంద్యాల రూరల్‌లో 47,386 ఓట్లకుగాను 41,512 ఓట్లు పోలయ్యాయి. గోస్పాడు మండలంలో మొత్తం 28,844 ఓట్లకుగాను 26,193 ఓట్లు పోలయ్యాయి. నంద్యాల ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాలలో ఓట్లు లెక్కిస్తారు. మొత్తం 14 టేబుళ్లను ఏర్పాటు చేశారు. 19 రౌండ్లలో ఓట్లను లెక్కించనున్నారు. కౌంటింగ్ కేంద్రం వద్ద, పట్టణంలోనూ భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇదిలావుండగా, ఉప ఎన్నిక ఫలితంపై వందల కోట్లలో పందేపు రాయుళ్లు పందేలు కాశారు. రెండు తెలుగు రాష్ట్రాలతోపాటు కర్ణాటకలోని బళ్లారిలోనూ బెట్టింగ్‌లు జోరుగా సాగాయి. ఫలితం వెలువడే సమయం దగ్గరపడటంతో బెట్టింగ్‌రాయుళ్లలో ఉత్కంఠ నెలకొంది.



అన్నమ్మఘాటీసెంటర్‌లో ప్రచారం చేస్తున్న జగన్

బాబు హామీలకు మోసపోవద్దు

- అసెంబ్లీ ఎన్నికల్లో వచ్చేది వైసీపీయే
- ఇప్పుడు టీడీపీకి ఓటేసి అన్యాయానికి పట్టంగట్టొద్దు
- నంద్యాలతో నాంది.. కాకినాడలో తుది తీర్పు: జగన్

కాకినాడ, ఆగస్టు 27(ఆంధ్రజ్యోతి): 'ఏడాదిలోగా అసెంబ్లీ ఎన్నికలు రాబోతున్నాయి. ఆ ఎన్నికలు కురుక్షేత్ర మహాసభను తలపిస్తాయి. నీతికి, అవినీతికి మధ్య యుద్ధం జరుగనుంది. దీనికి నంద్యాల ఉప ఎన్నిక నాంది. ఇప్పుడు కాకినాడ కార్పొరేషన్‌కు జరుగబోయే స్థానిక సంస్థ ఎన్నిక తుది తీర్పు కాబోతోంది. అందువల్ల ఇక్కడ ఓటర్లు ఆలోచించి ఓటేయండి. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో వైసీపీ అధికారంలోకి రావడం ఖాయం. ఇప్పుడు కార్పొరేషన్ ఎన్నిక పూర్తయ్యాక రాష్ట్రంలో టీడీపీ పాలన ఉండేది ఏడాదిన్నరే. తర్వాత మా పాలనలో కార్పొరేషన్‌ను మూడున్నరేళ్లలో అభివృద్ధి చేస్తాం. ఏది కావాలి... కాకినాడ ఓటర్లూ ఆలోచించుకోండి' అని వైసీపీ అధినేత జగన్ అన్నారు. కాకినాడ నగరపాలక సంస్థకు ఈ నెల 29న జరిగే ఎన్నికల నేపథ్యంలో ప్రచారం చివరి రోజైన ఆదివారం జగన్ కాకినాడలో రోడ్ షో నిర్వహించారు. అన్నమ్మఘాటీ సెంటర్ కూడలిలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. 'మిట్ట మధ్యాహ్నం ఈ మండుటెండను లెక్క చేయకుండా ప్రజలు నన్ను చూడడానికి, నేను ఏం చెబుతానో వినడానికి వచ్చారు. వారందరి కష్టాలు తీరుస్తాను. కష్టాలు తీరాలంటే వైసీపీ అభ్యర్థులకు పట్టం కట్టాలి. తద్వారా టీడీపీ అరాచక పాలనకు చరమగీతం పలకాలి. మోసం చేయడం చంద్రబాబు నైజం. నమ్మి అధికారమిచ్చిన ప్రజలను చంద్రబాబు మోసం చేస్తున్నారు' అని ఆరోపించారు.

ఉప ఎన్నికలా...?

కాకినాడ రోడ్ షోలో జగన్ పలుమార్లు తడబడ్డారు. ఎన్నికల ఉపన్యాసంలో ఒక చోట యథాలాప ప్రసంగం చేస్తూ... తనపై చూపుతున్న ఆప్యాయత, ప్రేమను వృథా కానివ్వనంటూ... 'ఈ ఉప ఎన్నికలో' అని జగన్ అన్నారు. వెంటనే సరిదిద్దుకుని 'కార్పొరేషన్ ఎన్నికలో వైసీపీకే ఓటెయ్యాలన్నారు. జగన్ తడబాటును గుర్తించిన స్థానికులు... నంద్యాల ఎఫెక్టు ఇంకా పోలేదని చమత్కరించుకోవడం కనిపించింది.

నంద్యాలలో గెలుపు మాదే


- వైసీపీలో ఎవరూ ఉండరు: మంత్రి ఆది
- అభివృద్ధి చేసి చూపించి ఓట్లడుగుతున్నాం: సోమిరెడ్డి

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

నంద్యాలలో టీడీపీ భారీ మెజారిటీతో విజయం సాధించనున్నదని మంత్రులు సోమిరెడ్డి, ఆదినారాయణరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. వారు ఆదివారం వేర్వేరుగా కడప, తిరుపతిలో విలేకరులతో మాట్లాడారు. సోమవారం వెలువడే నంద్యాల ఉప ఎన్నిక ఫలితాలు వైసీపీ అహంకారానికి చెంపపెట్టు కానున్నదని, ఫలితం వెలువడ్డాక ఆ పార్టీలో ఎవరూ ఉండరని మార్కెటింగ్ శాఖ మంత్రి ఆదినారాయణరెడ్డి అన్నారు. అభివృద్ధి, సంక్షేమం సమపాళ్లలో చేసి చూపిస్తున్నాం కాబట్టే ప్రజల వద్దకు ధైర్యంగా వెళుతున్నామని, నిర్భయంగా ఓట్లు అడుగుతున్నామని వ్యవసాయశాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. కాగా, రాష్ట్రంలోని వైసీపీ దొంగలు గ్రామాలపై పడుతున్నారని, ప్రజలను మోసం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని కేంద్రమంత్రి అశోకగజపతిరాజు అన్నారు. వైసీపీ అధినేత జగన్‌ను గజదొంగ అని వ్యాఖ్యానించారు. ఆదివారం విజయనగరం జిల్లా బొబ్బిలిలో జరిగిన టీడీపీ జిల్లా కార్యవర్గ సమావేశంలో అశోక్ గజపతి మాట్లాడారు.

కాకినాడకు వాళ్లు చేసింది శూన్యం

- బీజేపీ, టీడీపీలపై రఘువీరా ఆరోపణ



కాకినాడ కార్పొరేషన్, ఆగస్టు 27: బీజేపీ, టీడీపీలు కాకినాడకు చేసింది శూన్యమని పీసీసీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి ఆరోపించారు. ఆ పార్టీలను ఎండగట్టేందుకు గట్టి ప్రయత్నం చేస్తున్నామన్నారు. కార్పొరేషన్ ఎన్నికల ప్రచారంలో పాల్గొనేందుకు ఆదివారం కాకినాడ వచ్చిన ఆయన డీసీసీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ప్రత్యేక హోదా విషయంలో దగా చేసిన బీజేపీ, టీడీపీ, వీటితో ఆలస్యంగా చేతులు కలిపిన జగన్ పార్టీకి బుద్ధి చెప్పే అవకాశం కాకినాడ ప్రజలకు దక్కిందన్నారు. ఈ మూడు పార్టీలు దోచుకోవడం, దాచుకోవడంలో సామరస్యంగా ముందుకు సాగుతున్నాయన్నారు. పదేళ్లలో కాంగ్రెస్ చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు తప్ప బీజేపీ, టీడీపీ ఏమీ చేయలేదన్నారు. స్మార్ట్ సిటీకి కేంద్రం నిధులను నిలిపివేసిందన్నారు. ఆ మూడు పార్టీలను తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. సమావేశంలో కేంద్ర మాజీ మంత్రి పళ్లంరాజు, డీసీసీ అధ్యక్షుడు పంతం నానాజీ, మాజీ ఎంపీ ఏజేవీబీ మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కాకినాడలో ప్రచారం సమాప్తం

- రేపే పోలింగ్... సర్వం సిద్ధం

కాకినాడ, ఆగస్టు 27(ఆంధ్రజ్యోతి): కాకినాడ నగరపాలక సంస్థ ఎన్నికల ప్రచారం ఆదివారం సాయంత్రం ఐదు గంటలకు ముగిసింది. చివరి రోజున టీడీపీ, వైసీపీ అధినేతలు చంద్రబాబు, జగన్ ఆయా పార్టీల అభ్యర్థుల తరపున రోడ్ షోలు నిర్వహించారు. పీసీసీ చీఫ్ రఘువీరారెడ్డి కూడా పార్టీ అభ్యర్థుల తరపున విస్తృతంగా ప్రచారం చేశారు. ఈ నెల 29వ తేదీ ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభమవుతుంది. మొత్తం 48 డివిజన్లకు ఎన్నికలు జరుగుతున్నాయి. టీడీపీ 39 స్థానాల్లో, మిత్రపక్షం బీజేపీ 9 స్థానాల్లో, వైసీపీ 48 డివిజన్లలోనూ పోటీ చేస్తోంది. కాంగ్రెస్ 17 సీట్లలో పోటీ చేస్తుండగా ఆరు చోట్ల ప్రభావితం చూపే అవకాశం ఉంది.

అసలు



ఇది పీటీఐ ఫొటో

నకిలీ



లాలూ ట్విట్టర్‌లో పెట్టిన ఫొటో

ఇది 'బీజేపీ భగావో.. దేశ్ బచావో' నినాదంతో లాలూ ప్రసాద్ ఆదివారం ఏర్పాటు చేసిన సభ. నిజంగానే దీనికి లక్షల సంఖ్యలో జనం వచ్చారా? సభా ప్రాంగణం మొత్తం నిండినట్లు ఉన్న ఫొటోలను లాలూ తన ట్విట్టర్‌లో పెట్టారు. అయితే, ఇవి మార్ఫింగ్ ఫొటోలని పలు వార్తలొస్తున్నాయి. సభ జరిగిన తీరును క్షుణ్ణంగా పరిశీలిస్తే మార్ఫింగ్ నిజమేనని తెలుస్తోంది! మధ్యాహ్నం 2:30 గంటలకు పీటీఐ వార్తా సంస్థ తన సైట్‌లో పెట్టిన ఫొటోలో సగం మైదానం ఖాళీగా కనిపిస్తోంది. లాలూ ట్విట్టర్‌లో ఫొటోలో మాత్రం మైదానం కిక్కిరిసిపోయినట్టు కనిపిస్తోంది. 'ఇది లాలూ పాల్పడ్డ మరో కుంభకోణం' అని నెటిజన్లు వ్యంగ్యంగా వ్యాఖ్యానిస్తున్నారు. కాగా, బిహార్‌లో కొందరు మహాకూటమిని భగ్నం చేశారని, ప్రజాతీర్పును ఉల్లంఘించి వారిని మోసం చేశారని జేడీయూ అసంతృప్త నేత శరద్ యాదవ్ అన్నారు. బిహార్‌లో భగ్నం చేసినా జాతీయ స్థాయిలో మాత్రం మహాకూటమిని ఏర్పాటు చేశామన్నారు.

స్విస్ చాలెంజ్ సరైంది కాదు: ఐవైఆర్

హైదరాబాద్, ఆగస్టు 27(ఆంధ్రజ్యోతి): రాజధాని నిర్మాణంలో రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న స్విస్ చాలెంజ్ విధానం సరైనది కాదని ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి ఐవైఆర్ కృష్ణారావు విమర్శించారు. జీవో 179ను రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఆదివారం హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడారు. ఇదే అంశంపై సీఎం చంద్రబాబుకి తాను 19పేజీల లేఖ రాసినట్లు తెలిపారు. స్విస్ చాలెంజ్ అంటే సుమోటోగా కంపెనీలు ముందుకురావాలి గానీ విధివిధానాలను వక్రీకరించి కంపెనీలతో ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుందని, రాష్ట్ర ప్రయోజనాలు ఫణంగా పెట్టి విదేశీ కంపెనీలకు అనుకూలంగా చట్టాన్ని సవరణ చేశారని ఆరోపించారు.

• ఐవైఆర్.. జగన్ స్క్రిప్ట్ చదవద్దు: శ్రీధర్

గుంటూరు, ఆగస్టు 27 : ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి ఐవైఆర్ కృష్ణారావు, జగన్ స్క్రిప్ట్ చదవడం మానుకుంటే మంచిదని బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ గుంటూరు జిల్లా కో ఆర్డినేటర్ సిరిపురపు శ్రీధర్, బ్రాహ్మణ సంఘాలు హెచ్చరించాయి. ఈ మేరకు ఆదివారం గుంటూరులో విలేకరుల సమావేశంలో శ్రీధర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వాన్ని కించపరిచేలా జీవో నెంబర్ 179ని రద్దుకు డిమాండ్, స్విస్ చాలెంజ్ విధానాన్ని తప్పు పట్టటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. వైసీపీ ఆడుతున్న నాటకంలో ఐవైఆర్ కీలుబొమ్మ అన్నారు. జగన్ ఎన్ని కుయుక్తులు వేసినా బ్రాహ్మణులు టీడీపీ వెంటే ఉన్నారన్నారు.

• ఆర్టీసీ ఐఎన్‌టీయూసీ నేతగా మహమూద్

హైదరాబాద్, ఆగస్టు 27(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఆర్టీసీలోని ప్రధాన కార్మిక సంఘాల్లో ఒకటైన ఐఎన్‌టీయూసీ ప్రధానకార్యదర్శిగా సయ్యద్ మహమూద్ నియమితులయ్యారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని ఏపీఎస్సార్టీసీ కార్మిక సంఘాల్లో దశాబ్దాల తరబడి చక్రం తిప్పిన నేతలు ఎం.నాగేశ్వరరావు, సయ్యద్ మహమూద్ కాగా... ఆ తరువాత పరిణామాల్లో ఎవరికి వారే అన్నట్లుగా విడి కుంపట్లు పెట్టుకున్నారు.

• 21ఏళ్లకే సీఏ, సీఎస్, సీఎంఏ!

సూరత్, ఆగస్టు 27: సీఏ, సీఎస్, సీఎంఏలను చిన్న వయసులోనే పూర్తి చేశాడో యువకుడు. ఇప్పటిదాకా వేరే విద్యార్థుల పేరిట ఉన్న రికార్డును చెరిపేసి తన పేరిట పునర్లిఖించుకున్నాడు. గుజరాత్‌లోని సూరత్‌కు చెందిన ఆదిత్య ఝువార్.. 21 ఏళ్ల వయసులోనే చార్టర్డ్ అకౌంటెన్సీ (సీఏ), కంపెనీ సెక్రటరీస్ (సీఎస్), కాస్ట్ అండ్ మేనేజ్‌మెంట్ అకౌంటెన్సీ (సీఎంఏ)లను పూర్తి చేసి ఆ మూడింటిని చిన్న వయసులో పూర్తి చేసిన యువకుడిగా నిలిచాడు. అంతకుముందు ఆ రికార్డు ఢిల్లీకి చెందిన సార్థక్ అహూజ, పల్లవి సచ్‌దేవ పేరిట ఉండేది. వారిద్దరూ కూడా 23 ఏళ్లకు ఆ మూడింటిని పూర్తి చేయగలిగారు. శుక్రవారం వెల్లడైన ఫలితాలతో వారిని దాటేశాడు ఆదిత్య.

• ట్రంప్ సైబర్ సలహాదారుల రాజీనామా

వాషింగ్టన్, ఆగస్టు 27: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సైబర్ భద్రత సలహాదారులు మూకుమ్మడిగా రాజీనామా చేశారు. భారత సంతతికి చెందిన వైట్ హౌస్ చీఫ్ డేటా సైంటిస్ట్ డీజే పాటిల్ సహా ఏడుగురు సలహాదారులు పదవుల నుంచి వైదొలిగారు.

• మోదీ ఊరు.. ఒకప్పుడు బౌద్ధనగరం!

అహ్మదాబాద్, ఆగస్టు 27: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సొంతూరు ఏదంటే..? చాలా మందికి తెలిసుండదు. ఆయన స్వస్థలం గుజరాత్‌లోని వాద్‌నగర్. అయితే.. వాద్‌నగర్ అసలు పేరు అది కాదు. చరిత్ర చెబుతున్న ప్రకారం మోదీ ఊరు అసలు పేరు.. 'ఆనంద్‌నగర్'. అంతేకాదు.. ఆ ఊరికి మరో విశిష్టత కూడా ఉంది. దాదాపు 1800 ఏళ్ల క్రితం అది ఓ బౌద్ధనగరమట. ఈ విషయాన్ని పురాతత్వ శాస్త్రవేత్తలు నిర్ధారించారు. పురాతన తవ్వకాల్లో భాగంగా రెండు శాసనాలను భారత పురాతత్వ శాఖ (ఏఎస్ఐ) వెలికి తీసింది.

• 2020కి ఆర్మీ చేతికి మరో అస్త్రం!

న్యూఢిల్లీ, ఆగస్టు 27: భారత సైన్యం నిరీక్షణ ఫలించబోతోంది. ఆర్మీ అమ్ములపొదిలోకి ఆధునిక అస్త్రం వచ్చి చేరనుంది. శత్రువులు ప్రయోగించే గతిశీల క్షిపణులు, యుద్ధ విమానాలు, హెలికాప్టర్లను కూల్చే సామర్థ్యం ఉన్న మధ్య శ్రేణి క్షిపణిని 2020 నాటికి సమకూర్చుకోనుంది. డీఆర్‌డీఏ, ఇజ్రాయెల్ ఏరోస్పేస్ ఇండస్ట్రీస్ భాగస్వామ్యంతో ఈ క్షిపణి వ్యవస్థను రూపొందిస్తోంది.

• మాల్యా కార్లు రూ.1.40 లక్షలే

ఆంధ్రజ్యోతి, బెంగళూరు: కింగ్‌ఫిషర్ యజమాని విజయ్‌మాల్యాకు చెందిన రెండు కార్లను హుబ్బళ్లికి చెందిన పారిశ్రామికవేత్త హనుమంతరెడ్డి ఆన్‌లైన్ వేలంలో దక్కించుకున్నారు. విజయ్ మాల్యా విలాసాలకు మారుపేరుగా ఉండేవారు. ఈయన ఉపయోగించిన లగ్జరీ కార్లు, భవంతులు, ఆస్తులు వేలం వేసే పరిస్థితి వచ్చిన విషయం తెలిసిందే. ఇలా రెండు కార్లు ముంబైలో వేలం వేయగా ఆన్‌లైన్ వేలం ద్వారా వాటిని హనుమంతరెడ్డి ఎంహెచ్01 డిఎ7227 నెంబరు గల సొనాటో గోల్డ్, హోండా ఎకార్డ్ ఎంహెచ్01 ఎంఎ 1235 కార్లను కొనుగోలు చేశారు. దాదాపు రూ.32 లక్షల విలువ చేసే కార్లు హనుమంతరెడ్డికి కేవలం రూ.1.40 లక్షలకే దక్కాయి. వేలంలో దక్కిన కార్లను శనివారం ఆయన మీడియా ముందు ప్రదర్శించారు.

• బాంబుతో పరిగెత్తిన పోలీసుకు 50 వేలు

భోపాల్, ఆగస్టు 27: తానొక్కడిని మరణించినా ఫర్వాలేదు.. 400 మంది విద్యార్థులను కాపాడాలనే లక్ష్యంతో 10 కిలోల బాంబును పట్టుకుని పరిగెత్తిన కానిస్టేబుల్ అభిషేక్ పటేల్‌కు మధ్యప్రదేశ్ సీఎం శివరాజ్‌సింగ్ చౌహాన్ రూ.50 వేల నజరానా ప్రకటించారు. మధ్యప్రదేశ్‌లోని సాగర్ జిల్లా ఛితోరాలో పాఠశాల ప్రాంగణంలో ఉన్న బాంబును అభిషేక్ పటేల్ తన భుజం మీద పెట్టుకుని కిలోమీటరు దూరం పరిగెత్తి నిర్మానుష్య ప్రదేశంలో విసిరేశారు.





రైతుకే తొలి ప్రాధాన్యం



- రాజధాని నగరాభివృద్ధిలో భాగస్వామ్యం
- అభివృద్ధి ఫలాలు అందరికీ అందాలి
- సీఆర్‌డీఏపై టెలికాన్ఫరెన్స్‌లో సీఎం
- రైతుల కోసం 'మన అమరావతి' యాప్
- 20 ఏళ్లలో 11 లక్షల ఉద్యోగాలు

అమరావతి, ఆగస్టు 27(ఆంధ్రజ్యోతి): రాజధాని నగరానికి భూములిచ్చిన రైతులకు తొలి ప్రాధాన్యం ఇవ్వాలని, రాజధాని నగరాభివృద్ధిలో ప్రతి అంశమూ రైతులకు తెలిసేలా సమాచార బ్యాంక్‌ను రూపొందించాలని సీఎం చంద్రబాబు... అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. అమరావతి ఎలా రూపుదిద్దుకుంటుందో ప్రతి రైతుకూ తెలిసేలా చైతన్యపరచాలని అన్నారు. అందుకోసం ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను రూపొందించాలని, ప్రపంచంలో ఏ మూలన ఉన్నా అమరావతి వైభవం, నగర నిర్మాణ ప్రణాళిక చిటికెలో తెలిసేలా చర్యలు చేపట్టాలని నిర్దేశించారు. సీఎం చంద్రబాబు ఆదివారం అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అమరావతిలో జరిగే ప్రతి అభివృద్ధి పనిలో రైతు భాగస్వామ్యం కావాలని, వారికి సంపూర్ణ అవగాహన కల్పించాలన్నారు. రాజధాని ప్రతి నిర్మాణం రైతు త్యాగం ప్రతిబింబించేలా ఉండాలని సీఆర్‌డీఏ అధికారులకు సూచించారు. 'ప్రపంచం ఆశ్చర్యపోయేలా 33,500 ఎకరాల భూసమీకరణ రైతు సహకారంతోనే సాధ్యమైందన్న విషయం మర్చిపోకూడదు. నేను అద్భుతమైన రాజధానిని నిర్మిస్తానన్న విశ్వాసంతో ఒక్క పిలుపుతోనే రైతులు స్పందించారు. తరతరాలుగా ఆ భూములతో ఉన్న అనుబంధాన్ని విడిచి అప్పగించారు. నాపై వారు ఉంచిన విశ్వాసం వమ్ముచేయను. ప్రతిక్షణం రైతు అందించిన సహకారాన్ని గుర్తుచేసుకోవాలి. రాజధాని రైతుల జీవితాల్లో గణనీయమైన మార్పులు రావాలి. నగరాభివృద్ధి ఫలాలు భూములిచ్చిన ప్రతి రైతుకూ దక్కాలి. అలాగే అమరావతి అభివృద్ధి ఫలాలు రాష్ట్ర ప్రజలందరికీ దక్కేలా విధానాల రూపకల్పన జరగాలి' అని సీఎం అన్నారు. కాగా, ప్రపంచ శ్రేణి నిపుణులతో అమరావతి అభివృద్ధిలో రైతులకు భాగస్వామ్యం, సహకారంపై చైతన్యం కలిగేలా సదస్సులు నిర్వహిస్తామని సీఆర్‌డీఏ కమిషనర్ శ్రీధర్ తెలిపారు. నగర నిర్మాణంలో కీలక ఘట్టాలు, భూములిచ్చిన రైతులకు కలిగే ప్రయోజనాల గురించి ఈ సదస్సుల్లో సవివరంగా తెలియజేస్తామన్నారు. ఇప్పటికే రైతులకు 70,732 ప్లాట్లు అందజేశామని సీఎంకు వివరించారు. అమరావతిలో మూడేళ్లలో 40వేల నుంచి 70వేల ఉద్యోగాలు యువతకు లభిస్తాయని, రాష్ట్ర జీడీపీకి రూ.4వేల కోట్లు అదనంగా వచ్చేందుకు అవకాశం ఉందని కమిషనర్ తెలిపారు. వచ్చే 20ఏళ్లలో రాష్ట్ర జీడీపీలో అదనంగా రూ.30వేల కోట్ల వృద్ధికి అమరావతి దోహదం చేస్తుందన్నారు. తద్వారా 11లక్షల ఉద్యోగాలు వస్తాయని చెప్పారు.

'మన అమరావతి'తో సమగ్ర సమాచారం

ఏజేఎస్ఏ సంస్థ రూపొందించిన 'మన అమరావతి' యాప్ రాజధాని రైతులకు సమగ్ర సమాచారం అందిస్తుందని, భూముల వివరాలు, ధరలు, అభివృద్ధికి సంబంధించిన వివరాలు అందించేందుకు ఉపయోగపడుతుందని అధికారులు ఈ సందర్భంగా సీఎంకు తెలిపారు. రైతులు వారికి వచ్చిన ప్లాట్లలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టవచ్చు, బ్యాంకుల రుణ సహాయం, భవన నిర్మాణ అనుమతుల గురించి తెలుసుకునే వెసులుబాటు కలుగుతుందన్నారు. ఈ యాప్ వల్ల దళారుల ప్రమేయం లేకుండా వాస్తవ సమాచారం రైతులకు చేరుతుందని చెప్పారు. రైతులు వారి ఆధార్ సంఖ్యను ఎంటర్‌చేసిన వెంటనే వారి భూమికి సంబంధించిన సమగ్ర సమాచారం వస్తుందన్నారు. అమరావతి నగరంలోని 13 జోన్లలో రైతుల ప్లాట్లు విస్తరించి ఉంటాయని కమిషన్ తెలిపారు. ఏడేళ్లలో రూ.15,672 కోట్లు ఖర్చుచేసి మౌలిక సదుపాయాలన్నీ అందుబాటులోకి తెస్తామని కమిషనర్ చెప్పారు. కాగా, అమరావతిలో 27 స్వీయసమృద్ధి టౌన్‌షిప్‌లు రానున్నాయని ఇంధనశాఖ ముఖ్యకార్యదర్శి అజయ్ జైన్ తెలిపారు. సమ్మిళిత అభివృద్ధితోపాటు ఆర్థికాభివృద్ధి కేంద్రంగా మారుతుందని చెప్పారు. రాజధానికి అవసరమైన సమగ్ర ట్రాఫిక్, రవాణా వ్యవస్థల్లో సహకారానికి జైకా సిద్ధంగా ఉందని అన్నారు. దీంతో, రాజధాని అభివృద్ధికి తీసుకుంటున్న చర్యల పట్ల సీఎం సంతోషం వ్యక్తంచేశారు. 33,500 ఎకరాల భూసమీకరణ విధానంపై హార్వర్డ్ వర్సిటీ అధ్యయనం చేసేందుకు ముందుకురావడం పట్ల హర్షం వ్యక్తంచేశారు. దీంతో అమరావతి ప్రపంచస్థాయి గుర్తింపు దక్కిందన్నారు. టెలికాన్ఫరెన్స్‌లో మున్సిపల్ మంత్రి పి.నారాయణ, సీఎంవో ప్రత్యేక ప్రధానకార్యదర్శి సతీశ్‌చంద్ర, అమరావతి అభివృద్ధి సంస్థ చైర్‌పర్సన్ లక్ష్మీపార్థసారథి, సీఆర్‌డీఏ అదనపు కమిషనర్ రామనోహర్ తదితరులు పాల్గొన్నారు.



'ఎర్ర' పోరు!

- ఇటు టాస్క్‌ఫోర్స్.. అటు తమిళ స్మగ్లర్లు

అమరావతి, ఆగస్టు 27(ఆంధ్రజ్యోతి): ప్రపంచంలో ఎక్కడా లభించని విలువైన ఎర్రచందనం శేషాచలం అటవీ ప్రాంతంలో లభిస్తుండడంతో దీనిని కొల్లగొట్టేందుకు ఒక పక్క స్మగ్లర్లు, దీనిని కాపాడేందుకు మరోపక్క పోలీసులు ఇలా ఈ రెండు వర్గాల మధ్య పోరు తీవ్రమవుతోంది. రాయలసీమలోని చిత్తూరు, కడప, కర్నూలుతోపాటు నెల్లూరు, ప్రకాశం జిల్లాల పరిధిలోని ఐదు లక్షల హెక్టార్లలో విస్తరించిన ఎర్రచందనం చెట్లను నరికేందుకు తమిళనాడుకు చెందిన స్మగ్లర్లు గత కొన్నేళ్లుగా వస్తూనే ఉన్నారు. అత్యంత ఖరీదైన కలప కావడం.. విదేశాలకు ఎగుమతి అవుతుండటంతో స్మగ్లర్లు విచ్చలవిడిగా శేషాచలం అడవుల్ని నరికేశారు. అడ్డొచ్చిన అటవీ సిబ్బందిని సైతం హత్య చేశారు. ఇదే సమయంలో రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో స్మగ్లర్లను అణచివేసేందుకు గట్టి చర్యలు చేపట్టింది. చిత్తూరు, కడప, తిరుపతి, నెల్లూరు జిల్లాల పోలీసులతో ఎర్రచందనం స్మగ్లర్లపై దాడులు చేయించింది. అయినా తగ్గక పోవడంతో అటవీ, పోలీసు సిబ్బందితో ఐజీ కాంతారావు నేతృత్వంలో ఉమ్మడిగా ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేసింది. రెండున్నరేళ్లుగా ఈ దళం అడవుల్లో కూంబింగ్ చేస్తూ వందలాది మంది స్మగ్లర్లు, వాహనాలతోపాటు టన్నుల కొద్దీ ఎర్రచందనం దుంగల్ని స్వాధీనం చేసుకున్నారు. అడవుల్లోకి చొరబడే స్మగ్లర్లలో దాదాపు 95% మంది తమిళనాడులోని జావాది మలై ప్రాంతానికి చెందిన గిరిజనులు. అడవుల్లో జీవించడం అలవాటు కావడంతో స్మగ్లర్లు వీరిని శేషాచలంలోకి పంపుతున్నారు. ఇటు ప్రభుత్వం కూడా శిక్షణ పొందిన కానిస్టేబుళ్లకు ఆయుధాలిచ్చి అడవిలోకి పంపుతోంది. అడవిలో కూంబింగ్‌కు వెళ్లినప్పుడు ఎర్రచందం చెట్టు నరికేందుకు వచ్చిన స్మగ్లర్లు ఎక్కువగా ఉండి టాస్క్‌ఫోర్స్ పోలీసులు తక్కువగా ఉంటే దాడులకు దిగుతున్నారు. ఈ పరిస్థితుల్లో పోలీసులు గాయాల బారిన పడుతున్నారు. ఒకప్పుడు తుపాకీతో స్మగ్లర్లను కాల్చి చంపిన టాస్క్‌ఫోర్స్ బలగాలకు ఆయుధాలిచ్చినా ఆదేశాలు రాకపోవడంతో ఏమీ చేయలేక పోతున్నారు.

కంటికి రక్షణ కరువు!

- అందుబాటులో లేని సూపర్ స్పెషాలిటీ వైద్యం
- రీజనల్ ఆస్పత్రుల్లో తీవ్రమైన పడకల కొరత
- ఒక్కో బెడ్‌పై ఇద్దరు.. కొన్ని వార్డుల్లో నేలపైనే...
- బోధనాస్పత్రుల్లోనూ సిబ్బంది లేక ఇబ్బందులు
- ప్రయివేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తున్న రోగులు



విశాఖ ప్రాంతీయ కంటి ఆస్పత్రిలో నేలపైనే కూర్చుని వైద్య సేవలు పొందుతున్న రోగులు

అమరావతి, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): నవ్యాంధ్రలో ప్రజల కంటికి రక్షణ కరువయింది. రాష్ట్ర విభజన అనంతరం ఇక్కడి కంటి రోగులు సూపర్ స్పెషాలిటీ వైద్యానికి దూరమయ్యారు. ప్రభుత్వాస్పత్రుల్లో ఈ వైద్యసేవలు అందుబాటులో లేకపోవడంతో బాధితులు ప్రయివేట్ ఆస్పత్రులకు పరుగులు తీస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఇదే పరిస్థితి ఉంది. విశాఖ, కర్నూలు జిల్లాల్లో రీజనల్ కంటి ఆస్పత్రులు ఉన్నా వాటిలో కొంతవరకూ మాత్రమే చికిత్సలు చేయగలుగుతున్నారు. సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందించే పరికరాలు కానీ వైద్యులు కానీ వీటిలో అందుబాటులో లేరు. ఇక రాష్ట్రంలో ఉన్న 11 బోధనాస్పత్రుల్లోని కంటి విభాగాల్లో సిబ్బంది కొరత తీవ్రంగా వేధిస్తోంది. కొన్ని యూనిట్లకు ప్రొఫెసర్ల కొరత ఉంటే, మరికొన్నిచోట్ల అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు లేరు. దీంతో ఓపీ కోసం వచ్చే రోగులు గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోంది.

పడకలు తక్కువ.. పాట్లు ఎక్కువ

విశాఖ, కర్నూలు రీజనల్ కంటి ఆస్పత్రుల్లో నాలుగు యూనిట్ల ద్వారా రోగులకు కంటి వైద్య సేవలు అందుతున్నప్పటికి అవి ఏ మూలకూ సరిపోవడం లేదు. విశాఖ ఆస్పత్రిలో 75 పడకలు అందుబాటులో ఉండేవి. రోగుల తాకిడి ఎక్కువగా ఉండటంతో దీన్ని 120 పడకలకు పెంచారు. అయినా పరిస్థితిలో మార్పులేదు. ఇక్కడ రోజూ సుమారు 300 నుంచి 500 వరకూ ఓపీ నమోదవుతుండగా 150 మంది రోగులు ఆస్పత్రిలో చేరతారు. ఒక్కో బెడ్‌కు ఇద్దరేసి చొప్పున, మరికొన్ని వార్డుల్లో కింద పడుకోవాల్సిన పరిస్థితి ఉంది. దీంతో చికిత్స కోసం వచ్చే రోగుల పరిస్థితి పడకల తక్కువ... పాట్లు ఎక్కువ అన్నట్లుగా తయారయింది. కర్నూలు రీజనల్ ఐ ఆస్పత్రిలో కూడా దాదాపు ఇదే పరిస్థితి నెలకొంది.

దూరమైన 'సరోజిని' సేవలు

ఆంధ్రప్రదేశ్ ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పుడు మొత్తం 23 జిల్లాల ప్రజలకు హైదరాబాద్‌లోని సరోజినీదేవి సూపర్ స్పెషాలిటీ కంటి ఆస్పత్రి ఇదే రీఫరల్ ఆస్పత్రిగా ఉండేది. కంటికి సంబంధించి ఎంత పెద్ద శస్త్రచికిత్స చేయించుకోవాలన్నా రోగులు అక్కడికే వెళ్లేవారు. రాష్ట్ర విభజన తర్వాత ఈ ఆస్పత్రి తెలంగాణకే పరిమితమైపోయింది. విభజన తర్వాత అక్కడ ఆస్పత్రిలో చేర్పించుకుంటారో లేదో అన్న అనుమానంతో రోగులు రాష్ట్రం దాటి కదలడం లేదు. రెండేళ్ల క్రితం విశాఖలో సూపర్ స్పెషాలిటీ కంటి ఆస్పత్రి ఏర్పాటు చేయాలని ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు భావించారు. దీనికి సంబంధించి సిద్ధం చేసిన ప్రతిపాదనలు కాలక్రమంలో అటకెక్కాయి. ప్రభుత్వం వెంటనే స్పందించి విశాఖ, కర్నూలు లేదా అమరావతిలో సూపర్ స్పెషాలిటీ కంటి ఆస్పత్రి ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలనే డిమాండ్లు ఊపందుకుంటున్నాయి.

'మద్యాని'కి నయా దారి!

- రహదారుల వెంట షాపులకు అవకాశం
- నివాసిత ప్రాంతాల నుంచి వెనక్కు
- 500 మీటర్ల తీర్పుపై సుప్రీం స్పష్టత
- తీర్పునకు అనుగుణంగా ఎక్సైజ్ నిర్ణయం
- 1500 షాపులు, బార్లకు లబ్ధి

అమరావతి, ఆగస్టు 27(ఆంధ్రజ్యోతి): నివాసిత ప్రాంతాల్లో మద్యం దుకాణాల ఏర్పాటు వల్ల తలెత్తుతున్న వివాదాలకు పరిష్కారం మార్గం లభించింది. తప్పని పరిస్థితుల్లో జనావాసాల మధ్య మద్యం దుకాణాలు ఏర్పాటుచేసి వివాదాలపాలవుతున్న వ్యాపారులకు ఊరట లభించింది. రహదారుల వెంట మద్యం విక్రయాల విషయంలో గతంలో ఇచ్చిన తీర్పుపై ఇటీవల సుప్రీం కోర్టు స్పష్టత ఇచ్చింది. దీంతో తిరిగి రహదారుల వెంట దుకాణాల ఏర్పాటుకు వెసులుబాటు లభించింది. ఫలితంగా కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో 500 మీటర్ల నిబంధనకు మినహాయింపునివ్వాలని నిర్ణయించింది. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిన ఎక్సైజ్, రెండు రోజుల్లోనే నోటిఫికేషన్ జారీచేయాలని భావిస్తోంది. నోటిఫికేషన్ జారీ అయిన తర్వాత షాపులు, బార్లను తరలించుకునేందుకు లైసెన్సీలకు అవకాశం ఏర్పడుతుంది. తాజా పరిణామాలతో రాష్ట్రవ్యాప్తంగా 1500 మద్యం దుకాణాలకు లబ్ధి చేకూరనుంది. అలాగే బార్లన్నీ పట్టణ ప్రాంతాల్లోనే ఉన్నందున మొత్తం 800 బార్లకు ఉపశమనం కలుగుతుంది. ప్రధానంగా మహిళలు, స్థానిక ప్రజల నుంచి ఎదురవుతున్న వ్యతిరేకతకు ఇది పెద్ద పరిష్కారంగా అధికారులు భావిస్తున్నారు. మద్యంపై ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన సర్వేలో కూడా ఇదే విషయం వెల్లడైంది.

పెరగనున్న ఎక్సైజ్ ఆదాయం

రహదారుల వెంట మద్యం షాపులు, బార్ల ఏర్పాటుకు ఎక్సైజ్ శాఖ అనుమతి జారీ చేసిన వెంటనే వందల సంఖ్యలో షాపులు, బార్లు తిరిగి పూర్వస్థానాలకు వచ్చి చేరేందుకు సిద్ధంగా ఉన్నాయి. దీనివల్ల ఎక్సైజ్‌కు అదనపు ఆదాయం సమకూరనుంది. షాపు లేదా బార్‌ను ఒకచోట నుంచి మరోచోటకు తరలించాలంటే నిబంధనల ప్రకారం రూ.25 వేలు లేదా లైసెన్సు ఫీజులో 1% చెల్లించాలి. రహదారుల వెంట షాపుల ఏర్పాటుకు కనీసం 1500 షాపులు, బార్లు ముందుకొచ్చే అవకాశముంది. ఈ క్రమంలో షిఫ్టింగ్ ఫీజుల రూపంలో ఆదాయం వస్తుంది.

గ్రామాలకు 220 మీటర్లు

సుప్రీంకోర్టు ఇచ్చిన వెసులుబాటు నగరాలు, పట్టణాలకు మాత్రమే వర్తిస్తుంది. కానీ గ్రామీణ ప్రాంతాలు, మండల కేంద్రాలకు గతంలో ఉన్న నిబంధనలే ఉంటాయి. 20 వేల లోపు జనాభా ఉన్న ప్రాంతాల్లో జాతీయ, రాష్ట్ర రహదారులకు 220 మీటర్ల వెలుపలే మద్యం అమ్మకాలు ఉండాలి. రాష్ట్ర రహదారులను జిల్లా ప్రధాన రహదారులుగా మారుస్తూ గతంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం వల్ల గ్రామీణ ప్రాంతాల్లో కొన్ని షాపులకు మేలు జరిగింది.

ఎన్ఏబీహెచ్ గుర్తింపు కోసం

ప్రభుత్వ బోధనాస్పత్రుల దరఖాస్తు




గుంటూరు, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రభుత్వ వైద్య బోధన ఆస్పత్రులు నాణ్యత ప్రమాణాల గుర్తింపు కోసం చర్యలు చేపట్టాయి. ప్రైవేటు కార్పొరేట్ హాస్పిటల్స్‌కు దీటుగా 'నేషనల్ అక్రిడిటేషన్ బోర్డ్ ఫర్ హాస్పిటల్స్ అండ్ హెల్త్ కేర్ ప్రొవైడర్స్' (ఎన్ఏబీహెచ్) గుర్తింపు కోసం దరఖాస్తు చేస్తున్నాయి. జాతీయ స్థాయిలో వైద్యసంస్థల వ్యాధి నిర్ధారణ ప్రయోగశాలల నాణ్యత ప్రమాణాలను నిర్ధారించి గుర్తింపు అందజేసే స్వయం ప్రతిపత్తి ఉన్న సంస్థ ఎన్ ఏబీహెచ్. ప్రైవేటు వైద్య రంగంలో 5 నుంచి 7 శాతం వైద్యశాలలకు మాత్రమే ఎన్ఏబీహెచ్ గుర్తింపు ఉంది. ప్రభుత్వ వైద్య రంగంలో అంతకన్నా తక్కువ సంఖ్యలో ఉండడం గమనార్హం. తాజాగా ప్రభుత్వ ఆదేశాలతో ఏపీలోని వైద్యబోధన ఆస్పత్రులు ఎన్ఏబీహెచ్ నాణ్యత ప్రమాణాల గుర్తింపు కోసం దరఖాస్తు చేస్తున్నాయి.

40 ఏళ్లలోపే ఎస్సార్‌షిప్!

- వైద్య మండలి కొత్త నిబంధన
- రాష్ట్ర పీజీ సీట్లపై ప్రభావం

అమరావతి, ఆగస్టు 27(ఆంధ్రజ్యోతి): సీనియర్ రెసిడెంట్ షిప్(ఎస్సార్ షిప్) విషయంలో మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా కొత్త నిబంధనలు తెరమీదకి తెచ్చింది. ఇకపై 40 ఏళ్లలోపు ఎస్సార్ షిప్ పూర్తి చేస్తేనే దానిని తాము పరిగణనలోకి తీసుకుంటామని ఈ ఏడాది జూన్‌లో ఎంసీఐ నిర్ణయించింది. ఈ నిబంధన వల్ల ఎంబీబీఎస్ తర్వాత వెంటనే పీజీలో చేరే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందీ ఉండదు. కానీ ప్రభుత్వ సర్వీస్‌లో ఉండి 35, 40 ఏళ్లకు పీజీ చేద్దామని ఆలోచించే వైద్యులు మాత్రం ఇబ్బందులు పడాల్సి ఉంటుంది. 40 ఏళ్ల తర్వాత చేసే ఎస్సార్ షిప్‌ను ఎంసీఐ పరిగణనలోకి తీసుకోకపోవడం వల్ల వారు అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుకు అర్హత సాధించరు.


మెక్ గ్రెగర్‌పై మేవెదర్ పంచ్

మనదే సిరీస్!

అదరగొట్టిన రోహిత్, ధోనీ.. బుమ్రాకు ఐదు వికెట్లు..భారత్ హ్యాట్రిక్ విజయం 3-0తో సిరీస్ కైవసం.. మళ్లీ ఓడిన శ్రీలంక

ఊహించిందే జరిగింది..! శ్రీలంక గడ్డపై టెస్టు సిరీస్‌ను క్లీన్ స్వీప్ చేసిన భారత్.. మరోసారి ఆతిథ్య జట్టును ఆటాడేసుకుంటూ వన్డే సిరీస్‌ను కూడా ఖాతాలో వేసుకుంది. స్వల్ప లక్ష్యాన్నే నిర్దేశించినా.. 61 పరుగులకే నాలుగు వికెట్లు కూల్చి టీమిండియా జోరుకు బ్రేక్ వేసేలా కనిపించిన లంక ఆపై చేతులెత్తేసింది. రోహిత్ శర్మ అజేయ శతకానికి మిస్టర్ కూల్ మహేంద్ర సింగ్ ధోనీ సమయోచిత హాఫ్ సెంచరీ తోడవడంతో కోహ్లీసేన 3-0తో సిరీస్ కైవసం చేసుకుంది.

పల్లెకెలె: శ్రీలంక పర్యటనలో భారత్ జోరు కొనసాగుతోంది. టెస్టులో అదరగొట్టిన కోహ్లీసేన పరిమిత ఓవర్ల క్రికెట్‌లోనూ అద్భుత ప్రదర్శనతో వన్డే సిరీస్‌ను కైవసం చేసుకుంది. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా ఆతిథ్య శ్రీలంకతో ఆదివారమిక్కడ జరిగిన మూడో వన్డేలో భారత్ ఆరు వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. లంక నిర్దేశించిన 218 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని టీమిండియా నాలుగు వికెట్లు కోల్పోయి మరో 29 బంతులు మిగిలుండగానే ఛేదించింది. స్టార్ ఓపెనర్ రోహిత్ శర్మ (145 బంతుల్లో 16 ఫోర్లు, 2 సిక్సర్లతో 124 నాటౌట్) అజేయ శతకంతో రాణించగా.. జట్టు కష్టాల్లో ఉన్నపుడు కీలక ఇన్నింగ్స్ ఆడిన ధోనీ (86 బంతుల్లో 4 ఫోర్లు, సిక్సర్‌తో 67 నాటౌట్) జట్టుకు అద్భుత విజయాన్ని అందించాడు. ఈ గెలుపుతో ఐదు వన్డేల సిరీస్‌ను భారత్ 3-0తో దక్కించుకుంది. లంక బౌలర్లలో అకిల ధనంజయ రెండు వికెట్లు పడగొట్టగా.. మలింగ, విశ్వ ఫెర్నాండో చెరో వికెట్ దక్కించుకున్నారు. అంతకుముందు శ్రీలంక.. భారత పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా (5/27) ధాటికి నిర్ణీత ఓవర్లలో తొమ్మిది వికెట్లకు 217 పరుగులు చేసింది. లహిరు తిరిమన్నె (105 బంతుల్లో 5 ఫోర్లు, సిక్సర్‌తో 80) అర్ధ సెంచరీతో ఆదుకున్నాడు. దినేష్ చాందిమల్ (36), మిలింద సిరివర్ధన (29) కీలక పరుగులు సాధించారు. 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' బుమ్రా కెరీర్‌లో తొలిసారిగా ఐదు వికెట్ల ప్రదర్శనతో ఆకట్టుకున్నాడు. ఇరు జట్ల మధ్య నాలుగో వన్డే కొలంబో వేదికగా గురువారం జరగనుంది.

భారత్ తడబాటు..

లక్ష్యం చిన్నదే.. పైగా బ్యాట్స్‌మెన్ ఫామ్‌లో ఉన్నారు. ఇంకేం.. భారత్ విజయం నల్లేరుపై నడకే.. సిరీస్ విజయం ఖాయమే అని భావించారంతా..! కానీ ఇన్నింగ్స్ మూడో ఓవర్లోనే లసిత్ మలింగ


బుమ్రా (5/27)

ఫామ్‌లో ఉన్న ధవన్ (5)ను అవుట్ చేసి భారత్‌కు ఊహించని షాక్ ఇచ్చాడు. ఈ షాక్ నుంచి తేరుకునేలోపే విరాట్ కోహ్లీ (3)ని అవుట్ చేసిన విశ్వ ఫెర్నాండో మరో దెబ్బకొట్టాడు. దీంతో 19 పరుగులకే రెండు కీలక వికెట్లు కోల్పోయిన భారత్ కష్టాల్లో పడింది. ఓపెనర్ రోహిత్‌కు జతకలిసిన కేఎల్ రాహుల్ (17) కాసేపు పోరాడాడు. ఈ దశలో అకిల ధనంజయ డబుల్ బ్రేక్‌తో శ్రీలంకను రేసులోకి తెచ్చాడు. వరుస ఓవర్లలో రాహుల్, కేదార్ జాదవ్ (0)లను వెనక్కుపంపాడు. దీంతో 61 పరుగులకే నాలుగు వికెట్లు కోల్పోయిన టీమిండియా కష్టాల్లో పడింది.

లంక ప్రేక్షకుల వీరంగం..

భారత్ 210/4తో ఉన్న దశలో తమ జట్టు సిరీస్ ఓటమిని జీర్ణించుకోలేకపోయిన శ్రీలంక ప్రేక్షకులు ఆగ్రహంతో ఊగిపోయారు. ఎక్స్‌ట్రా కవర్స్ ఏరియాలో ఉన్న ప్రేక్షకులు మైదానంలోకి వాటర్ బాటిల్స్ విసిరేశారు. 1996 ప్రపంచకప్‌లో కోల్‌కతా వేదికగా భారత్-శ్రీలంక మధ్య జరిగిన మ్యాచ్‌ను గుర్తుకుతెచ్చారు. దీంతో అంపైర్లు 35 నిమిషాలపాటు ఆట నిలిపి వేశారు. వెంటనే అప్రమత్తమైన భద్రతా సిబ్బంది ఆ స్టాండ్‌ను తమ అధీనంలోకి తీసుకుంది. పరిస్థితి అదుపులోకి వచ్చిన తర్వాత ఆట తిరిగి ప్రారంభం కాగా.. రోహిత్, ధోనీ ప్రత్యర్థికి ఎలాంటి అవకాశం ఇవ్వకుండా మ్యాచ్‌ను ముగించేశారు.

మహీ అండగా రోహిత్ ఆడగా..

ఈ దశలో మరో వికెట్ పడి ఉంటే భారత్ పరిస్థితి వేరుగా ఉండేది. కానీ.. రోహిత్‌కు జతకలిసిన ధోనీ ఆ పరిస్థితి రానీయలేదు. ఈ ఇద్దరూ జాగ్రత్తగా ఆడడంతో జట్టు స్కోరు 22.3 ఓవర్లలో వంద దాటింది. ఈ క్రమంలోనే రోహిత్ 64 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. మరో ఎండ్‌లో మహీ కూడా బ్యాట్‌కు పనిచెప్పడంతో భారత్ లక్ష్యం దిశగా సాగిపోయింది. ఈ క్రమంలో 33 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద వన్డేల్లో మహ్మద్ అజరుద్దీన్ (9378)ను అధిగమించాడు. ఇక ధనంజయ వేసిన 32వ ఓవర్లో సొగసైన సిక్సర్ సాధించిన రోహిత్ 90ల్లోకి ప్రవేశించాడు. చమీర వేసిన 36వ ఓవర్ ఆఖరి బంతికి సింగిల్‌తో అతడు సెంచరీ పూర్తి చేసుకున్నాడు. శ్రీలంక గడ్డపై అతనికిదే తొలి సెంచరీ కావడం విశేషం. శతకం అనంతరం రోహిత్ మరింత జోరు పెంచాడు. ఫెర్నాండో బౌలింగ్‌లో సిక్సర్, ఫోర్‌తో అలరించాడు. ధోనీ కూడా చమీర వేసిన 43వ ఓవర్లో చక్కటి స్లైస్ షాట్ బౌండ్రీతో వన్డేల్లో 65వ అర్ధ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఆ తర్వాత సిరివర్ధన బౌలింగ్‌లో రోహిత్ ఫోర్ బాదగా, ధోనీ సిక్స్‌తో చెలరేగాడు. దీంతో జట్టు స్కోరు 200 దాటింది. మ్యాచ్ భారత్ సొంతమైంది.


రోహిత్ (124 నాటౌట్)

రాణించిన తిరిమన్నె

తరంగ స్థానంలో కెప్టెన్సీ బాధ్యతలు నిర్వర్తించిన కపుగెదర టాస్ నెగ్గగానే మరో ఆలోచన లేకుండా బ్యాటింగ్ ఎంచుకున్నాడు. కానీ.. ఓపెనర్లు నిరోషన్ డిక్‌వెలా (13), చాందిమల్ అతని నిర్ణయానికి న్యాయం చేయలేకపోయారు. ఫామ్‌లో ఉన్న డిక్‌వెలాను బుమ్రా చక్కని బంతితో వికెట్ల ముందు దొరకబుచ్చుకున్నాడు. తొలుత అంపైర్ నాటౌట్‌గా ప్రకటించినా.. రివ్యూ కోరిన భారత్ తొలి వికెట్‌ను ఖాతాలో వేసుకుంది. వన్‌డౌన్‌లో వచ్చిన కుశాల్ మెండిస్ (1)ను కూడా బుమ్రానే అవుట్ చేశాడు. ఈ దశలో చాందిమల్, తిరిమన్నె జట్టును ఆదుకున్నారు. గుణతిలక గాయపడడంతో జట్టులోకొచ్చిన తిరిమన్నె చక్కటి ఆటతీరుతో ఆకట్టుకున్నాడు. ఈ దశలో హార్దిక్ బౌలింగ్‌లో చేతి వేలికి గాయం కావడంతో చాందిమల్ కాస్త నెమ్మదించాడు. అయితే జట్టు స్కోరు 100 వద్ద చాందిమల్ మూడో వికెట్‌గా వెనుదిరిగాడు. అతని స్థానంలో వచ్చిన ఏంజెలో మాథ్యూస్ (11) కాసేపు వికెట్ల పతనాన్ని అడ్డుకున్నాడు. ఈ క్రమంలో తిరిమన్నె 69 బంతుల్లో అర్ధ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఇక ఇన్నింగ్స్ కుదుట పడినట్టే అనుకుంటున్న తరుణంలో అనవసర షాట్ ఆడిన మాథ్యూస్ వికెట్ పారేసుకున్నాడు. కొద్దిసేపటికే సెంచరీ దిశగా సాగుతున్న తిరిమన్నె కూడా అవుటవడంతో లంక 159/5తో కష్టాల్లో పడింది. ఆ తర్వాత లంక కోలుకోలేకపోయింది. కెప్టెన్ కపుగెదర (14), సిరివర్ధన ఆదుకునే ప్రయత్నం చేసినప్పటికీ బుమ్రా బ్రేకులు వేశాడు.

చాందిమల్‌కు గాయం



వరస ఓటములు దానికితోడు గాయాలతో ఇబ్బంది పడుతున్న శ్రీలంకకు మరో ఎదురుదెబ్బ తగిలింది. కెప్టెన్ ఉపుల్ తరంగపై రెండు మ్యాచ్‌ల నిషేధం విధించడంతో జట్టులోకొచ్చిన దినేష్ చాందిమల్ కూడా మూడో వన్డే సందర్భంగా గాయానికి గురయ్యాడు. బ్యాటింగ్ సందర్భంగా హార్దిక్ పాండ్యా బౌలింగ్‌లో చాందిమల్ కుడిచేతి బొటనవేలుకు గాయమైంది. స్కానింగ్‌లో వేలు సన్నగా చిట్లినట్టు తెలిసింది. దీంతో అతడు ఫీల్డింగ్‌కు దిగలేదు. సిరీస్‌లో మిగిలిన రెండు వన్డేల్లోనూ చాందిమల్ ఆడేది అనుమానంగా మారింది. ఫామ్‌లో ఉన్న ఓపెనర్ ధనుష్క గుణతిలక భుజం గాయం కారణంగా జట్టుకు దూరంకాగా.. స్లో ఓవర్ రేట్ కారణంగా కెప్టెన్ తరంగపై రెండు మ్యాచ్‌ల వేటు పడిన సంగతి తెలిసిందే.

స్కోరు బోర్డు

శ్రీలంక ఇన్నింగ్స్: డిక్‌వెలా (ఎల్బీ) బుమ్రా 13, చాందిమల్ (సి) బుమ్రా (బి) హార్దిక్ 36, కుశాల్ మెండిస్ (సి) రోహిత్ (బి) బుమ్రా 1, తిరిమన్నె (సి) కేదార్ (బి) బుమ్రా 80, మాథ్యూస్ (ఎల్బీ) కేదార్ 11, కపుగెదర (బి) అక్షర్ 14, సిరివర్ధన (బి) బుమ్రా 29, ధనంజయ (బి) బుమ్రా 2, చమీర (రనౌట్) 6, ఫెర్నాండో (నాటౌట్) 5, మలింగ (నాటౌట్) 1; **ఎక్స్‌ట్రాలు: 19; మొత్తం: 50 ఓవర్లలో 217/9; వికెట్లపతనం:** 1-18, 2-28, 3-100, 4-138, 5-159, 6-181, 7-191, 8-201, 9-210; **బౌలింగ్:** భువనేశ్వర్ 9-2-41-0, బుమ్రా 10-2-27-5, చాహల్ 10-0-49-0, హార్దిక్ 8-0-42-1, అక్షర్ 10-1-35-1, కేదార్ 3-0-12-1.


భారత్ ఇన్నింగ్స్: రోహిత్ (నాటౌట్) 124, ధవన్ (బి) మలింగ 5, కోహ్లీ (సి) చమీర (బి) ఫెర్నాండో 3, రాహుల్ (సి) తిరిమన్నె (బి) ధనంజయ 17, కేదార్ (ఎల్బీ) ధనంజయ 0, ధోనీ (నాటౌట్) 67; **ఎక్స్‌ట్రాలు: 2; మొత్తం: 45.1 ఓవర్లలో 218/4; వికెట్లపతనం:** 1-9, 2-19, 3-61, 4-61; **బౌలింగ్:** మలింగ 5-0-25-1, విశ్వ ఫెర్నాండో 8.1-2-35-1, చమీర 10-1-59-0, మాథ్యూస్ 3-0-17-0, ధనంజయ 10-0-38-2, సిరివర్ధన 9-0-43-0.

మేవెదర్ 50/0

విజయాల్లో అజేయ అర్ధ సెంచరీ • మెక్‌గ్రెగర్‌పై నాకౌట్ విజయం

లాస్ వెగాస్: ఓటమి ఎరుగని అమెరికా యోధుడు ఫ్లాయిడ్ మేవెదర్ జూనియర్ (40) ప్రొఫెషనల్ బాక్సింగ్ విజయాల్లో అర్ధ శతకం సాధించాడు. ఆదివారం జరిగిన అత్యంత ఖరీదైన బౌట్‌లో మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్ ప్లేయర్, ప్రొఫెషనల్‌గా అరంగేట్రం చేసిన ఐరిష్ బాక్సర్ కానర్ మెక్‌గ్రెగర్‌ను మేవెదర్ 10వ రౌండ్‌లో నాకౌట్ చేశాడు. అమెరికా బాక్సర్ కెరీర్‌లో ఇది 27వ నాకౌట్ విజయం. ఈ గెలుపుతో మేవెదర్ తన విజయాల రికార్డును 50-0తో మెరుగుపరచుకున్నాడు. ప్రైజ్‌మనీ కింద మేవెదర్‌కు రూ. 1268 కోట్లకుపైనే దక్కనుండగా.. గ్రెగర్‌కు రూ. 638 కోట్లకుపైనే ముట్టనుంది. వీరిద్దరికీ లభించే ఈ మొత్తం ఎంతనేది పలు అంశాలపై ఆధారపడివుంటుంది. నిర్వాహకులు కూడా వివరాలు వెల్లడించలేదు.

వెల్టర్‌వెయిట్ మాజీ చాంపియన్ మేవెదర్.. రిటైర్మెంట్ ప్రకటించి రెండేళ్ల తర్వాత మళ్లీ రింగ్‌లోకి అడుగుపెట్టాడు. అయితే తొలిసారి బాక్సింగ్ రింగ్‌లోకి దిగిన 29 ఏళ్ల మెక్‌గ్రెగర్ మొదటి నాలుగు రౌండ్లలో దూకుడును కనబరిచాడు. మేవెదర్‌పై పంచ్‌ల వర్షం కురిపించాలని చూశాడు. కానీ డిఫెన్స్‌లో ఎంతో పటిష్టంగా ఉండే అమెరికా బాక్సర్‌పై దాడి చేయడం అంత సులువు కాదని వెంటనే గ్రహించాడు. మరోవైపు అవకాశం కోసం ఎదురు చూసిన మేవెదర్.. ఐదో రౌండ్‌లో ప్రత్యర్థి అలసటను గమనించి తన పంచ్ పవర్‌ను చూపించాడు. ఇక్కడ నుంచి ప్రత్యర్థి వెనుకంజ వేస్తుంటే.. అమెరికా బాక్సర్ దాడుల ఉధృతిని పెంచాడు. ఎడాపెడా పంచ్‌లు విసురుతూ గ్రెగర్‌పై పిడిగుద్దుల వర్షం కురిపించాడు. 7, 8 రౌండ్లలోనే మేవెదర్ గెలుపు ఖాయం అనిపించింది. ఇక 9వ రౌండ్ ఆరంభంలో కొంత ప్రతిఘటించిన గ్రెగర్.. మేవెదర్‌పై కుడిచేతితో పంచ్ విసిరాడు. అనంతరం బెల్ట్ కింద కొట్టడంతో ఫ్లాయిడ్ నొప్పితో ఇబ్బందిపడ్డాడు. కానీ రిఫెరీ ఫౌల్‌గా ప్రకటించకపోవడంతో బౌట్ కొనసాగింది. రౌండ్ చివరల్లో ఫ్లాయిడ్ ఎడాపెడా పంచ్‌లకు గ్రెగర్ రోప్ మీద పడి నోరు తెరిచాడు. 10వ రౌండ్‌లో మేవెదర్ రెండు పంచ్‌లను వరుసగా సంధించడంతో గ్రెగర్ రోప్‌లపై పడిపోయాడు. ముఖమంతా రక్తసిక్తమైంది. రిఫరీ కలగజేసుకుని ఫైట్‌ను నిలిపివేసి టెక్నికల్ నాకౌట్‌గా ప్రకటించాడు. తాను ఊహించిన దానికంటే గ్రెగర్ గట్టి పోటీ ఇచ్చాడని.. అయితే గేమ్ ప్లాన్ ప్రకారం ఆడి విజయం సాధించానని బౌట్ అనంతరం మేవెదర్ చెప్పాడు. ఈ విజయంతో హెవీవెయిట్ లెజెండ్ రాకీ మార్కియానో రికార్డును ఫ్లాయిడ్ అధిగమించాడు. కాగా మేవెదర్ మళ్లీ రిటైర్మెంట్ మూడ్‌లోకి వెళ్లాడని సమాచారం. అయితే గ్రెగర్ మాత్రం ఎటువంటి ఓటమి భారంతో కనిపించలేదు. బౌట్ అనంతరం ఎంతో ఉల్లాసంగా ఎంజాయ్ చేశాడు. కాగా, మెక్‌గ్రెగర్‌ను లెజెండ్ అని టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లీ ప్రశంసించాడు.


మేవెదర్

ఆదుకున్న షకీబల్, తమీమ్

• బంగ్లాదేశ్ 260 ఆలౌట్.. ఆసీస్ 18/3

ఢాకా: సొంతగడ్డపై ఆస్ట్రేలియాతో తొలి టెస్ట్‌లో ఆతిథ్య బంగ్లాదేశ్ బ్యాటింగ్‌లో తడబడింది. రెండు టెస్ట్‌ల సిరీస్‌లో భాగంగా ఆదివారం మొదలైన ఈ టెస్ట్‌లో బంగ్లా తొలి ఇన్నింగ్స్ లో 260 పరుగులకే ఆలౌటైంది. షకీబల్ హసన్ (84), తమీమ్ ఇక్బాల్ (71) అర్ధ సెంచరీలతో ఆదుకున్నారు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన కంగారూలు తొలి రోజు ఆట చివరకు 3 వికెట్ల నష్టానికి 18 పరుగులు చేశారు.

షకీబల్ రికార్డు: బంగ్లా ఆల్‌రౌండర్ షకీబల్ హసన్ టెస్ట్ క్రికెట్‌లో 3500 పరుగులు, 150 వికెట్లు తీసిన పదో ఆటగాడిగా నిలిచాడు. అలాగే ఈ ఫీట్‌ను వేగంగా సాధించిన తొలి ప్లేయర్ అయ్యాడు.


షకీబల్ (84)

హోల్డర్ ఆల్‌రౌండ్ షో


ఆసక్తికరంగా ఇంగ్లండ్-విండీస్ రెండో టెస్ట్

లీడ్స్: ఇంగ్లండ్-వెస్టిండీస్ మధ్య రెండో టెస్ట్ ఆసక్తికరంగా సాగుతోంది. మూడో రోజు ఆటలో విండీస్ కెప్టెన్ జాసన్ హోల్డర్ అటు బ్యాట్‌తోపాటు బంతితోనూ రాణించి ఆతిథ్య ఇంగ్లండ్ ఆశలపై నీళ్లు చల్లాడు. దీంతో విండీస్ 169 పరుగుల ఆధిక్యం సాధించింది. ఓవర్‌నైట్ స్కోరు 329/5తో మూడో రోజైన ఆదివారం ఆటను ఆరంభించిన విండీస్.. హోల్డర్ (43) బ్యాట్‌తో ఆదుకోవడంతో తొలి ఇన్నింగ్స్‌లో 427 పరుగులకు ఆలౌటైంది. ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో 258 రన్స్ చేసింది. అనంతరం రెండో ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్.. హోల్డర్ (2/44) దెబ్బకు మూడో రోజు ఆట ముగిసే సమయానికి 171/3తో నిలిచింది. ఓపెనర్ కుక్ (23)ను హోల్డర్ స్వల్ప స్కోరుకే పెవిలియన్ చేర్చగా.. స్టోన్‌మన్ (52) అర్ధ శతకం సాధించాడు. రూట్ (45 బ్యాటింగ్), మలన్ (21 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు.

ఎట్రాక్షన్..వారిద్దరే!

వాళ్లిద్దరూ దిగ్గజాలే.. ఇద్దరిదీ 13 ఏళ్ల వైరం..37 మ్యాచ్‌ల పోరాటం..కానీ ఫ్లషింగ్ మెడోస్‌లో మాత్రం వారు నేటివరకూ ముఖాముఖీ తలపడకపోవడం గమనార్హం..అయితే ఈసారి అభిమానులకు ఆ ముచ్చట తీరే అవకాశాలున్నాయి. రోజర్ ఫెడరర్, రఫెల్ నడాల్ సమరానికి సై అంటున్నారు..యూఎస్ ఓపెన్‌లో ఒకే పార్శ్వంలో ఉన్న ఈ ప్లేయర్లు సెమీస్‌లో తలపడే చాన్సుంది. దాంతో టాప్ ఆటగాళ్లు పలువురు గాయాలతో వైదొలగి ఒకింత కళ తప్పిన యూఎస్ ఓపెన్‌కు ఈ పోరు వన్నె తేనుంది. జొకోవిచ్, మర్రే, వావ్రింకాల పరోక్షంలో జ్వెరేవ్, సిలిచ్, థీమ్ వంటి భావి క్రీడాకారులు సత్తా చాటేందుకు ఈ టోర్నీ చక్కటి అవకాశం కల్పిస్తోంది.

• బరిలో ఫెడరర్, నడాల్ • నేటినుంచే యూఎస్ ఓపెన్


ఫెడరర్

న్యూయార్క్ : ఈ ఏటి ఆఖరి గ్రాండ్‌స్లామ్ యూఎస్ ఓపెన్ సోమవారం ప్రారంభం కానుంది. రెండుసార్లు విజేత జకోవిచ్, డిఫెం డింగ్ చాంపియన్ వావ్రింకా, 2014 రన్నరప్ నిషికోరి, రవోనిక్ ఇంతకుముందే తప్పుకోగా..తాజాగా డ్రాల అనంతరం రెండోసీడ్ ఆండీ మర్రే తుంటి గాయంతో వైదొలగడంతో ఈ టోర్నీలో గాయాల జాబితా మరింత పెద్దదైంది. మూడేళ్ల సుదీర్ఘ విరామం అనంతరం ఇటీవలే నెంబర్‌వన్ ర్యాంక్ కైవసం చేసుకున్న నడాల్ 2010, 2013లలో ఇక్కడ చాంపియన్‌గా నిలిచాడు. ఈ సంవత్సరం రికార్డు స్థాయిలో 10వ సారి ఫ్రెంచ్ ఓపెన్ టైటిల్ నెగ్గిన అతడు యూఎస్ ఓపెన్‌ను మూడో సారి నెగ్గాలని పట్టుదలగా ఉన్నాడు. ఇక 2004 నుంచి 2008 వరకూ వరుసగా ఐదుసార్లు యూఎస్ ఓపెన్ కిరీటం సాధించిన ఫెడరర్ ఈ ఏడాది మూడో, కెరీర్‌లో మొత్తం గా 20వ గ్రాండ్‌స్లామ్‌కోసం ఆవురావురుమంటున్నాడు. తుంటి గాయం మానకపోవడంతో చివరి నిమిషంలో మర్రే వైదొలగగా..ఒకే పార్శ్వంలో ఉన్న టాప్‌సీడ్ నడాల్, మూడోసీడ్ ఫెడరర్ సెమీఫైనల్లో ఢీకొనే అవకాశాలున్నాయి. సెర్బియాకు చెందిన లజోవిక్‌తో నడాల్ యూఎస్ ఓపెన్ పోరును ఆరంభించనున్నాడు. అమెరికా టీనేజర్ టియాఫోను తొలిరౌండ్‌లో ఫెడరర్ ఎదుర్కోనున్నాడు.

మహిళల్లో ఎనిమిదిమంది...

సెరెనా విలియమ్స్, అజరెంకా బరిలో లేనందున ఈ ఏడాది మహిళల విజేత ఎవరనేది సస్పెన్స్‌గా మారింది. మొత్తం ఎని మిదిమంది క్రీడాకారిణులు టైటిల్ రేసులో నిలిచారు. మాజీ వరల్డ్ నెంబర్ వన్, ఐదు గ్రాండ్‌స్లామ్‌ల విజేత షరపోవా వైల్డ్‌కార్డ్‌తో ఈసారి అదృష్టం పరీక్షించుకుంటోంది. అయితే పునరాగమనం అనంతరం గాయాల బెడద ఎదుర్కొంటున్న షరపోవా ఏమాత్రం సత్తా చూపుతుందో చూడాలి. రెండో ర్యాంకర్ సిమోన హలెప్ (రుమేనియా)ను తొలిరౌండ్ లో షరపోవాను ఢీకొననుంది. గతంలో ఆరుసార్లు ఈ ఇద్దరు తలపడగా అన్నిదఫాలూ షరపోవానే విజయం సాధించడం విశేషం. చెక్ ప్లేయర్, ప్రపంచ నెంబర్ వన్ కరోలినా ప్లిస్కోవా (చెక్ రిపబ్లిక్), హలెప్, వోజ్నియాకి (డెన్మార్క్), ముగురుజ (స్పెయిన్), నాలుగో ర్యాంక్ ఎలీనా స్విటొలినా (ఉక్రెయిన్), జొనా కొంట (బ్రిటన్), కుజెనెత్సోవా (రష్యా)లకు టైటిల్ అవకాశాలున్నాయి.


నడాల్

రాత్రి 8:30 నుంచి స్టార్ స్పోర్ట్స్ సెలెక్ట్-1లో

ఆంధ్రజ్యోతి స్పోర్ట్స్
విజయవాడ సోమవారం 28 ఆగస్టు 2017

అందుకు గర్విస్తున్నా..

ఫైనల్లో ఓడినందుకు నిరుత్సాహపడ్డా. మూడో గేమ్‌లో 20-20తో ఉన్నప్పుడు ఇరువురికీ సమాన అవకాశాలున్నాయి. అయితే, నేను అనవసర తప్పిదం చేశా. తుదిపోరులో ఎవరైనా స్వర్ణం నెగ్గాలనే గురిపెడతారు. నేను దానికి చాలా దగ్గరగా వచ్చా. కానీ, చివరి క్షణాల్లో అంతా తారుమారైంది. ఒకుహర అంత సులభమైన ప్లేయర్ కాదు. గతంలో మేం తలపడ్డ ప్రతీ మ్యాచ్ హోరాహోరీనే. ఇలానే, కఠినంగా ఉంటాయి. క్లిష్టమైన ర్యాలీలు సాగుతాయి. అందుకే ఆమెను ఎప్పుడూ తక్కువగా అంచనా వేయను. ఈ తుదిపోరు సుదీర్ఘంగా సాగుతుందని ఊహించి అందుకు సన్నద్ధమయ్యా. కానీ, ఈ రోజు నాది కాదని ఊహించలేకపోయా. ఫైనల్ పోరు మా ఇద్దరికీ మానసికంగా, శారీరకంగా సవాల్ విసిరింది. ప్రతీ ర్యాలీ చాలా సుదీర్ఘంగా సాగింది. ఇద్దరం దూకుడుగా ఆడాం. తీవ్రంగా చెమటోడ్చాం. కానీ, ఇంత గొప్ప పోరులో దురదృష్టవశాత్తూ నేను నెగ్గలేకపోయా. అయితే, టోర్నీలో మొత్తంగా రెండు పతకాలు నెగ్గడం భారత్‌కు సానుకూలాంశం. దేశానికి రజతం పతకం సాధించినందుకు నేనూ గర్విస్తున్నా. ఇది నాలో ఎంతో ఆత్మవిశ్వాసాన్ని నింపింది.

-పీవీ సింధు

అలసిపోతున్నారు.. ఆయాస పడుతున్నారు.. నిరుత్సాహపడుతున్నారు.. నిట్టూరుస్తున్నారు.. కోర్టులో పడిపోతున్నారు.. అయినా పోరాటం మాత్రం ఆపడం లేదు..!

కిందపడ్డ రబ్బరు బంతుల్లా అంతే వేగంగా పైపైకి లేచారు..! షటిల్‌ను మించిన వేగంతో కోర్టులో పాదరసంలా కదిలారు.. సివంగుల్లా కొట్లాడారు.. ప్రాణం పెట్టి పోరాడారు..!

కోర్టును కదనరంగంగా మార్చి.. అంతిమ సమరం అంటే ఇలానే ఉండాలని చాటిచెప్పి...

రోమాంచిత పోరాటంతో స్టేడియంలో ప్రేక్షకులను మునివేళ్లపై నిలుచోబెట్టి...

టీవీల ముందున్న వారూ ఊపిరి బిగబట్టేలా.. నూటా పది నిమిషాల పాటు ఎవ్వరినీ రెప్పవాల్చనీయకుండా చేసి.. మీ ఆటకు వందనం అనిపించారు ఆ ఇద్దరూ..!

ఆ సమ ఉజ్జీలు మన పూసర్ల వెంకట సింధు, జపాన్ ప్లేయర్ నొజోమి ఒకుహరా!

అది ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ స్వర్ణ పతక మ్యాచ్!

సగటు బాడ్మింటన్ అభిమాని గుండెలను పిండేసిన ఈ పోరు ఇరువురు షట్లర్ల బలాన్ని.. తెలివిని కొలిచింది..! టెక్నిక్‌కు.. తెగువకు పరీక్ష పెట్టింది..! కానీ, ఈ సవాల్‌లో పోరాడి ఓడింది మన సింధు..! ఆఖర్లో ఒత్తిడిని జయించిన ఒకుహరా వరల్డ్ చాంపియన్‌గా నిలిచింది..!

తొలి గేమ్ కోల్పోయినా.. 73 షాట్ల పాటు సుదీర్ఘంగా సాగిన ర్యాలీతో రెండో గేమ్ నెగ్గి మ్యాచ్‌లో నిలిచిన తెలుగు షట్లర్ ఒక మ్యాచ్ పాయింట్‌ను కాచుకున్నా.. చివర్లో ఒత్తిడికి తలొగ్గింది..! ఈ మెగా టోర్నీలో స్వర్ణం గెలిచి చరిత్ర సృష్టిద్దామన్న కలను నెరవేర్చుకోలేకపోయింది...!

రజతంతో సరిపెట్టినా.. పసిడి కోసం ప్రాణం పెట్టిన సింధు.. అభిమానుల మనసులు గెలుచుకుంది..!

భారత వెండికొండ అసమాన పోరాట పటిమ కనబరిచిన ఈ పోరు బ్యాడ్మింటన్ చరిత్రలో గుర్తుండిపోతుంది..!



ఒకుహరా



వెండి కొండ..

- రజతంతో సరిపెట్టిన సింధు
- ఫైనల్లో పోరాడి ఓడిన తెలుగు షట్లర్
- ఒకుహరాదే వరల్డ్ చాంపియన్‌షిప్

సింధుకు 10, సైనాకు 5లక్షలు

నజరానా ప్రకటించిన బాయ్

న్యూఢిల్లీ: వరల్డ్ చాంపియన్‌షిప్‌లో పతకాలతో మెరిసిన పీవీ సింధు, సైనా నెహ్వాల్‌కు భారత బ్యాడ్మింటన్ సంఘం (బాయ్) నగదు బహుమతి ప్రకటించింది. రజతం నెగ్గిన సింధుకు రూ. పది లక్షలు, కాంస్యం గెలిచిన సైనాకు రూ. ఐదు లక్షల రికార్డు ఇస్తామని బాయ్ అధ్యక్షుడు హిమంత బిస్వా శర్మ ఆదివారం తెలిపారు. టోర్నీలో అద్భుత ప్రదర్శన చేసిన ఇద్దరు పేయర్లను ఆయన అభినందించారు. ఇది అద్భుత ప్రయాణమన్న ఆయన.. ఇకపై మరింత మెరుగ్గా రాణిస్తారన్న ఆశాభావం వ్యక్తం చేశారు.

మోదీ అభినందన



తెలుగమ్మాయి సింధుపై అభినందనల వర్షం కురిసింది. ప్రధాన మోదీ సహా పలువురు ప్రముఖులు ఆమెను ప్రశంసించారు. 'బాగా ఆడావు సింధు. ఫైనల్లో నీ ఆట చూసి మేమంతా గర్వపడ్డాం. శుభాభినందనలు' అని మోదీ ట్వీట్ చేశారు. మెగా టోర్నీలో మూడో పతకం నెగ్గిన తెలుగు షట్లర్‌పై మాజీ క్రికెటర్ సెహ్వాగ్ తనదైన శైలిలో పొగడ్తల వర్షం కురిపించాడు. 'పూసర్ల వెంకట సింధు.. ఈ పేరును గుర్తుంచుకోండి. 22 ఏళ్ల వయసులోనే ఆమె ఈ తరానికి ఆదర్శం. ఊపిరి బిగపట్టేలా ఫైనల్ ఆడిన సింధును చూసి భారత్ గర్విస్తోంది' అని ట్వీట్ చేశాడు. దేశ ఇద్దరు చాంపియన్లను పోడియంపై చూడడం గర్వంగా అనిపిస్తోందని లియాండర్ పేస్ అన్నాడు. ఫైనల్లో అద్భుతంగా ఆడి సింధు దేశం గర్వించేలా చేసిందని కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు రాహుల్ గాంధీ ట్వీట్ చేశారు.

గ్లాస్కో: ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో తెలుగమ్మాయి పూసర్ల వెంకట సింధు వెండి వెలుగులు నింపింది. స్వర్ణంపై గురిపెట్టిన సింధు ఆఖరాటలో అసాధారణ ప్రదర్శన చేసినా.. పసిడిని అందు కోలేకపోయింది. ఆదివారం రాత్రి నువ్వానేనా అన్నట్టు సాగిన ఫైనల్ పోరులో నాలుగో సీడ్ సింధు 19-21, 22-20, 20-22తో ఏడో సీడ్ జపాన్ ప్లేయర్ నొజోమి ఒకుహరా చేతిలో పోరాడి ఓడిపోయింది. గంటా యాభై నిమిషాల మారథాన్ పోరులో తొలి గేమ్‌ను కోల్పోయినా.. రెండో గేమ్ గెలిచి మ్యాచ్‌లో నిలిచిన మన సింధూరం.. 43 నిమిషాలపాటు తీవ్ర ఉత్కంఠను రేపిన ఆఖరి గేమ్‌లో ప్రత్యర్థికి తలవంచింది. గతంలో రెండు సార్లు (2013, 2014) కాంస్యం నెగ్గి తొలిసారి ఫైనల్‌కు చేరిన ఆమె ఆఖరి క్షణాల్లో పట్టు చేజార్చింది. అయినా.. పతకం రంగు మారుస్తానని చెప్పిన సింధు మాట నిలబెట్టుకున్నది. రజతం నెగ్గి ఈ టోర్నీలో వెండి గెలిచిన భారత రెండో షట్లర్‌గా సైనా నెహ్వాల్ సరసన నిలిచింది. సెమీస్‌లో ఒకు హరా చేతిలోనే ఓడిన సైనా కాంస్యం దక్కించుకుంది. దాంతో, ఈ మెగా టోర్నీలో భారత్ తొలిసారి రెండు పతకాలు గెలుచుకుంది.

ఆది నుంచే అమీతుమీ..

ఇద్దరు మేటి షట్లర్ల మధ్య ఆఖరాట ఊహించిన దానికంటే ఎక్కువ హోరాహోరీగా సాగింది. తొలి గేమ్ నుంచే సింధు, నొజోమి ప్రతీ పాయింట్ కోసం తీవ్రంగా పోరాడారు. వైడ్ షాట్ ఆడి తొలి పాయింట్ కోల్పోయిన సింధు.. వరుసగా రెండు పాయింట్లు నెగ్గి 2-1తో గేమ్‌ను సానుకూలంగా ఆరంభించింది. అయితే ఆరంభంలో నెట్ వద్ద ఆమె కాస్త ఇబ్బంది పడింది. దాంతో ఒకుహరా పదే పదే నెట్ వద్దకు రప్పిస్తూ 5-3తో ఆధిక్యం సాధించింది. కానీ, వెంటనే ఈ బలహీనత నుంచి బయట పడ్డ పీవీ డ్రిబ్లింగ్‌లో మెరుగైంది. దూకుడు పెంచి బలంగా షాట్లు కొట్టింది. ఇక, 5-5తో సమంగా నిలిచిన దశలో ఒక్కసారిగా విజృంభించిన తెలుగమ్మాయి వరుసగా ఆరు పాయింట్లు నెగ్గి 11-5తో విరామం తీసుకుంది. తన ఎత్తును సద్వినియోగం చేసుకుంటూ చక్కటి స్మాష్‌లు, క్రాస్ కోర్ట్ షాట్‌లు సంధించిన ఆమె షటిల్‌ను నేర్పుగా అవతలి కోర్టు వైపు పంపింది. మరోవైపు షటిల్‌ను సరిగ్గా అంచనా వేయడంలో విఫలమైన ఒకుహరా వైడ్ షాట్లు ఆడింది. వీటిని పూర్తిగా సద్వినియోగం చేసుకున్న సింధు ప్రత్యర్థిపై పైచేయి సాధించింది. కోర్టు మారిన తర్వాత జపాన్ ప్లేయర్ వరుసగా రెండు పాయింట్లు రాబట్టి పోటీలోకొచ్చింది. చూడచక్కటి డ్రాప్ షాట్‌తో సింధు 12-7తో నిలిచింది. ఈ దశలో గేమ్ ప్లాన్ మార్చిన ఒకుహరా సుదీర్ఘ ర్యాలీలతో సింధును పరీక్షించింది. కోర్టు నలుమూలలా షటిల్‌ను పంపిస్తూ భారత షట్లర్ అలసి పోయేలా చేసింది. ఆమె తప్పిదాలు చేసేలా పురిగొల్పింది. వేగంగా ఆడుతూ స్మాష్‌లు సంధించే అవకాశం ఇవ్వకుండా చేసింది. ఏకాగ్రత కోల్పోయిన నాలుగో సీడ్ సింధు తప్పిదాలు చేయడంతో ఒకుహరా 18-14తో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. అయితే, అద్భుతంగా పుంజుకున్న సింధు వరుసగా నాలుగు పాయింట్లతో 18-18తో స్కోరు సమం చేసింది. కానీ, కీలక దశలో రిటర్న్‌ను నెట్ కొట్టిన సింధు మరో సుదీర్ఘ ర్యాలీలో వైడ్ షాట్ ఆడి గేమ్‌ను కోల్పోయింది.



గెలిచి.. నిలిచి..

తొలి గేమ్‌ను తృటిలో చేజార్చుకున్న భారత ప్లేయర్ రెండో గేమ్‌లో ఆరంభం నుంచే పైచేయి సాధించింది. ప్రత్యర్థి వైడ్ షాట్లను సొమ్ము చేసు కున్న ఆమె 5-1తో ముందంజ వేసింది. పెద్దగా కష్టపడకుండానే పాయింట్లు రావడంతో 9-3తో మరింత ఆధిక్యం ప్రదర్శించింది. దాంతో సులభంగా గేమ్ నెగ్గేలా కనిపించినా.. ఆధిక్యాన్ని కాపాడుకోలేక పోయింది. లయ కోల్పోయిన ఆమె ప్రత్యర్థి ఫోర్ హ్యాండ్ రిటర్న్‌లను అందుకోలేక వరుసగా ఐదు పాయింట్లు ఇచ్చుకుంది. దాంతో, నొజోమి 8-9తో పీవీకి చేరువైంది. ఇక, 11-8తో విరామం తర్వాత సింధు షటిల్‌ను తప్పుగా అంచనా వేసి పాయింట్ కోల్పోయినా.. తర్వాత కళ్లు చెదిరే రిటర్న్ కొట్టింది. కానీ, షటిల్‌ను ఎక్కువ ఎత్తులో పంపుతూ ప్రత్యర్థిని పుంజుకునేలా చేసింది. దాంతో, జపాన్ ప్లేయర్ 12-12తో స్కోరు సమం చేసింది. అయితే, బ్యాక్‌హ్యాండ్‌తో మెరుగ్గా ఆడిన సింధు 15-13 ఆధిక్యంలో నిలిచింది. ఈ దశలో 43 షాట్ల పాటు సాగిన సుదీర్ఘ ర్యాలీని ఖాతాలో వేసుకొని ఆత్మవిశ్వాసం ప్రోది చేసుకున్న తెలుగు ప్లేయర్ అదే ఊపులో 20-17తో గేమ్ పాయింట్‌పై నిలిచింది. ఈ సమయంలో అనూహ్యంగా చెలరేగిన నొజోమి.. సింధు డిఫెన్స్‌ను ఛేదించింది. 3 గేమ్ పాయింట్లు కాచుకొని 20-20తో స్కోరు సమం చేసింది. టైటిల్‌కు కేవలం 2 పాయింట్ల దూరంలో నిలవడంతో అభిమానుల్లో ఒకటే టెన్షన్ నెలకొంది. అయితే, సింధు నేర్పుగా షటిల్‌ను బ్యాక్‌కోర్టుకు పంపి 21-20తో గేమ్ పాయింట్‌పై నిలిచింది. ఇక, 73 షాట్ల పాటు మ్యాచ్‌కే హైలైట్‌గా సాగిన భారీ ర్యాలీతో పాటు గేమ్‌లో నెగ్గి మ్యాచ్‌లో నిలిచింది.

ఆశలు రేపి.. పతకం చేజార్చి..

నిర్ణాయక మూడో గేమ్‌లో ఒకుహరా పదునైన స్మాష్‌లతో 5-1తో ముందంజ వేసింది. కానీ పుంజుకున్న సింధు కళ్లు చెదిరే షాట్లతో 5-5తో స్కోరు సమం చేసింది. నొజోమిని బేస్‌లైన్ వద్దకు రప్పిస్తూ డ్రాప్ షాట్లతో విజృంభించి 11-9తో ఆధిక్యం సాధించింది. అయితే, విరామం తర్వాత నొజోమి బాడీ స్మాష్, మరో కళ్లు చెదిరే షాట్‌తో 11-11తో స్కోరు సమం చేసింది. అనంతరం చెరో పాయింట్ నెగ్గుతూ వెళ్లడంతో గేమ్ 12-12, 14-14, 16-16గా నరాలు తెగే ఉత్కంఠ రేపింది. ఈ దశలో ఒకుహరా కొట్టిన వైడ్ షాట్‌తో సింధు 19-17తో ముందంజ వేసింది. కానీ, ఒకుహరా 19-19తో స్కోరు సమం చేసింది. సింధు నెట్ వద్ద షటిల్‌ను తప్పుగా అంచనా వేయడంతో నొజోమి మ్యాచ్ పాయింట్‌పై నిలిచింది. అయితే సింధు 20-20తో ఒక మ్యాచ్ పాయింట్‌ను కాచుకొని మరింత ఉత్కంఠ రేకెత్తించింది. కానీ, ఆమె మరోసారి షటిల్‌ను నెట్‌కు కొట్టడంతో ప్రత్యర్థి మళ్లీ మ్యాచ్ పాయింట్‌పై నిలిపింది. ఈ సారి ఎలాంటి పొరపాటు చేయని ఒకుహరా.. చక్కటి రిటర్న్ షాట్‌తో స్వర్ణం కొల్లగొట్టింది.

శభాష్..సింధు

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

పూసర్ల వెంకట సింధు.. 22 ఏళ్ల ఈ తెలుగుతేజం ప్రపంచ బ్యాడ్మింటన్ ఇప్పటికే ఓ సంచలనం.. వరల్డ్ చాంపియన్‌షిప్‌లో ఫైనల్‌కు దూసుకురావడం ద్వారా మరోసారి విశ్వవేదికపై మెరిసింది. ఫైనల్లో ఆమె విజయం సాధించకపోయి ఉండొచ్చు కానీ తుదిపోరులో ఆమె చూపిన పోరాటం అనన్య సామాన్యం. ఇప్పటివరకూ భారత క్రికెట్ జట్టు ఆడే ఫైనల్ మ్యాచ్‌లకే అభిమానులు టీవీలకు అతుక్కుపోయే దృశ్యాలు కనిపించేవి. కానీ ఇప్పుడు బ్యాడ్మింటన్ పోటీలను అంతకంటే ఉత్కంఠగా అభిమానులు తిలకిస్తున్నారంటే అందుకు కారణం సింధు అనడంలో అతిశయోక్తి లేదు. మన క్రీడాభిమానుల దృక్పథాన్ని అలా మార్చేసింది ఆమె. ఇంత కీర్తి ప్రతిష్ఠలు సింధుకు దక్కడం వెనుక 14 ఏళ్ల కఠోర శ్రమ ఉంది. ఎనిమిదేళ్ల ప్రాయంలో బ్యాడ్మింటన్‌వైపు పడిన ఆమె అడుగులు నిరంతర సాధనతో, అసమాన పట్టుదలతో, అలుపెరగని శ్రమతో ప్రపంచ చాంపియన్‌షిప్స్‌లో నేటి రజతం సహా రెండు కాంస్యాలు, ఒలింపిక్స్‌లో మరో రజతంతో ఖ్యాతినార్జించే స్థాయికి దారి తీశాయి. ఆల్‌ఇంగ్లండ్ చాంపియన్ పుల్లెల గోపీచంద్ స్ఫూర్తిగా బ్యాడ్మింటన్‌ను ఎంచుకున్నానని చెప్పే సింధు..అదే గోపీచంద్ గురువుగా ప్రపంచ బ్యాడ్మింటన్‌లో ఒక్కో శిఖరాన్ని అధిరోహిస్తుండడం విశేషం. 17 ఏళ్ల వయస్సులో 2012లో డబ్ల్యూబీఎఫ్ ర్యాంకింగ్స్‌లో టాప్ 20లో ప్రవేశించడంతో ప్రపంచం దృష్టిని ఆకర్షించింది సింధు. అనంతరం వరల్డ్ బ్యాడ్మింటన్‌పై ఆమె వేస్తూ వస్తున్న ముద్ర చెరగలేనిది. డబ్ల్యూబీఎఫ్ ర్యాంకింగ్స్‌లో గత ఏప్రిల్‌లో అత్యుత్తమంగా రెండో స్థానానికి చేరిన సింధు ప్రస్తుతం సాధిస్తున్న విజయాలు చూస్తే టాప్‌నకు చేరుకొనే రోజులు ఎంతో దూరంలో లేవు కూడా. ఈసారి ప్రపంచ చాంపియన్‌షిప్స్‌లో నాలుగో ర్యాంక్‌తో బరిలోదిగిన ఆమెపై యావత్ భారత్ అభిమానులు



చాముండీతో సైనా, సింధు

పెట్టుకున్న ఆశలు అన్నీఇన్నీకావు. ఈ ఏడాది ఆమె గెలిచిన టైటిళ్లు, కరోలినా మారిన్, సన్ యూలాంటి హేమాహేమీ క్రీడాకారిణులను ఓడించిన తీరుచూస్తే గ్లాస్గోలో ఆమె మరో చరిత్ర సృష్టించడం ఖాయం అనిపించింది. ఫైనల్ వరకూ ఆమె ఆటతీరు గమనిస్తే భారత్ బ్యాడ్మింటన్‌లో మరో సువర్ణాధ్యాయం లిఖించడం ఇక లాంఛనమే అన్న అంచనాలకు వచ్చేశాం. కానీ ఫైనల్లో జపాన్ అమ్మాయి నొజోమి ఒకుహారా..సింధుతో తీసిపోని విధంగా ఆడింది. అయినా సింధు ఏదశలోనూ వెనక్కు తగ్గలేదు. శాయశక్తులా పోరాడింది. త్రుటిలో విజయం చేజారింది. కానీ అభిమానుల మది గెలుచుకుంది. ఈ పరాజయానికి చింతించాల్సిన పనిలేదు. ఈ ఓటమి వచ్చే ప్రపంచ చాంపియన్‌షిప్స్ టైటిల్ విజయానికి నాంది. ఈ చాంపియన్‌షిప్స్‌లో అద్భుతంగా రాణించిన సింధు, సైనా, శ్రీకాంత్, సాయిప్రణీత్ సహా భారత ఆటగాళ్లంతా భవిష్యత్‌లో భారత బ్యాడ్మింటన్‌ను మరింత ఉన్నత శిఖరాలకు చేర్చడం ఖాయం.

విక్టర్‌దే విక్టరీ

పురుషుల ఫైనల్లో డెన్మార్క్ షట్లర్, మూడో సీడ్ విక్టర్ అక్సెల్సెన్ విజేతగా నిలిచింది. ఫైనల్లో విక్టర్ 22-20, 21-16తో వరుస గేమ్‌ల్లో ఏడో సీడ్ లిన్ డాన్ (చైనా)కు షాకిచ్చి స్వర్ణం గెలిచాడు.



ఢిల్లీ ఉత్కంఠ విజయం

- ముంబాకు హ్యాట్రిక్ ఓటములు

ముంబై: సొంతగడ్డపై యు ముంబా వరుసగా మూడో పరాజయాన్ని చవిచూసింది. ప్రో కబడ్డీ లీగ్‌లో ఆదివారం ఉత్కంఠ భరితంగా జరిగిన మ్యాచ్‌లో దబాంగ్ ఢిల్లీ 33-32 తో యు ముంబాపై విజయం సాధించింది. ఢిల్లీ ప్లేయర్ మెరాజ్ షేక్ 11 రైడ్ పాయింట్లు సాధించాడు. ముంబా తరఫున కెప్టెన్ అనూప్ కుమార్ 11 రైడ్ పాయింట్లు తెచ్చాడు. ఆరంభం నుంచే ఇరు జట్లూ వడివడిగా పాయింట్లు సాధించాయి. టైకి రెండు పాయింట్లు అవసరమైన సమయంలో చివరి రైడ్‌కు వెళ్లిన అనూప్ ఒక్క పాయింట్ మాత్రమే తీసుకురావడంతో ముంబాకు ఓటమి తప్పలేదు. మరో మ్యాచ్‌లో బెంగాల్ వారియయర్స్ 32-26తో బెంగళూరు బుల్స్‌పై నెగ్గింది. బెంగాల్ ప్లేయర్ సుర్జీత్ సింగ్ 8 టాకిలింగ్ పాయింట్లు సాధించాడు. 36వ నిమిషంలో 28-21తో ఆధిక్యంలో ఉన్న బెంగాల్.. మ్యాచ్‌పై పట్టు సాధించింది. చివరి 5 నిమిషాల్లో పుంజుకోవాలని బుల్స్ తీవ్రంగా ప్రయత్నించినా.. బెంగాల్ వాటిని సమర్థంగా నిరోధించింది.



ఢిల్లీ-ముంబై మ్యాచ్ దృశ్యం



సిర్సాలోని డేరా ప్రధాన కార్యాలయాన్ని ఖాళీ చేసి తమ ఇళ్లకు తిరిగివెళ్తున్న గుర్మీత్ అనుచరులు



గుర్మీత్‌ను ఉంచిన రోహ్‌తక్ జిల్లా జైలు వద్ద భారీ బందోబస్తు

నివురు గప్పిన నిప్పు

- పంజాబ్, హరియాణాల్లో ఉద్రిక్తత
- గుర్మీత్ సింగ్‌కు నేడే శిక్ష ఖరారు

చండీగఢ్, ఆగస్టు 27: పంజాబ్, హరియాణా రాష్ట్రాలు నివురు గప్పిన నిప్పులా ఉన్నాయి. రెండు రాష్ట్రాల్లోనూ కర్ఫ్యూను ఎత్తివేశారు. డేరా సచ్చా సౌదా ప్రధాన కార్యాలయం లో, బయట, సిర్సా పట్టణంలో 5 గంటలపాటు కర్ఫ్యూను సడలించారు. ఆ సమయంలో ఎలాంటి హింసాత్మక ఘటనలూ జరగలేదు. కానీ, ఉద్రిక్తత మాత్రం కొనసాగుతోంది. సోమవారం ఏం జరగనుంది? అన్నదే ప్రతి ఒక్కరిలోనూ ఉన్న ఆందోళన. ఇందుకు మొదటి కారణం.. ఇద్దరు భక్తురాళ్లపై అత్యాచారం కేసులో దోషిగా తేలిన రాం రహీమ్ గుర్మీత్ సింగ్‌కు సీబీఐ కోర్టు సోమవారం శిక్ష ఖరారు చేయనుండడం. సీబీఐ కోర్టు జడ్జి జగదీప్ సింగ్ సోమవారం రోహ్‌తక్ శివార్లలోని సునారియా జైలుకు చేరుకుని అక్కడే ప్రత్యేక కోర్టును నిర్వహించనున్నారు. ఇందుకు అక్కడ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. మధ్యాహ్నం 2.30 గంటలకు అక్కడే గుర్మీత్‌కు శిక్షను ఖరారు చేయనున్నారు. ఆయనకు ఏడేళ్ల శిక్ష పడుతుందా? లేక యావజ్జీవం వేస్తారా? అనే సందేహాలు ప్రతి ఒక్కరిలోనూ ఉన్నాయి. ఇక, రెండోది, గుర్మీత్‌ను దోషిగా తేల్చడంతో రెచ్చిపోయిన ఆయన అనుచరులు.. ఆయనకు శిక్ష ఖరారు చేసిన తర్వాత ఎలా స్పందిస్తారనేది! ఈ నేపథ్యంలోనే, గుర్మీత్‌ను ఉంచిన రోహ్‌తక్ జిల్లా జైలు చుట్టూ వివిధ అంచెల్లో భద్రత ఏర్పాటు చేశారు. ఏకంగా 23 కంపెనీల పారామిలటరీని మోహరించారు. దాదాపు 10 నుంచి 15 వేల మంది గుర్మీత్ అనుచరులు ఇప్పటికే రోహ్‌తక్‌కు చేరుకున్నారని నిఘా వర్గాలు తెలిపాయి. శిక్ష ఖరారు తర్వాత మళ్లీ హింస చెలరేగవచ్చని హెచ్చరించాయి. నగరమంతటా 144 సెక్షన్ విధించారు. సోమవారం కూడా రెండు రాష్ట్రాల్లోనూ విద్యా సంస్థలకు సెలవు ఇచ్చారు. మొబైల్ ఇంటర్నెట్ సర్వీసుల నిలిపివేతను మంగళవారం వరకూ కొనసాగించాలని నిర్ణయించారు. ఒక్క సిర్సా తప్ప మిగిలిన ప్రాంతాల్లో కర్ఫ్యూను ఎత్తి వేశామని డీజీపీ బీఎస్ సంధు చెప్పారు. ఇప్పటి వరకూ 52 కేసులను నమోదు చేశామని, 926 మందిని అరెస్టు చేశామని తెలిపారు. గుర్మీత్ అనుచరుల హింసలో మృతుల సంఖ్య 38కి పెరిగిందని తెలిపారు. కాగా, ఢిల్లీ-రోహ్‌తక్-భటిండా సెక్షన్ మినహా రెండు రాష్ట్రాల్లోనూ రైల్వే సర్వీసులను పునః ప్రారంభించారు. మరోవైపు, ఢిల్లీలో కూడా హై అలర్ట్ ప్రకటించారు. ఇక, సిర్సాలోని డేరా ప్రధాన కార్యాలయం ఖాళీ అయింది. దాదాపు లక్ష మందికిపైగా గుర్మీత్ అనుచరులు తిరుగుబాట పట్టారు. రెండు రాష్ట్రాల్లోనూ ఏకంగా వందకుపైగా డేరా శిబిరాలను మూసివేశారు. వాటిలో పెద్దఎత్తున ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు.

డేరా బాధ్యతలు దత్తపుత్రికకే?



చండీగఢ్, ఆగస్టు 27: డేరా చీఫ్ గుర్మీత్ తర్వాత డేరా బాధ్యతల్ని చేపట్టేది ఎవరు? అనేదే ఇప్పుడు అందరి మెదళ్లను తొల స్తున్న ప్రశ్న. వందల కోట్ల స్థిర, చరాస్తులున్న డేరా సామ్రాజ్యాన్ని ఏలేది.. గుర్మీత్ దత్తపుత్రిక హనీప్రీత్ ఇన్సాన్ యేనా! అంటే అవుననే సంకేతాలొస్తున్నాయి. తన ట్విటర్, ఫేస్‌బుక్ పేజీల్లో 'తండ్రికి గారాలపట్టి, పరోపకారి, డైరెక్టర్, ఎడిటర్, నటి. రాక్‌స్టార్ అయిన తన తండ్రి ఆదేశాలను చేసి చూపే మక్కువతో ఉన్నా' అని రాసుకొచ్చింది హనీప్రీత్. డేరా బాధ్యతలు చేపట్టే అవకాశాలు ఇన్సాన్‌కు మెండుగా ఉన్నాయనేది గుర్మీత్ అనుచరుల మాట. డేరా అనుచరుడు విశ్వాస్ గుప్తాను ఈమె పెళ్లి చేసుకోగా.. అత్తింటివాళ్లు వేధించడంతో గుర్మీత్ దత్తత తీసుకున్నాడు.

గుర్మీత్‌ను తప్పించేందుకు విఫలయత్నం

- పోలీసు అధికారిపైనే భద్రతా సిబ్బంది దాడి

కోర్టు నుంచి జైలుకు తరలించే సమయంలో డేరా సచ్చా సౌదా అధినేత గుర్మీత్ సింగ్‌ను తప్పించడానికి ప్రయత్నించిన ఏడుగురు భద్రతా సిబ్బందిపై హరియాణా పోలీసులు దేశద్రోహం, హత్యాయత్నం అభియోగాలతో కేసు నమోదు చేశారు. వారిలోనూ ఐదుగురు హరియాణా పోలీసు సిబ్బంది. శుక్రవారం గుర్మీత్‌కు శిక్ష ఖరారు చేసిన తర్వాత ఆయనను హెలికాప్టర్లో రోహ్‌తక్‌కు తరలించేందుకు ఏర్పాట్లు చేశారు. గుర్మీత్‌ను కోర్టు ప్రాంగణం నుంచి బయటకు తీసుకొచ్చారు. ఆ సమయంలో గుర్మీత్ భద్రతా దళంలోని పోలీసులు ఇతర పోలీసులపై దాడి చేసి డేరా బాబాను తప్పించేందుకు ప్రయత్నించారు. వారిలో ఓ ఎస్సై, ఏఎస్సై, హెడ్ కానిస్టేబుల్, ఇద్దరు కానిస్టేబుళ్లు ఉన్నారు. దాంతో, వారందరినీ అరెస్టు చేసి శనివారం సాయంత్రమే కోర్టు ఎదుట హాజరుపరిచారు. కోర్టు వారికి 7రోజుల రిమాండ్ విధించింది.

సిర్సాలో అన్నదానం

మూడ్రోజులుగా కర్ఫ్యూ! దుకాణాలు, హోటళ్లు బంద్! మరి, సిర్సాలో మోహరించిన ఆర్మీ, పారా మిలటరీ, పోలీసులకు ఆహారం ఎలా అందింది!? ఇందుకు సమాధానమే సిర్సాలోని సుశీల్ కండోయ్. ఆయన, ఆ చుట్టుపక్కల మరి కొంతమంది కలిసి విలేకరులు, సైనికులు, పోలీసులకు టీ, టిఫిన్లు, ఆహారం అందించారు. రోజంతా మోటారు సైకిళ్లు, జీప్సీలు, ట్రాక్టర్ల మీద తిరిగి వీటిని అందించారు. మానవతా కార్యక్రమాలు అమలు చేసే సిర్సావాసులు ఇప్పుడు సంక్షోభ పరిస్థితుల్లో ఆర్మీ, పారా మిలటరీ, పోలీసులకు ఆహారం అందించడం ప్రతి ఒక్కరినీ ఆకర్షిస్తోంది.

మరో స్వచ్ఛ ఉద్యమం!

- 'స్వచ్ఛతా సేవ' పేరుతో 15న శ్రీకారం
- 'మన్‌కీ బాత్'లో ప్రధాని మోదీ



న్యూఢిల్లీ, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): దేశ ప్రజలు మరో 'స్వచ్ఛ' ఉద్యమానికి శ్రీకారం చుట్టాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. ఆదివారం 'మన్‌కీ బాత్' కార్యక్రమంలో ప్రధాని మాట్లాడారు. 'స్వచ్ఛభారత్ ఉద్యమాన్ని ప్రారంభించి అక్టోబరు 2 నాటికి మూడేళ్లు అవుతోంది. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని 'స్వచ్ఛతా సేవ' పేరుతో ఉద్యమాన్ని ప్రారంభిద్దాం. దీనికి సెప్టెంబరు 15న శ్రీకారం చుడదాం' అని మోదీ పిలుపునిచ్చారు. చిత్తశుద్ధితో స్వచ్ఛతా సేవ ఉద్యమాన్ని విజయవంతం చేస్తే అక్టోబరు 2 నాటికి దేశంలో విప్లవాత్మక మార్పులు వస్తాయని, తద్వారా గాంధీ మహాత్ముడికి ఆయన జయంతి రోజున ఘనంగా నివాళులర్పించవచ్చని అన్నారు. ఈ మహాక్రతువులో కలెక్టర్లు, సర్పంచులు, విద్యార్థులు, ఎన్జీవోలు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. ఉద్యమాన్ని విజయవంతం చేసిన వారికి పురస్కారాలు అందజేస్తామని ప్రకటించారు. జిల్లా స్థాయిలో ముగ్గురికి, రాష్ట్ర స్థాయిలో ముగ్గురికి ఈ పురస్కారాలు ఇస్తామన్నారు. స్వచ్ఛ ఉద్యమంపై వ్యాసరచన, చిత్రలేఖన, షార్ట్ ఫిల్మ్ పోటీలు నిర్వహించాలని సూచించారు. స్వచ్ఛ భారత్ ఉద్యమం ప్రారంభంలో 39 శాతంగా ఉన్న మరుగుదొడ్లు ప్రస్తుతం 67 శాతానికి పెరిగాయని, దేశవ్యాప్తంగా 2,30,000 బహిరంగ మలవిసర్జనరహిత గ్రామాలు ఏర్పడ్డాయన్నారు. సెప్టెంబరు 5న ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రతి పౌరుడూ.. మార్పు కోసం బోధన(టీచ్ టు ట్రాన్స్‌ఫార్మ్), సాధికారత కోసం చదువు(ఎడ్యుకేట్ టు ఎంపవర్), నాయకుడిగా ఉండేందుకు నేర్చుకో(లెర్న్ టు లీడ్) అన్న సంకల్పాలు తీసుకోవాలని కోరారు. గణేశ్ చతుర్థి వేడుకలను జరుపుకుంటున్న ప్రజలకు మోదీ శుభాకాంక్షలు తెలిపారు. దేశవ్యాప్తంగా ప్రతిభ ఉన్న క్రీడాకారులుంటే వారి బయోడేటా లేదా వీడియోను క్రీడా మంత్రిత్వ శాఖ వెబ్‌సైట్‌లో పెట్టాలని ప్రధాని సూచించారు. 'స్పోర్ట్స్ టాలెంట్ సెర్చ్' పేరుతో ఒక పోర్టల్‌ను సోమవారం క్రీడా మంత్రిత్వ శాఖ ప్రారంభిస్తుందని, ప్రతిభ ఉన్న క్రీడాకారులను వెతికి పట్టుకుని ప్రత్యేక శిక్షణ ఇవ్వడమే దాని లక్ష్యమన్నారు. కాగా, నవభారత నిర్మాణానికి సమష్టిగా పనిచేయాలని ప్రధాని ఉన్నతాధికారులకు పిలుపునిచ్చారు. సుమారు 80 మంది అదనపు కార్యదర్శులు, సంయుక్త కార్యదర్శులతో సమావేశమైన ప్రధాని వారికి దిశానిర్దేశం చేశారు.

ఆలయాలను శుభ్రపర్చిన ముస్లింలు

గుజరాత్‌లో వరదల కారణంగా దెబ్బతిన్న 22 ఆలయాలను, రెండు మసీదులను జమాయిత్-ఉలేమా-ఏ-హింద్ సంస్థకు చెందిన ముస్లిం కార్యకర్తలు శుభ్రపరిచారని ప్రధాని మోదీ మన్‌కీ బాత్‌లో ప్రస్తావించారు. భిన్నత్వంలో ఏకత్వానికి ఇంతకన్నా అందమైన నిదర్శనం ఏముంటుందన్నారు. గుజరాత్‌లోని బనస్కాంత జిల్లాలో జమాయిత్ వలంటీర్లు చేసిన ఈ సేవాకార్యక్రమాన్ని మోదీ ప్రత్యేకంగా ప్రస్తావించి, వారిని అభినందించారు.

విశ్వాసం పేరుతో హింసను సహించం

(మొదటి పేజీ తరువాయి)

చేశారు. అల్లర్ల నేపథ్యంలో పంజాబ్, హరియాణా హైకోర్టు ప్రధానిపై తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేసిన విషయం విదితమే. ఆదివారం మన్‌కీ బాత్‌లో ప్రధాని మాట్లాడుతూ.. చట్టాన్ని చేతుల్లోకి తీసుకునే అధికారం ఎవ్వరికీ లేదని అన్నారు. దేశాన్ని ఏకతాటిపైకి తీసుకొచ్చేందుకు సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ కృషి చేశారని, బుద్ధుడు, మహాత్మాగాంధీ అహింసామార్గాన్ని ప్రబోధించారని వారి అడుగుజాడల్లో నడవడం ప్రతి పౌరుడి విధి అన్నారు. బీఆర్ అంబేడ్కర్ రాజ్యాంగాన్ని అన్ని వర్గాలకు న్యాయాన్ని చేకూర్చేలా రూపొందించారని అన్నారు. దేశమంతా పండుగలు జరుపుకుంటున్న వేళ హింసాత్మక ఘటనలు చోటు చేసుకోవడం దురదృష్టకరమన్నారు.

నరమేధానికి కుట్ర

దాడులు చేయండి.. సద్గురు పేరు చెప్పొద్దు.. అల్లర్లు, ఘర్షణలకు ముందే ప్లాన్
బయటపడిన ఆడియో టేపులు.. హైకోర్టుకు సమర్పిస్తాం: పోలీసులు



హరియాణాలోని గుర్‌గావ్‌లో డేరా సచ్చా సౌధా ఆశ్రమంలో తనిఖీలు నిర్వహిస్తున్న జిల్లా యంత్రాంగం

న్యూఢిల్లీ, ఆగస్టు 27: డేరా సచ్చా సౌదా చీఫ్ గుర్మీత్ రామ్ రహీం సింగ్‌ను రేప్ కేసులో దోషిగా నిర్ధారిస్తే అల్లర్లు, ఘర్షణలకు పాల్పడటానికి.. నరమేధం సృష్టించడానికి ఆయన అనుచర గణం ముందే సిద్ధమైందా? అందుకు పక్కా ప్రణాళిక రచించిందా? ఈ ప్రశ్నలకు ఔననే సమాధానమే వస్తోంది. ఈమేరకు.. 'డేరా' సంస్థకు చెందిన ఇద్దరు సీనియర్ అధికారుల టెలిఫోన్ సంభాషణలను జాతీయ ఆంగ్ల చానల్ ఒకటి బయట పెట్టింది. వారిద్దరి సంభాషణ ఇలా సాగింది..

అనుచరుడు1: హలో.. అక్కడ ఎంత మంది ఉన్నారు?

అనుచరుడు 2: నిన్నటికి (గురువారానికి) దాదాపు 350 మంది దాకా వచ్చారు.

అనుచరుడు1: ఎన్ని టెంపోలు, బస్సులు ఉన్నాయి?

అనుచరుడు 2: ఆరు టెంపోలు, 2 బస్సులు. ఇంకా అవసరమైతే ఎవరి వాహనాన్ని వారు ఏర్పాటు చేసుకుంటారు.

అనుచరుడు1: అక్కడ చాలా మంది మద్దతుదారులున్నారు. భయపడాల్సిన పని లేదు.

అనుచరుడు 2: అక్కడున్న ప్రతి ఒక్కరికీ.. వ్యక్తిగతంగా మీరు పితాజీ సందేశాన్ని తెలియజేయాలి. అదేంటంటే.. సద్గురు పేరు ఎక్కడా బయటపెట్టకూడదు.

అనుచరుడు1: ఒకవేళ దాడులకు దిగినా ఎక్కడా సద్గురు పేరు బయటపెట్టొద్దని వారికి చెప్పండి

అనుచరుడు 2: వాళ్లు దాడులు చేయాలి. ఒకవేళ ఎవరైనా పాత్రికేయులు అడిగితే.. తమంతట తామే చేసినట్టు చెప్పాలి. పితాజీగానీ, మరొకరుగానీ పంపినట్లు అస్సలు చెప్పకూడదు.

అనుచరుడు1: ప్రేమీలందరికీ ఈ విషయాన్ని తెలిపాను. వారంతా మనతోనే ఉన్నారు. వాళ్లు ఎవరి పేరూ చెప్పరు.

అనుచరుడు 2: పిల్లలకు కూడా తెలుసు.. ఎవరైనా అడిగితే, వారు తమంతట తామే వచ్చినట్టు చెబుతారు. నేనింకా జనాన్ని కూడగడుతున్నాను.

అనుచరుడు1: చేసేదేదో గుట్టుగా చేయండి. హడావుడి చేయొద్దు. ఏం చేయాలనుకుంటున్నామో అంతా చేయాలి. ఇబ్బందులు రాకుండా చూసుకోవాలి.

..ఈ టెలిఫోన్ సంభాషణ, హింసకు కుట్ర గురించి పంచకుల పోలీసు కమిషనర్ ఏఎస్ చావ్లా మీడియాకు తెలిపారు. ఈ టేపులను హైకోర్టు ఆదేశాల మేరకు న్యాయస్థానానికి సమర్పించనున్నట్టు తెలిపారు.

ప్లాస్టిక్ కాయిన్‌లే డబ్బు

- గుర్మీత్ రాజ్యంలో ప్రత్యేక వ్యవస్థ
- వ్యాపారాలన్నీ అతని అనుచరులవే
- అక్కడ చిల్లర బదులు 5, 10 టోకెన్లు

సిర్సా, ఆగస్టు 27: తళుకుబెళుకుల గుర్మీత్ రామ్ రహీమ్ సింగ్ సామ్రాజ్యంలో ప్లాసిక్ కాయిన్లకు కూడా ఒక విలువ ఉంది. అవి డబ్బులా చెలామణీ అవుతాయి. అంటే.. గుర్మీత్ ఇక్కడ ఒక సమాంతర ద్రవ్య వ్యవస్థను ప్రవేశపెట్టాడు. హరియాణాలోని సిర్సా పట్టణంలో డేరా సచ్చా సౌదా వెయ్యి ఎకరాల్లో విస్తరించింది. డేరాకంటూ ఒక టౌన్‌షిప్ ఉంది. పాఠశాలలు, క్రీడా గ్రామం, సినిమా హాలు ఉన్నాయి. ఇక డేరాలోనూ, చుట్టుపక్కల వ్యాపారాలన్నీ గుర్మీత్ అనుచరులవే! దానికి సూచికగా అన్నట్లు ప్రతి దుకాణం పేరు ముందు 'సచ్' అని ఉంటుంది. ఇక్కడ వ్యాపారులు కస్టమర్లకు చిల్లర బదులు ప్లాస్టిక్ కాయిన్లు ఇస్తుంటారు. రూ.5, రూ.10 విలువ కలిగిన ఇవి తర్వాత ఇతర దుకాణాల్లోనూ చెల్లుబాటు అవుతాయి. ఈ కాయిన్లపై 'ధన్ ధన్ సద్గురు తేరా హై అసరా.. డేరా సచ్ సౌదా సిర్సా' అని ముద్రించి ఉంటుంది. ఎవరైనా రూ.100 ఇచ్చి.. రూ.70కి ఏవైనా కొంటే.. చిల్లరగా రూ.10 విలువైన 3 ప్లాసిక్ కాయిన్లు ఇస్తుంటారు. అత్యాచారం కేసులో గుర్మీత్‌ను దోషిగా నిర్ధారించి అరెస్టు చేసిన దరిమిలా డేరా హెడ్‌క్వార్టర్స్‌ను ఆర్మీ చుట్టుముట్టింది. ఇప్పుడు ప్రజల దగ్గర ఉండిపోయిన ప్లాస్టిక్ కాయిన్లను డబ్బుగా మార్చుకునే అవకాశం లేదు మరి!

డేరా ఆస్తుల గుర్తింపు ప్రారంభం

చండీగఢ్, ఆగస్టు 27: డేరా సచ్చా సౌదా స్థిర, చరాస్తుల వివరాలు సేకరించేందుకు హరియాణా, పంజాబ్ ప్రభుత్వాలు కసరత్తు ప్రారంభించాయి. గుర్మీత్ అనుచరులు పంచకుల పట్టణాన్ని తగులబెట్టినందుకు ఆగ్రహం వ్యక్తం చేసిన పంజాబ్, హరియాణా హైకోర్టు.. ఆస్తి నష్టాన్ని బాబానుంచే వసూలు చేయాలని ఆదేశించడంతో రెండు రాష్ట్ర ప్రభుత్వాలు డేరా ఆస్తుల గుర్తింపులో తలమునకలైనాయి. మంగళవారం లోగా ఆస్తుల చిట్టా తనముందు పెట్టాలన్న హైకోర్టు ఆదేశాలతో డేరా బ్యాంకు ఖాతా వివరాలు తెలపాలని అధికారులు అన్ని బ్యాంకులను కోరారు. కాగా, గుర్‌గావ్ పాలన యంత్రాంగం డేరా చీఫ్ గుర్మీత్ రాం రహీమ్‌కు చెందిన ప్రత్యక్ష, పరోక్ష ఆస్తులు, బ్యాంకు ఖాతాల వివరాలు సేకరించింది.

నల్లగొండలో 9 ఎకరాల అసైన్డ్ భూములు

చిట్యాల, ఆగస్టు 27: గుర్మీత్‌కు చెందిన డేరా సచ్చా సౌదా భూముల్లో 9.29 ఎకరాల అసైన్డ్ భూములున్నట్లు తేలింది. ఈ సంస్థ.. నల్లగొండ జిల్లా చిట్యాల మండలం వెలిమినేడు శివారులో కొనుగోలు చేసిన భూముల్లో అసైన్డ్ భూములున్న విషయం వెలుగులోకి వచ్చిన నేపథ్యంలో నల్లగొండ ఆర్డీవో వెంకటాచారి ఆదివారం వాటిని పరిశీలించారు. డేరా సంస్థ కొనుగోలు చేసిన భూమిలో 9.29ఎకరాల అసైన్డ్ భూమి ఉన్నట్లు రెవెన్యూ అధికారులు నిర్ధారించారని ఆర్డీవో తెలిపారు. చట్ట ప్రకారం వాటిని తిరిగి స్వాధీనం చేసుకుంటామన్నారు.

టెక్సాస్‌లో హరికేన్ విలయం



'హార్వే' హరికేన్ టెక్సాస్ తీర ప్రాంతంలో విలయం సృష్టించింది. భారీ గాలులు, కుండపోత వర్షాలు అతలాకుతలం చేశాయి. వందలాది విద్యుత్ స్తంభాలు విరిగి పడ్డాయి. వృక్షాలు కూకటి వేళ్లతో పెకిలించుకుపోయాయి. చెట్లు పడి ఇళ్లు శిథిలమయ్యాయి. గ్యాస్ స్టేషన్లు ధ్వంసమయ్యాయి. వేర్వేరుచోట్ల ఐదుగురు మరణించారు. మృతుల సంఖ్య పెరుగుతుందని ఆందోళన వ్యక్తమవుతోంది. కరెంట్ లేకపోవడంతో లక్షల మంది చీకట్లో మగ్గారు. హోస్టన్ తీవ్రంగా దెబ్బతింది. చమురు పరిశ్రమకు కేంద్రమైన టెక్సాస్‌పై 1961 తర్వాత పెను తుఫాన్ పడగెత్తడం ఇదే ప్రథమం. అమెరికా గత 12 ఏళ్లలో ఇటువంటి పెను తుఫాన్‌ను చూసి ఎరుగదు.

41 పోస్టుల భర్తీకి యూపీఎస్సీ నోటిఫికేషన్

న్యూఢిల్లీ, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలో 41 పోస్టుల భర్తీకి యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(యూపీఎస్సీ) నియామక నోటిఫికేషన్ విడుదల చేసింది. మైక్రోబయాలజీ విద్యార్హతపై ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖలో స్పెషల్ గ్రేడ్-3 27 పోస్టులు, నీతి ఆయోగ్‌లో ఎకనమిక్ ఆఫీసర్లు 10 పోస్టులు వంటి తదితర కేంద్ర ప్రభుత్వ విభాగాల్లో ఖాళీల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆన్‌లైన్ రిక్రూట్మెంట్ అప్లికేషన్(ఓఆర్ఏ) విధానం ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, దీనికి వచ్చే నెల 14 ఆఖరు తేదీ అని పేర్కొంది. మరిన్ని వివరాలకు యూపీఎస్సీ వెబ్‌సైట్ ద్వారా తెలుసుకోవచ్చని పేర్కొంది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107
Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.